www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ప్రైవేటు ఉద్యోగాల్లో 75% స్థానికులకే!

మేనేజ్‌మెంట్ ఉద్యోగాలైతే 50 శాతం

కర్ణాటక నిర్ణయం.. కేబినెట్ ఆమోదం

గ్రూపు సీ, డీ ఉద్యోగాలన్నీ కన్నడిగులకే

రేపు అసెంబ్లీ ముందుకు బిల్లు 2

ఇతర రాష్ట్రాల వారికి తగ్గనున్న ఉపాధి

ఐటీ సంస్థల్లో భారీగా తెలుగువారు



బుధవారం | 17-7-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 92 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి రా. 9.03 తదుపరి ద్వాదశి; నక్షత్రం: అనూరాధ తె. 3.13 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: ఉ. 6.23-8.04; దుర్ముహూర్తం: ఉ. 11.55-12.47; అమృతఘడియలు: సా. 4.23-6.03; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.53; సూర్యాస్తమయం: 6.48 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టైటిల్లింగ్ చట్టం రద్దు

రాష్ట్ర మంత్రివర్గం ఆమోద ముద్ర

ఉచిత ఇసుక పాలసీకీ పచ్చ జెండా



రాష్ట్ర ఆర్థిక పునరుజ్జీవానికి

సమగ్ర ప్రణాళిక!

అమిత్ షాతో ఢిల్లీలో చంద్రబాబు భేటీ

తక్షణ నిధులు, ప్రాజెక్టులపై విస్తృత చర్చలు

నేడు నిర్మలను, ఇతర మంత్రులను కలిసే చాన్సు

ధాన్యం కొనుగోలుకు రుణసేకరణకు ప్రభుత్వ హామీ

పౌర సరఫరాల సంస్థకు రూ.2 వేల కోట్ల గ్యారెంటీ

మార్క్‌ఫెడ్‌కు రూ.3,200 కోట్లకు సర్కారు హామీ

పంటల బీమాపై అధ్యయనానికి మంత్రులతో కమిటీ

నెలలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం

కౌలు రైతులకు సులువుగా రుణాలపైనా అధ్యయనం

కేబినెట్ కమిటీ వేయాలని సీఎం సూచన

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టికి నిర్ణయం

2029 నాటికి 20 లక్షల ఎకరాల్లో సాగు

మరో 4 నెలలకు ఓటాన్ అకౌంట్!

అసెంబ్లీ సమావేశాల తర్వాత ఆర్డినెన్స్ జారీ

అమరావతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ (2022)పై ప్రజల్లో పలు భయసందేహాలు, అనుమానాలు ఉన్న నేపథ్యంలో ఈ చట్టాన్ని రద్దు చేయాలని భూయజమానుల నుంచి తీవ్ర ఒత్తిడి మొదలైందని, దీంతో దీనిని రద్దుచేస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని సమాచార-పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. మంగళవారం సచివాలయంలో కేబినెట్ సమావేశం అనంతరం సమాచారశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి ఆయన విలేకరులకు వివరాలు తెలియజేశారు. నీతి ఆయోగ్ రూపొందించిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ప్రకారం టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి (టీఆర్వో)గా ప్రభుత్వ అధికారి ఉండాలని.. అయితే ఆ స్థానంలో గత ప్రభుత్వం ఎలాంటి అర్హతా లేని వ్యక్తులను

మిగతా 11వ పేజీలో...



మంగళవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, సీఎస్, మంత్రులు

'జె' భూతం వెంటాడుతోంది!

పారిశ్రామికవేత్తల్లో ఇంకా ఆందోళన పోలేదు.. కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి వ్యాఖ్య

స్వేచ్ఛ వచ్చిందని ప్రజల్లో సంతోషం.. ఈ సానుకూలతను మరింత పెంచుకోవాలి

మంత్రులు పనితీరు మెరుగుపరచుకోవాలి.. నేర్చుకోవడం చిన్నతనంగా భావించొద్దు

ఇంత అనుభవమున్నా.. ఇప్పటికీ నేర్చుకుంటుంటాను.. ఇసుకపై ఇక 'జె' ట్యాక్స్ ఉండదు

ఉచిత ఇసుక శాశ్వత విధానం.. మనం ఉన్నంత కాలం ఉంటుంది 11

ప్రజాప్రతినిధులు తలదూర్చొద్దు.. భూములు, గనుల దోపిడీ కట్టడికి సమిష్టి నిర్ణయం

బియ్యం స్మగ్లింగ్‌పై సమగ్ర విచారణ: సీఎం

'సీసీ'.. సొమ్ములు నొక్కేసి!



అవసరం లేని ఆసుపత్రుల కోసం భారీగా సీసీ కెమెరాల కొనుగోలు

అర్హతలేని కంపెనీకి 18 కోట్ల టెండర్

అస్మదీయ కంపెనీ పేరిట బిల్లులు

అధికారుల జేబుల్లోకి ఖజానా నిధులు

టెండర్ నిబంధనల్లో స్పెసిఫికేషన్ మార్పు

విషయం ముందే పసిగట్టిన ఎంఎస్ఐడీసీ

కొనుగోలు ఆదేశాలు ఇవ్వలేమని పక్కకు

అయినా.. పట్టు వదలని అధికారులు

10 మెడికల్ కాలేజీలకు అవసరం లేకున్నా రూ.3 కోట్లతో సీసీ కెమెరాల కొనుగోలు

వైసీపీ హయాంలో అవినీతి బాగోతం

తాజాగా వెలుగులోకి వచ్చిన వైనం

జగన్ హయాంలో రాష్ట్ర ఆరోగ్య శాఖలో జరిగిన అక్రమాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. గత ప్రభుత్వంలో అక్రమాలు, అవినీతి ఒక్కొటీ బయటపడుతున్నాయి. ఏపీఎంఎస్ఐడీసీ(ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)లో జరిగిన ప్రతి టెండర్ ప్రక్రియలోనూ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారు. వీటిలో తాజాగా సీసీ కెమెరాల వ్యవహారం వెలుగు చూసింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆరోగ్య శాఖలో సీసీ కెమెరాల అవినీతి వ్యవహారం తెరమీదికి వచ్చింది. ఆ శాఖ ఉన్నతాధికారులు 11 బోధనాసుపత్రులు, 10 కొత్త మెడికల్ కాలేజీలు, 17 జిల్లా ఆస్పత్రులు, 51 ఏరియా ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు బిగించాలని నిర్ణయించారు. అయితే, బోధనాస్పత్రులు, కొత్త కాలేజీలకు మినహా ఇతర ఆసుపత్రులకు సీసీ కెమెరాల అవసరం లేదు. పైగా కెమెరాలు

మిగతా 11వ పేజీలో...

నామినేటెడ్ పదవులపై కసరత్తు

త్వరలో పాతిక వరకూ కార్పొరేషన్ పదవుల భర్తీ

విడతల వారీగా అందరికీ ఏదో ఒక అవకాశం

టీడీపీ ఆశావహుల్లో పెరిగిన ఉత్సాహం

జనసేన, బీజేపీ నేతలకూ చాన్స్ 12

పెద్దిరెడ్డి 'సెటిల్‌మెంట్'కు బ్రేక్ 11

982 ఎకరాలపై సర్వే సెటిల్‌మెంట్స్ కమిషనర్‌కు రివిజన్ పిటిషన్ వేయండి.. కలెక్టరు ఆదేశాలు

పెద్దిరెడ్డి, ఆయన మనుషులకు అనుకూలంగా నాటి చిత్తూరు జేసీ, ప్రస్తుత తిరుపతి కలెక్టర్ పావులు

ప్రభుత్వం వచ్చేనాటికి భూములన్నీ పెద్దిరెడ్డి గుప్పిట్లో

అక్కడ తమ భూములున్నాయని రైతుల ఫిర్యాదులు

బాబు రాగానే రిజిస్ట్రేషన్లు ఆపేసిన అధికారులు

త్వరలో బాధిత రైతులకు నోటీసులు



రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి వాన్స్‌తో ఉష

అమెరికా ఎన్నికల్లో 'తెలుగు బంధం'

రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి వాన్స్ భార్య ఉషా చిలుకూరుకు ఆంధ్రప్రదేశ్ మూలాలు

అమెరికాలో న్యాయ సలహాదారుగా ఉష సుదీర్ఘ సేవలు

ఆమె డెమోక్రాట్.. భర్త రిపబ్లికన్ పార్టీ నేత

వాషింగ్టన్, జూలై 16 : అమెరికాలో తెలుగు మూలాలు ఉన్న ఓ కుటుంబం ఇప్పుడు అనూహ్యంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. రిపబ్లికన్ల నాయకుడు డొనాల్డ్ ట్రంప్ ఒకవేళ ఎన్నికల్లో గెలిస్తే ఈ కుటుంబానికి చెందిన వ్యక్తే ఉపాధ్యక్ష పదవిని చేపడతారు. అదే జరిగితే తెలుగు మూలాలు ఉన్న కుటుంబానికి చెందిన నేత అమెరికా చరిత్రలోనే తొలి సారి అత్యున్నత పదవిని అధిష్ఠించినట్టు అవుతుంది. ఇంతలా వార్తల్లో నిలుస్తున్న ఆ వ్యక్తి జేడీ వాన్స్, ఒహాయో సెనేటర్. రిపబ్లికన్ పార్టీ తరఫున ట్రంప్ అభ్యర్థిత్వం మిల్వాకీలో జరిగిన పార్టీ

మిగతా 2వ పేజీలో...

న్యాయ పీఠం



కోటీశ్వర్‌సింగ్ | మహదేవన్

సుప్రీంకోర్టులో తొలిసారిగా మణిపూర్ జడ్జి

ఆ రాష్ట్రానికి చెందిన జస్టిస్ కోటీశ్వర్‌సింగ్ న్యాయమూర్తిగా నియామకం

మరో జడ్జిగా జస్టిస్ ఆర్ మహదేవన్

బీసీ సామాజికవర్గానికి అవకాశం

వైవిధ్యతకు కొలీజియం పెద్దపీట 2

34కు చేరుకోనున్న న్యాయమూర్తుల సంఖ్య.. పూర్తి సామర్థ్యంతో సుప్రీంకోర్టు

ఇక చదువుకోండి

కాలేజీల ఖాతాలకే ఫీజులు 12

తల్లిదండ్రులకు ముడిపెట్టకూడదని నిర్ణయం

పాత విధానంపై అధ్యయనానికి లోకేశ్ ఆదేశం

విద్య, వసతి దీవెనల్లో 3,480 కోట్ల బకాయిలు

కాలేజీల్లో నిలిచిపోయిన విద్యార్థుల సర్టిఫికెట్లు

కళాశాలల్లో డ్రగ్స్ నియంత్రణకు పటిష్ఠ చర్యలు

నోడల్ అధికారుల నియామకంపై పరిశీలన

ఫీజులు, ఉన్నత విద్యపై మంత్రి లోకేశ్ సమీక్ష

ఇక ఇంటికే 'మందు'

స్విగ్గీ, జొమాటోలతో మద్యం హోం డెలివరీ!

పైలట్ ప్రాజెక్టుకు పలు రాష్ట్రాల యోచన

తొలుత బీర్, వైన్ సరఫరా 2

ఇప్పటికే ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో మద్యం హోం డెలివరీకి అనుమతి

కుట్ర కోణం!

ట్రంప్‌పై హత్యాయత్నం వెనుక ఉక్రెయిన్?

ఘటన అనంతరం సోషల్ మీడియాలో ఆ దేశ వైమానిక దళ హర్షాతిరేకం 2

సెక్యూరిటీ అనలిస్ట్ మార్క్ సెల్బోడా వెల్లడి

తాను గెలిస్తే ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్ని నిలిపేస్తానని ట్రంప్ ప్రకటించడం వల్లే..?

స్వామి సేవకు

టీటీడీ జేఈవోగా వెంకయ్య చౌదరి!



రాష్ట్ర వినతిపై కేంద్ర విధుల నుంచి రిలీవ్ చేసిన డీవోపీటీ

టీటీడీకి పంపుతున్నట్టు ఉత్తర్వుల్లో వెల్లడి

ఐపీఎస్ అధికారి రవికృష్ణకూ రిలీవ్ ఆర్డర్ 12

గలగలా గోదారి..

పోలవరం ఎడమ కాలువకు మోక్షం!

సీఎం ఆదేశాలతో ప్లాన్-ఏ, బీ సిద్ధం

మంత్రి నిమ్మలకు నివేదిక సమర్పణ 3

మొదటి ప్లాన్‌కు 2 వేల కోట్ల వ్యయం

ప్రాజెక్టు పూర్తయ్యాక విశాఖ వరకు నీరు

క్రమంగా శ్రీకాకుళం దాకా తరలింపు

రెండేళ్లలో పూర్తిచేసేలా కార్యాచరణ

రెండో ప్లాన్ అంచనా వ్యయం వెయ్యి కోట్లు

ప్రాజెక్టు పూర్తయ్యేలోపు పురుషోత్తపట్నం, పుష్కర లిఫ్టులతో గోదావరి జలాల ఎత్తిపోత

ముఖ్యమంత్రితో భేటీలో తుది నిర్ణయం!

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

నలుగురు జవాన్ల మృతి

మృతుల్లో ఆర్మీ కెప్టెన్ బ్రిజేశ్ థాపా, ఏపీకి చెందిన జవాన్ రాజేశ్

ఉగ్రవాదుల కోసం తనిఖీలు చేస్తుండగా దుండగుల కాల్పులు 2

ఎర్రమట్టి దిబ్బలకు ఎసరు

భీమిలిలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు

గతంలో పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన

ప్రభుత్వం మారింది.. కానీ, ఆగని తవ్వకం

'భీమిలి సొసైటీ'కి 373.95 ఎకరాలు

లేఅవుట్‌కు 2016లో వుడాకు దరఖాస్తు

ఈ దిబ్బలు వారసత్వ సంపద కావడంతో సొసైటీకి పలు షరతులు పెట్టిన సంస్థ

అప్పటి నుంచి మౌనంగా ఉండి.. ఎన్నికలకు ముందు నుంచి పనులు

దిబ్బను చదును చేస్తున్న భారీ యంత్రాలు

కూటమి ప్రభుత్వం వచ్చినా పడని బ్రేకులు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

భీమిలిలో భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తించిన ఎర్రమట్టి దిబ్బలను ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. ఎర్రమట్టి దిబ్బలను తవ్వేసి వందల ఎకరాలను చదును చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల సమయంలో మొదలైన పనులు ఇప్పటికీ నిరాటంకంగా సాగడం గమనార్హం. గత ఏడాది వీఎంఆర్‌డీఏ అధికారులు ఎర్రమట్టి దిబ్బల సమీపంలో లేఅవుట్లకు అనుమతి ఇచ్చినప్పుడు కూడా ఇలాగే తవ్వేశారు. అప్పుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చి పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్నారని, వైసీపీ నేతలు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. అయినా, ఇప్పటికీ తవ్వకాలను

మిగతా 12వ పేజీలో...



పొక్లెయిన్‌లు, ట్రాక్టర్లతో భీమిలిలోని ఎర్రమట్టి దిబ్బలను తవ్వేస్తున్న దృశ్యం

అమెరికా ఎన్నికల్లో తెలుగు బంధం

(మొదటి పేజీ తరువాయి)


సమావేశంలో ఖరారైంది. ఆయన వైస్ ప్రెసిడెంట్‌గా జేడీ వాన్స్ పేరును ప్రకటించారు. జేడీ వాన్స్.. తెలుగు మూలాలు (ఆంధ్రప్రదేశ్) కలిగిన యువతి, న్యాయవాది ఉషా చిలుకూరికి భర్త. అధికార డెమొక్రటిక్ పార్టీ నాయకురాలు, భారతీయ మూలాలు ఉన్న కమలా హారిస్ ఉపాధ్యక్షురాలిగా ఉన్న విషయం తెలిసిందే. ఏపీ నుంచి అమెరికాకు వలస పోయిన కుటుంబంలో ఉష జన్మించారు. కాలిఫోర్నియాలోని శాన్‌డియాగోలో ఉషా పెరిగి పెద్దయ్యారు. మౌంట్ కార్మెల్ హైస్కూలులో చదివారు. మొదటి నుంచీ మంచి చదువరి అని, కష్టించి పనిచేసే తత్వం ఆమెకు ఉన్నదని సన్నిహితులు చెబుతున్నారు. యేల్ యూనివర్సిటీలో చరిత్ర విభాగంలో 2007లో బ్యాచులర్ డిగ్రీ, కేంబ్రిడ్జ్‌లో 2009లో ఫిలాసఫీలో మాస్టర్స్ చేశారు. యేల్ లా జర్నల్‌కు మేనేజింగ్ ఎడిటర్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు పలు ప్రతిష్ఠాత్మక సంస్థలకు న్యాయ సలహాదారుగా పనిచేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వద్ద విధులు నిర్వహించారు. ఉదారభావాలు కలిగిన ఉషా.. వామపక్ష రాజకీయాలను ఇష్టపడేవారు. 2014లో డెమొక్రట్‌గా తన పేరు నమోదు చేసుకున్నారు. దీనికి భిన్నగా జేడీ వాన్స్ రిపబ్లికన్ పార్టీలో ఉండటం గమనార్హం. ట్రంప్‌కు ఆయన వీర విధేయుడు. జేడీ వాన్స్ కూడా యేల్ యూనివర్సిటీలోనే న్యాయశాస్త్రం అభ్యసించారు. అక్కడే వాన్స్ ఉషాలకు పరిచయమై అది ప్రేమగా మారింది. 2014లో కెంటకీలో హిందూ పూజారి సమక్షంలో వారిద్దరు ఒక్కటయ్యారు. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. జేడీ వాన్స్ రాసిన 'హిల్‌బిలీ ఎలెజీ' అనే పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది. గ్రామీణ శ్వేత అమెరికన్లపై కొనసాగుతున్న సామాజిక వివక్షను విశ్లేషించిన ఆ పుస్తక రచనలో వాన్స్‌కు ఉషా సహకరించారు. ఈ పుస్తకం 2020లో సినిమాగా కూడా వచ్చింది. జేడీ వాన్స్ ఒహాయోలోని మిడిల్‌టౌన్‌లో జేమ్స్ డొనాల్డ్ బౌమన్, బెవ్ వాన్స్ దంపతులకు జన్మించారు. మత్తుకు ఆయన తల్లి బానిస కావడంతో తండ్రి వారిని వదిలి వెళ్లిపోయాడు. దీంతో చిన్నారి వాన్స్ తాతయ్య ఇంట పెరిగి పెద్దయ్యారు. కాగా, ఉపాధ్యక్షునిగా వాన్స్ పేరును ట్రంప్ ప్రకటించిన తర్వాత నుంచి వాన్స్ దంపతుల వివరాలు సోషల్‌మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.



ఆనంద్ మహీంద్ర పోస్టు చేసిన ఉష పెళ్లి ఫొటో

జెడి వాన్స్ ఆయన సతీమణి ఉష చిలుకూరి పెళ్లినాటి ఫొటోను ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఇది గుర్తుండిపోయే మరొక గొప్ప భారతీయ వివాహం' అని వ్యాఖ్యానించారు.

లోకం తీరు



కర్ణాటకలో ప్రైవేటు ఉద్యోగాలు స్థానికులకే!

- సిద్దరామయ్య కేబినెట్ తీర్మానం
- మేనేజ్‌మెంట్ జాబుల్లో వారికి 50% కోటా
- నాన్-మేనేజ్‌మెంట్ పోస్టుల్లో 75% ఇవ్వాల్సిందే
- గ్రూపు సీ, డీ ఉద్యోగాలన్నీ కన్నడిగులకే.. రేపు అసెంబ్లీ ముందుకు బిల్లు
- ఇతర రాష్ట్రాల వారికి తగ్గనున్న ఉపాధి అవకాశాలు
- బెంగళూరు ఐటీ సంస్థల్లో భారీ సంఖ్యలో తెలుగువారు

బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఐటీ సహా ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కర్మాగారాల్లో ఇక ఇతర రాష్ట్రాలవారికి ఉద్యోగాలు తగ్గిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాటిలో 50 శాతం నుంచి వంద శాతం వరకు స్థానికులకే రిజర్వేషన్ కల్పించాలని ఆ రాష్ట్ర కేబినెట్ ఓ బిల్లును ఆమోదించింది. మేనేజ్‌మెంట్ ఉద్యోగాల్లో 50 శాతం, నాన్-మేనేజ్‌మెంట్ ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకు ఇవ్వాలని అందులో నిర్దేశించారు. గురువారం ఈ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. కర్ణాటకలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన అనేక మంది ప్రజలు నివసిస్తున్నారు. ముఖ్యంగా బెంగళూరులో ఐటీ సహా పలు ప్రైవేటు సంస్థల్లో పెద్దసంఖ్యలో ఉద్యోగాలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే తమ రాష్ట్రంలోని సంస్థల్లో స్థానికులకే ఉపాధి అవకాశాలివ్వాలని కన్నడ సంఘాలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రైవేటు ఉద్యోగాల్లో స్థానికులకు రిజర్వేషన్ కల్పిస్తూ సీఎం సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎవరు స్థానికులో ఈ బిల్లులో నిర్వచించారు. కర్ణాటకలో జన్మించినవారు.. 15 ఏళ్లుగా ఆ రాష్ట్రంలోనే నివసిస్తున్నవారు.. కన్నడ భాషలో మాట్లాడే, చదివే, రాసే నైపుణ్యం ఉండి.. రాష్ట్ర నోడల్ ఏజెన్సీ నిర్వహించే అర్హత పరీక్షలో నెగ్గినవారిని స్థానిక అభ్యర్థిగా పరిగణిస్తారు. కన్నడం ఓ భాషగా ఉన్న ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్‌ను ఉద్యోగార్థులు కలిగి ఉండాలి. లేదంటే ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ నిర్వహించే కన్నడ ప్రావీణ్య పరీక్షలో పాసవ్వాలి. అర్హతలున్న స్థానిక అభ్యర్థులు దొరక్కపోతే.. చట్ట నిబంధనల సడలింపునకు ప్రైవేటు పరిశ్రమలు, సంస్థలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలి. తగు విచారణ తర్వాత ప్రభుత్వం సముచిత ఉత్తర్వులు జారీ చేస్తుంది. అవే ఫైనల్. అర్హతలున్న స్థానికులు లేకపోతే.. ఆయా సంస్థలు సర్కారు సహకారంతో మూడేళ్లలో స్థానిక అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధిస్తామని బిల్లులో పేర్కొన్నారు. కాగా.. ప్రైవేటు పరిశ్రమల్లోని గ్రూపు సీ, డీ ఉద్యోగాలను వంద శాతం స్థానికులకే ఇవ్వాలని కేబినెట్ భేటీలో తీర్మానించినట్లు సిద్దరామయ్య మంగళవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. కన్నడిగులు తమ రాష్ట్రంలో సౌకర్యవంతమైన జీవనం సాగించాలని.. మాతృభూమిలో వారికి ఉపాధి దూరం కారాదన్నది తమ ప్రభుత్వ అభిలాష అని తెలిపారు. 'మాది కన్నడ అనుకూల ప్రభుత్వం. వారి సంక్షేమానికే మా ప్రాధాన్యం' అని వెల్లడించారు. మరోవైపు.. ఏడో వేతన కమిషన్ సిఫారసులకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులకు వేతనం పెంచుతూ కర్ణాటక కేబినెట్ నిర్ణయం తీసుకుంది. 31 శాతం కరువుభత్యాన్ని మూలవేతనంలో కలపడంతో పాటు 27.5 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని కమిషన్ సిఫారసు చేసింది. పెంచిన వేతనాలు ఆగస్టు నుంచి అమలులోకి రానున్నాయి.

పూజాను శిక్షణ నుంచి రిలీవ్ చేయండి

- ముస్సోరి పంపేయండి.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు
- నేరం రుజువయ్యే వరకూ నేను దోషిని కాదు: పూజా



మాట్లాడుతున్న పూజా

పుణె, న్యూఢిల్లీ, జూలై 16: వివాదస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్‌పై చర్యలు మొదలయ్యాయి. తక్షణం ఆమెను జిల్లా శిక్షణ కార్యక్రమం నుంచి రిలీవ్ చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. తక్షణం ఆమెను ముస్సోరీలోని ఐఏఎస్ అకాడెమీకి పంపించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు అదనపు ప్రధాన కార్యదర్శి నితిన్ గాద్రె మహారాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. నకిలీ సర్టిఫికెట్ల వివాదంలో పూజా పూర్తిగా కూరుకుపోవడంతో ఆమెను వెంటనే ముస్సోరీ అకాడెమీకి పంపాలని ఆదేశించారు. పూజా సమర్పించిన దృష్టి లోపానికి సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్లు, ఓబీసీ రిజర్వేషన్‌కు సంబంధించిన సర్టిఫికెట్లపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. ఇక, తాజాగా పూజా పుట్టిన సంవత్సరానికి సంబంధించిన వివాదం కూడా ముందుకొచ్చింది. సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ట్రైబ్యునల్‌కు పెట్టుకున్న దరఖాస్తుల్లో పుట్టిన ఏడాదిని వేర్వేరుగా పేర్కొన్నట్లు సమాచారం. వయసు మినహాయింపును పొందడానికే పూజా ఇలా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. సివిల్స్‌కు దరఖాస్తు చేసే సమయాల్లో కూడా 2020లో ఖేద్కర్ పూజా దిలీప్‌రావు అని, 2023లో పూజా మనోరమా దిలీప్ ఖేద్కర్ అని పేర్లను మార్చిన విషయం తెలిసిందే. యూపీఎస్సీ అభ్యర్థులకు సాధారణ కేటగిరిలో అయితే 32 ఏళ్లలోపు ఆరుసార్లు పరీక్ష రాసే అవకాశం ఉండగా, ఓబీసీ కేటగిరి అభ్యర్థులకు 35 ఏళ్ల వరకూ తొమ్మిదిసార్లు పరీక్షకు హాజరయ్యే వెసులుబాటు ఉంది. ఇక, పూజా సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్లపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దృష్టి లోపం ఉందంటూ దివ్యాంగుల కోటాలో ఉద్యోగం పొందేందుకు మెడికల్ సర్టిఫికెట్ పొందేందుకు ఆమె ప్రయత్నించిన విషయం ఇప్పటికే బయటపడిన సంగతి తెలిసిందే. పూజా సమర్పించిన పత్రాలపై విచారణ చేయాలని దివ్యాంగుల కమిషన్ నుంచి ఆదేశాలు రావడంతో పుణె పోలీసులు రంగంలోకి దిగారు. ఆమె ఏ పత్రాలు సమర్పించింది... ఏ ఆసుపత్రిలో ఏ వైద్యులు ఆ పత్రాలు ఇచ్చారనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. కాగా, తనపై వస్తున్న ఆరోపణల నిగ్గు తేల్చాల్సింది కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీయేనని, మీడియా, ప్రజలు దాన్ని తేల్చలేరని పూజా వ్యాఖ్యానించారు. నేరం నిరూపితమయ్యే వరకూ ఎవరినీ దోషిగా పేర్కొనరాదని పూజా అన్నారు. ఇక, పూజా అభ్యర్థిత్వం సరైందా, కాదా అనే విషయాన్ని తేల్చేందుకు గత వారంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ రెండు వారాల్లో తన నివేదిక సమర్పించవలసి ఉంది.

పుణె కలెక్టర్‌పై కేసు పెట్టిన పూజా

తనను వేధిస్తున్నారంటూ పుణె కలెక్టర్ సుహాస్ దివాసీపై పూజా ఖేద్కర్ కేసు పెట్టారు. వాసిం పోలీసు స్టేషన్‌కు చెందిన మహిళా పోలీసులు సోమవారం పూజా ఇంటికి వెళ్లిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే కలెక్టర్ సుహాస్ తనను వేధిస్తున్నారంటూ పూజా ఫిర్యాదు చేశారు. అంతకుముందు పోలీసులు ఆమె ఇంటికి వెళ్లడంపై అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చినా దానిపై స్పందించేందుకు పూజా నిరాకరించారు. కొన్ని పనులు ఉండడంతో తానే మహిళా పోలీసులను ఇంటికి రమ్మని పిలిచానని పూజా వెల్లడించారు.

ట్రంప్‌కే రిపబ్లికన్లు జై

అధ్యక్ష అభ్యర్థిత్వం లాంఛనంగా ఖరారు..'ఉపాధ్యక్షుడి'గా జేడీ వాన్స్ పేరు ప్రకటన

- వాన్స్ భార్య ఉష తెలుగు సంతతి మహిళ

మిల్వాకీ, జూలై 16: అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ ఓ లాంఛనం పూర్తిచేసింది. హత్యాయత్నం నుంచి ప్రాణాలతో బయటపడిన మాజీ అధ్యక్షుడు ట్రంప్(78)ను తన అభ్యర్థిగా ప్రకటించింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం విస్కాన్సిన్ రాష్ట్రంలోని మిల్వాకీ నగరంలో ఆ పార్టీ జాతీయ సదస్సు జరిగింది. అన్ని రాష్ట్రాలకు చెందిన రిపబ్లికన్ ప్రతినిధులు ట్రంప్ అభ్యర్థిత్వానికే మొగ్గుచూపారు. ఈ ఏడాది నవంబరు 5న జరిగే ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిత్వం ఖరారుకు మొత్తం 2,429 మంది ప్రతినిధులకు గాను 1,215 మంది మద్దతు అవసరం కాగా.. ఆయనకు ఏకంగా 2,388 మంది ఓటేశారు. 41 మంది ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. దాంతో ట్రంప్‌ను రిపబ్లికన్ అభ్యర్థిగా ప్రకటించారు. ప్రైమరీ ఎన్నికలు పూర్తయ్యే నాటికే 2,243 మంది ప్రతినిధులు ఆయనకు మద్దతిచ్చారు. తాజాగా మిగతా సభ్యులు కూడా మద్దతుగా నిలిచారు. ట్రంప్ అంతకుముందే తన ఉపాధ్యక్షుడిగా ఒహాయో సెనేటర్ జేడీ వాన్స్(39)ను ప్రకటించారు. వాన్స్ భార్య ఉషా చిలుకూరి అమెరికన్ తెలుగు సంతతికి చెందిన మహిళ కావడం విశేషం. ఉపాధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడిన వారిలో ఫ్లోరిడా సెనేటర్ మార్కో రుబియో, నార్త్ డకోటా గవర్నర్ డగ్ బర్గమ్ కూడా ఉన్నారు. 'వారందరి టాలెంట్‌పై సుదీర్ఘంగా చర్చించాక ఉపాధ్యక్ష పదవికి ఒహాయో సెనేటర్ జేడీ వాన్స్ తగిన వ్యక్తిగా నిర్ణయించాను' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ నెట్‌వర్క్‌లో సోమవారమే వెల్లడించారు. పార్టీ సదస్సు ఆయన నిర్ణయాన్ని హర్షధ్వానాలతో స్వాగతించింది. పార్టీగా, దేశంగా మనందరం ఐక్యంగా ఉండాలని రిపబ్లికన్ పార్టీ ఛైర్మన్ మైకేల్ వాట్లీ ఈ సమావేశంలో పిలుపిచ్చారు. అమెరికాను ఉజ్వల భవిష్యత్ దిశగా నడిపేందుకు.. హత్యాయత్నం నుంచి చెవిగాయంతో బయటపడిన ట్రంప్ మాదిరిగా శక్తిసామర్థ్యాలనుప్రదర్శించాలని కోరారు.



ట్రంప్‌తో కరచాలనం చేస్తున్న వాన్స్

భారతీయ అమెరికన్ల హవా..

ఈసారి రిపబ్లికన్ కన్వెన్షన్‌లో భారతీయ అమెరికన్లు కీలక పాత్ర పోషించారు. పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ట్రంప్‌కు పూర్తి మద్దతు ప్రకటించడం నుంచి సిక్కు మతసంప్రదాయంలో ప్రార్థనలు చేసేవరకు అంతా వారిదే హడావుడి. ఈ సదస్సు నాలుగు రోజులు జరుగనుంది. ట్రంప్‌కు తన రాష్ట్రానికి చెందిన ప్రతినిధులంతా మద్దతిస్తున్నట్లు టెక్సాస్ రిపబ్లికన్ పార్టీ ఛైర్మన్‌గా గత మే నెలలో ఎన్నికైన భారతీయ అమెరికన్ అబ్రహాం జార్జ్ సభలో ప్రకటించారు. ట్రంప్ విజయం సాధించాలని సదస్సు జాతీయ కమిటీ సభ్యురాలు హర్మీత్ ధిల్లాన్ (కాలిఫోర్నియా) గురునానక్‌ను ప్రార్థించారు. జేడీ వాన్స్‌ను ఉపాధ్యక్షుడిగా ఖరారుచేసే సమయంలో ఆయన భార్య ఉష సభలోనే ఉన్నారు. ఒహాయో రాష్ట్ర సెనేటర్ నీరజ్ అంతానీ, రిపబ్లికన్ పార్టీ సభ్యుడు డాక్టర్ సంపత్ శివాంగి ఆ రాష్ట్ర రిపబ్లికన్ ప్రతినిధులుగా హాజరయ్యారు. అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని అధికారికంగా అంగీకరిస్తూ గురువారం రాత్రి సదస్సునుద్దేశించి ట్రంప్ ప్రసంగిస్తారు. ఆయన బరిలో నిలవడం ఇది మూడోసారి. 2016 ఎన్నికల్లో గెలిచిన ఆయన 2020లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు.

మస్క్ నెలనెలా రూ.376 కోట్ల విరాళం

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సంచలన ప్రకటన చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున బరిలో ఉన్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నెల నెలా రూ.376 కోట్ల(45 మిలియన్ డాలర్లు) విరాళం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ నిధులను నేరుగా ట్రంప్ రాజకీయ వ్యవహారాలు చూస్తున్న పొలిటికల్ యాక్షన్ కమిటీ(పీఏసీ)కి ఇవ్వనున్నట్టు మస్క్ ప్రకటించారు.

ట్రంప్‌పై హత్యాయత్నం వెనుక ఉక్రెయిన్?

మాస్కో, జూలై 16: అమెరికా మాజీ అధ్యక్షుడు, 2024 ప్రెసిడెన్షియల్ రేసులో దూసుకుపోతున్న డోనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం వెనుక ఉక్రెయిన్ ఆర్మీ హస్తం ఉందా? ప్రముఖ సెక్యూరిటీ అనలిస్టు మార్క్ స్లెబోడా.. ఉక్రెయిన్ ఆర్మీ హస్తం ఉందనే అభిప్రాయపడుతున్నారు. రష్యాకు చెందిన స్పుత్నిక్ వార్తాసంస్థ నిర్వహించిన 'ద క్రిటికల్ అవర్ ప్రోగ్రామ్'లో ఆయన మాట్లాడారు. ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిందన్న విషయం తెలియగానే ఉక్రెయిన్‌కు చెందిన 79వ ఎయిర్ అసాల్ట్ బ్రిగేడ్ సోషల్ మీడియా వేదికగా సంతోషం తెలిపిందని.. ఇది తమ సొంత ఇంటెలిజెన్స్ వ్యవస్థల పనేనని వారు భావిస్తున్నారని ఆయన వివరించారు. ట్రంప్‌పై కాల్పుల వెనుక ఉక్రెయిన్ హస్తం ఉందనడానికి ఇప్పటివరకూ ఎలాంటి ఆధారాలూ లేవు. అయినప్పటికీ.. తాను గెలిస్తే ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్ని నిలిపివేస్తానని ట్రంప్ ప్రకటించినందునే ఇలాంటి ఊహాగానాలు వినిపిస్తున్నాయని మరికొందరు విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా.. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్, బైడెన్లలో ఎవరు గెలిచినా వారితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని జెలెన్‌స్కీ తెలిపారు.

ఉక్రెయిన్‌తో యుద్ధం వద్దని పుతిన్‌కు చెప్పండి

- భారత్‌ను కోరిన అమెరికా

మిల్వాకీ, జూలై 16: రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల స్నేహ సంబంధాలను ఉక్రెయిన్‌పై రష్యా అధ్యక్షుడు పుతిన్ సాగిస్తోన్న అక్రమ యుద్ధం ముగించేందుకు ఉపయోగించాలని అమెరికా కోరింది. అమెరికా ప్రభుత్వ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ తన రోజువారీ విలేకరుల సమావేశంలో సోమవారం ఈ మేరకు పేర్కొన్నారు. జూలై 9న ప్రధాని మోదీ రష్యా పర్యటన ముగించుకుని వెనుదిరిగినప్పుడు కూడా మిల్లర్ ఇదేవిధమైన వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ సమస్యకు యుద్ధభూమిలో పరిష్కారం దొరకదని, బాంబులు, బుల్లెట్ల మధ్య శాంతి ప్రయత్నాలు ఫలించవని జూలై 9న పుతిన్‌తో జరిపిన భేటీలో మోదీ పేర్కొన్నారు.

పాక్ సైనిక స్థావరంపై ఆత్మాహుతి దాడి

- 8 మంది జవాన్ల మృతి

పెషావర్, జూలై 16: పాకిస్థాన్‌లోని ఓ సైనిక స్థావరంపై ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 8 మంది జవాన్లు మరణించారు. ఈ ఘటన ఖైబర్ ప్రావిన్స్‌లోని బన్నూ కంటోన్మెంట్‌లో జరిగింది. "సోమవారం బన్నూ కంటోన్మెంట్‌లోకి 10 మంది ఉగ్రవాదులు చొరబడ్డారు. తొలుత కొందరు ముష్కరులు పేలుడు పదార్థాలు ఉన్న వాహనంతో కంటోన్మెంట్ గోడను కూల్చి లోనికి ప్రవేశించారు. వారు జరిపిన దాడిలో 8 మంది సైనికులు మరణించారు. అనంతరం మరికొందరు ఉగ్రవాదులు లోనికి వచ్చి దాడులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో జవాన్లు సైతం ఎదురుదాడి చేయడంతో మొత్తం 10 మంది ఉగ్రవాదులు మృతి చెందారు" అని ఆర్మీ అధికారులు తెలిపారు. ఈ దాడి తమ పనేనని హఫీజ్ గుల్ బహదూర్ గ్రూప్ ఉగ్ర సంస్థ ప్రకటించింది.

సుప్రీంకోర్టులో తొలిసారిగా మణిపూర్ జడ్జి

న్యూఢిల్లీ, జూలై 16: దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌కు తొలిసారిగా ప్రాతినిధ్యం లభించనుంది. ఆ రాష్ట్రానికి చెందిన జస్టిస్ నాంగ్‌మీకపమ్ కోటీశ్వర్‌సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆయనతోపాటు, మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఆర్ మహదేవన్ కూడా సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. వీరితో ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ చంద్రచూడ్ గురువారం ప్రమాణం చేయించనున్నారు. ఇద్దరు న్యాయమూర్తుల నియామకంతో సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య (సీజేఐతో కలిపి) 34కు చేరుకోనుంది. ఇది సుప్రీంకోర్టుకు కేటాయించిన గరిష్ఠ న్యాయమూర్తుల సంఖ్య. సీజేఐ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు కొలీజియం.. ఇద్దరు జడ్జిల నియామకాలను ఈ నెల 11న కేంద్రప్రభుత్వానికి సిఫార్సు చేసింది. జస్టిస్ కోటీశ్వర్‌సింగ్ నియామకంతో సుప్రీంకోర్టులో తొలిసారిగా మణిపూర్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం లభించనున్న విషయాన్ని కొలీజియం ప్రముఖంగా ప్రస్తావించింది. మరోవైపు, జస్టిస్ మహదేవన్ పేరును కొలీజియం సిఫార్సు చేస్తూ.. 'తమిళనాడుకు చెందిన జస్టిస్ మహదేవన్ బీసీ సామాజిక వర్గానికి చెందినవారు. మద్రాస్ హైకోర్టుతోపాటు ఇతర హైకోర్టుల్లో పని చేస్తున్న న్యాయమూర్తుల సీనియారిటీ పరంగా ఆయన మూడో స్థానంలో ఉన్నప్పటికీ.. బీసీ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లభించాలన్న ఉద్దేశంతో ఆయన పేరును సిఫార్సు చేస్తున్నాం' అని పేర్కొంది. జస్టిస్ మహదేవన్ నియామకం ద్వారా సుప్రీంకోర్టు ధర్మాసనానికి వైవిధ్యం సమకూరుతుందని తెలిపింది.

4 వారాల్లోగా రేషన్ కార్డులివ్వండి

- ఈ- శ్రమ్‌లో రిజిస్టరైన వలస కూలీలకు జారీ చేయండి.. రాష్ట్రాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, జూలై 16: ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికుల వివరాలను పరిశీలించి నాలుగు వారాల్లోగా రేషన్ కార్డులు జారీ చేయాలని రాష్ట్రాలను సుప్రీం కోర్టు ఆదేశించింది. తాము ఆదేశాలిచ్చి నాలుగు నెలలైనా ఇప్పటివరకు ప్రక్రియను పూర్తి చేయని రాష్ట్రాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిని దురదృష్టకరం అని అభివర్ణించింది. మరో రెండు నెలలు గడువు కోరండంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా తాము పేర్కొన్న వ్యవధిలోగా పరిశీలన పూర్తి చేయకుంటే ఆయా రాష్ట్రాల కార్యదర్శులకు సమన్లు జారీ చేస్తామని హెచ్చరించింది. ఈ-శ్రమ్‌లో దరఖాస్తు చేసుకున్న 8 కోట్ల మందికి రెండు నెలల్లో రేషన్ కార్డులు జారీ చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. కానీ, తెలంగాణ, బిహార్ రాష్ట్రాలు మాత్రమే దరఖాస్తుల తనిఖీని పూర్తి చేశాయి. మిగతా రాష్ట్రాలు ఇంకా ప్రక్రియను ముగించలేదని, కొన్ని కసరత్తును ప్రారంభించలేదని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంగళవారం జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లాలతో కూడిన బెంచ్ విచారణ జరిపింది. వివరాలు పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన రాష్ట్రాలకు రేషన్ మంజూరు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 27కు వాయిదా వేసింది.

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కాల్పులు.. నలుగురు జవాన్ల దుర్మరణం

- మృతుల్లో ఏపీకి చెందిన జగదీశ్, రాజేశ్
- ఆర్మీ కెప్టెన్ బ్రిజేశ్ థాపా కూడా
- ఉగ్రవాదుల కోసం తనిఖీలు చేస్తుండగా.. కాల్పులు జరిపిన దుండగులు



బ్రిజేశ్, బిజేంద్ర, అజయ్ కుమార్, రాజేశ్

జమ్మూ, నందిగాం(శ్రీకాకుళం), జూలై 16: జమ్మూకశ్మీర్‌లో భద్రతాబలగాలే లక్ష్యంగా ఉగ్రవాదులు మరోమారు తెగబడ్డారు. సోమవారం రాత్రి తనిఖీల్లో ఉన్న జవాన్లపైకి కాల్పులు జరిపారు. ఇందులో ఒక ఆర్మీ కెప్టెన్, ఒక నాయక్, ముగ్గురు సిపాయిలు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లాకు చెందిన హవల్దార్ సనపల జగదీశ్వరరావు, ఆర్మీ నాయక్ డొక్కరి రాజేశ్ ఉన్నారు. దోడా జిల్లా దేసా అటవీ ప్రాంతంలో ఉన్న ధరీగోట ఉడార్‌బాగిలో ఉగ్రవాదులు నక్కి ఉన్నట్లు ఉప్పందుకున్న సైన్యం, జమ్మూకశ్మీర్ రాష్ట్రీయ రైఫిల్స్ బలగాలతో కలిసి సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో కార్డాన్ అండ్ సెర్చ్ నిర్వహించాయి. ఈ క్రమంలో చీకట్లో నక్కిన ఉగ్రవాదులు.. బలగాలపైకి కాల్పులు జరిపి పారిపోయారు. వారిని వెంబడిస్తూ వెళ్లిన బలగాలు.. రాత్రి 9 గంటల సమయంలో ఉగ్రవాదులను గుర్తించాయి. మరోమారు ఇరువైపులా కాల్పులు జరిగాయి. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆర్మీ కెప్టెన్ బ్రిజేశ్ థాపా, తెలుగువారైన హవల్దార్ సనపల జగదీశ్వరరావు, ఆర్మీ నాయక్‌- డొక్కరి రాజేశ్, రాజస్థాన్‌కు చెందిన సిపాయిలు బిజేంద్ర, అజయ్ అమరులయ్యారు. కాగా.. గడిచిన 32 నెలల్లో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో 48 మంది సైనికులు ప్రాణాలను కోల్పోయారు. జమ్మూకశ్మీర్‌లో సుమారు 60 మంది ఉగ్రవాదులు క్రియాశీలంగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. సైనికుల మృతిపట్ల కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం తన విధానాలతో జవాన్ల జీవితాలతో ఆటలాడుకుంటోందని రాహుల్ గాంధీ మండిపడ్డారు. జమ్మూకశ్మీర్ డీజీపీ రాజకీయాల్లో బిజీగా ఉన్నారని, ఆయనను మారిస్తే.. ఇలాంటి ఘటనలు తగ్గుతాయని ముఫ్తీ అభిప్రాయపడ్డారు. మరోవైపు ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ స్థానిక ప్రజలు దోడాలో నిరసనలు చేపట్టారు. పాకిస్థాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

సిక్కోలులో విషాదఛాయలు

ఉగ్రవాదుల కాల్పుల్లో శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గానికి చెందిన నాయక్ డొక్కరి రాజేశ్, హవల్దార్ జగదీశ్వరరావు మృతితో టెక్కలిలో, మృతుల స్వగ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వారి కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. జవాన్లతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని గ్రామస్థులు, మిత్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. రాజేశ్‌ది కడుపేద కుటుంబమని వారు తెలిపారు. జగదీశ్వరరావుది నందిగాం మండలం వల్లభరాయుడుపేట. 2003లో ఆర్మీలో జవాన్‌గా చేరి అంచెలంచెలుగా ఎదిగి హవల్దార్ అయ్యారు. ఆయనకు భార్య సమత, ఇద్దరు కుమార్తెలు మోక్షప్రియ(8), దీక్షిత(6) ఉన్నారు. సమత దిమిలాడ సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన మృతి వార్త తో కుటుంబ సభ్యులంతా విషాదంలో మునిగిపోయారు. మృతుల కుటుంబ సభ్యులను కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు పరామర్శించారు.

స్విగ్గీ, జొమాటోలతో మద్యం హోం డెలివరీ!

- ఆలోచనలో పలు రాష్ట్రాలు.. త్వరలోనే పైలట్ ప్రాజెక్టు
- ఇప్పటికే ఒడిశా, బెంగాల్‌లో మద్యం హోం డెలివరీ
- 20 నుంచి 30% పెరిగిన అమ్మకాలు



న్యూఢిల్లీ, జూలై 16: స్విగ్గీ, జొమాటో, బిగ్ బాస్కెట్, బ్లింకిట్ లాంటి హోం డెలివరీ యాప్‌ల ద్వారా మద్యాన్ని కూడా హోం డెలివరీ చేసేందుకు అనుమతించాలని ఢిల్లీ, కర్ణాటక, హరియాణా, పంజాబ్, తమిళనాడు, గోవా, కేరళ రాష్ట్రాలు భావిస్తున్నాయి. ఇందు కోసం పైలట్ ప్రాజెక్టుకు కూడా రూపకల్పన చేస్తున్నాయి. ఈ మేరకు జాతీయ వార్తా సంస్థ ఎకనామిక్ టైమ్స్ ఓ కథనంలో వెల్లడించింది. పరిశ్రమ వర్గాలు ఈ విషయాన్ని తెలిపినట్లు అందులో పేర్కొంది. ఆయా రాష్ట్రాల అధికారులు ఇప్పటికే ఫుడ్ డెలివరీ యాప్‌లతో, మద్యం తయారీ సంస్థలతో సంప్రదింపుల్లో ఉన్నారని, మద్యం హోం డెలివరీ వల్ల కలిగే లాభనష్టాలపై అంచనా వేస్తున్నారని పేర్కొంది. పైలట్ ప్రాజెక్టు కింద తొలుత బీర్, వైన్ లాంటి తక్కువ ఖరీదైన మద్యాన్ని హోం డెలివరీ చేసేందుకు అనుమతినిచ్చే అవకాశం ఉందని తెలిపింది. నగరాల్లో జీవనశైలి మారుతోందని, పురుషులతో పాటు చాలా మంది మహిళలు మద్యం సేవిస్తున్నారని, వైన్ షాపులకు వెళ్లి మద్యం కొనలేని మహిళలకు హోం డెలివరీ నిర్ణయం ఉపకరిస్తుందని వివరించింది. ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఇప్పటికే మద్యం హోం డెలివరీ వెసులుబాటు ఉంది. బెంగాల్‌లో స్విగ్గీ, స్పెన్సర్స్ రిటైల్ సంస్థలు మద్యాన్ని ఇంటికి సరఫరా చేస్తున్నాయి. హోం డెలివరీ సేవలు ప్రారంభించాక ఈ రెండు రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు 20-30% పెరిగినట్లు అంచనా. ఇదిలా ఉండగా, హోం డెలివరీకి అన్ని నిబంధనలు పాటిస్తామని, వయసును ధ్రువీకరించుకొన్న తర్వాతే, పరిమితి మేరకే డెలివరీ ఉంటుందని స్విగ్గీ కార్పొరేట్ అఫైర్స్ వైస్ ప్రెసిడెంట్ దినకర్ వశిష్ చెప్పినట్లు ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో ప్రస్తావించింది.

సముద్రంలో నౌక మునిగి 16 మంది గల్లంతు

- వారిలో 13 మంది భారతీయులు

మస్కట్, జూలై 16: ఒమన్ తీరానికి సమీపంలో ఒక ఆయిల్ ట్యాంకర్(నౌక) సోమవారం సముద్రంలో మునిగి 16 మంది సిబ్బంది గల్లంతయ్యారు. వారిలో 13 మంది భారతీయులు, ముగ్గురు శ్రీలంక వాసులు. ఈమేరకు ఒమన్ తీరరక్షక దళం మంగళవారం వెల్లడించింది. సముద్రంలో ఆ నౌక తిరగబడి కనిపిస్తోందని తెలిపింది. అయితే దానిలోంచి ఆయిల్ లీకవుతోందా.. లేదా అనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. ఎడెన్ ఓడరేవుకు వెళుతోన్న ఈ నౌక ఒమన్‌కు చెందిన పారిశ్రామిక ఓడరేవు దక్మ్‌కు సమీపంలో సముద్రంలో మునిగింది.

ఒమన్‌లో ఉగ్రవాదుల కాల్పులు

- ఆరుగురి మృతి.. వారిలో ఒకరు భారతీయుడు

మస్కట్, జూలై 16: ఒమన్ రాజధాని మస్కట్‌లో షియాల మసీదు వద్ద సోమవారం రాత్రి జరిగిన కాల్పుల ఘటనలో ఆరుగురు మృతి చెందగా 28 మంది గాయాలపాలయ్యారు. మృతి చెందిన వారిలో ఒకరు భారతీయుడు, మరొకరు పోలీసు. ఒమన్‌లోని భారత ఎంబసీ భారతీయుడి మృతిని ధ్రువీకరించింది. కాల్పులకు పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులను భద్రతా సిబ్బంది కాల్చిచంపారు. ఈ ఘటన వెనుక ఇస్లామిక్ తీవ్రవాద సంస్థ ఐఎస్ ఉన్నట్లు భావిస్తున్నారు. గతంలో పలు దేశాల్లో షియా ముస్లింలు లక్ష్యంగా వారు పండుగలు చేసుకొనే సమయంలో ఐఎస్ దాడులు జరిపింది.

వ్యాక్సినేషన్‌లో భారత్ వెనుకంజ

న్యూఢిల్లీ, జూలై 16: పిల్లలకు రోగనిరోధక టీకాలు వేయడంలో భారత్ వెనుకంజలో ఉన్నట్లు తేలింది. సోమవారం యూనిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయం స్పష్టమైంది. 2023లో భారత్‌లో సుమారు 16 లక్షల మంది పిల్లలు అసలు ఒక్క వ్యాక్సిన్(జీరో డోస్) కూడా వేయించుకోలేదని ఈ నివేదిక పేర్కొంది. జీరోడోస్‌లో మన దేశం రెండో స్థానంలో ఉండగా, మొదటి స్థానంలో నైజీరియా ఉంది. అక్కడ 21 లక్షల మంది పిల్లలకు టీకా వెయ్యలేదని నివేదిక తెలిపింది. అయితే, 2021తో పోలిస్తే భారత్‌లో ఈ సంఖ్య మెరుగుపడింది. ఆ సంవత్సరం ఏకంగా 27.3 లక్షల మంది చిన్నారులు టీకాలకు నోచుకోలేదు.

ఆరు వారాల్లో కౌంటర్ వేయాల్సిందే

- లేదంటే రూ.20 వేలు జరిమానా
- ఇసుక అక్రమ తవ్వకాల పిటిషన్‌పై ఏపీ సహా 4రాష్ట్రాలకు సుప్రీం హెచ్చరిక

న్యూఢిల్లీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తవ్వకాలపై ఆరునెలల్లో కౌంటర్ దాఖలు చేయాలని, లేనిపక్షంలో రూ.20 వేలు జరిమానా విధిస్తామని ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాలను సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఎం అళగరసామి అనే వ్యక్తి పిటిషన్‌పై విచారణ సందర్భంగా మంగళవారం న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్ తరఫున సీనియన్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు.

వైసీపీ నేతల ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ 23కి వాయిదా

- అప్పటి వరకు మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనలో మంగళగిరి గ్రామీణ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పలువురు వైసీపీ నేతలు వేసిన పిటిషన్లు మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చాయి. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. పిటిషన్లపై గురువారం విచారణ చేపట్టాలని కోరారు. నిందితుల విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో వ్యాజ్యాలపై అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు.విచారణను మంగళవారానికి వాయిదా వేయాలని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది. ఆ రోజు పిటిషన్ల పై తుది విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. నిందితుల విషయంలో ఎలాంటి తొందరపాటు/కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తదుపరి విచారణ వరకు పొడిగించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైసీపీ ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ నేత దేవినేని అవినాష్, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. మరోవైపు చంద్రబాబు నివాసం పై మూకదాడి వ్యవహారంలో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీమంత్రి జోగిరమేష్ దాఖలు చేసిన వ్యాజ్యం పై విచారణను కూడా న్యాయమూర్తి ఈ నెల 23కు వాయిదా వేశారు. నిందితుడి పై తొందరపాటు చర్యలొద్దని గతంలోఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు.

సీబీఐ రామ్‌సింగ్ వ్యాజ్యంపై విచారణ 1కి వాయిదా

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): వివేకా హత్యకేసులో తప్పుడు సాక్ష్యం చెప్పాలని తనను బెదిరించారంటూ గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ప్రైవేటు ఫిర్యాదు ఆధారంగా కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ వేసిన పిటిషన్ పై విచారణను హైకోర్టు ఆగస్టు 1కి వాయిదా వేసింది. ఆ రోజు వ్యాజ్యం పై తుది విచారణ జరుపుతామని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఆదేశాలిచ్చారు. ఫిర్యాదుదారు తరఫున సీనియర్ న్యాయవాది ప్రద్యుమ్నకుమార్ రెడ్డి, సీబీఐ తరఫున కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జూపూడి యజ్ఞదత్, పోలీసుల తరఫున ఏపీపీ వాదనలు వినిపించారు.

సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేయండి

- ప్రభుత్వానికి ఎక్సైజ్ జేఏసీ విజ్ఞప్తి

అమరావతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ఎక్సైజ్‌లో విలీనం చేయాలని ఎక్సైజ్ జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. జేఏసీ కార్యవర్గంతో కలసి నేతలు బాబ్జీరావు, బి. నర్సింహులు, మార్పు కోటయ్య మంగళవారం విజయవాడలోని ఏపీఎన్జీవో కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్‌ను నియంత్రించాలంటే రెండు విభాగాలు విలీనం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల్లో 62% సీట్లు భర్తీ

అమరావతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తుది దశ కౌన్సెలింగ్ అనంతరం ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల్లో 62శాతం సీట్లు భర్తీ అయ్యాయని సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ బి.నవ్య తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో కలిపి మొత్తం 81,420 సీట్లు ఉండగా వాటిలో 37,036 సీట్లు భర్తీ అయ్యాయని, మరో 44,384 సీట్లు మిగిలిపోయాయని పేర్కొన్నారు.

ఆకాశవాణిలో సర్వేశ్వర శర్మ సైన్స్ ధారావాహిక



అమలాపురం, జూలై 16: ప్రముఖ సైన్స్ రచయిత, కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సి.వి.సర్వేశ్వర శర్మ రూపకల్పన చేసిన సైన్స్ ధారావాహికను ఈ నెల 5వ తేదీ నుంచి ప్రతి శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి 8.30 గంటల వరకు ఆకాశవాణి విజయవాడ కేంద్రం ప్రసారం చేస్తోంది. గతంలోనూ డాక్టర్ సి.వి.సర్వేశ్వర శర్మ రాసిన సైన్స్ ధారావాహికలు ఆకాశవాణి విజయవాడ, కడప, విశాఖపట్నం, హైదరాబాద్, న్యూఢిల్లీ కేంద్రాల నుంచి ప్రసారమయ్యాయి.

మద్యం మత్తులో మాజీ వలంటీర్ వీరంగం

- వైద్య శిబిరంలో వైద్య పరికరాలు, మందులు చెల్లాచెదురు
- పోలీసులకు సచివాలయ సిబ్బంది ఫిర్యాదు

మాకవరపాలెం, జూలై 16: అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం గిడుతూరులో ఓ మాజీ వలంటీర్ మంగళవారం బీభత్సం సృష్టించాడు. గిడుతూరులో 108 సిబ్బంది ప్రతి మంగళవారం వైద్య శిబిరం నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆ సమయంలో మూకల రమణబాబు అనే మాజీ వలంటీర్ అక్కడకు వచ్చాడు. అతను ఎన్నికల ముందు వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కాగా మద్యం మత్తులో వైద్య శిబిరానికి రావడంతో అక్కడ ఉన్నవారంతా ముక్కు మూసుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన రమణబాబు అక్కడ ఉన్న కుర్చీలు, టేబుళ్లను విసిరికొట్టాడు. అక్కడే ఉన్న ఆశ కార్యకర్త పాసపు రామరత్నం గాయపడ్డారు. వైద్య పరికరాలను పగులగొట్టాడు. ఏఎన్ఎం సాయిరెడ్డి నాగలక్ష్మి, ఆశ కార్యకర్త పాసపు రామరత్నం ఫిర్యాదు మేరకు రమణబాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్తే పీక కోసి.. ప్రాణం తీశాడు

- అనంతలో అమానవీయ ఘటన

గుంతకల్లు టౌన్, జూలై 16: ప్రేమించి పెళ్లాడిన భార్యను అతి కిరాతకంగా ఆ భర్త హత్యచేశాడు. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘోరం చోటు చేసుకుంది. నారాయణ స్వామి, రంగమ్మ దంపతుల చిన్న కుమార్తె సాయితేజ (26) ఓ నర్సింగ్ హోంలో పనిచేసేది. గుత్తి పట్టణంలోని బంధువుల ఇంటికి వెళ్లినప్పుడు ఆమెకు భవన నిర్మాణ కార్మికుడు పులికొండ పరిచయమయ్యాడు. రెండేళ్ల క్రితం ఇంట్లోవారికి చెప్పకుండా వారిద్దరూ గుడిలో పెళ్లిచేసుకున్నారు. గుత్తిలోనే ఓ అద్దె ఇంట్లో ఉండేవారు. సాయితేజ ఏడు నెలల గర్భిణిగా ఉన్నప్పుడు ఆమె తల్లిదండ్రులు కాన్పుకోసం పుట్టింటికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి పులికొండ డబ్బుల కోసం భార్యను వేధించడం మొదలుపెట్టాడు. సాయితేజ తండ్రి పేరిట ఉన్న ఇంటిని తనకు రాయాలని గొడవ పడేవాడు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో గతంలో పంచాయితీ జరిగింది. కొన్నాళ్లకు సాయితేజకు కూతురు మోక్షశ్రీ పుట్టింది. ప్రస్తుతం పాప వయసు ఐదు నెలలు. ప్రస్తుతం దంపతులిద్దరూ పాత గుంతకల్లు శివాలయం వెనుక ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి.. డబ్బులు, నగలు, ఇంటి విషయమై ఇద్దరి మధ్యా గొడవ జరిగింది. పులికొండ.. సెల్‌ఫోన్ చార్జింగ్ వైరును సాయితేజ గొంతుకు బిగించి హత్య చేశాడు. ఆపై కత్తితో ఆమె గొంతు కోశాడు. అనంతరం పాపను తీసుకుని పారిపోవాలని చూశాడు. ఆ సమయంలో పసిబిడ్డతో ఉన్న పులికొండను చూసిన స్థానికులు.. అతన్ని అడ్డుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పులికొండను అదుపులోకి తీసుకున్నారు.

అమరావతిలో జోరుజోరుగా!

రాజధానిలో వేగం పుంజుకున్న నిర్మాణాలు.. చకాచకా ఫోరెన్సిక్ పరిశోధనాలయ భవనం

- ఏడాదిలోగా కార్యకలాపాలు ప్రారంభించే యోచన
- ఆధునిక హంగులతో ఎన్ఐడీ భవనాలు తుదిదశకు
- అమరావతికి క్యూ కడుతున్న కేంద్ర సంస్థలు

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)



అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్ నిర్మాణం

రాజధాని అమరావతి నిర్మాణ పనులు జోరందుకున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే మొదలైన పనులు అనతికాలంలోనే వేగం పుంజుకున్నాయి. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ప్రభుత్వ భవనాల నిర్మాణం సాగుతుండగా, వివిధ శాఖలు, కేంద్ర సంస్థలు కూడా తమ పనులు ప్రారంభించేందుకు ముందుకొస్తున్నాయి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కోర్ క్యాపిటల్‌లోని ప్రభుత్వ కార్యాలయ, సిబ్బంది నివాస భవనాలపై దృష్టి పెట్టారు. కంపచెట్లను తొలగించి వాటికి కొత్త శోభ తీసుకురావాలని ఆదేశించారు. స్పీకర్ అచ్చెన్నాయుడు కూడా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ నిర్మాణాలను పరిశీలించి 9నెలల్లో వాటిని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించడం ద్వారా రాజధానిలో ప్రభుత్వ నిర్మాణపనులకు బాటలు వేశారు. అప్పటివరకూ స్తబ్దుగా ఉన్న పనుల్లో ఒక్కసారిగా కదలిక వచ్చింది. కేంద్రం నుంచి కూడా సహకారం లభిస్తుందన్న భరోసాతో పలు శాఖల పనులు జోరందుకున్నాయి.

ఏడాదిలోగా ఫోరెన్సిక్ ల్యాబ్ పూర్తి

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతిలో ఫోరెన్సిక్ విభాగం తన కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పట్లో పైకప్పు వరకూ నిర్మాణం పూర్తయింది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, మూడు రాజధానుల పేరుతో గందరగోళం సృష్టించడంతో పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఆ తర్వాత గడిచిన ఐదేళ్లలో ఫోరెన్సిక్ విభాగం ఆవైపు చూసిన దాఖలాలు కూడా లేవు. ఆ ప్రాంతంలో దట్టంగా కంపచెట్లు పెరగడంతో భవనమే కనిపించకుండా పోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ అక్కడ ఫోరెన్సిక్ విభాగం నిర్మాణ పనులు ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం రాజధాని విషయంలో గందరగోళం సృష్టించకపోతే నాలుగేళ్ల క్రితమే అక్కడ ఈ విభాగం కార్యకలాపాలు ప్రారంభమై ఉండేవి. అవసరాల కోసం హైదరాబాద్ చుట్టూ తిరగాల్సి వచ్చేది కాదు. ఏడాదిలోగా నిర్మాణ పనులు పూర్తిచేసి అక్కడినుంచే కార్యకలాపాలు ప్రారంభించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

రూపురేఖలు మారిన ఎన్ఐడీ

అమరావతికి వచ్చిన ప్రతిష్ఠాత్మక కేంద్ర సంస్థల్లో ఎయిమ్స్‌తో పాటు ఎన్ఐడీ కూడా ఒకటి. కేంద్రం సౌజన్యంతో నడిచే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ) నిర్మాణం 2019కి ముందే మొదలయింది. కానీ వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఎన్ఐడీ భవనం చుట్టూ చిల్లకంపలు అల్లుకున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ సంస్థ రూపురేఖలే మారిపోయాయి. భవనం చుట్టూ ఉన్న కంపచెట్లను పూర్తిగా తొలగించారు. పరిపాలన భవనంతో పాటు మరో రెండు భవనాలు నిర్మించారు. వాటిలో ఒకదాని నిర్మాణం పూర్తికాగా, రెండోది తుదిదశకు చేరుకుంది.

45 కేంద్ర సంస్థలు రెడీ

కొత్త ప్రభుత్వం వచ్చాక అమరావతికి కేంద్ర సంస్థలు క్యూ కడుతున్నాయి. రాజధానిలో స్థలాలు కేటాయిస్తే కార్యాలయాల ఏర్పాటుకు దాదాపు 45 సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సీఆర్డీఏ అధికారులను ఆయా సంస్థల ప్రతినిధులు కలిసి, చర్చించారు. కాగా ఇండియా పోస్టు, ఇండియన్‌నేవీ, ఇండియన్ ఆర్మీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, సీబీఐ, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, కాగ్, ఆర్బీఐ, ఏంఐడీ, నాబార్డు, ఎస్‌బీఐ, యూబీఐ, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, గెయిల్ వంటి సంస్థలకు గతంలోనే భూములు కేటాయించారు. వాటిలో ఆర్బీఐ, ఇతర బ్యాంకింగ్ సంస్థలు కార్యాలయాల ఏర్పాటుకు ముందుకొచ్చినట్లు తెలుస్తోంది.



స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కలిసిన అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్

శాసనసభ సెక్రటరీ జనరల్‌గా సూర్యదేవర

- స్పీకర్ సమక్షంలో బాధ్యతల స్వీకరణ

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సెక్రటరీ జనరల్‌గా సూర్యదేవర ప్రసన్నకుమార్ నియమితులయ్యారు. మంగళవారం అమరావతి శాసనసభ కార్యాలయంలో శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రసన్నకుమార్ దాదాపు 30ఏళ్ల పాటు భారత ప్రభుత్వంలో విభిన్న హోదాల్లో పని చేశారు. అందులో 15ఏళ్ల పాటు అత్యున్నత రాజ్యాంగ కార్యాలయాల్లో పని చేశారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలపై అవగాహన కలిగిన ప్రసన్నకుమార్‌ను శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు శాసనసభ సెక్రటరీ జనరల్‌గా ఎంపిక చేశారు. శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసన వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఈ నియామకాన్ని ధ్రువీకరించారు. ప్రసన్నకుమార్ గతంలో లోక్‌సభ స్పీకర్‌కు ఓఎస్డీగా పని చేశారు. ప్రపంచంలోనే తొలిసారి పార్లమెంట్ ద్వారా 'లోక్‌సభ టీవీ' చానల్ ఏర్పాటులో స్పీకర్ నేతృత్వంలో కీలకపాత్ర పోషించారు. రాజ్యసభ చైర్మన్ కార్యాలయంలో ఆరేళ్లపైగా పనిచేశారు. 'రాజ్యసభ టీవీ' వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరిగా నిలిచారు. భారత ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో ఓఎస్డీగా, సుప్రీంకోర్టులో కొంత కాలం రిజిస్ట్రార్‌గానూ పని చేసిన ఆయన.. సుమారు మూడేళ్లపాటు ఢిల్లీ శాసనసభ కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీ సలహాదారుగా వ్యవహరిస్తున్నారు.

మరో ఐదు రోజులు వానలు

- రేపు, ఎల్లుండి భారీ వర్షాలు

అమరావతి/విశాఖపట్నం, జూలై 16(ఆంధ్రజ్యోతి): వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనించి మంగళవారం సాయంత్రానికి మధ్యప్రదేశ్‌లో కేంద్రీకృతమై ఉంది. ఇంకా ఒడిశా మీదుగా తూర్పు, పడమరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. వీటన్నింటి ప్రభావంతో మంగళవారం కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో అనేకచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని, ఈ నెల 18, 19 తేదీల్లో కోస్తా, రాయలసీమల్లో విస్తారంగా వర్షాలు పడతాయని పేర్కొంది. ఆ రెండు రోజుల్లో కోస్తాలో భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ నెల 19న వాయవ్య పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో ఈ నెల 19 నుంచి 21 వరకు కోస్తాలో ఎక్కువ చోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా, అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో బుధవారం అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు, గురు, శుక్రవారాల్లో కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, శనివారం మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. బుధవారం శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు మోస్తరు, కృష్ణా నుంచి తిరుపతి వరకు తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొంది.

పోలవరం ఎడమ కాలువకు మోక్షం!

- సీఎం ఆదేశాలతో ప్లాన్-ఏ, బీ సిద్ధం
- నివేదికను మంత్రి నిమ్మలకు సమర్పించిన ప్రాజెక్టు అధికారులు
- మొదటి ప్లాన్‌కు 2 వేల కోట్ల వ్యయం
- రెండేళ్లలో పూర్తిచేసేలా కార్యాచరణ
- రెండో ప్లాన్ అంచనా వ్యయం వెయ్యి కోట్లు
- ముఖ్యమంత్రితో భేటీలో తుది నిర్ణయం!

అమరావతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేలోగా కుడి ప్రధాన కాలువ తరహాలోనే ఎడమ ప్రధాన కాలువ నుంచీ గోదావరి జలాలను ఉత్తరాంధ్ర దాకా తరలించే కార్యాచరణ సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన నివేదికను ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వానికి అందజేశారు. సీఎం చంద్రబాబు గత నెల 12న పదవీప్రమాణం చేశాక.. 17వ తేదీన ప్రాజెక్టు పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎడమ కాలువ పనులు సేర్తి చేయడం ద్వారా విశాఖపట్నం వరకూ నీటిని తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ఇటీవల ఉత్తరాంధ్ర పర్యటన సందర్భంలోనూ ఎడమ ప్రధాన కాలువ పనులు పరిశీలించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులపైనా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎడమ కాలువ నిర్మాణం పనుల కోసం ప్లాన్ ఏ, ప్లాన్ బీని అమలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పోలవరం అధికారులను ఆయన ఆదేశించారు.

దరిమిలా రెండ్రోజుల కిందట జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వారితో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఏ, బీ ప్లాన్‌ల నివేదికను వారు ఆయనకు అందజేశారు. ప్లాన్-ఏ ప్రకారం మొత్తం ఎడమ కాలువ పూర్తి చేసేందుకు రూ.2,000 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. రెండేళ్లలో పూర్తి చేసే ఈ పనులతో విశాఖ నగరానికి తాగునీటిని, పారిశ్రామిక అవసరాలకు నీరందించవచ్చు. క్రమంగా శ్రీకాకుళం జిల్లా సరిహద్దులదాకా తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. ఇక ప్లాన్-బీ కింద.. ప్రాజెక్టు పూర్తయ్యేలోపు పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా గోదావరి జలాలను పోలవరం ఎడమ కాలువలోకి పంపింగ్ చేయాలని ప్రతిపాదించారు. రూ.వెయ్యి కోట్లు ఖర్చయ్యే ఈ పనులను ఏడాదిలోపే పూర్తి చేయవచ్చని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యాక తుది నిర్ణయం తీసుకునే అవకాశముందని జల వనరుల శాఖ వర్గాలు వెల్లడించాయి. మొత్తానికి జగన్ జమానాలో ఐదేళ్లపాటు నిలిచిపోయిన పోలవరం ఎడమ కాలువ పనులకు మళ్లీ కదలిక వస్తోంది.



పుష్పపల్లకిలో దేవేరులతో మాడవీధుల్లో విహరిస్తున్న మలయప్పస్వామి

శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం

తిరుమల, జూలై16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం ఆణివార ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో శ్యామలరావు, ఇతర ఉన్నతాధికారులు వెంట రాగా పెద్దజీయర్ స్వామి వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా విచ్చేశారు. నాలుగు పట్టువస్త్రాలను మూలవిరాట్టుకు అలంకరించారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరించారు. తర్వాత పెద్ద, చిన్నజీయర్ స్వాములకు, ఈవోకు టీటీడీ తరఫున 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి అర్చకులు తగిలించారు. ఈ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల వద్ద ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగిసింది. సాయంత్రం ఉత్సవ మూర్తులు పుష్పపల్లకీలో కొలువుదీరి మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.

మహాదేవునికి నాగాభరణం



ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం పాతాళగంగ మార్గంలో వజ్రాల గంగమ్మ ఆలయం వెనుక కొలువై ఉన్న శివలింగానికి నాగుపాము చుట్టుకొని ఆరాధిస్తున్న దృశ్యం మంగళవారం భక్తులకు దర్శనమిచ్చింది. కొందరు సోషల్ మీడియాలో ఈ వీడియోలు షేర్ చేయడంతో వైరల్‌గా మారాయి. - శ్రీశైలం

బొప్పూడిలో జస్టిస్ కృష్ణమోహన్ పూజలు

చిలకలూరిపేట అర్బన్, జూలై 16: పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి కొండపై ఉన్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ దంపతులు మంగళవారం సందర్శించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వారిని సత్కరించారు.



జస్టిస్ కృష్ణమోహన్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నేటి నుంచి రొట్టెల పండుగ



కోరిన కోర్కెలు తీరుతాయని పేరొందిన రొట్టెల పండుగ బుధవారం ప్రారంభం కానుంది. ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా పండుగను నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు.

- ఆంధ్రజ్యోతి, నెల్లూరు

నరసాపురం ఎంపీడీవో అదృశ్యం!

- ఉపముఖ్యమంత్రి పేరిట సూసైడ్ నోట్.. న్యాయం చేయాలని వేడుకోలు
- రూ.55 లక్షల బకాయి చెల్లించని ఫెర్రీ బోట్ల కాంట్రాక్టర్
- మాజీ చీఫ్ విప్ ప్రసాదరాజు అండతో బెదిరింపులు
- పెనమలూరు పోలీసు స్టేషన్లో కేసు నమోదు



వెంకటరమణారావు

పెనమలూరు, నరసాపురం రూరల్, జూలై 16: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీఓ ఎం.వెంకటరమణారావు అదృశ్యమయ్యారు. నరసాపురంలో ఫెర్రీ లీజుకు సంబంధించి, వైసీపీకి చెందిన ప్రభుత్వ మాజీ విప్ ప్రసాదరాజు అండదండలతో కాంట్రాక్టరు ధవేజీ చేస్తున్న బెదింపులను తట్టుకోలేకపోతున్నానని, తనకు న్యాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి పేరిట లేఖ రాసి అదృశ్యమయ్యారు. తన తండ్రి కనిపించకుండా పోయాడంటూ వెంకటరమణారావు చిన్న కుమారుడు మహీధర్ ఫిర్యాదు మేరకు కృష్ణా జిల్లా పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వెంకటరమణారావు సుమారు ఐదు నెలల నుంచి నరసాపురంలో ఎంపీడీఓగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 10 నుంచి సెలవు పెట్టి పెనమలూరు దరి కానూరు మహదేవపురం కాలనీలోని ఇంటివద్దనే ఉంటున్నారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో మచిలీపట్నం వెళుతున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లారు. అదే రోజు మధ్యాహ్నం మూడున్నరకు ఇంటికి ఫోన్‌చేసి తాను బందరులోనే ఉన్నానని, ఇంటికి రావడంలేదని చెప్పారు. తర్వాత అర్ధరాత్రి ఆయన ఫోన్ నుంచి.. ఈ రోజు నా పుట్టిన రోజు, చనిపోయేరోజు కూడా, ఇంటి వద్ద జాగ్రత్తగా ఉండమని కుటుంబసభ్యులకు మెసేజ్ వచ్చింది. కంగారుపడిన కుటుంబసభ్యులు పెనమలూరు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆయన బండి కూడా బందరు రైల్వే స్టేషన్లోనే ఉన్నట్లు గుర్తించారు.

వాట్సాప్‌లో పవన్ పేరిట సూసైడ్ నోట్

వెంకటరమణారావు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేరిట రాసిన సూసైడ్ నోట్ తన సెల్‌ఫోన్ నుంచి కుటుంబ సభ్యులకు పంపించారు. ఆ నోట్‌లో వైసీపీ ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ ప్రసాదరాజుపై ఆరోపణలు చేశారు. గత మూడున్నరేళ్లుగా నరసాపురం ఫెర్రీకి చెందిన బోట్లకు రూ.55 లక్షలు చెల్లించవలసి ఉందని, ప్రసాదరాజు అండదండలతో ఆ కాంట్రాక్టరు సొమ్ము చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడని, ప్రసాదరాజు ఒత్తిళ్లు తట్టుకోలేకపోతున్నానని, దీన్నుంచి బయటపడే మార్గం కనిపించడంలేదని పేర్కొన్నారు. 33ఏళ్లు నిజాయితీగా పనిచేసిన తాను ఇలాంటి పరిస్థితుల్లో చిక్కుకోవాల్సి వస్తుందని అనుకోలేదని వాపోయారు.

గుంటూరు జిల్లా..

నకిలీ విత్తనాల ఖిల్లా!

- ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి విక్రయాలు
- మొలకెత్తని విత్తనాలతో అన్నదాత కుదేలు
- రాష్ట్ర స్థాయి బృందాల తనిఖీల్లో వెలుగులోకి
- కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వానికి రైతుల విజ్ఞప్తి



నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్న రాష్ట్ర స్థాయి తనిఖీ బృందాలు(ఫైల్)

గుంటూరు సిటీ, జూలై 16: గుంటూరు జిల్లాలో నకిలీ విత్తనాల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. ప్రస్తుతం ఉన్న విత్తన చట్టం-1966 ప్రకారం నకిలీ విత్తనాలు విక్రయించిన వారికి వేసే జరిమానా రూ.500, జైలు శిక్ష ఆరునెలలు మాత్రమే ఉండడంతో నకిలీ విత్తనాల వ్యాపారులు చెలరేగిపోతున్నారు. నకిలీ విత్తనాలు అమ్మి.. దొరికినా ఏమీ కాదన్న భావనతో వారు రైతులను నట్టేట ముంచుతున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా రూ.వందల కోట్ల విలువ చేసే నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చేశాయి. మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన ఈ విత్తనాలు అన్నదాతలకు విక్రయించేశారు. ఉమ్మడి జిల్లాలో 5 లక్షల ఎకరాల సాగుభూమి ఉండగా ఎక్కువ భాగం మెట్టపంటలే వేస్తున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో అగ్రభాగం పత్తి, మిరప పంటలు సాగుచేసేందుకు మొగ్గుచూపుతున్నారు. సీజన్ ఆరంభంలో పేరొందిన కంపెనీల విత్తనాలకు కొరత రావటంతో రైతులు దళారులను ఆశ్రయించారు. దీంతో దళారులు.. తెలంగాణ నుంచి తెచ్చిన లూజు విత్తనాలను పేరొందిన కంపెనీల కవర్లలో ప్యాక్‌చేసి రైతులకు అంటకట్టారు. ఉమ్మడి జిల్లాలో అనుమతి లేని బీటీ-3 విత్తనాలు కూడా రైతులకు చేరినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర నుంచి కూడా ఎక్కువగా నకిలీ విత్తనాలు ఉమ్మడి జిల్లాకు చేరాయి. నకిలీ విత్తనాల వ్యవహారంలో ఉమ్మడి జిల్లాలోని పత్తి రైతులు బాగా నష్టపోతున్నారు. ఈ విత్తనాలతో మొక్క బాగా ఎదిగినా కాపు సరిగా రావడంలేదు. ఒకవేళ కాసినా దిగుబడి పడిపోతుంది. కొందరు వ్యాపారులు గుంటూరు ఆటో నగర్, హైవే దగ్గర్లోని మాంచెస్టర్ రోడ్డులో సాధారణ పత్తి విత్తనాలు తీసుకువచ్చి స్థానికంగా శుద్ధి చేస్తున్నారు. వాటిని పేరొందిన కంపెనీల ప్యాక్‌లలో నింపి అధిక ధరకు రైతులకు అంటగడుతున్నారు.

రాణీ బెంగళూరు నుంచే

మిరప విత్తనాల్లో నాణ్యమైనవిగా పేరున్న 'రాణి' విత్తనాలు ఎక్కువగా బెంగళూరులోనే తయారవుతాయి. అక్కడ ఫెయిల్ అయిన విత్తనాలను ఇక్కడి వ్యాపారులు కొనుగోలు చేస్తారు. కేజీ రూ.5 వేల నుంచి రూ.10వేలతో కొనుగోలు చేసి ఇక్కడికి తెచ్చి అందంగా ప్యాక్ చేసి కేజీ రూ.లక్ష నుంచి రూ.1.60 లక్షల వరకు విక్రయిస్తారు. గత నెలలో గుంటూరు నగరంలోని ఏటుకూరు రోడ్డులో లూజు మిరప విత్తనాలు ప్యాక్ చేస్తుండగా విజిలెన్స్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు.

వరినీ వదల్లేదు

వరి విత్తనాలు కూడా ఇబ్బడిముబ్బడిగా ఇతర రాష్ట్రాల నుంచే తీసుకువస్తున్నారు. ఈ నకిలీలను ఎవరూ పట్టుకోకుండా రాజకీయ పలుకుబడి వినియోగిస్తున్నారు. గుంటూరు జిల్లాలోని తెనాలి, మంగళగిరి, తాడికొండ ప్రాంతాల్లో ఇలాంటి వ్యవహారం ఎక్కువగా జరుగుతోంది. ఈ నెలలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో రాష్ట్రస్థాయి బృందాలు విత్తనాలు, పురుగుమందుల కంపెనీలు, షాపులపై దాడులు చేసి సుమారు రూ.20 కోట్ల విలువైన విత్తనాలు, పురుగుమందుల అమ్మకాలు నిలుపుదల చేశాయి. వీటిలో ఎక్కువ భాగం నకిలీ విత్తనాలు ఉన్నట్లు తేలింది. ఎక్కడ నుంచో తీసుకువచ్చి సరైన బిల్లులు, సర్టిఫికెట్లు లేకుండా వాటిని నిల్వ చేసినట్లు గుర్తించిన అధికారులు అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించారు. ప్రభుత్వం స్పందించి నకిలీ విత్తన వ్యాపారులను కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వెలిగిన విపక్షం

లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన ఇండియా కూటమికి ఇటీవలి ఉప ఎన్నికల విజయాలు మరింత ఉత్సాహాన్నిస్తాయి. ఏడురాష్ట్రాల్లో 13స్థానాలకు జరిగిన ఎన్నికల్లో పదింటిని ఇండియా కూటమి కైవసం చేసుకుంది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో చెరో రెండు స్థానాలతో మొత్తం నాలుగుస్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంటే, పశ్చిమబెంగాల్‌లో మొత్తం నాలుగింటినీ తృణమూల్ కాంగ్రెస్ ఎగరేసుకుపోయింది. పంజాబ్‌లో జలంధర్ వెస్ట్‌ని ఆమ్ ఆద్మీపార్టీ, తమిళనాడులోని విక్రవందిని డీఎంకె గెలుచుకుంటే, హిమాచల్, మధ్యప్రదేశ్‌లలో చెరొకస్థానంతో మొత్తం రెండు సీట్లను మాత్రమే బీజేపీ సాధించుకుంది. బిహార్‌లో మిగిలిన ఆ ఒక్క స్థానం ఓ స్వతంత్ర అభ్యర్థికి పోయింది.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ చేతుల్లో ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో తుడిచిపెట్టుకుపోయిన నెలన్నరకాలంలోనే నాలుగు అసెంబ్లీ స్థానాలను సంపాదించడం కాంగ్రెస్‌కు శక్తినిస్తుంది. మరీ ముఖ్యంగా, మొత్తం నాలుగు లోక్‌సభ సీట్లనూ తన నాయకత్వంలో ఓడిపోయినందుకు గాను పార్టీ అధిష్ఠానంనుంచి తీవ్రంగా విమర్శలు ఎదుర్కొంటున్న హిమాచల్ ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్ సుక్కూకు ఈ ఉప ఎన్నికల ఫలితాలు ఉపశమనాన్నిస్తాయి. ముగ్గురు ఇండిపెండెంట్లు రాజీనామా చేసి బీజేపీలో చేరడంతో జరిగిన ఈ ఉపఎన్నికల్లో రెండింటిని గెలుచుకోవడంతో ఆయన ప్రభుత్వం ఇప్పుడు సుస్థిరంగా ఉంది. ఈ ముగ్గురితో పాటు ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటువేయడంతో సుక్కూ ప్రభుత్వం ఇటీవల సంక్షోభంలోకి జారుకున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ అభిషేక్ మనుసింఘ్వీ ఓడిపోవడంతో ఆ ఎమ్మెల్యేలపై అనర్హతవేటుపడింది. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఈ ఆరుస్థానాలకు జరిగిన పోలింగ్‌లో నాలుగింటిని కాంగ్రెస్ గెలుచుకుంది. తాజా విజయంతో సుక్కూ ప్రభుత్వానికి ఇక ఢోకాలేనట్టే. మధ్యప్రదేశ్‌లో ఒక స్థానాన్ని బీజేపీకి కోల్పోయినప్పటికీ, ఉత్తరాఖండ్‌లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బదరీనాథ్‌ను గెలుచుకోవడం కూడా కాంగ్రెస్‌కు ఊరటనిచ్చే అంశం. అక్కడి ఎమ్మెల్యే బీజేపీలోకి ఫిరాయించినప్పటికీ, ఆ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకుంది. మతానికి సంబంధించి తనపై బీజేపీ చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మడం లేదని కాంగ్రెస్ గట్టిగా చెప్పుకోవచ్చు. పంజాబ్ పార్లమెంటరీ ఎన్నికల్లో పదమూడింటిలో మూడు మాత్రమే గెలుచుకున్న ఆప్‌కు కూడా ఇది మంచి పరిణామమే. ఈ పార్టీనుంచి పోయి బీజేపీలో చేరిన సిట్టింగ్ ఎమ్మెల్యేను ఓడించడం ద్వారా ఆప్ నైతికంగా పైచేయి సాధించింది.

ఇక, తృణమూల్, డీఎంకే తమ రాష్ట్రాల్లో సాధించిన విజయాలు ఆ పార్టీలను మరింత బలోపేతం చేస్తాయి. మూడుస్థానాలను బీజేపీ నుంచి స్వాధీనం చేసుకొని, రాష్ట్రంలో తనకు తిరుగులేదని టీఎంసీ ఈ ఫలితాల్లో చాటిచెప్పింది. లోక్‌సభ ఎన్నికల్లో ఆశించినస్థాయిలో సీట్లు సాధించలేక, కనీసబలానికి కూడా ఓ అడుగుదూరంలో నిలిచిపోయిన భారతీయ జనతాపార్టీకి ఈ ఫలితాలు మరింత నిరాశకలిగిస్తాయి.

సార్వత్రిక ఎన్నికల అనంతరం అతిసమీపకాలంలో జరిగిన ఈ ఉప ఎన్నికల్లోనూ ఫలితాలు అదేరీతిలో ఉండటం విశేషం. పూర్తిగా స్థానిక అంశాలే కారణమని ఇదమిత్థంగా చెప్పలేని రీతిలో, దేశంలోని ఏడు రాష్ట్రాలకు ఈ ఫలితాలు విస్తరించి ఉన్నాయి. బీజేపీమీద ప్రజాగ్రహం జాతీయస్థాయిలోనే కాక, అసెంబ్లీ స్థాయిలో కూడా బలంగా ఉన్నదని, గతంలో నెగ్గిన స్థానాలను కూడా అది ఇప్పుడు కోల్పోవడం అందుకు నిదర్శనమని విపక్షాలు గట్టిగా అనగలుగుతున్నాయి. పైగా, అత్యధిక స్థానాలను కూటమి పార్టీలు నేరుగా బీజేపీతో పోటీపడి గెలుచుకోవడం, తమనుంచి చీలి, బీజేపీలో చేరినవారిని ఓటర్లు శిక్షించడం వాటికి ఆనందాన్నిస్తోంది.

కారణాలు ఏమైనప్పటికీ, పదమూడులో పదింటిని సంపాదించిపెట్టిన ఈ ఫలితాలు ఇండియా కూటమికి ఎన్డీయేమీద సభలోపలా బయటా పోరాడే శక్తిని ఇస్తాయి. బీజేపీ కచ్చితంగా ఈ ఫలితాలను విశ్లేషించుకుంటుంది, పరిస్థితులను చక్కదిద్దుకొనేందుకు ప్రయత్నిస్తుంది. సంస్థాగత సామర్థ్యం, సమర్థ నాయకత్వం, నైపుణ్యం దానికి ఉన్నాయి. మరికొద్దినెలల్లో బిహార్, మహారాష్ట్ర, హర్యానా, తదితర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. జమ్మూకశ్మీర్‌లో సైతం ఎన్నికలుంటాయని కేంద్రం అంటోంది. రాబోయే రోజుల్లో భారతీయ జనతాపార్టీని నిలువరించాలంటే విపక్షకూటమి మరింత చాకచక్యంగా, బీజేపీ వ్యతిరేక ఓటుచీలకుండా, ఐకమత్యంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

రెండు ధ్రువాలుగా రాజకీయ భారత్



2029 నాటికి కేవలం రెండు కూటములే (ఎన్డీఏ, ఇండియా) రంగంలో ఉంటాయా? ఈ కూటములలో లేని పార్టీలు అదృశ్యమవుతాయా అన్న చర్చ జరుగుతోంది. భారతదేశ రాజకీయాలు రెండు ధ్రువాల మధ్య సాగడం ఆరోగ్యకరమా? కాదా? అన్న చర్చ కూడా సాగాల్సిన అవసరం ఉన్నది. ఒకే పార్టీకి అధికారం అప్పజెప్పడం కన్నా ఒక కూటమి పాలన నిర్వహించడం అనేక విధాలుగా శ్రేయస్కరమనడంలో సందేహం లేదు.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'దేశ ప్రజలు కాంగ్రెస్‌ను వ్రేళ్లతో పెకిలించేందుకు నిర్ణయించారు. కాంగ్రెస్ లేకుండా భారత దేశాన్ని విముక్తి చేయాలన్నది బీజేపీ నినాదం మాత్రమే కాదు, ప్రజల సంకల్పం కూడా' అని పదేళ్ల క్రితం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. పదేళ్లుగా ఆయన అనేకసార్లు కాంగ్రెస్ విముక్త భారత్ గురించి మాట్లాడుతూనే వచ్చారు. కాని పదేళ్ల తర్వాత కూడా ఈ దేశం కాంగ్రెస్ పార్టీ నుంచి విముక్తం కాలేదు. లోక్‌సభలో కాంగ్రెస్ సంఖ్యాబలం వందకు చేరుకుంది. బీజేపీ బలం 240 సీట్లకు తగ్గిపోయింది. గత వారం దేశ వ్యాప్తంగా 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీకి 2 సీట్లు మాత్రమే దక్కగా, ఇండియా కూటమికి 11 స్థానాలు దక్కాయి. బిహార్, బెంగాల్, హిమాచల్, ఉత్తరాఖండ్, పంజాబ్, తమిళనాడులో ఈ కూటమి అధిక స్థానాలు గెలుచుకుంది. హిమాచల్‌లో అసెంబ్లీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన ముగ్గురిలో ఇద్దరిని కాంగ్రెస్ ఓడించడం, ఉత్తరాఖండ్‌లో రెండు చోట్లా కాంగ్రెస్ విజయం సాధించడం విస్మరించదగిన విషయం కాదు. ఈ ఫలితాలను బట్టి భారతదేశంలో రాజకీయాలు రెండు బలమైన కూటములుగా విడిపోతున్నాయని చెప్పేందుకు ఆస్కారం కలుగుతున్నది. ఈ ఏడాది అక్టోబర్–నవంబర్‌లో జరిగే హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, వచ్చే ఏడాది జరిగే బిహార్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల దిశను నిర్దేశించవచ్చు. ఈ అయిదు రాష్ట్రాల్లోనూ ఎన్డీఏకూ, ఇండియా కూటమికీ మధ్య హోరాహోరీ పోరు జరుగుందనడంలో సందేహం లేదు.

గత రెండు సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ సంఖ్యాబలం కొంత పెరగడాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశ్లేషిస్తూ కాంగ్రెస్ పరాన్నజీవి కనుకే కొన్ని సీట్లను పెంచుకున్నదని అన్నారు. 'ఇటీవలే జరిగిన లోక్‌సభ ఫలితాలను విశ్లేషిస్తే కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసిన చోట్ల ఎక్కువ సీట్లు గెలుచుకోలేదు. కాని వేరే పార్టీల భుజాలపై ఎక్కినప్పుడు మాత్రం చెప్పుకోదగిన ఫలితాలు సాధించింది. అంటే కాంగ్రెస్ ఒక పరాన్నజీవిలా తన సహచర పార్టీల ఓట్లను ఆరగిస్తుంది' అని మోదీ లోక్‌సభలో జూలై 4న ప్రసంగిస్తూ తెలిపారు బీజేపీతో ముఖాముఖి తలపడిన అధిక నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు పరాభవం ఎదురవుతుందని ఆయన ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ఆయన ఈ సారి కాంగ్రెస్ విముక్త భారత్ అన్న పదాన్ని ఉపయోగించలేదు. అది అంత సులభంగా సాధ్యపడదని ఆయన గ్రహించి ఉంటారు.

నిజానికి ఒక దశలో కాంగ్రెస్ విముక్త భారత్ నిజంగా ఏర్పడుతుందా అన్న అనుమానాలు చాలా మందికి కలిగాయి. 2009లో బీజేపీకి, కాంగ్రెస్‌కు మధ్య 171 సీట్లలో ముఖాముఖి పోటీ జరిగితే కాంగ్రెస్ 93 స్థానాల్లోనూ, బీజేపీ 78 స్థానాల్లోనూ విజయం సాధించాయి. 2014లో నరేంద్రమోదీ రంగప్రవేశం తర్వాత పరిస్థితి మారిపోయింది. ఈ ఎన్నికల్లో 189 స్థానాల్లో రెండు పార్టీలు ముఖాముఖి తలపడ్డప్పుడు బీజేపీ 166 సీట్లు, కాంగ్రెస్ 23 సీట్లు గెలుచుకున్నాయి. 2019లో కాంగ్రెస్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్ 190 సీట్లలో ముఖాముఖి తలపడితే బీజేపీకి 175, కాంగ్రెస్‌కు 15 దక్కాయి.

కాని 2024 ఎన్నికలు కాంగ్రెస్ పరిస్థితిలో కొంత మార్పు తీసుకువచ్చాయి. ఈ సారి గత మూడు ఎన్నికల్లో కంటే ఎక్కువ సీట్లలో కాంగ్రెస్ బీజేపీతో ముఖాముఖి తలపడింది. ఈ ఎన్నికల్లో 215 సీట్లలో బీజేపీకి, కాంగ్రెస్‌కు ముఖాముఖి పోటీ జరిగితే బీజేపీ 162 సీట్లు, కాంగ్రెస్ 53 సీట్లు గెలుచుకున్నాయి. బీజేపీతో ముఖాముఖి తలపడిన అత్యధిక సీట్లలో కాంగ్రెస్ ఓడిపోయి ఉండవచ్చు కాని గెలిచిన వంద సీట్లలో సగానికి పైగా సీట్లు బీజేపీ నుంచి దక్కించుకున్నవే అన్న విషయం గమనించాల్సి ఉంటుంది. మిగతా సీట్లు ఇతర పార్టీలతో కలిసి పోటీ చేయడం వల్ల సాధించుకున్నవే. అందువల్ల కాంగ్రెస్‌ను పూర్తిగా పరాన్నజీవి అనడానికి వీల్లేదు. అదే సమయంలో ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కూడా కనీసం 15–20 స్థానాలు మిత్రపక్షాలతో కలిసి పోటీ చేయడం వల్ల దక్కించుకున్నదనేది సత్యదూరం కాదు. అంతేకాక కొన్ని పార్టీలు కలిసి పోటీ చేసినప్పుడు పరస్పర ప్రయోజనాలు లేకపోతే అవి కూటమిగా పోటీ చేసే అవకాశాలు ఉండవన్న విషయం గమనించాలి. మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్‌లో అక్కడి స్థానిక పార్టీలు కాంగ్రెస్‌ను విస్మరించకపోవడానికి ఇదే కారణం.

కాంగ్రెస్ విముక్త భారత్ సాధ్యపడకపోవచ్చు కాని కాంగ్రెస్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడానికి ఇప్పట్లో అవకాశం లేదని కూడా ఈ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. 2029 నాటికి కాంగ్రెస్, బీజేపీల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఇప్పుడే చెప్పలేం. పదేళ్ల తర్వాత అతి కష్టమ్మీద వంద సీట్లు సాధించిన కాంగ్రెస్ మరింత బలం పుంజుకోవాలంటే బీజేపీతో ముఖాముఖి పోటీ చేసే సీట్లలో కనీసం సగానికి పైగా సాధించాలి. మధ్యప్రదేశ్‌లో ఉప ఎన్నికల్లో కూడా బీజేపీ గెలిచింది. ఉత్తరాదిన గత లోక్‌సభ ఎన్నికల్లో కొన్ని సీట్లు కోల్పోయిన బీజేపీ దెబ్బతిన్న బెబ్బులిలా పుంజుకునేందుకు తీవ్ర యత్నాలు చేయక తప్పదు. తెలంగాణ, కర్ణాటకల్లో కూడా బీజేపీ పుంజుకునేందుకు సన్నాహాలు చేయక మానదు.

ఈ సార్వత్రిక ఎన్నికల్లో బ్రహ్మాండమైన విజయం సాధిస్తామనే ఆత్మవిశ్వాసంతో జమిలి ఎన్నికలకు మోదీ రంగం సిద్ధం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా ఆమోదింపచేశారు. ఈ ఫలితాల తర్వాత జమిలి ఎన్నికల గురించి ఇప్పుడు బీజేపీ ఆలోచించే మూడ్‌లో ఉన్నట్లు కనపడడం లేదు. వీటన్నిటికి తోడు 2021లో జరగాల్సిన జనాభా లెక్కల సేకరణ ఇంతవరకూ జరగలేదు. 2026 తర్వాత ఈ జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన కూడా నిర్వహించాల్సి ఉన్నది. గడచిన ఎన్నికల్లో కుల జనగణన, రిజర్వేషన్లను ప్రతిపక్షాలు ఒక ఎన్నికల అంశంగా మార్చాయి. ఈ అంశాలను విస్మరించి జనాభా లెక్కల సేకరణ, నియోజకవర్గాల పునర్విభజన ఎన్డీఏ ప్రభుత్వం నిర్వహించగలదా అన్న చర్చ కూడా జరుగుతోంది. అందువల్ల 2029 ఎన్నికలు మరింత సంక్లిష్ట సామాజిక పరిస్థితుల్లో జరుగుతాయనడంలో సందేహం లేదు.

భారతదేశ రాజకీయాల్లో ఎన్నో పార్టీలు జన్మించి మటుమాయమైపోయాయి, ఒకప్పుడు దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన స్వతంత్ర పార్టీ ఇప్పుడెక్కడుంది? బిహార్‌లో శోషిత్ దళ్, జనక్రాంతి దళ్, సోషలిస్టు, కాంగ్రెస్ (ఓ) తదితర పార్టీల నేతలు ముఖ్యమంత్రులైన సందర్భాలు ఉన్నాయి. మండల్ కమిషన్ రచయిత అయిన బిపి మండల్, కర్పూరీ ఠాకూర్ అలాంటి నాయకులే. ఈ పార్టీలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. రకరకాల పార్టీలతో కలిసి ఏర్పడిన జనతా పార్టీ రకరకాల వర్గాలుగా, పార్టీలుగా ముక్కలై పోయింది. ఉత్తరప్రదేశ్‌లో ఒకప్పుడు అధికారాన్ని చలాయించిన బహుజన సమాజ్ పార్టీ కూడా దాదాపు ఉనికి కోల్పోయింది.

తెలంగాణలో ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితికి ఒక్క సీటు కూడా ఎందుకు రాలేదు అన్న ప్రశ్నకు ఇటీవల ఢిల్లీకి వచ్చిన ఆ పార్టీ నేతలు హరీశ్ రావు, కేటీఆర్ వద్ద స్పష్టమైన సమాధానం లేదు. ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి ఓటు వేయాలని అనుకున్నారు కనుకే తమ ఓటర్లంతా బీజేపీ వైపు మొగ్గు చూపారని ఒకరంటే, ప్రజలు ఎన్డీఏ, ఇండియా కూటమిల మధ్య విడిపోయారని మరొకరు జవాబు చెప్పారు. ఒడిషా, తమిళనాడులో కూడా అదే జరిగింది కదా.. అని వారి అభిప్రాయం. కాని ఈ పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ భవిష్యత్తు ఏమిటో తేలడానికి మరో అయిదేళ్లు పడుతుందని వారికి తెలుసు. రేవంత్ రెడ్డికి మరో అయిదేళ్ల వరకు ఢోకా లేదని వారే చెబుతున్నారు. వారి అభిప్రాయం ప్రకారమే ప్రజలు రెండు కూటముల మధ్య విడిపోయారు కనుక బీఆర్‌ఎస్ భవిష్యత్ ప్రస్తుతానికి అగమ్య గోచర పరిస్థితిలో పడిందనడంలో సందేహం లేదు. తెలంగాణ ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ తన రంగు, రుచి వాసన కోల్పోయి ప్రజల పార్టీగా ఏర్పడిన ముద్రను తన్ను తానే తొలగించుకున్నదనడంలో అతిశయోక్తి లేదు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ఒక రాజకీయ పార్టీగా మనుగడ సాధిస్తుందా అన్న చర్చ జరుగుతోంది. పార్టీలను వ్యక్తి ఆధారితంగా మార్చి గుప్పెడు అస్మదీయులతో నడపాలని ప్రయత్నిస్తే ఏం జరుగుతుందో బీఆర్‌ఎస్, వైసీపీల అనుభవాలు నిరూపిస్తున్నాయి. ఒడిషాలో వృద్ధనాయకుడైన నవీన్ పట్నాయక్ వచ్చే అయిదేళ్ల వరకు తన పార్టీని ఎంతవరకు బలంగా ఉంచగలుగుతారా అన్న చర్చ జరుగుతోంది. అక్కడ బీజేడీ స్థానంలో బలోపేతం అయ్యేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేయక మానదు. తమిళనాడులో ఒక్క లోక్‌సభ సీటు కూడా గెలుచుకోలేని అన్నాడిఎంకే మళ్లీ బీజేపీ దరిచేరే అవకాశాలూ లేకపోలేదు. అక్కడ ఈ సారి బీజేపీ తన ఓటు శాతాన్ని 3.58 నుంచి 11.24 శాతానికి పెంచుకోగలిగింది. ఈ నేపథ్యంలో 2029 నాటికి కేవలం రెండు కూటములే రంగంలో ఉంటాయా, ఈ కూటములలో లేని పార్టీలు అదృశ్యమవుతాయా అన్న చర్చ జరుగుతోంది.

భారతదేశ రాజకీయాలు రెండు ధ్రువాల మధ్య సాగడం ఆరోగ్యకరమా లేదా అన్న చర్చ కూడా సాగాల్సిన అవసరం ఉన్నది. కాని ఒకే పార్టీకి అధికారం అప్పజెప్పడం కన్నా ఒక కూటమి అధికారం నిర్వహించడం ఎప్పుడైనా ఆరోగ్యకరమే. ఈ రెండు ధ్రువాలు, లేదా కూటములు ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధానాల్లో సైద్ధాంతిక స్పష్టత నేర్పరుచుకుని ప్రజల ముందుకు వెళ్లడం ఇంకా అవసరం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

విద్యామంత్రి అంటే తెలుగు మంత్రి!

విద్యాప్రదాత జ్ఞాన వృద్ధుడైతే విద్యార్థి పరిణతి పొందుతాడు. విద్యామంత్రి జ్ఞానవంతుడైన యువకుడైతే విద్యావ్యవస్థని వేగంగా పటిష్టంగా, శక్తిమంతం చేయగలుగుతాడు. ఇప్పుడీ అవకాశం 'ఆంధ్రప్రదేశ్'కి కలిగింది. భాషా సంస్కృతుల పట్ల అభిమానంతో నారా లోకేష్ విద్యాశాఖను చేపట్టటాన్ని భాషాభిమానులు స్వాగతిస్తున్నారు. 1982లో స్వర్గీయ నందమూరి తారక రామారావు చేసిన తెలుగు భాషా విధాన ప్రకటన మాతృభాష విషయంలో ఒక 'మాగ్న కార్టా' లాంటిది. తాతగారి ఆశయాన్ని మనవడు నెరవేర్చగలగాలి!

తెలుగు భాష అనేది తెలుగు జాతి ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. దాన్ని తగ్గించాలనుకోవటం మనల్ని మనం తక్కువ చేసుకోవటమే అవుతుంది. ఇంగ్లీషులో మాట్లాడితేనే గౌరవం అనీ, తెలుగు ఎత్తేయటం సంక్షేమ కార్యక్రమం అనీ, ప్రజలే తెలుగు వద్దంటున్నారనీ ప్రచారం చేయటం, దానికి కులాల రంగు పులమటం ధర్మం కాదు. ఏ కులంవాడికైనా మాతృభాష రావాలి!

ఉమ్మడి రాష్ట్రంలో నాటి విద్యామంత్రి పీవీ నరసింహారావు 1966 మే 14న అధికారభాషా చట్టాన్ని తెచ్చారు. కానీ, అది అమలు కాలేదు. 1974లో విద్యామంత్రి మండలి వెంకటకృష్ణారావు మొదటగా తాలూకా స్థాయిలో తెలుగును ప్రవేశపెట్టారు. వావిలాల గోపాలకృష్ణయ్య అధ్యక్షతన అధికార భాషా సంఘాన్ని నియమించారు. 1975 ప్రపంచ తెలుగు మహాసభల్లో జిల్లా స్థాయిలో అధికార భాష అమలు ప్రకటించారు. ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చాకే తెలుగు పూర్తిస్థాయిలో అధికారభాష అయ్యింది. కేంద్రానికి పంపే ఫైళ్ళను కూడా తెలుగులో రాసి, అనుబంధంగా ఇంగ్లీషు అనువాదాన్ని పంపించాల్సిందిగా ఆదేశించిన ఘనత రామారావుదే!

2018లో నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికార భాషాసంఘం స్థానే అన్ని అధికారాలతో కూడిన 'తెలుగు భాషా ప్రాధికార సంస్థ'ని ఏర్పరచి గవర్నర్ ఆమోదం పొందింది. ఏడు విభాగాలతో శక్తివంతమైన ఈ సంస్థని ఏర్పరచి పాలనాధికారిని నియమించారు. భాషను నిర్లక్ష్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునే అధికారాలున్న ఈ సంస్థ ఆచరణలోకి వచ్చి ఉన్నట్లైతే దేశంలోనే రాష్ట్ర భాషకు పట్టం కట్టిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచి ఉండేది.

2024 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందేశంలో యునెస్కో సంస్థ ప్రపంచవ్యాప్తంగా 40శాతం పిల్లలు తమ మాతృభాషలో ప్రాథమిక విద్య పొందలేకపోతున్నారని, కొన్ని దేశాల్లో ఈ సంఖ్య 90శాతం దాకా ఉందని పేర్కొంది. నూతన విద్యావిధానాన్ని రూపొందించే ముందు ఈ అంతర్జాతీయ నిపుణుల సూచనల్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఇంగ్లీషు రావాలంటే తెలుగు రాకూడదనటం అన్యాయం.



ప్రాథమిక విద్యలోనే పిల్లల్ని మాతృభాషకు దూరం చేస్తే, డిగ్రీ చదివినా బస్సుల మీద ఊళ్ళ పేర్లు చదవలేక 'ఈ బస్సు ఏ ఊరు వెడ్తుంది?' అని అడగాల్సొస్తుంది. చదువుకున్న నిరక్షరాస్యుల్ని తయారుచేయటం ప్రభుత్వ లక్ష్యం కాకూడదు. 'సవాళ్లంటే నాకిష్టం! అందుకే విద్యాశాఖను తీసుకున్నా'నని విద్యాశాఖామాత్యులు నారా లోకేష్ అనటం గొప్ప విషయం. తెలుగు భాషకు శాశ్వత రక్షణ కల్పించే సవాలును నెరవేర్చవలసిందిగా భాషోద్యమం ఆయన్ని కోరుతోంది.

భాషాప్రాతిపదికపై రాష్ట్రాలను విభజించినా భాషా ప్రాతిపదికగా పాలనా వ్యవస్థలు పని చేయకపోవటం గురించి విద్యామంత్రి ఆలోచన చేయాలి. ప్రతీ పథకానికి ముందు తెలుగు అనే పదాన్ని జోడించిన యన్‌టి రామారావు స్ఫూర్తి కావాలి. తెలుగు భాషోద్యమం ఇంగ్లీషు భాషకు వ్యతిరేకం కాదు. ఇంగ్లీషు కోసం తెలుగును అశ్రద్ధ చేయవద్దని మాత్రమే కోరుతోంది. భారత రాజ్యాంగం చదువుకునే హక్కు చట్టం 5వ అధ్యాయం 29ఎఫ్ సెక్షన్ 350(ఎ) ప్రకారం మాతృభాషలోనే ప్రాథమిక విద్య ఉండాలి. 2020లో కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యావిధానమూ ఇదే పేర్కొంది. 1–2 తరగతులకే తెలుగు చదవడం, రాయడం నేర్పిస్తే పై తరగతులకు ఈ నైపుణ్యం తోడ్పడుతుంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని అంచెలంచెలుగా తొలగించాలని గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని 2020 ఏప్రిల్ 15న హైకోర్టు కొట్టివేసింది. ఆ తరువాత ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు మీడియం రద్దు చేసే అధికారం రాష్ట్రానికి ఉందా లేదా అన్నదాని పైనే చర్చ జరిగింది. పిల్లల మనోపరిపక్వత దెబ్బతినకూడదనేది మరుగునపడింది.

ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి. ప్రైమరీలో ఇంగ్లీషు ఒక సబ్జెక్టుగా, హైస్కూలు స్థాయిలో ఇంగ్లీషు– తెలుగు మిశ్రమంగా, కాలేజీల్లో ఇంగ్లీషు మీడియం కొనసాగినా తెలుగు ఒక సబ్జెక్టుగా ఉండాలి. రాబోయే రోజుల్లో సాంకేతిక ఉపకరణాలన్నీ తెలుగులో పనిచేయబోతున్నాయి. తెలుగు చదువుకున్న అభ్యర్థులకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.

తెలుగులో చదివితే ఉద్యోగాలు రావనే అపోహను తొలగిస్తూ, ఇంటర్మీడియెట్ వరకూ తెలుగులో చదువుకున్న విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యతను ఎన్టీఆర్ ప్రభుత్వం కల్పించింది. అది మళ్ళీ జరగాలి. గ్రామాలతో సంబంధాలుండే రెవెన్యూ, జిల్లాపరిషత్, విద్య, వైద్యం లాంటి శాఖల్లో 15శాతం ఉద్యోగాలకు తెలుగులో చదివినవారికి ప్రాధాన్యత ఇవ్వాలి. తెలుగు మీడియం కొనసాగిస్తున్న ప్రైవేట్ పాఠశాలలకూ ప్రోత్సాహకాలివ్వాలి. వైద్యం, ఇంజనీరింగ్ ఇంకా ఇతర సాంకేతిక విద్యల్లో కూడా తెలుగును ఒక బోధనాంశం చేయాలి.

కళాశాలల్లో 4 సెమిస్టర్ల తెలుగుని 2 సెమిస్టర్లకు కుదించారు. తెలుగు చదవకపోయినా మార్కులొస్తాయనే లోకువ ఏర్పడింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ 9వ తరగతికి వెళ్లి పిల్లల్ని తమ పేరు తెలుగులో రాయమని కోరితే... అందరూ తప్పులే రాసిన సంగతి విద్యాశాఖామాత్యులు మనసులో పెట్టుకుని అందరికీ తెలుగు చక్కగా నేర్పించాలి! ప్రాథమిక విద్యలోనే పిల్లల్ని మాతృభాషకు దూరం చేస్తే, డిగ్రీ చదివినా బస్సుల మీద ఊళ్ళ పేర్లు చదవలేక 'ఈ బస్సు ఏ ఊరు వెడ్తుంది?' అని అడగాల్సొస్తుంది. చదువుకున్న నిరక్షరాస్యుల్ని తయారుచేయటం ప్రభుత్వ లక్ష్యం కాకూడదు.

గోండి, కొండ, కోయ, చెంచు, యెరుకుల లాంటి అనేక ఆదిమ తెగలు తెలుగు నేలపైన జీవిస్తున్నారు. వారికి వారి భాషలో చదువు చెప్తూ రాష్ట్ర భాష తెలుగును, అంతర్జాతీయ భాష ఇంగ్లీషును కూడా అందరికీ చాలినంత నేర్పించాలి.

కేంద్ర విద్యాశాఖకు అనుబంధంగా ఉన్న కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ పద్ధతిలోనే, రాష్ట్ర విద్యాశాఖకు అనుబంధంగా తెలుగు చారిత్రక పరిశోధనా మండలిని స్వతంత్ర ప్రతిపత్తితో ఏర్పాటు చేసి తెలుగు భాషా సంస్కృతుల చరిత్రపై సమగ్ర అధ్యయనం జరిపించాలి. విశ్వవిద్యాలయాలు విస్మరించిన మన సాంస్కృతిక వికాస చరిత్ర, సాంఘిక చరిత్ర, ఆహార చరిత్ర లాంటి మానవీయ అంశాల్ని దాని పరిధిలోకి తెచ్చి తెలుగు జాతి మూలాల సమగ్ర అన్వేషణ జరిపించాలి.

'సవాళ్లంటే నాకిష్టం! అందుకే విద్యాశాఖను తీసుకున్నా'నని విద్యాశాఖామాత్యులు నారా లోకేష్ అనటం గొప్ప విషయం. తెలుగు భాషకు శాశ్వత రక్షణ కల్పించే సవాలును నెరవేర్చవలసిందిగా భాషోద్యమం ఆయన్ని కోరుతోంది. విద్యామంత్రి అంటే తెలుగు మంత్రి అని ఆయనే నిరూపించుకోవాలి.

● డా. జి.వి.పూర్ణచందు
ప్రపంచ తెలుగు రచయితల సంఘం కార్యదర్శి

బదిలీల షెడ్యూల్ ప్రకటించాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెగా డీఎస్సీ–2024 ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. రిక్రూట్‌మెంట్ జరిగే లోపు సాధారణ, రిక్వెస్ట్ బదిలీలు జరపాలని అన్ని ప్రభుత్వ మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులు కోరుతున్నారు. వివిధ వ్యక్తిగత, ఆరోగ్య, కుటుంబ కారణాల వలన అనేకమంది ఉద్యోగులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి బదిలీల విధానాన్ని, షెడ్యూల్‌ని రూపొందించి డీఎస్సీ–2024 భర్తీకి ముందే బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి. ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్‌లో డీఎస్సీ–2018 రెగ్యులర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్, రెగ్యులర్ ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ ఉపాధ్యాయులకు జోనల్ ప్రాతిపదికన బదిలీలు జరపాలి. టీచర్స్ రిక్రూట్‌మెంట్ జరిగే షెడ్యూల్‌కు ముందుగానే ప్రమోషన్స్ కల్పించాలి. బదిలీల కోసం అనేక సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం చేసి వేకెన్సీస్ అన్నీ కూడా చూపి డీఎస్సీకి ముందు బదిలీలు జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. బదిలీలపై, ఇతర విద్యారంగం సమస్యలపై ప్రభుత్వం చర్చించేందుకు అన్ని సంఘాలకు సాధారణంగా అవకాశం ఇస్తుంది. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు కూడా సంఘ సమావేశాల్లో పాల్గొని తమ సమస్యలను అధికారులకు ప్రభుత్వానికి తెలియజేసేందుకు అవకాశం ఇవ్వాలని వారు కోరుతున్నారు. మోడల్ స్కూల్లో ఉపాధ్యాయులని కూడా గుర్తించి వారి సమస్యలకు పరిష్కార మార్గం కొత్త ప్రభుత్వంలో జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

– బి.సురేష్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఏపీ పునర్నిర్మాణానికి శ్రీకారం

అమరావతి నిర్మాణ ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం కీలకపాత్ర పోషించబోతోంది. అలాగే 194 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న బహుళార్థ ప్రయోజనకర పోలవరం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 90 ప్రకారం జాతీయ ప్రాజెక్ట్‌గా పూర్తి చేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నది. వీటితోపాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కృషి చేయనున్నది.





ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి 2024 ఎన్నికలలో అఖండ విజయం వికసిత భారత్‌లో వికసిత ఆంధ్ర అంతర్భాగం కావడానికి దోహదపడింది. సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రజలు ఢిల్లీలో నరేంద్ర మోదీ ప్రధానిగా, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండాలని డబుల్ ఇంజన్ సర్కార్ కోసం ఓటు వేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షల విషయానికొస్తే, రాష్ట్ర పురోగతికి, అభివృద్ధికి రాష్ట్రంలో రెండు ముఖ్యమైన ప్రాజెక్టులు కీలకం. అవి– రాష్ట్ర రాజధాని అమరావతి, పోలవరం. ఈ రెండు ప్రాజెక్టులు దేశానికి అదనపు స్థూల జాతీయ ఉత్పత్తిని అందించడానికి, రాష్ట్రానికి అపారమైన సంపద సృష్టికి దోహదపడతాయి. అలాగే సాధారణ ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు అమరావతి రాజధానిగా రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వాహక విధులకు సేవలను అందించే అవకాశం ఉంది. రాజధాని నిర్మాణ ప్రక్రియలో సేవలు, నిర్మాణ అనంతరం ప్రధానంగా సేవా రంగంలో వృద్ధికి అమరావతి నుంచి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. పోలవరం విషయానికొస్తే– కోట్లాది రాష్ట్ర ప్రజల తాగునీరు, లక్షలాది ఎకరాలకు సాగునీటి అవసరాలకు, పారిశ్రామిక అవసరాలతో పాటు, 960 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తికి, మొత్తం మీద ఆంధ్రప్రదేశ్‌కు ఈ ప్రాజెక్టు వరప్రదాయిని.

గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ఆకస్మికంగా నిలిచిపోయిన అమరావతి నిర్మాణానికి మద్దతు ఇచ్చి పూర్తి చేయాలని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా సానుకూల భావాన్ని 2024 ఎన్నికల ప్రచారసభలలో వ్యక్తం చేశారు. అమరావతిని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దురుద్దేశ్యంతో విస్మరించారు. ఈ క్రమంలో అమరావతిని 'గ్రోత్ ఇంజిన్'గా అభివృద్ధి చేయడానికి 2019కి ముందు చంద్రబాబు చేసిన ప్రయత్నాలన్నింటినీ సమాధి చేశారు. దీంతో అమరావతిని పునర్నిర్మించాల్సిన పరిస్థితి నెలకొంది. అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ (సీఆర్‌డీఏ) ఆమోదించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం రాజధానిలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని దశలవారీగా ఎలా కొనసాగించాలి అనేది ప్రశ్న. ప్రధానంగా, క్రమానుగుణంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు– ఎ) అమరావతి నిర్మాణం స్వయం సుస్థిర ప్రాజెక్ట్ అయినా నిర్మాణాలలో మార్పులు, అవసరమైన నిధుల కోసం సవరించిన డిపిఆర్ అవసరమా. బి) పాత కాంట్రాక్టర్లు ప్రాజెక్ట్ చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారా లేదా కొత్త కాంట్రాక్టర్లను ఆహ్వానించాలా. సి) అమరావతిని నిర్వీర్యం చేయడానికి జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం సీఆర్డీఏ చట్టంలో కొన్ని సవరణలు చేసినందున, ప్రాజెక్టును మాస్టర్ ప్లాన్ ప్రకారం పూర్తి చేయడానికి ఆ చట్టంలో ఏవైనా మార్పులు అవసరమా. డి) అమరావతి ప్రాజెక్టు మాస్టర్ ప్లాన్ ప్రకారం మొదటి దశ నిధుల కోసం అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రావాల్సిన 25 వేల కోట్ల రుణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఎకనమిక్ అఫైర్స్ వారు పదే పదే లేఖలు రాసినా, అప్పటి ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల వెనక్కి పోయిన ఆ రుణం తిరిగి సాధించాలంటే కార్యాచరణ ఏమిటి?

అమరావతి నిర్మాణ ప్రక్రియలో కేంద్రప్రభుత్వం కీలకపాత్ర పోషించబోతోంది. ఇప్పటికే రూ.1500 కోట్ల రూపాయలు అమరావతిలో అవసరమైన అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు వంటి వాటి మౌలిక సదుపాయాల కల్పనకు గ్రాంట్ ఇచ్చింది. అలాగే హడ్కో రుణం రూ.10వేల కోట్ల మేరకు కేంద్రం వెసులుబాటు కల్పించింది. కేంద్ర ప్రభుత్వం అమరావతిని స్మార్ట్ సిటీ, హెరిటేజ్ సిటీగా గుర్తించింది, రాజధాని నిర్మాణం కోసం దాదాపు 35వేల ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ విధానంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు రైతులు సీఆర్‌డీఏకు స్వచ్ఛందంగా భూమిని అందించారు, రైతులకు తమ భూముల మొదటి అమ్మకంపై క్యాపిటల్ గెయిన్ పన్ను మినహాయింపునకు నాటి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ చొరవతో కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. మరో ముఖ్యమైన అంశం దాదాపు 50 కేంద్ర ప్రభుత్వ సంస్థలు దేశానికి సేవ చేయడానికి అవసరమైన నిర్మాణాల కోసం అమరావతిలో భూమిని సేకరించాయి, కానీ గడచిన ఐదేళ్లలో ఆ సంస్థలకు భూమిని అప్పజెప్పడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లిప్తంగా వ్యవహరించడంతో నిర్మాణాలు ఆలస్యమయ్యాయి, ఇప్పుడు వాటిని ప్రారంభించాలి.

అమరావతి అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే మౌలిక సదుపాయాలలో ఔటర్ రింగ్ రోడ్డు దాదాపు 25వేల కోట్ల రూపాయల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినా, గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లిప్తత వల్ల ఆ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. దీని కొనసాగింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడితే అడుగులు ముందుకు పడే అవకాశం ఉంది. అలాగే అమరావతికి కొత్త రైల్వే లైన్, రైల్వే స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకున్నందున, ఆ పనులను వేగంగా పూర్తి చేయడానికి కావలసిన చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలి. డీపీఆర్ ప్రకారం అమరావతిలో అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు కావలసిన నిధుల కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వాటా అనంతరం అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సేకరించడానికి కేంద్ర ఆర్థిక శాఖ సమన్వయంతో ముందుకు వెళ్లాలి.

అలాగే 194 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న బహుళార్థ ప్రయోజనకర పోలవరం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 90 ప్రకారం జాతీయ ప్రాజెక్ట్‌గా పూర్తి చేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నది. ఈ ప్రాజెక్ట్‌లో ముఖ్యమైన సహాయ, పునరావాసం కోసం అవసరమయ్యే నిధులు చాలా ముఖ్యమని గుర్తించబడ్డాయి. వీటి వ్యయం, తాగునీరు, పారిశ్రామిక నీటి వ్యయ భాగాలను వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ప్రణాళికాబద్ధంగా ఎలా సర్దుబాటు చేయవచ్చు అనే అంశంపై దృష్టి సారించాలి. 2024 ఎన్నికల ప్రచారంలో మోదీ, అమిత్ షా పోలవరం పూర్తికి తమ మద్దతును తెలియజేసినందున, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్ట్ వచ్చే నాలుగేళ్లలో పూర్తి అవుతుందనడంలో సంశయం లేదు. అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల భేటీ అనంతరం 2014లో చంద్రబాబు అభ్యర్థన మేరకు ప్రధాని మోదీ చొరవతో ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన ఏడు మండలాల్లో ఐదు గ్రామాలు వెనక్కి ఇచ్చే ప్రతిపాదన జరిగిందని ప్రచారం జరుగుతోంది, దీనివల్ల ప్రాజెక్ట్ నిర్మాణంలో ఇబ్బందులు తలెత్తవచ్చనే వ్యాఖ్యలు వినిపిస్తున్నందున, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలి.

జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల పోలవరం, అమరావతి నిర్మాణంలో అలసత్వంతో కూడిన ఆలస్యం వల్ల జరిగిన నష్టాన్ని స్పష్టంగా శ్వేతపత్రం రూపంలో ప్రజల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఉంచారు. పోలవరం నిర్మాణానికి సంబంధించి ఏర్పడిన సాంకేతిక సమస్యలను అధిగమించటానికి అంతర్జాతీయ నిపుణులను పిలిపించారు. వారి సలహాల మేరకు ముందుకు వెళ్లడం, నిధులు సమకూర్చడం ద్వారా మాత్రమే నిర్ణీత వ్యవధి నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి అవుతుంది. అలాగే అమరావతికి సంబంధించి వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్ల సింగపూర్ కన్సార్షియం వెనక్కి వెళ్లినందున, మరల వారిని ఒప్పించడం లేదా మరొకరితో ముందుకు వెళ్లడం అనే అంశం కూడా కీలకమే అవుతుంది.

అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు గత ఐదేళ్లుగా జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకొని విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్, బెంగళూరు–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, బెంగళూరు–హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్ల పరిధిలోని పారిశ్రామిక నోడ్‌ల సమర్థ వినియోగం జరగాలి. అలాగే ప్రకాశం జిల్లా కనిగిరి, తిరుపతి సమీపంలోని ఏర్పేడు వద్ద నిమ్జ్‌లను పూర్తి చేయడం ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించవచ్చు. వీటన్నిటి ద్వారా ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి జరుగుతుంది.

■ లంకా దినకర్



థియేటర్ వద్ద ఎమ్మెల్యే వెనిగండ్ల, మాజీ ఎమ్మెల్యే రావి తదితరులు

కొడాలి నానికి షాక్!

వాటాదారులకు శరత్ థియేటర్ స్వాధీనం

థియేటర్ యాజమాన్యాన్ని బెదిరించి లాక్కున్న మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని

- ఎమ్మెల్యే వెనిగండ్లకు యాజమాన్యం ఫిర్యాదు
- సొంత ఆఫీసును ఖాళీ చేయించిన వైనం
- కొడాలి నాని, పార్టీ ఫ్లెక్సీల తొలగింపు

గుడివాడ : గత పదేళ్లుగా మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఆక్రమణలో ఉన్న శరత్ థియేటర్‌కు విముక్తి లభించింది. థియేటర్‌లోని వైసీపీ ఫ్లెక్సీలు, కొడాలి నాని ఫొటోలు తొలగించారు. థియేటర్‌ను యాజమాన్యానికి అప్పగించారు. కేవలం ఒక్క వాటా హక్కు కలిగిన నాని మిగిలిన ముగ్గురు వాటాదారులను బెదిరించి మొత్తం థియేటర్‌ను తన ఆధీనంలో ఉంచుకున్నారు. గత ఐదేళ్లుగా అధికారాన్ని అడ్డు పెట్టుకుని థియేటర్ యాజమాన్యాన్ని బెదిరించి ఆక్రమించుకుని తన సొంత కార్యాలయంగా మార్చుకున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కొడాలి నాని చిత్తుచిత్తుగా ఓడిపోయారు. నాని ముఖం చాటేసి గుడివాడ వదిలి హైదరాబాద్‌లో తలదాచుకుంటున్నారు. శరత్ థియేటర్ పాత యాజమాన్యంలోని ముగ్గురు వాటాదారులు స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రామును కలిసి తమక న్యాయం చేయాలని కోరారు. రంగంలోకి దిగిన వెనిగండ్ల... నాని ఆక్రమాలకు చెక్ చెడుతూ పాత యాజమాన్యానికి థియేటర్‌ను అప్పగించారు.

థియేటర్‌లో టీ పార్టీ

వాటాదారుల్లో ఒకరైన మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు థియేటర్‌లో మంగళవారం టీ పార్టీ ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ అందరికి న్యాయం చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ థియేటర్ యజమానులకు హక్కును వారికి కల్పించేందుకు వచ్చామన్నారు. శరత్ థియేటర్ వాటాదారులు యలవర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏళ్ల తరువాత తన ఆస్తిని చూసుకునేందుకు రావడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

వాతావరణం మారినప్పుడల్లా ఇంద్రకీలాద్రి వణుకు పుట్టిస్తోంది. ఒక మోస్తరు వర్షం కురిస్తే ఎటువైపు నుంచి కొండచరియలు విరిగి పడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. మళ్లీ వాతావరణం మామూలు పరిస్థితికి వచ్చే వరకు అధికారులకు ఒక టెన్షన్, భక్తులకు మరో టెన్షన్. ఎక్కడ రాయి విరిగి పడినా మొత్తం ఘాట్ రోడ్డును మూసివేయాల్సిన పరిస్థితి. అలాగని మామూలుగా వదిలేస్తే ఎలాంటి ప్రమాదం వస్తుందో అంచనా వేయలేని పరిస్థితి. ఇంద్రకీలాద్రి కొండచరియలు విరిగిపడడానికి శాశ్వత పరిష్కారం ఎప్పటికి లభిస్తుందో తెలియడం లేదు.


కొండకు పరిష్కారం లేదా?

కొండచరియల సమస్యకు కానరాని శాశ్వత పరిష్కారం

- ఘాట్ రోడ్డు మూసివేత ఒక్కటే మార్గమా?
- నిపుణులకు అంతుబట్టని ఇంద్రకీలాద్రి స్వరూపం

చిన్నపాటి వర్షానికే ఘాట్ రోడ్డును మూసేస్తారా? ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తుల మనస్సులో మాట ఇది.

వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కడి నుంచి ఎలాంటి రాయి జారుకుంటూ కిందపడుతుందో తెలియదు. ఒకచోట ప్రత్యామ్నాయ చర్యలు చేపడితే మరోచోట ఇబ్బంది వస్తుంది.
- ఇంజనీరింగ్ అధికారుల ఆందోళన ఇది.



కొండ మీదుగా దిగువకు ఇనుప మెష్

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన కొండల్లో ఇతర కొండలకు ఇంద్రకీలాద్రికి చాలా వ్యత్యాసం ఉంది. తిరుమలతో సహా ఇతర కొండలు రాయితో చాలా బలంగా ఉంటాయి. ఇంద్రకీలాద్రిలో మాత్రం భిన్న లక్షణాలు కనిపిస్తాయి. చూడడానికి గిరిగా కనిపిస్తున్నప్పటికీ గర్భంలో మాత్రం అంత పటిష్టం లేదని నిపుణులు గుర్తించారు. ఇంద్రకీలాద్రిలో గుల్లదనం ఎక్కువ ఉంది. రాయి, రాతిసున్నం మిశ్రమంతో ఈ కొండలు ఏర్పడ్డాయి. మొక్కలు, చెట్లు పెరిగినా వర్షాలు కురిసిన ప్పుడు గుల్లదనం బయట పడుతుంది. వర్షపునీరు కొన్నిచోట్ల నిలిచిపోవడంతో అది నెమ్మదిగా కొండలోకి దిగుతోంది. ఫలితంగా లోపల భాగం చెమ్మగా మారుతోంది. ఇది వర్షాలు పడినప్పుడు మరింతగా పెరిగి రాళ్లు జారి పడుతున్నాయి. ఈ రాళ్లు ఘాటు రోడ్డుపై పడుతుం డటంతో పైనుంచి కింది వరకు ఇనుప మెస్ ఏర్పాటు చేశారు. రాక్ మెటిగేషన్ విధానంలో ఇప్పటి వరకు 330 మీటర్ల వరకు ఇనుప మెష్ ఏర్పాటు



చేశారు. ఇంకా 180 మీటర్ల మేర ఈ మెస్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది.

నివేదికలకే పరిమితం

ఇంద్రకీలాద్రిని పరిశీలించడానికి, అధ్యయనం చేయడానికి ఒక్కోసారి ఒక్కో నిపుణుల కమిటీ వస్తోంది. కొండపై కురిసిన వర్షం కిందికి వెళ్లిపోవడానికి కాలువలు నిర్మాణం చేయాలని సూచించారు. దీనివల్ల వర్షపు నీరు కిందికి వెళ్లిపోతుందని భావించారు. ఇంద్రకీలాద్రిపైన స్వరూపం మాత్రం భిన్నంగా ఉంటుంది. ఇది మొత్తం ఎత్తుపల్లాలుగా ఉంటుంది. ఇప్పటికే కొండపై మధ్యలో ఒక కొలనులాంటి ప్రదేశం ఉంది. కాలువలు నిర్మించినా ఈ వర్షపు నీరు కిందికి వెళ్లపోగా తిరిగి ఇదే కొలనులోకి వెళ్తాయని ఇంజనీరింగ్ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. దీనివల్ల కొండ పైభాగం మరింత బలహీనపడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కొండ ఏటవాలుగా ఉంటేనే కాలువల ప్రణాళిక పనిచేస్తుందని భావిస్తున్నట్టు సమాచారం.

కొండ చుట్టూ డబుల్ ట్విస్టెడ్ ఎక్సాగానల్

కొండకు చుట్టూ డబుల్ ట్విస్టెడ్ ఎక్సాగానల్ (ఆరు భుజాలు) వైర్ మెష్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని జర్మనీ నుంచి తీసుకొచ్చి మెకాఫెర్రీ కంపెనీ ఈ పనులు చేసింది. ఇతర దేశాల్లో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నచోట్ల ఈ కంపెనీయే పనులు నిర్వహిస్తోంది. ఘాట్‌రోడ్డు వైపు కొండ చరియలు విరిగినప్పుడల్లా కొండపైకి రాకపోకలను కొన్ని రోజులపాటు నిలిపివేయాల్సి వస్తోంది. ఇప్పటివరకు ఘాట్ రోడ్డు వైపు కొండ చరియలు విరిగిపడగా, తాజాగా జాతీయ రహదారివైపు కొండచరియలు విరిగిపడ్డాయి. మోడల్ గెస్ట్‌హౌస్‌కు ఎదురుగా ఉన్న కొండ భాగం దసరాకు ముందు విరిగి పడింది. ఈ ప్రదేశంలో కొండచరియలు పడకుండా రహదారి పక్క నుంచి రిటైనింగ్ వాల్‌ను నిర్మించాలన్న ప్రతిపాదనను నిపుణులు చేశారు. బెంగళూరులో ఉన్న సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మేనేజ్‌మెంట్‌కు చెందిన కొంతమంది నిపుణులు విజయవాడకు వచ్చారు. కొండచరియలు పడేటప్పుడు సూచనలు తెలియడం కోసం సెన్సార్లు ఏర్పాటు చేయాలని భావించారు. కొండచరియల సమస్య మాత్రం ఇంజనీరింగ్ అధికారులపై తీవ్రమైన ఒత్తిడి పెంచుతోంది. ఎలాంటి చిన్న ప్రమాదం జరిగినా ముందుగా తామే బలైపోతామన్న భయం వారిని వెంటాడుతోంది. ఇంద్రకీలాద్రిని అన్ని కోణాల్లోనూ అధ్యయనం చేస్తేనే పరిష్కార మార్గాలు వస్తాయన్న భావన అధికారుల్లో కనిస్తోంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- దోమల నివారణ, శానిటేషన్‌లో ప్రజల భాగస్వామ్యం అవసరం
- ఓవర్‌హెడ్ రిజర్వాయర్లలో క్లీనింగ్, క్లోరినేషన్ పూర్తిచేయండి
- విద్యార్థి దశ నుంచే అవగాహన
- అన్ని ఆర్వో ప్లాంట్ల మ్యాపింగ్ జరగాలి
- కలెక్టర్ సృజన

6లో..

నాలుగు నెలల్లోనే ఒక అధికారిని ప్రాధాన్యత లేని చోటుకు బదిలీ చేస్తే ఏమనుకోవాలి? అతనేదైనా తప్పు చేసి ఉండాలి. లేదంటే ఉన్నతాధికారుల కక్ష అయినా ఉండాలి. ఇదేమీ లేకుండా ఊరికినే బదిలీ చేయరు. మరి ఇలా బదిలీ చేసిన అధికారిని తిరిగి యథాస్థానానికి వెంటనే రివర్స్ బదిలీ ఇచ్చారంటే ఏమనుకోవాలి? అనేక రకాలుగా అర్థం చేసుకోవచ్చు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని ఒక పర్సనల్ అధికారి విషయంలో ఈ వింత పరిణామం చోటు చేసుకుంది. స్పీడ్‌గా బదిలీ జరగటం, అంతే స్పీడ్‌గా రివర్స్ బదిలీ జరగటం వెనుక మర్మమేమిటన్నది విజయవాడ రైల్వే డివిజన్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది.

మూడు నెలల్లో రివర్స్ బదిలీ

బెజవాడ రైల్వేలో విచిత్రం

- పర్సనల్ అధికారి రాయనపాడుకు బదిలీ
- మళ్లీ విజయవాడకు మార్పు
- వివాదాలకు కేరాఫ్‌గా పర్సనల్ ఆఫీసు
- అధికారిపై అనేక ఆరోపణలు
- మహిళలపై లైంగిక వేధింపుల వ్యవహారంపై డీఆర్ఎంకు ఫిర్యాదు
- డీఆర్ఎంకు గ్రాండ్ బర్త్ డే ట్రీట్ వ్యవహారం చర్చనీయాంశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వే డివిజన్‌పై ఇప్పటికే సీబీఐ దృష్టి సారించిన నేపథ్యంలో, పర్సనల్ అధికారి రివర్స్ బదిలీ అంశం పెద్దఎత్తున విమర్శలకు, ఆరోపణలకు దారి తీస్తోంది. విజయవాడ డివిజన్‌కు ఎన్నికల ముందు పర్సనల్ ఆఫీసర్‌గా ఒక

- మిగతా 6లో

సీపీడీసీఎల్‌లో పదవుల పందేరం

కీలక పోస్టుల్లో తమవారి కోసం కాంట్రాక్టర్ల ప్రయత్నాలు



పదవుల్లో చేరడానికి పాత డైరెక్టర్ల ప్రయత్నాలు

వైసీపీ హయాంలో అడ్డగోలుగా వ్యవహరించిన అధికారుల కోసం ఆరాటం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : సీపీడీసీఎల్‌కు కొద్దిరోజుల క్రితం వరకు సంతోషరావు ఇన్‌చార్జి సీఎండీగా వ్యవహరించేవారు. ఆయన ఎస్పీడీసీఎల్‌కు రెగ్యులర్ సీఎండీ సీపీడీసీఎల్ ఇన్‌చార్జి బాధ్యతలను ఆయనకు అప్పగించారు. కొద్దిరోజుల క్రితం సంతోషరావుకు ఇన్‌చార్జి బాధ్యతలను ప్రభుత్వం తప్పించింది. ఆయన స్థానంలో చక్రధరబాబుకు బాధ్యతలను అప్పగించింది. వైసీపీ ప్రభుత్వంలో గుంటూరు జిల్లాకు చెందిన ఓ విశ్రాంత అధికారి సీపీడీసీఎల్‌లో డైరెక్టర్‌గా పనిచేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజీనామా చేయకుండా కుర్చీని అతుక్కుని కూర్చున్నారు. నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారితో రాజీనామాలు చేయించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఆ డైరెక్టర్ రాజీనామా చేశారు. సీపీడీసీఎల్‌కు సీఎండీగా ఎవరు ఉన్నా తమ వ్యవహారాలను చక్కబెట్టుకుంటూ, కాంట్రాక్టర్లకు మేలు చేసిన ఈ డైరెక్టర్‌కు సీపీడీసీఎల్‌పై ప్రేమ చావలేదు. తిరిగి సీపీడీసీఎల్‌లోకి అడుగు పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

వైసీపీ హయాంలో అన్ని శాఖల్లోనూ ఆ పార్టీ రంగు పూసుకున్న కాంట్రాక్టర్లు వాలిపోయారు. వారు చెప్పిన మాటలకు తల ఊపిన అధికారులను నియమించుకున్నారు. కుదరదని సమాధానం చెప్పిన అధికారుల కుర్చీలు కదిపేశారు. ఇలాంటి వ్యవహారాలు సాగిన శాఖల్లో సీపీడీసీఎల్ (సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్) ఒకటి. ప్రభుత్వం ఒకపక్క ప్రక్షాళన చేస్తుంటే మరోపక్క మంచి కాంట్రాక్టర్లు కూటమి నేతల వద్ద తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్న అధికారులను తిరిగి తీసుకొచ్చి కుర్చీల్లో కూర్చోబెట్టే వ్యవహారాలను చాపకింద నీరులా సాగిస్తున్నారు.

గత ప్రభుత్వంలో అడ్డగోలుగా కాంట్రాక్టులు

జగన్ సీఎంగా ఉన్నప్పుడు సీపీడీసీఎల్‌లో అడ్డగోలుగా కాంట్రాక్టులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇప్పుడు రంగంలోకి దిగుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్న అధికారులను, డైరెక్టర్లను నియమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మరోపక్క సంతోషరావును తిరిగి సీపీడీసీఎల్‌కు రావడానికి పావులు కదుపుతున్నట్టు విద్యుత్ ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. సీపీడీసీఎల్ ఏర్పాటు చేసిన తర్వాత అవుట్ సోర్సింగ్‌ల్లో తమకు అనుకూలంగా ఉన్న వారిని నియమించుకున్నారు. కార్యాలయంలో ఏ ఫైలులో ఏ సారాంశం ఉందన్న విషయాలను వారి ద్వారా తెలుసుకుంటున్నట్టు సమాచారం.

ఎస్ఈ పోస్టుకు మరో రూటు

సీపీడీసీఎల్ ఎస్ఈగా ఉన్న మురళీమోహనరావు తన పదవిని కాపాడుకోవడానికి నానాపాట్లు పడుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ఎస్ఈగా ఉన్న ఆయనను వైసీపీ ప్రభుత్వం ఇక్కడి నుంచి బదిలీ చేసింది. నెల నిండకుండానే తిరిగి ఎస్ఈగా వచ్చారు. ఇప్పుడు ఆయన తనకు పదోన్నతి వచ్చే వరకు సీపీడీసీఎల్ ఎస్ఈగా కొనసాగాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించి ఒక్కో అడుగు ముందుకు వేస్తూ అడ్డంకులు లేకుండా చేస్తున్నారు. మురళీమోహనరావు సీఈ పదోన్నతి జాబితాలో ఉన్నారు. ఈ పదోన్నతి ఎప్పుడు వస్తుందో తెలియదు. అప్పటి వరకు ఆయన ఇక్కడే ఎస్ఈగా కొనసాగాలని భావిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాస్థాయి అధికారుల్లోనూ మార్పు ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. దీంతో మురళీమోహనరావు తన సీటును కాపాడుకునే ప్రయత్నాలు జోరుగా సాగిస్తున్నారు. ఇప్పటికే ఏలూరు జిల్లాకు చెందిన ఓ మంత్రి నుంచి లేఖ తీసుకున్నట్టు సమాచారం. ఎస్ఈకి సీఈ పదోన్నతి వచ్చే వరకు ఇక్కడి నుంచి బదిలీ చేయవద్దని లేఖ ఇవ్వడం విద్యుత్ శాఖలో చర్చనీయాంశమవుతోంది. మురళీమోహనరావు చేస్తున్న ప్రయత్నాలకు విద్యుత్ ఉద్యోగుల సంఘంలోని ఒక కీలకనేత సహాయ సహకారాలు అందిస్తున్నట్టు సమాచారం.

ఫ్రైడే ఇక డ్రైడే

ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు వినూత్న కార్యక్రమం



ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు జిల్లా యంత్రాంగం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నూతన కలెక్టర్ సృజన తనదైన ముద్ర వేసేందుకు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరంతో పాటు ఇతర పట్టణ ప్రాంతాలు, గ్రామాల్లో నెలకొన్న అధ్వానపు పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచటంతో పాటు, సీజనల్ వ్యాధులను కట్టడి చేసేందుకు, సమాంతరంగా తీసుకోవాల్సిన అత్యవసర చర్యలను పాటించేందుకు ప్రతి శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించటానికి జిల్లా యంత్రాంగం సిద్ధమౌతోంది. ఈ వినూత్న కార్యక్రమానికి కలెక్టర్ సృజన 'ఫ్రైడే డ్రైడే'గా నామకరణం చేశారు.

- ప్రతి శుక్రవారం డ్రైడే పేరుతో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్స్
- ఎల్లుండి నుంచి ఎన్టీఆర్ జిల్లాలో అమలు
- హెల్త్ ఈజ్ వెల్త్ నినాదంతో కలెక్టర్ సృజన పిలుపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఫ్రైడే డ్రైడేలో భాగంగా ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే వాటిలో ప్రధానమైన అపరిశుభ్రత అంశంతో పాటు, నూరు శాతం శానిటేషన్, వ్యర్థపదార్థాల నిర్వహణ, దోమల నిర్మూలన, రక్షిత మంచినీటికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ భావించి ఈ కార్యక్ర మానికి పిలుపునిచ్చారు. పట్టణాలు, గ్రామాలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలలో పరిశుధ్యం ఒకటి. పారిశుధ్య సమస్యల్లో ఎక్కడ పడితే అక్కడ రోడ్ల వెంబడి చెత్త పోగులు దర్శనమిస్తున్నాయి. డంపింగ్ యార్డులు లేకపోవటం వల్ల వ్యర్థపదార్థాల నిర్వహణ సరిగా ఉండటం లేదు. ఈ సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టడానికి విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటారు.

గ్రీన్ అంబాసిడర్ల కార్యక్రమం పునరుద్ధరణ

డంపింగ్ యార్డులకు సంబంధించి కొరత తీర్చటానికి గతంలో టీడీపీ ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్ల కాన్సెప్ట్‌ను తిరిగి పునరుద్ధరించనున్నారు. ఇది సాధారణంగా జరిగే కార్యక్రమం. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో మాత్రం రోడ్ల వెంబడి చెత్త పోగులను తొలగిస్తారు. వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా చర్యలు చేపడతారు. ఆ మేరకు ప్రజలలో అవగాహన పెంపొందించే కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు. దీంతో పాటు డ్రెయిన్లలో సిల్టు తొలగింపు వంటి చర్యలకు ప్రాధాన్యమిస్తారు. వ్యర్థపదార్థాల నిర్వహణ, డ్రెయిన్లలో మురుగునీటి పారుదల, వరదనీటి మళ్లింపు, కాల్వల సమర్థ నిర్వహణ వంటివి మేజర్‌గా దృష్టి పెడతారు.

దోమల నివారణ చర్యలు

మరో ప్రధానమైనది దోమల నిర్మూలన. గతంలో ఎప్పుడూ లేని విధంగా దోమల ఉధృతి పెరిగిపోయింది. దీంతో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు పెద్దఎత్తున దోమల నిర్మూలనా చర్యలు చేపడతారు. యాంటీ లార్వా ఆపరేషన్, మురుగు కాల్వలు, మురుగునీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వంటివి వేయిస్తారు. దోమల నిర్మూలన కోసం ఫాగింగ్ చర్యలు చేపడతారు.

తాగునీటి సరఫరాపై కేంద్రీకరణ

ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరా అందించటంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తారు. ప్రతి ఒక్కరికీ కుళాయిల ద్వారా ఆరోగ్యకరమైన మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటారు. దీనికోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఇప్పటికే కలెక్టర్ సృజన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో విజయవాడతో పాటు జగ్గయ్యపేటలలో డయేరియా కేసులు ప్రబలాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని రక్షిత మంచినీటిని అందించటానికి ఓవర్‌హెడ్ రిజర్వాయర్లను శుభ్రపరచటం, ప్రతిరోజూ మంచినీటి పరీక్షలను నిర్వహించటం చేస్తారు. వీటితోపాటు మినరల్ వాటర్ ప్లాంట్స్ కుప్పలు తెప్పలుగా వెలిశాయి. మినరల్ వాటర్ ప్లాంట్స్ ద్వారా రక్షిత మంచినీటిని పొందవచ్చునని ప్రజలు ఆ వైపు మొగ్గుచూపుతున్నారు. వాస్తవానికి మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి వచ్చే మంచినీటి నాణ్యతపై సందేహాలు ఉన్నాయి. మినరల్ వాటర్ ప్లాంట్లను గుర్తించటం, వాటిని మ్యాపింగ్ చేయటం, నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయో లేదో పరిశీలించటం, ప్రమాణాలను పాటించేలా చూడటం వంటి చర్యలను చేపట్టనున్నారు. ఇవి కాకుండా ప్రజలలో అవగాహనా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించనున్నారు. విద్యార్థి దశ నుంచే పరిసరాల శుభ్రత పట్ల అవగాహన పెంచే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.



కొండపైన కోలాహలం

- సర్వమంగళకారిణి దుర్గమ్మకు సారె సమర్పణలు
- మొక్కులు తీర్చుకున్న భక్త బృందాలు



వన్‌టౌన్, జూలై 16 : ఇంద్రకీలాద్రిపై సర్వమంగళ కారిణి కనకదుర్గమ్మకు మంగళవారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆషాఢం సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. 39 బృందాలకు చెందిన మొత్తం 1750 మంది భక్తులు సారె సమర్పణలో పాల్గొన్నారు. అత్యంత కోలాహలం మధ్య భక్తి తత్పరతతో మహిళాభక్తులు సారె సమర్పించారు. అనేక రకాల తీపి పదార్థాలు, పండ్లు, పూలు, గాజులు, పసుపు కుంకుమ, గంధం తదితర పరిమళ ద్రవ్యాలను అమ్మవారికి సమర్పించారు. విజయవాడకు చెందిన దుర్గా శివసాయి సేవా సంఘం 200 మంది, రాధా మాధవి భక్త బృందం 100 మంది, సింగ్‌నగర్‌కు చెందిన దుర్గా బృందం 100 మంది, గురుభవానీ బృందం 100 మంది, భవానీపురానికి చెందిన కోదండరామాలయం సేవా సమితి నుంచి 170 మంది, పరిటాల నుంచి దుర్గా శివసాయి ఉండి సేవా సంఘం 200 మంది, విశాఖపట్నం నుంచి అన్నమాచార్య సేవా సమితికి చెందిన 50 మంది ఇలా అనేక ప్రాంతాలనుంచి మొత్తం 1750 మంది సారె సమర్పించారు.

19 నుంచి శాకంబరీ ఉత్సవాలు

ఈనెల 19 నుంచి 21 వతేదీ వరకు శాకంబరీ ఉత్సవాలను ఆలయంలో నిర్వహించనున్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నట్టు దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. మూడు రోజుల పాటు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు పండ్లు ఆకు కూరలతో అలంకరిస్తారు.

27 నుంచి సుబ్బారాయుడి పవిత్రోత్సవాలు

మోపిదేవి, జూలై 16 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆషాఢ మాసం పురస్కరించుకుని ఈ నెల 27 నుంచి పవిత్రోత్సవాలు, ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్.చక్రధరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు గోపూజతో పవిత్రోత్సవాలు ప్రారంభమై 28వ తేదీ సుబ్రహ్మణ్య మూలమంత్ర అనుష్ఠానములు, మూలమూర్తులు, ఉత్సవమూర్తులకు పట్టుపవిత్రముల సమర్పణ, 29వ తేదీ గోపూజ, హవనము, పవిత్ర జల ప్రోక్షణ, పూర్ణాహుతి కార్యక్రమంతో ముగుస్తాయన్నారు. 30వ తేదీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి జన్మనక్షత్రం సందర్భంగా శ్రీ వల్లీదేవసేన అమ్మవార్లకు శాకంబరి మహోత్సవం జరుగుతుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- దోమల నివారణ, శానిటేషన్‌లో ప్రజల భాగస్వామ్యం అవసరం
- ఓవర్‌హెడ్ రిజర్వాయర్లలో క్లీనింగ్, క్లోరినేషన్ పూర్తిచేయండి
- విద్యార్థి దశ నుంచే అవగాహన
- అన్ని ఆర్వో ప్లాంట్ల మ్యాపింగ్ జరగాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



సీజనల్ వ్యాధులు, దోమల వ్యాప్తి నియంత్రణపై అవగాహన పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 16 : సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ప్రజల భాగస్వామ్యంతో పారిశుధ్యం, దోమల నివారణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. నగరంలోని కాలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం శానిటేషన్, సీజనల్ వ్యాధులపై పంచాయతీరాజ్, వైద్యఆరోగ్య, నగరపాలక సంస్థ, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యంగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వ్యాధులు ప్రబలడానికి ముందే వాటిని అరికట్టే విధంగా అవగాహన కల్పించి ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. దోమల ద్వారా ప్రబలే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలోని 288 గ్రామపంచాయతీలలో 389 హ్యాబిటేషన్లలో ప్రతిరోజు నిర్వహించే శానిటేషన్‌తో పాటు ఈ వర్షాకాల సీజన్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. జిల్లాలోని 588 ఓహెచ్‌ఎస్‌ఆర్ ఓవర్ హెడ్ రిజర్వాయర్లలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం క్లీనింగ్ అనంతరం జియో టాగింగ్, ఫొటోను నిర్దేశించిన ఫార్మాట్‌లో పొందుపరచాలన్నారు. క్లీనింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఈవోపీఆర్డీ సర్టిఫికెట్ తప్పనిసరి అన్నారు. ఎక్కడైనా ఓహెచ్ఎస్ఆర్ శుభ్రం చేయలేదని ఆరోపణ వస్తే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నగరపాలక సంస్థ, మున్సిపల్, గ్రామ పంచాయితీల పరిధిలోని ఆర్వో ప్లాంట్ల మ్యాపింగ్ చేయాలన్నారు. దోమల నియంత్రణ, శానిటేషన్‌పై అవగాహన పోస్టర్లు, కరపత్రాలు, వీడియో షార్ట్ క్లిప్పింగ్స్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థి దశ నుంచే శానిటేషన్, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించే విధంగా ప్రతి శనివారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించే అసెంబ్లీలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అవగాహన పోస్టర్లు, పాంప్లెట్లను కలెక్టర్ సృజన విడుదల చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఎ.మహేష్, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, డీపీవో శివప్రసాద్ యాదవ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు, నగరపాలక సంస్థ మెడికల్ ఆఫీసర్ రత్నావళి, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంఈజీపీకి అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, జూలై 16 : పీఎంఈజీపీ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా గరిష్టంగా తయారీ యూనిట్లకు 50 లక్షల వరకు సర్వీసు యూనిట్లు రూ.20 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణం పొందే అవకాశం వుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఈ పథకానికి అర్హులు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం నుంచి 35 శాతం వరకు పట్టణ ప్రాంతాల్లో 15 శాతం నుంచి 25 శాతం వరకు సబ్సిడీ పొందవచ్చునని తెలిపారు. ఈ పథకం పూర్తిగా ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తులు స్వీకరించబడతాయని, ఆసక్తి వున్న అభ్యర్థులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.కేవీఐసీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తును సమర్పించాలని కోరారు. తదుపరి వివరాలకు ఆటోనగర్, విజయవాడలోని జిల్లా పరిశ్రమ కేంద్రం వారిని నేరుగా గానీ సంబంధిత అధికారులు ఆర్.రవికుమార్-8985063960, పి.రాజేష్‌కుమార్-8499882892, కె.వేణు-7382560676లను ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు..

వన్‌టౌన్, జూలై 16 : 2024 జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో నేషనల్ అవార్డ్స్ టు టీచర్స్. ఎడ్యుకేషన్. గవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 18 వతేలోగా పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈనెల 21లోగా పూర్తి చేసిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందన్నారు. ఈ అంశాన్ని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని అర్హులైన ఉపాధ్యాయులకు తెలియజేయాలని కోరారు.

నేడు ఎన్టీఆర్ జిల్లా అండర్-7 చెస్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, జూలై 16 : జూనియర్ చెస్ అకాడమీ, ది విజయవాడ చెస్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఈనెల 17న గుణదలలోని అరుణ ఎలక్ట్రికల్స్ ఫస్ట్ ఫ్లోర్‌లో ఎన్టీఆర్ జిల్లా అండర్-7 బాలబాలికలకు వేర్వేరుగా చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్బర్ బాషా, మందుల రాజీవ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రెండుస్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని, ఇతర వివరాలకు 9246181858 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.



స్వాధీనం చేసుకున్న మోటారు బైక్‌లు

గంజాయి విక్రయిస్తూ బైక్‌ల చోరీ..

- పోలీసుల అదుపులో ముగ్గురు మైనర్లు

గుడ్లవల్లేరు, జూలై 16 : విశాఖ పరిసర ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి గ్రామంలో పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థులకు విక్రయిస్తూ, ఇక్కడి నుంచి బైక్‌లు దొంగిలించి తీసుకెళుతున్న వారిని మంగళవారం గుడ్లవల్లేరు పోలీసులు అదుపులోకి తీసుకుని జువనైల్ కోర్టుకు తరలించారు. గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు పరిసర ప్రాంతాలకు చెందిన ముగ్గురు మైనర్లు విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని తెచ్చి ఇక్కడ కళాశాలల వద్ద విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. ఈ క్రమంలో గుడ్లవల్లేరు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద రెండు బైక్‌లు, గుడ్లవల్లేరు శివారు ప్రాంతంలో ఒక బైక్‌ను దొంగిలించి వెళుతుండగా పెంజంద్ర సమీపంలో వాహనాల తనిఖీల్లో మూడు బైక్‌లు ముగ్గురు బాలురు పట్టుబడ్డారు. మరో ఇద్దరు పరారయ్యారని ఎస్ఐ తెలిపారు. వారి వద్ద ఉన్న 500 గ్రాముల గంజాయి, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. సరకును, బైక్‌లు నిందితులను జువైనల్ కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

సీసీఆర్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి

- వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల ప్రగతిపై కలెక్టర్ సృజన సమీక్ష



అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 16 : కౌలు రైతులకు క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్ (సీసీఆర్‌సీ) పంపిణీ, పీఎం కిసాన్ యోజన వెరిఫికేషన్ ప్రక్రియ త్వరతగతిన పూర్తి కావాలని కలెక్టర్ జి.సృజన వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల ప్రగతిపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ, కౌలు రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరాలంటే కౌలు రైతు గుర్తింపు కార్డు తప్పనిసరన్నారు. సీసీఆర్సీ కార్డు ద్వారా కౌలు రైతులు పంటల బీమా పథకంలో నమోదు చేసుకొనే వీలుందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 16 మండలాల్లోని 311 గ్రామాలలో 55,560 కార్డుల పంపిణీ చేయాల్సి వుండగా ఇప్పటివరకు 12,380కి పైగా కార్డుల పంపిణీ చేసినట్టు వ్యవసాయ శాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా త్వరతగతిన నూరు శాతం కార్డుల పంపిణీ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (పీఎం కిసాన్) పథకంలో అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ త్వరతగతిన పూర్తికావాలన్నారు. ఇప్పటివరకు 8,497 దరఖాస్తులకు గాను 6 వేల దరఖాస్తులు పూర్తికాగా.. పెండింగ్ వున్న 2,494 దరఖాస్తులు పరిశీలన ప్రక్రియ 15 రోజులలోగా పూర్తిచేయాలన్నారు. జగ్గయ్యపేట వీరులపాడు మండలాల్లో 84 శాతం వెరిఫికేషన్ పూర్తికాగా మిగిలిన జిల్లాల్లో తక్కువ శాతం పరిశీలన పూర్తికావడంపై వ్యవసాయ శాఖ అధికారులను వివరణ కోరారు. జిల్లాలో ఉద్యాన శాఖ ద్వారా 43,563 హెక్టార్లలో కూరగాయలు, పండ్లు, స్పైసెస్, పూలతోటల సాగు జరుగుతుందని, వీటిలో మామిడి సాగు ప్రధానంగా జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట, విజయవాడ రూరల్ మండలాల్లో జరుగుతుందని, ఆయిల్‌పామ్ పంట సాగుకు అవసరమైన సీడింగ్ నర్సరీ రెడ్డిగూడెం మండలం నాగులూరు గ్రామంలో వుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి కలెక్టర్‌కు వివరించారు. వర్షాలు కురుస్తున్నందున ఉద్యాన పంటల సాగుకు రైతులను సన్నద్ధం చేసి ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులను కోరారు. మత్స్యశాఖ అమలుచేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో అర్హులైన లబ్దిదారుల యూనిట్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో టమాటా ధరలను సమీక్షించుకొని వినియోగదారులకు రైతుబజార్ల ద్వారా అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారిణి ఎస్.నాగమణెమ్మ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పి.బాలాజీకుమార్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి కె.విద్యాసాగర్, సెరీకల్చర్ ఆఫీసర్ ఎన్.సత్యనారాయణ, అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి కె.మంగమ్మ, మత్స్యశాఖ అధికారి పెద్దిరాజు, డీసీవో పి.త్రినాథ్, ఏపీసీఎన్ఎఫ్ పీడీ డీఎంఎఫ్ విజయకుమారి సంబంధిత ధికారులు పాల్గొన్నారు.

పంట రుణాలలో కౌలు రైతుల వాటా పెంచాలి

వన్‌టౌన్: పంటరుణాలలో కౌలు రైతుల వాటాను పెంచాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్రకమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, కార్యదర్శి ఎం.హరిబాబులు మంగళవారం ఈమేరకు ఒక సంయుక్త ప్రకటన చేశారు. రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వారికి సగటున రూ 12,500 మాత్రమే పంట రుణం వస్తుందన్నారు. ప్రభుత్వం కూడా పదిలక్షలమంది కౌలు రైతులకు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇటీవల జరిగిన బ్యాంకర్ల సమావేశంలో పంటరుణాలకు కేటాయించిన నాలుగువేల కోట్ల రూపాయలను పంచితే రూ. 40 వేలు చొప్పున మాత్రమే వస్తుందన్నారు. ఈపాటి కొద్ది మొత్తాలతో పంటలు వేయడం సాధ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల మేరకు 80 లక్షల ఎకరాలలో పంట సాగు జరిగితే అందులో కౌలురైతులు 50 లక్షలకు పైగా ఎకరాలలో సాగు చేస్తున్నారన్నారు. వాటాను బట్టి లెక్కిస్తే రూ.1.66 లక్షల కోట్లలో కౌలు రైతులకు కనీసం లక్ష కోట్లయినా ఇవ్వాల్సి వస్తుందన్నారు. ఇటువంటి గణాంకాలు తేట తెల్లంగా ఉంటే కేవలం నాలుగువేల కోట్ల మేరకే కౌలు రైతులకు పంట రుణాలు ఇస్తామని ప్రణాళిక రూపొందించడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో 2000లేదా 3000 కోట్లమేరకు బటన్ నొక్కిన అనుభవం ఉందన్నారు.ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కౌలురైతులకు సంబంధించి అన్నిపంటలకు రుణాలు ఇచ్చేందుకు రూ.25 వేల కోట్లకు పెంచాలన్నారు.

మూడు నెలల్లో రివర్స్ బదిలీ

(5వ పేజీ తరువాయి)

అధికారి వచ్చారు. ఈ అధికారి వచ్చీ రావటంతోనే వివాదాస్పదమయ్యారు. ఈయన తమపై తీవ్ర ఒత్తిళ్లు తీసుకు వస్తున్నారని ఉద్యోగులు ఉన్నతాధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదు ఇచ్చారు. తమను వేధిస్తున్నారని మహిళలు కూడా ఫిర్యాదు ఇచ్చారు. ఈ అధికారి కింద పనిచేసే ఒక ఉద్యోగి మహిళలను లొంగదీసుకునే విధంగా వ్యవహరిస్తున్నారని మహిళా ఉద్యోగులు పలువురు గతంలో ఫిర్యాదులు ఇచ్చారు. ఆ ఉద్యోగిపై మహిళా ఉద్యోగులు ఫిర్యాదు చేసిన క్రమంలో అంతర్గత విచారణ జరపగా ఆరోపణలు నిర్ధారణ అయ్యాయి. దీంతో మరో విభాగంలోకి ఆ ఉద్యోగిని బదిలీ చేశారు. అయినా ఇదే విభాగంలో ఆ ఉద్యోగి చక్రం తిప్పుతున్నాడు. డివిజనల్ పర్సనల్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులపై నెలకొంటున్న వేధింపులు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల సమయంలో ఇవన్నీ జరగటంతో.. పర్సనల్ కార్యాలయం పరిధిలో జరుగుతున్న వ్యవహారాలు బయటకు రాలేదు. కొంతమంది మహిళా ఉద్యోగులు మీడియా దృష్టికి తీసుకురావటంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. పర్సనల్ ఆఫీసర్‌కు నమ్మినబంటుగా ఉంటూ బదిలీ అయిన ఉద్యోగిపై మహిళా ఉద్యోగులు అనేక ఫిర్యాదులు చేశారు.

● రాయనపాడుకు బదిలీ

మొత్తం మీద ఈ వివాదం సమసిన క్రమంలో పర్సనల్ అధికారిని రాయనపాడు బదిలీ చేశారు. ఏ కారణం మీద బదిలీ చేశారన్నది మిస్టరీగా ఉంది. ఈ అధికారి వచ్చి నాలుగు నెలలు కూడా కాలేదు. విజయవాడలో అయితే అతని పోస్టు ప్రాధాన్యమైనది. అదే రాయనపాడు అయితే అంత ప్రాధాన్యత కాదు. ప్రాధాన్యత ఉన్న స్థానం నుంచి ప్రాధాన్యత లేని స్థానానికి ఎందుకు బదిలీ చేశారన్నది మిస్టరీగా మారింది. ఈ అధికారి బదిలీ వ్యవహారాన్ని జోన్ హెడ్డాఫీసులోని చీఫ్ ప్రిన్సిపల్ పర్సనల్ మేనేజర్ బదిలీకి ఆదేశించారని తెలుస్తోంది. దీంతో జీఎం బదిలీ ఆర్డర్స్ ఇచ్చారు. ఏ కారణంతో బదిలీ వేటు పడిందన్నది రైల్వే అధికారులు అత్యంత రహస్యంగా ఉంచారు.

● మళ్లీ రివర్స్ బదిలీ..

మళ్లీ అదే జీఎం ఆదేశాలతో రివర్స్ బదిలీ చేస్తూ కొద్ది రోజుల్లోనే ఆర్డర్ ఇచ్చారు. బదిలీకి కొద్ది కాలం ముందు ఈ అధికారి విజయవాడ డీఆర్ఎం బర్త్‌డే సెలబ్రేషన్స్‌ను గ్రాండ్‌గా నిర్వహించారు. ఒక డీఆర్ఎంకు బెజవాడలో ఈ స్థాయిలో ఓపెన్ గ్రౌండ్‌లో బర్త్‌డే సెలబ్రేషన్స్ ఎప్పుడూ జరగలేదు. ఈ బర్త్‌డే సెలబ్రేషన్స్ పెద్ద చర్చనీయాంశంగా మారాయి. ఈ అధికారి తిరిగి రావటానికి ఎవరు కారణమన్నది కూడా చర్చనీయాంశంగా మారుతోంది. ఈ అధికారి తమ మీద చూపించిన స్వామిభక్తితో ఏ ఉన్నతాధికారి సిఫార్సు చేశారన్నది చర్చనీయాంశమౌతోంది.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



వైద్య అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఎంపీలాడ్స్, సీఎస్ఆర్ నిధులతో జిల్లాలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అధికారులు ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ విభాగాల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాళ్లు, డిజిటల్ లైబ్రరీలు, మైక్రోఫిల్లర్లు, ఇతర రైతు భవనాల నిర్మాణపనులను పూర్తిచేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. ఆయా నిర్మాణాలకు సంబంధించిన నాణ్యతను అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. ఇకపై ప్రతి 15రోజులకోసారి జిల్లాలో అభివృద్ధిపనులపై పర్యవేక్షణ చేస్తానని, ఏ పనులు ఏ దశలో ఉన్నాయి.. వాటి పురోగతిపై పూర్తిస్థాయి సమాచారం అందించాలన్నారు. సమావేశంలో సీపీవో గణేష్, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల ఈఈలు ఏపీఎస్ శ్రీనివాస్, శివప్రసాద్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖరరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను తగ్గించండి

జిల్లాలో మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు వైద్యులు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. మంగళవారం వైద్య, అనుబంధశాఖల అధికారులతో ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇటీవల కాలంలో మాతా శిశుమరణాలకు సంబంధించిన కారణాలపై కలెక్టర్ ఆరా తీశారు. గర్భిణీలలో హైరిస్క్‌కేసుల విషయంలో వైద్యులు మరింత అప్రమత్తంగా ఉండి, ప్రాణనష్టం జరగకుండా అన్నిజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఎప్పటికప్పుడు గర్భిణీల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని వైద్యులకు సమాచారం అందించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో గర్భిణులకు అవసరమైన మందులను అందజేయాలన్నారు. పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, డీసీహెచ్ఎస్ పి.శ్రావణ్, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు సమావేశంలో పాల్గొన్నారు.

పామాయిల్ సాగుపై.. అవగాహన కల్పించండి

మచిలీపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో మంగళవారం ఉద్యాన, బిందుసేద్యం విభాగం అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ జేడీ జె జ్యోతి మాట్లాడుతూ గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లో పామాయిల్ సాగు జరుగుతోందని, గత ఏడాదినుంచి చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ మండలాల్లోనూ ఈ సాగును రైతులు చేపట్టారని తెలిపారు. హెక్టారుకు 143 మొక్కలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, ఐదో సంవత్సరంనుంచి పంట అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఏడాదికి ఎరువుల నిమిత్తం హెక్టారుకు రూ.5,200లను సబ్సిడీగా అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. బిందు సేద్యం విభాగం అధికారి విజయలక్ష్మీ మాట్లాడుతూ బిందుసేద్యంను ఉపయోగించే రైతులకు ఐదుఎకరాల్లోపు 90శాతం పరికరాల రాయితీలను ఇస్తున్నట్లు, ఐదుఎకరాలకు పైబడిన వారికి 50శాతం సబ్సిడీని ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వంనుంచి మార్గదర్శకాలు విడుదల కావాలని ఆమె అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పామాయిల్ పంటను సేకరించే పతంజలి, వేహన్ కంపెనీల ప్రతినిధులతో ఆయా ప్రాంతాలలో త్వరలో సమావేశాలు నిర్వహించి రైతులకు మరింతగా ఈ సాగుపట్ల అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండల, గ్రామస్థాయి అధికారులతో కలసి రైతులకు పామాయిల్ సాగుపై రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఎన్నికల విధుల్లో పనిచేసిన సిబ్బందికి..

పారితోషికాలెప్పుడు?

- కొత్త ప్రభుత్వం కొలువు తీరి 30 రోజులు
- కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన ఓ అధికారి!
- పై అధికారులను అడగలేక బీఎల్‌వోలు బిక్కుబిక్కు
- త్వరలో తహసీల్దార్ల బదిలీ వార్తలతో మరింత ఆందోళన

జగ్గయ్యపేట : ఎన్నికల విధులు నిర్వహించిన కింది స్థాయి సిబ్బంది, చిరుద్యోగులకు ఇవ్వాల్సిన పారితోషికాలు ఎన్నికల ప్రక్రియ ముగిసి, కొత్త ప్రభుత్వం కొలువు తీరి నెలరోజులైనా ఇవ్వకపోవటంతో గగ్గోలు పెడుతున్నారు. నియోజకవర్గంలో మొత్తం 222 పోలింగ్ స్టేషన్లు ఉండగా, ఎన్నికలకు వందల సంఖ్యలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేశారు. పై స్థాయిలో పనిచేసిన కొందరు అధికారులకు కొంత మొత్తం దక్కినా, కిందిస్థాయిలో బీఎల్‌ఓలుగా పనిచేసిన వారికి రిక్తహస్తమే మిగిలింది. బీఎల్‌ఓలుగా పంచాయతీ సెక్రటరీలు, గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శి, కొన్నిచోట్ల అంగన్వాడీ వర్కర్లు, రెవెన్యూ సిబ్బంది పనిచేశారు. పోలింగ్ రోజున ప్రభుత్వ పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాల కోసం ఇచ్చిన రూ.5వేలు వినహా వారి సేవలకు ఎలాంటి పారితోషకం అందలేదు. ఎన్నికల కోడ్ వచ్చాక పూర్తిగా బాధ్యతలు బీఎల్‌వోలపైనే పడ్డాయి. ఎన్నికల కోసం నిద్రాహారాలు లేకుండా పాటు పడ్డారు. వీరితో పాటు ఈవీఎంను స్ట్రాంగ్‌రూంలకు తరలించటం, ప్రోగ్రామింగ్, పలు విడతల శిక్షణలో పాల్గొన్నారు. ఇంత పనిచేసినా కనీసం తమ సేవలకు గుర్తింపు లేకపోవటంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. బీఎల్‌వోలకు రెండు సంవత్సరాలుగా నెలకు రూ.500ల చొప్పున ఇవ్వాల్సిన గౌరవ వేతనం అందలేదు. ఎన్నికల రెండు రోజులకు రూ.250ల చొప్పున రూ.500ల మాత్రమే ఇచ్చారు. కంప్యూటర్ ఆపరేటర్లకు పారితోషకం అందలేదు. ఎన్నికల అధికారులు మాత్రం ఇంకా బడ్జెట్ రావాల్సి ఉందని చెప్పుకుంటు వాయిదాలు వేస్తున్నారు. వీరంతా చిరుద్యోగులు, వివిధ శాఖలకు చెందిన వారు కావటంతో గట్టిగా అడిగేందుకు సాహసించటం లేదు. వీరితో పాటు పోలింగ్ స్టేషన్‌లలో కరెంటు పనులు, కేటరింగ్, ఫోటోగ్రఫి, వీడియోగ్రాఫర్లకు సంబంధించిన బిల్లుల కోసం కార్యాలయాల చుట్టు తిరుగుతున్నట్టు సమాచారం. కొద్ది రోజుల్లో తహసీల్దార్ల బదలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు వెళ్లిపోతే తమ పరిస్థితి ఏంటని వారు వాపోతున్నారు. బీఎల్‌వోలు, పోలింగ్ రోజున హమాలీలుగా పనిచేసిన గ్రామ సేవకులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఎన్నికలు అందరికి పండుగలా జరిగితే తమకు మాత్రం అన్ని రకాలుగా ఇబ్బంది పడ్డామని వాపోతున్నారు. నియోజకవర్గంలో కీలకంగా పనిచేసిన ఒక అధికారి తన బిల్లులు రాలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. పెద్ద అధికారులు కలెక్టర్‌ను కలిసి చెప్పుకుంటారని, తమ పరిస్థితి ఏమిటని చిరుద్యోగులు మదన పడుతున్నారు. ఈ విషయమై జగ్గయ్యపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పనిచేసిన జి.వెంకటేశ్వర్లును ఫోన్‌లో సంప్రదించగా, బిల్లులు రాలేదని కొంత మంది తనకు ఫిర్యాదు చేశారని, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన బిల్లులు ఏఈఆర్వోగా వ్యవహరించిన జగ్గయ్య పేట తహసీల్దార్ శేషు ద్వారా వస్తాయని, కొన్ని బిల్లులు పెండింగ్ ఉన్నాయని చెప్పారు. తహసీల్దార్ శేషును వివరణ కోరగా కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, బడ్జెట్ కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. బీఎల్‌ఓల ఎంత ఇవ్వాల్సింది లెక్క చూడాల్సి ఉందని చెప్పారు.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వండి

- జేసీకి యూటీఎఫ్ వినతి

గవర్నర్‌పేట : ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ మంగళవారం యూటీఎఫ్ జిల్లా ప్రతినిధులు, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అన్ని జిల్లాల్లో ఇప్పటికే డ్యూటీ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో అందజేశారని, ఇక్కడ మాత్రం ఇవ్వలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుందరయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్, జిల్లా సహాధ్యక్షుడు కృష్ణయ్య పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

దుర్గమ్మకు వాసవీ క్లబ్ సారె



అజిత్‌సింగ్‌నగర్, జూలై 16 : ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వాసవీ క్లబ్ అజిత్‌సింగ్‌నగర్ ఆధ్వర్యంలో కనకదుర్గ అమ్మవారికి మంగళవారం సారె సమర్పించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని క్లబ్ కార్యాలయం నుంచి కోలాటం, మేళతాళాలతో మహిళలు దుర్గామల్లేశ్వర దేవస్థానానికి చేరుకుని సారె సమర్పించారు. క్లబ్ సభ్యులు మల్లిఖార్జునరావు, కేవీ భాస్కరరావు, పి.హనుమంతరావు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో పారిశుధ్యం అధ్వానం

● ఎక్కడపడితే అక్కడ రోడ్ల నిండా చెత్త, వ్యర్థాలు ● పొంచి ఉన్న ప్రమాదాలు ● పట్టించుకోని ఐలా సిబ్బంది

ఆటోనగర్, జూలై 16: ఆటోనగర్‌లో చెత్త నిర్వహణ అటకెక్కడంతో ఎక్కడికక్కడ చెత్తా చెదారం పేరుకుపోతోంది. పరిశ్రమల యజమానులు రోడ్ల చెంతనే చెత్తను పారవేయడం, సదరు చెత్తను తొలిగించాల్సిన ఐలా సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడంతో చెత్త ఎక్కడికక్కడే కుప్పలుకుప్పలుగా దర్శనమిస్తోంది. వర్షాకాలం కావడంతో చెత్త నుంచి మురుగు రావడం, పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు రెండు, మూడో రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్లను ముంచెత్తి ఉండడంతో కార్మికులు, చెత్త నిర్వహణ సిబ్బంది విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదాలు పొంచి ఉన్నాయి. వర్షాకాలంలో మురుగు, చెత్త చెదారం నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన సిబ్బంది మీనమేషాలు లెక్కిస్తుండడంతో దోమలు విజృంభించి మలేరియా, డయేరియా తదితర అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయి.





ఆటోనగర్ రెండో రోడ్డులో, మూడో రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ చెంతనే పడవేసిన వ్యర్థాలు

వారంలో చెత్త సమస్యకు పరిష్కారం

ఐలా కమిషనర్ మధు

చెత్త డంపింగ్‌కు యార్డును ఏర్పాటు చేయాల్సిన బాధ్యత వీఎంసీ అధికారులదే. ఆటోనగర్‌లో వచ్చే ఆదాయంలో 35శాతం పన్నుల రూపంలో ప్రతి మూడు నెలలకు వీఎంసీకి చెల్లిస్తున్నాం. ఏడో రోడ్డులో తాము వీఎంసీకి రెండెకరాల స్థలాన్ని కేటాయించాం. చాలా సార్లు వీఎంసీ కమిషనర్‌కు చెత్త నిర్వహణ సమస్యలపై నివేదించాం. త్వరలో స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను కలిసి సమస్యలను నివేదిస్తాం. ఒక వారం రోజుల్లో చెత్త సమస్యకు పరిష్కారం లభించవచ్చని ఐలా కమిషనర్ మధు ఆశాభావం వ్యక్తం చేశారు.

అమరావతి నిర్మాణానికి సహకరించాలి

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె

భారతీనగర్, జూన్ 16: ఆంధ్రుల రాజధాని అమరావతి నిర్మాణానికి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా మంగళవారం మూడో డివిజన్‌లోని కరెన్సీనగర్ కాలనీలోని అంజనేయ స్వామి గుడి రోడ్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్థానిక పెద్దలు, కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సైడు కాల్వల్లో చెత్త ఇతర వ్యర్థాలు, పడవేయకుండా చూడాలన్నారు. నగరంలో రోడ్ల నిర్మాణం పూర్తయినా కొన్ని ప్రాంతాల్లో సైడు కాల్వల నిర్మాణం కాకపోవడంతో అక్కడక్కడ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే నగరానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు తాడి బాబూరావు, గద్దె రమేష్, గుత్తి కొండ కృష్ణమోహన్, రత్నం నాగేశ్వరరావు, యలమంచిలి పండు, నీలం సాయి రంగరావు, గుణమాల రాజశేఖర్, ఈశ్వర్ పేరేపి, మాధవరావు, అలికాన చంద్రశేఖర్, గూడూరు సాయి సుమంత్, సిసి సామ్రాజ్యం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంటోని తదితరులు. పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న అజయ్‌కుమార్

గవర్నర్‌పేట, జూలై 16: సీఐటీయూ నాయకులు టి. సుబ్బారెడ్డి, ఎం.డేవిడ్, ఎస్ఎం సుభానీల జ్ఞాపకార్థం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. అజయ్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. సీఐటీయూ, అనుబంధ సంఘాలకు చెందిన 39 మంది నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంజిత శిబిరాన్ని పర్యవేక్షించారు. రక్తదానం చేసిన సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. వెంకటేశ్వరరావు, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, కోశాధికారి ఎం. శ్రీనివాస్, సెంట్రల్ సిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. దుర్గారావు, ఎంవీ సుధాకర్, నాయకులు ఎం. సోమేశ్వర రావు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూవీ కృష్ణయ్య, సీఐటీయూ నేతలు జి. వెంకట్రావు, ఈవీ నారాయణ, ఎన్. కోటిబాబు, ఎం. హనుమంతరావు, సీహెచ్ మురళీ పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ వితరణ



పటమట, జూలై 16 : సింగ్‌నగర్ విభిన్న ప్రతిభావంతుల ప్రభుత్వ పాఠశాల వార్డెన్ నాగస్వర్ణకు జీఆర్‌పీఎస్ ఫౌండేషన్ తరఫున హైదరాబాద్‌కు చెందిన దాత గూడూరు ఉషాబాల మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆర్వో ప్లాంట్‌ను అందజేశారు. దాత ఉషాబాల మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతులకు సేవ చేసే అదృష్టాన్ని మహాభాగ్యంగా భావిస్తున్నానని తెలిపారు. కృష్ణాజిల్లా డిసేబుల్ అసిస్టెంట్ డైరెక్టర్ కామరాజు, ఏలూరు లేబర్ అసిస్టెంట్ కమిషనర్ రాణి, మామిళ్లపల్లి దేవప్రసాద్, మామిళ్లపల్లి రజని, రవికుమార్‌లు పాల్గొన్నారు.

రథ్‌ఫెస్ట్‌లో పీబీ సిద్ధార్థ విద్యార్థి శ్రీ హర్ష ప్రతిభ



మొగల్రాజపురం, జూలై 16: జాతీయస్థాయిలో విజయవాడ ఇస్కాన్ మందిరంలో జరిగిన రథ్‌ఫెస్ట్ 2024 పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జూనియర్ ఇంటర్ విద్యార్థి వై. శ్రీ హర్షను పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాసికల్ (సోలో) ఇన్‌స్ట్రుమెంటల్ సీనియర్ విభాగంలో శ్రీ హర్ష వయోలిన్ ప్రదర్శనలో ప్రథమ బహుమతి సాధించాడని చెప్పారు. ఇప్పటికే జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరిగిన పలు పోటీల్లో బహుమతులు సాధించాడని తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తీసుకొస్తున్నాడని అభినందించారు.

స్కూల్ బస్సు ఢీకొని యువతికి గాయాలు

అజిత్‌సింగ్‌నగర్, జూలై 16 : స్కూల్ బస్సు ఢీకొని యువతి గాయపడిన ఘటన సోమవారం జరిగింది. వివరాల ప్రకారం అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఉప్పలపర్తి ప్రసన్నకుమారి(26) సోమవారం నగరం నుంచి సింగ్‌నగర్‌కు వస్తుండగా మార్గ మధ్యంలో గవర్నమెంట్ ప్రెస్ వద్ద ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు యువతిని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ యువతిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

భార్య, పిల్లలు కనిపించడం లేదని ఫిర్యాదు

పాయకాపురం, జూలై 16 : భార్య, ఇద్దరు పిల్లలు కనిపించడం లేదని ఓ వ్యక్తి మంగళవారం నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం వాంబేకాలనీకి చెందిన ఎం. నాగ శ్రీహరి ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య భవాని(31), ఇద్దరు మగ సంతానం. ఈనెల 14న దంపతుల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో ఇద్దరు పిల్లలను తీసుకుని భార్య పుట్టింటికి వచ్చేసింది. ఆదివారం శ్రీహరి ఎల్‌బీఎస్ నగర్‌లోని అత్తగారింటికి వచ్చాడు. ఈ సమయంలో మరోమారు దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో శ్రీహరి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. భర్త వద్దకు వెళ్తున్నానని చెప్పిన భవాని తన ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటి నుంచి బయటకు వచ్చింది. అప్పటి నుంచి ఆమె, పిల్లలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు నున్న రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేన్సర్‌పై నిరంతరం అప్రమత్తతతో ఉండాలి

● అవగాహనా సదస్సులో డాక్టర్ కృష్ణారెడ్డి



ప్రసంగిస్తున్న డాక్టర్ కృష్ణారెడ్డి

గవర్నర్‌పేట, జూలై 16: కేన్సర్ వ్యాధిని సంపూర్ణంగా నిరోధించే మందులు రాలేదని, జబ్బు వచ్చిన తరువాత గుర్తించడం కంటే కొన్ని నియమాలు పాటిస్తే కేన్సర్ బారిన పడకుండా ఉండవచ్చని మణిపాల్ హాస్పిటల్ కేన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ జి. కృష్ణారెడ్డి అన్నారు. ఎంజీ రోడ్డులోని ఎంబీవీకే ఆధ్వర్యంలో బాలోత్సవ్ భవన్‌లో జరిగిన కేన్సర్ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. సదస్సుకు సేఫ్ సంస్థ అధ్యక్షురాలు జి. జ్యోత్స్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ధూమపానం, మత్తుపదార్థాలు, ఊబకాయం, జీవన విధానం వల్ల వచ్చే కేన్సర్ అధిక శాతం ఉందన్నారు. దీని నివారణ కోసం వ్యాయామం, యోగ, ఆహారపు అలవాట్లలో మార్పులు, తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. మహిళలకు రొమ్ము కేన్సర్, సర్వైకల్ కేన్సర్‌లు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. కేన్సర్‌పై ప్రజలు నిరంతరం అప్రమత్తతతో ఉండాలన్నారు.

ఎంబీవీకే మేనేజింగ్ కమిటీ సభ్యులు కె. స్వరూపరాణి మాట్లాడుతూ కేన్సర్ కు కారకమైన కల్తీ ఆహార పదార్థాలు, పురుగుమందులు, ప్లాస్టిక్‌ను నిరోధించడం, మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సదస్సులో భారత మహిళా మండలి సభ్యురాలు ఉషారాజా, ఎంబీవీకే బాధ్యులు పి. విజయ, సుహాస్తి సంస్థ అధ్యక్షురాలు భారతీదేవి, రోటరీ ఇన్నర్‌వీల్ ప్రెసిడెంట్ కల్యాణి, కవిత ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ మహిళా విభాగం బాధ్యులు అరసవిల్లి సంధ్య తదితరులు పాల్గొన్నారు.



ఖతార్‌లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి

వన్‌టౌన్, జూలై 16: ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం, టీడీపీ వ్యవస్థాపకుడు,విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు స్వర్గీయ నందమూరి తారక రామరావు (ఎన్‌టీఆర్) సంచలనాలకు మారుపేరని అభిమానులు కొనియాడారు. ఖతార్‌లో మంగళవారం ఎన్‌టీఆర్ 101 వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు పెద్ద సంఖ్యలో చేరి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఎన్టీఆర్‌కు ఘన నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సినీ,రాజకీయ, సేవా రంగాల్లో ఆయన నేటి యువతరానికి ఎంతో ఆదర్శమన్నారు.

కారణ జన్ముడయిన ఎన్టీఆర్ తెలుగువారి కీర్తిని ప్రపంచానికి చాటారన్నారు. ఎన్నికల సమయంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారంతా ఏకమై తమ ఓటు హక్కుతో అరాచక ప్రభుత్వాన్ని సాగనంపి ప్రజా ప్రభుత్వం ఏర్పాటులో కీలక పాత్ర పోషించారన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో సీఎం చంద్రబాబుకు ప్రవాసులు సహకరించాలని, అభివృద్ధిలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్నవారందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

దర్గా ప్రాంతంలో మోడల్ రోడ్లు, డ్రెయినేజీ అభివృద్ధికి చర్యలు

పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి



దర్గాలో ఎమ్మెల్యే సుజనా చౌదరి

భవానీపురం, జూలై 16 : 41వ డివిజన్ దర్గా ప్రాంతంలో మోడల్‌గా రోడ్లు, డ్రెయినేజీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి అన్నారు. భవానీపురం హజ్రత్ గాలీబ్ షహీద్ దర్గా ప్రాంతంలో పర్యటనకు వచ్చిన ఆయనకు దర్గా కమిటీ అధ్యక్షుడు అహ్మద్, కార్యదర్శి ఇస్మాయిల్, అల్తాఫ్‌లు మంగళవారం ఘనస్వాగతం పలికారు. దర్గాలో మహ్మతులను దర్శించుకొని ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఉర్దూ స్కూల్ ప్రాంతంలో గతంలో ఆగిపోయిన కమ్యూనిటీ హాలుకు కేటాయించిన ఖాళీ స్థలంలో కల్యాణమండపం నిర్మించాలని దర్గా కమిటీ కోరగా, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వీఎంసీ అధికారులను ఆదేశించారు. మహ్మదీయ కో-ఆపరేటివ్ ప్లాట్స్ సభ్యులు ప్లాట్స్‌కు చెందిన 3 ఎకరాల ఖాళీస్థలంలో పార్కును నిర్మించాలని కోరారు. అయితే ఇది దర్గాకు చెందినదని కమిటీ సభ్యులు వివరించడంతో స్థలం వివరాలు సేకరించాలని కార్పొరేషన్ అధికారులను సుజనా ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట జోనల్ కమిషనర్ రమ్యకీర్తన, ఈఈ ఏఎస్‌ఎన్.ప్రసాద్, డీఈ, ఏఈలు, టీడీపీ సీనియర్ నాయకుడు సుబ్బారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, టీడీపీ మైనార్టీ నాయకులు ఫతావుల్లా, మాజీ కార్పొరేటర్లు, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు బాజీ, దర్గా కమిటీ సభ్యులు చాంద్‌లు పాల్గొన్నారు.

విద్యాధరపురం: పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి మంగళవారం 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చిన సుబ్బయ్య ఆధ్వర్యంలో గాంధీబొమ్మరోడ్డులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్‌ను సందర్శించారు హాస్టల్ రోడ్డు కంటే దిగువన ఉండడాన్ని గుర్తించి, డ్రెయినేజీ సమస్య పరిష్కారం కోసం ఎంత వ్యయమవుతుందో అంచనా వేసి చెప్పాలని అధికారులను ఆదేశించారు. సాయిబాబాగుడి వద్ద కల్వర్టులోని నీరు రోడ్డుపైకి వస్తున్నదని తెలుసుకుని ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పున్నమి ఘాట్ వద్ద కృష్ణుడి గుడిని సందర్శించి అక్కడి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి గుడి పునర్నిర్మాణానికి ఎంత వ్యయమవుతుందో అంచనా వేసి చెప్పమనగా కోటి రూపాయలు వ్యయమవుతుందని చిన సుబ్బయ్య చెప్పడంతో రూ. 20 లక్షలు శాంక్షన్ చేస్తున్నట్లు సుజనా తెలిపారు.

సైడు కాల్వల్లో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడండి

ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్



వన్‌టౌన్, జూలై 16: సైడు కాల్వల్లో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా ఎప్పటికప్పుడు పూడిక తీత పనులను చేపట్టాలని నగరపాలకసంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు, అధికారులకు సూచించారు. వ్యర్థాలను కూడా సత్వరమే తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. మంగళవారం ఆయన వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. దేవినగర్‌లో విజయవాడ- వైజాగ్ రైల్వే ట్రాక్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి పనులు ప్రారంభించేందుకు పరిశీలించారు. ఆయుష్ ఆసుపత్రి రోడ్డు, హై టెన్షన్ వైర్ రోడ్డు రామవరప్పాడు- నేషనల్ హైవే సర్వీస్ రోడ్లలో వర్షపు నీరు నిలిచి ఉండడాన్ని చూసి నీటిని వెంటనే తొలగించాలని, నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు కూడా వ్యర్థాలను రోడ్డుమీద పారవేయకుండా అవగాహన కల్పించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పాలన్నారు.

పాఠశాల పైకప్పుపై కూలిన చెట్టు కొమ్మ

● తప్పిన ముప్పు

మొగల్రాజపురం, జూలై 16: మొగల్రాజపురం రావి చెట్టు సెంటర్‌లో ఉన్న అప్పర్ ప్రైమరీ పాఠశాల పై కప్పు మీద చెట్టు కొమ్మ కూలింది.

ఈ ఘటన మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో జరిగింది. రావిచెట్టు కిందే పాఠశాల ఉండటం, పై కప్పు ఎక్కువ భాగం ప్లాస్టిక్ రేకులు ఉన్నాయి. చెట్టు కొమ్మ కూలి పై కప్పు మీద పడడగానే బరువుకు రేకులు విరిగి పిల్లలు కూర్చునే బల్ల మీద కొమ్మ పడింది. ఈ సంఘటన పగలు జరిగి ఉంటే పిల్లలకు ప్రమాదం జరిగి ఉండేది.



విరిగిన రేకు

బల్లలపై పడిన చెట్టు కొమ్మ

నేషనల్ త్రోబాల్ పోటీలకు దిషా రాతి



గవర్నర్‌పేట, జూలై 16: 16వ సౌత్‌జోన్ నేషనల్ త్రోబాల్ పోటీలకు నలంద విద్యానికేతన్ 12వ తరగతి విద్యార్థిని దిషా రాతి ఎన్నికయ్యారు. మంగళవారం ఎంజీ రోడ్డులోని మున్సిపల్ స్టేడియంలో జరిగిన నేషనల్ ప్రాబెల్స్ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 160 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో నలంద విద్యానికేతన్ విద్యార్థిని దిషా రాతి ఎన్నికయ్యారు. ఆగస్టు 3 నుంచి 7 వరకు బెంగళూరులో జరిగే 16వ సౌత్‌జోన్ నేషనల్ త్రోబాల్ పోటీల్లో ఆమె ఆడనున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ విద్యార్థినిని అభినందించారు. బెంగళూరు పోటీల్లో విజేతగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కోచ్‌ను అభినందించారు.

దిక్సూచి

గుంటూరు-లాంలోని ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ ఏయూ)- 'అగ్రిసెట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని వ్యవసాయ విభాగాల్లో పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులకు ఉద్దేశించారు. ఈ ఎగ్జామ్‌లో సాధించిన స్కోర్ ద్వారా నాలుగేళ్ల వ్యవధి గల 'బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎన్.జీ.రంగా వర్సిటీ అగ్రిసెట్



విభాగాలు: అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ ఫార్మింగ్

అర్హత: ఏఎన్‌జీఆర్‌ఏయూ/పీజేటీఎస్‌ఏయూ నుంచి రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 22 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.

అగ్రిసెట్ వివరాలు: అభ్యర్థులు తమ డిప్లొమా స్ట్రీమ్‌లోనే అగ్రిసెట్ ఎగ్జామ్ రాయాలి. ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) ప్రోగ్రామ్‌లకు ఏఎన్‌జీఆర్‌ఏయూ నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్న పత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఈ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 25 శాతం(30)మార్కులు రావాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **ఏఎన్‌జీఆర్‌ఏయూ అగ్రిసెట్ తేదీ:** ఆగస్టు 27
- **వెబ్‌సైట్:** angrau.ac.in

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the post-graduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000

Last Date to Apply: 04-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/HDFC54

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AT8a4gNలో చదవండి.

SCHOLARSHIP ALERT

Panasonic Ratti Chhatr Scholarship

Description: Panasonic Life Solutions India (PLSIND) invites applications from students enrolling in B.E./B.Tech. courses at the Indian Institutes of Technology (IITs).

Eligibility: Open for students across India who have cleared the entrance for admission into B.E./B.Tech. courses at any of the IITs (Indian Institute of Technology) in 2024-25. Applicants must have cleared their Class 12 examination or be awaiting final results. Applicants must have scored more than 75% marks in Class 12. The annual family income of the applicant must not be more than INR 8,00,000 from all sources. Only candidates from 2024-25 batch are eligible to apply.

Prizes & Rewards: Scholarship amount: INR 70,250 per year for four years

Last Date: 15-08-2024 *Application:* Online only

Short Url: www.b4s.in/aj/RCSP56

buddy4study.com

కొత్త పుస్తకం

పోటీ పరీక్షల దిక్సూచి

భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ

మరి కొద్ది నెలల్లో తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలు నిర్వహించబోతున్నారు. అటు ఏపీలోనూ ఇటీవల కొలువు తీరిన కొత్త ప్రభుత్వం భారీ స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి సమాయత్తం అవుతోంది. పోటీ పరీక్షలు ఏవైనా..ఇండియన్ పాలిటీ ప్రాధాన్యం ఎనలేనిది. పైగా అన్ని సబ్జెక్టుల్లో కన్నా ఎక్కువ మార్కులు తెచ్చిపెట్టే సబ్జెక్టు కూడా ఇదే. ఈ నేపథ్యంలో పోటీ పరీక్షల శిక్షణలో చాలా అనుభవం ఉన్న డాక్టర్ సుంకర రమాదేవీ రచించిన 'భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ' 15వ ఎడిషన్ మార్కెట్‌లోకి విడుదల అయ్యింది. దాదాపు 333 పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను అధ్యయనం చేసి ఈ పుస్తకానికి రూపకల్పన చేశారు. శాసన వ్యవస్థల కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ, రాజ్యాంగ, రాజ్యాంగేతర సంస్థల్లో వచ్చిన అన్ని పరిణామాలను, చట్టాలను, కోర్టుల తీర్పులను ఈ పుస్తకంలో పొందుపరిచారు. రాజ్యాంగ నిర్మాణ వివరాలతోపాటు ఉద్యమ చరిత్ర, రాజ్యాంగ చరిత్రలో ముఖ్య ఘట్టాలు, రాజ్యాంగం ఏర్పడటానికి దారితీసిన చారిత్రక పోరాటాలు - పరిణామాలు, బ్రిటిష్ పాలకులు అనుసరించిన వ్యూహాలు తదితర వివరాలన్నీ ఈ పుస్తకంలో ఉన్నాయి. భారత రాజకీయ వ్యవస్థకు సంబంధించిన ప్రతి అంశాన్నీ సంపూర్ణంగా, వాద ప్రతివాదాల సమాచారంతో ఎంతో ప్రామాణికంగా రూపొందించారు. అదేవిధంగా ఇండియా వర్సెస్ భారత్, ఉమ్మడి పౌర స్మృతి- ఒకే దేశం ఒకే చట్టం, పౌరసత్వ సవరణ చట్టం- విమర్శ, ఆర్టికల్ 370 రద్దు- సుప్రీంకోర్టు తీర్పు, కొత్త పార్లమెంట్ భవనం- సెంగోల్ స్థాపన, జమిలీ ఎన్నికలు - రామ్‌నాథ్ కోవింద్ కమిటీ, కొత్త నేర న్యాయ చట్టాలు, సాధారణ ఎన్నికల ఫలితాలు- 2024పై విశ్లేషణ, ఎలక్టోరల్ బాండ్స్ వంటి సమకాలీన అంశాలను వివరంగా చర్చించారు. సమగ్రమైన రాజ్యాంగ విశ్లేషణను, భారత రాజకీయాలకు సంబంధించిన సమాచారాన్ని, చారిత్రక పరిణామాలను వివిధ పట్టికల రూపంలో చక్కగా అందించారు. ఈ పుస్తకం కేవలం ఏపీపీఎస్సీ, టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకే కాదు విద్యార్థులకు, అధ్యాపకులకు, న్యాయవాదులకు, స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే వారికి కరదీపిక వలె ఉపయోగపడుతుంది.



పుస్తకం పేరు: భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ (15వ ఎడిషన్)
పేజీలు: 1202(రెండు వాల్యూమ్స్ కలిపి)
వెల: రూ.899/-
ప్రతులకు: శ్రీ తేజ పబ్లికేషన్స్, గాంధీనగర్, హైదరాబాద్-500080
ఫోన్ నెం: 8686430054, 8686430055

నవ్య | చిత్రజ్యోతి

బ్రహ్మారాక్షసుడిలా...



తమిళ కథానాయకుడు ధనుష్ 50వ చిత్రం 'రాయన్'. ఈ సినిమాకు ఆయనే దర్శకుడు కూడా. సందీప్‌కిషన్, కాళిదాస్ జయరామ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. 'బ్రహ్మారాక్షసుడిలా వస్తాడు.. దహనం చేస్తాడు' అంటూ ధనుష్ పాత్రను పరిచయం చేశారు. యాక్షన్ ప్యాక్డ్ ఎలిమెంట్స్‌తో ట్రైలర్ అదిరిపోయింది. ఇందులో నటించిన సందీప్‌కిషన్, ప్రకాశ్‌రాజ్, ఎస్.జె.సూర్య, కాళిదాస్ జయరామ్ ముఖ్య పాత్రలో కనిపించారు. ఆస్కార్ విన్నర్ ఏ.ఆర్.రెహమాన్ నేపథ్యం సంగీతం అలరించింది. పీటర్ హెయిన్ యాక్షన్ కొరియోగ్రఫీ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. ఈ నెల 26న 'రాయన్' చిత్రం విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను ఏషియన్ సురేశ్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ విడుదల చేయనుంది.

ఆ రోజులు మళ్లీ రాకూడదు



'గడచిన మూడేళ్ల ఎన్నో ఆటుపోట్లు చవి చూశాను. నా జీవితం తీవ్రమైన ఒడిదుడుకులతో గడిచింది. ఆ రోజులు నా జీవితంలో మళ్లీ రాకూడదు అని కోరుకుంటున్నాను' అని హీరోయిన్ సమంత అన్నారు. ఆమె ఇటీవలే ఓ మీడియా ఇంటర్వ్యూలో తన సినిమాలు, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. 'మన జీవితాల్లో కొన్ని సంఘటనలు చేదు అనుభవాలుగా విగిలిపోతాయి. ఎంత ప్రయత్నించినా మనం వాటిని ఆపలేం. అలాంటప్పుడు వాటిని అంగీకరించి, అధిగమిస్తూ ముందుకెళ్లడమే మనం చేయాల్సింది. కష్టకాలంలో ఆధ్యాత్మికత నాకు స్ఫూర్తినిచ్చింది. వ్యక్తిగతంగా, కెరీర్ పరంగా నాలో మంచి మార్పులకు కారణమైంది. ఈతరం ఎక్కువగా మానసిక అనారోగ్యానికి గురవుతోంది. ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవడం వల్ల ప్రశాంతంగా ఉండొచ్చు. ప్రస్తుతం నా జీవితం బావుంది. నేను మునుపటికన్నా బావున్నాను' అని సమంత చెప్పారు. కొత్త సినిమాల గురించి మాట్లాడుతూ 'ఈ ప్రపంచంలో నాకు బాగా ఇష్టమైన విషయం కెమెరా ముందు నిల్చోవడమే. ఆగస్టు నుంచి కొత్త సినిమా షూటింగ్‌లో పాల్గొంటాను. నా పాత్ర కోసం తర్ఫీదు అవుతున్నాను. విలువిద్య, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నాను. నేను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది. అందుకే కొత్త నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం ఉన్న కథలనే ఎంపిక చేసుకుంటున్నాను' అని ఆమె చెప్పారు. సమంత స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'లో నటిస్తున్నారు. ఆమె నటించిన 'హనీ-బన్నీ' వెబ్ సిరీస్ త్వరలో స్ట్రీమింగ్ అవనుంది.

ఇది సెలబ్రేట్ చేసుకోవాల్సిన విజయం




'నా సినీ జీవితంలో 200కు పైగా సినిమాలు చేశాను. అయితే వాటిలో అన్ని సినిమాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించి ఉండకపోవచ్చు. కానీ 'కల్కి 2898 ఏడీ' విజయాన్ని మాత్రం కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలి. సినిమా విడుదలైనప్పటి నుంచి నాకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి' అని నటుడు కమల్‌హాసన్ అన్నారు. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీసు దగ్గర సంచలన విజయాన్ని అందుకోవడంతో పాటు రూ. వెయ్యికోట్ల వసూళ్లను అధిగమించిన సందర్భంగా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన కమల్‌హాసన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ "కల్కి చిత్రానికి వసూళ్ల పరంగా వస్తున్న ఆదరణ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో యాస్కీన్ పాత్ర కోసం చాలా కసరత్తు జరిగింది. చాలా కష్టపడ్డాం. మేకప్ కోసం లాస్ ఏంజెల్స్ వెళ్లాం. మొదట్లో నా గెటప్ చూసి నాకే ఎబ్బెట్టుగా అనిపించినా, క్రమంగా ఉత్సాహం కలిగింది. రెండో భాగంలో నా పాత్ర నిడివి ఎక్కువగా ఉంటుంది. భారతీయ చిత్ర పరిశ్రమలోని దిగ్గజాలు అంతా ఈ చిత్రంలో కలసి నటించారు. ఒకప్పుడు సింగీతం శ్రీనివాసరావులా ఇప్పుడు నాగ్ అశ్విన్ కూడా ప్రేక్షకులను మాయ చేశారు. చిన్నపిల్లలు ఆటలో లీనమైపోయినట్లు పాత్రధారులందరూ తమ తమ పాత్రల్లో జీవించారు. సినిమా చూసిన ప్రేక్షకులు ఎంత సంతోషిస్తే మేము అంతగా సంతోషిస్తాం' అని పేర్కొన్నారు.

విలన్‌గా అభిషేక్ బచ్చన్



బాలీవుడ్‌లో ఒక్కో హీరో ఇప్పుడు విలన్‌గా మారుతున్నాడు. సంజయ్‌దత్, సైఫ్ అలీఖాన్, రణ్‌వీర్ సింగ్, బాబీ డియోల్.. ఇలా . తాజాగా ఈ జాబితాలోకి అభిషేక్ బచ్చన్ చేరబోతున్నారు. షారుఖ్‌ఖాన్ కొత్త చిత్రం 'కింగ్'లో అభిషేక్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయన తండ్రి అమితాబ్ స్వయంగా వెల్లడించడం విశేషం. 'ఇదే సమయం' అంటూ తనయుడు అభిషేక్‌కు అభినందనలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు అమితాబ్. గత ఏడాది 'జవాన్', 'పఠాన్' చిత్రాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ ఇచ్చిన షారుఖ్ ఖాన్ ఇప్పుడు 'కింగ్' చిత్రం కోసం సిద్ధమవుతున్నారు. ఆయన కుమార్తె సుహానా ఈ సినిమాలో మరో కీలక పాత్ర పోషించనున్నారు. తండ్రీ కూతుళ్లు కలసి నటిస్తున్న తొలి చిత్రం ఇదే. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న 'కింగ్' చిత్రానికి సుజయ్ ఘోష్ దర్శకత్వం వహిస్తున్నారు.

మాస్‌ను ఆకట్టుకునేలా...



రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్'లో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమాలో హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ నిర్మిస్తున్నారు. ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్ అందరికీ నచ్చడమే కాకుండా.. సినిమాపై అంచనాలను పెంచింది. మంగళవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'మార్ ముంతా చోడ్ చింత'ను మేకర్స్ విడుదల చేశారు. మాస్‌ను ఆకట్టుకునేలా ఈ సాంగ్‌లోని లిరిక్స్, డాన్స్ మూమెంట్స్ సాగాయి. ఈ పాటకు శ్యామ్ సాహిత్యం అందించగా రాహుల్ సిప్లిగంజ్, ధనుంజయ్ సీపాన, కీర్తన శర్మ ఆలపించారు. మణిశర్మ సంగీతం అందించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి

ముద్దు సీన్‌కు మూడు కట్స్



'యానిమల్ సినిమాలో బోల్డ్ సీన్స్‌లో పాల్గొని అందరి దృష్టినీ ఆకర్షించిన హాట్ గర్ల్ త్రిప్తి దిమ్రీ నటించిన తాజా చిత్రం 'బ్యాడ్ న్యూజ్'. విక్కీ కౌశల్ హీరోగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఈ నెల 19న విడుదల కానుంది. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో హీరోహీరోయిన్ల మధ్య ముద్దు సీన్లు మూడు ఉన్నాయట. ఈ మధ్యకాలంలో కిస్సింగ్ సీన్లను చూసీ చూడనట్లు వదిలేస్తున్న సెన్సార్ వారు 'బ్యాడ్ న్యూజ్' చిత్రం మీద కన్నెర్ర చేసి, కత్తెరకు పని చెప్పారట. విక్కీ, త్రిప్తి పై చిత్రీకరించిన ముద్దు సీన్లు మోతాదు మించి ఉన్నాయనీ, తగ్గించాలని సెన్సారు అధికారి చెప్పడంతో చేసేదేమీ లేక వాటిని తగ్గించి విడుదల చేస్తున్నారు. త్రిప్తి అభిమానులకు ఇది బ్యాడ్ న్యూసే కదూ!

పవర్‌ఫుల్ పాత్రలో



పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తి కథానాయకుడిగా రూపొందుతున్న తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'సర్దార్ 2'. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'సర్దార్' చిత్రానికి ఇది కొనసాగింపు. కొన్ని రోజుల క్రితమే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభమైంది. తాజాగా చిత్రబృందం అప్‌డేట్ ఇచ్చింది. నటుడు, దర్శకుడు ఎస్‌జే సూర్య ఈ చిత్రంలో పవర్‌ఫుల్ రోల్‌లో నటిస్తున్నట్లు మంగళవారం తెలిపింది. ఎస్. లక్ష్మణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి యువన్ శంకర్‌రాజా సంగీతం అందిస్తున్నారు.

ఆ రోజులు గుర్తొస్తున్నాయి



'ప్రతి సినిమాను ఎంతో ప్యాషన్‌తో తీసే నిర్మాత వేణుగోపాల్. ఆయనకు మంచి టేస్ట్ ఉంది. లవ్ స్టోరీస్ మీద పట్టుంది. ఈ సినిమా టీమ్‌ను, హీరోలను చూస్తుంటే నాకు 'ఈ నగరానికి ఏమైంది' రోజులు గుర్తుకు వస్తున్నాయి' అన్నారు హీరో విష్వక్‌సేన్. 'రోటీ కపడా రొమాన్స్' చిత్రంలోని 'గలీజ్' సాంగ్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సృజన్ కుమార్ బొజ్జం తో కలసి బెక్కం వేణుగోపాల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్ హీరోలుగా నటించిన ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ 'ఓ కొత్త పాయింట్‌ను ప్రేక్షకులకు చెప్పాలని ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ని నిర్మించాం. ఇటీవల కొంతమంది యూత్‌కి ఈ సినిమా చూపించాం. వారు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌తో మా కాన్ఫిడెన్స్ మరింత పెరిగింది' అన్నారు. ఆగస్టు 2న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మరో నిర్మాత సృజన్‌కుమార్ చెప్పారు.

ఆకట్టుకునే విజువల్స్‌తో... 'మా ఊరి జాతరలో'



అల్లరి నరేశ్, అమృత అయ్యర్ జంటగా నటిస్తున్న చిత్రం 'బచ్చల మల్లి'. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని రేకెత్తించాయి. మంగళవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'మా ఊరి జాతరలో' పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ ఫోక్ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ, విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. సింధూరి విశాల్, హరిగౌర ఆలపించగా, విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్ : చోటా కె ప్రసాద్, డీఓపీ : ఎం. రిచర్డ్ నాథన్.

రాజ్ తరుణ్‌కు నోటీసులు ?



సినిమా హీరో రాజ్ తరుణ్‌పై లావణ్య చేసిన ఫిర్యాదులో రాజ్ తరుణ్‌ను విచారించేందుకు నార్సింగ్ పోలీసులు సిద్ధమయ్యారు. రేపు విచారణకు హాజరు కావాలని రాజ్‌తరుణ్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆయన వాంగ్మూలాన్ని రికార్డ్ చేయడంతో పాటు పలు అంశాలపై ఆరా తీయనున్నారు. రాజ్ తరుణ్‌కు నోటీసులు ఇచ్చినట్లు మంగళవారం ప్రచారం జరిగింది. అయితే ఈ కేసులో నోటీసుల విషయంపై నార్సింగ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ కోసం సంప్రదించగా ఆయన స్పందించలేదు.

- నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

ముగ్గురు స్నేహితుల కథ



మక్కా శ్రీను, సుచిత్ర రాథోడ్, దిల్ రమేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఎస్.ఐ.కోదండపాణి'. రెంటాల నాగేంద్ర దర్శకత్వంలో మక్కా శ్రీదేవి నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ప్రీమియర్ షోను మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రెంటాల నాగేంద్ర మాట్లాడుతూ "కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా సినిమాను తెరకెక్కించాను. ముగ్గురు స్నేహితులు ఓ మర్డర్ మిస్టరీలో ఇరుక్కుని ఎలా బయటపడ్డారనేది సినిమా కథ" అని అన్నారు. "కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా ఇది. అందరినీ తప్పకుండా ఆకట్టుకుంటుంది" అని నిర్మాత శ్రీదేవి అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఉదయ్, కెమెరామెన్: సబరి, సంగీతం: సాల్మన్.

సమాజానికి అవసరమైన ఇండియా ఫైల్స్



తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అద్దంకి దయాకర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇండియా ఫైల్స్', ఇంద్రజ, సుమన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డాక్టర్ బొమ్మకు మురళి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ఆడియో వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రంలో నటిస్తున్న ప్రతీ ఒక్కరికీ నా అభినందనలు. ఈ మూవీ టీమ్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. ప్రస్తుత సమాజానికి ఇలాంటి చిత్రం అవసరం" అని చెప్పారు. "ఈ సినిమా విడుదల తర్వాత ఇలాంటి తరహా కథలు మరిన్ని తెరకెక్కుతాయి. మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది" అని ఎమ్మెల్యే అద్దంకి దయాకర్ చెప్పారు. "ప్రపంచంలో ప్రతీ మూలకు వెళ్లగలిగేది సినిమా మాత్రమే" అని దర్శకుడు బొమ్మకు మురళీ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక్, డీఓపీ: జి.ఎల్.బాబు, సంగీతం:ఎమ్.ఎమ్.కీరవాణి.

మంచి కంటెంట్‌తో రేవు



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి డాక్టర్ మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను డైరెక్టర్ బాబీ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ సినిమా విజువల్స్ బాగున్నాయి. మంచి కంటెంట్ ఉన్న ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది" అని అన్నారు. "ఇదొక విభిన్న తరహా సినిమా. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది" అని దర్శకుడు హరినాథ్ పులి చెప్పారు. ఈ సినిమాకు ఎడిటర్: శివ శర్వాని, డీఓపీ: రేవంత్ సాగర్, నిర్మాణ పర్యవేక్షణ: సీనియర్ జర్నలిస్ట్ ప్రభు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పర్వతనేని రాంబాబు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 17 జూలై 2024

యువర్ ఆనర్

పెళ్లి తరువాత భర్త ఇంటి పేరు జత అవుతుంది... సహజమే. కానీ ఆ పేరుతోనే తనను పిలుస్తానంటే ఒప్పుకోనంటోంది తహీరా కశ్యప్ ఖురానా. బాలీవుడ్ హీరో ఆయుష్మాన్ ఖురానా సతీమణి అయిన ఆమె... ఇటీవల విడుదలైన 'శర్మాజీకీ బేటీ'తో తొలిసారి ఓ చిత్రానికి దర్శకత్వం వహించింది. ఈ సందర్భంగా 'మిసెస్ ఖురానా'గా తనను సంబోధించడంపై అభ్యంతరం తెలిపిన ఆమె... 'నన్ను నన్నుగా గుర్తించండి' అంటూ అసహనం వ్యక్తం చేసింది.



నేను మిసెస్ ఖురానా ...కాదు

"ఆయుష్మాన్ భార్య సినిమా చేసింది' అని ఎందుకు రాస్తున్నారు? 'శర్మాజీ కీ బేటీ' చిత్రం నా కష్టానికి ఫలితం. కథ నాదే. దర్శకత్వం వహించిందీ నేనే. ఆయుష్మాన్ నా భర్త అన్నది తప్పు... తనకు ఈ సినిమాతో ఏ విధమైన సంబంధం లేదు' అంటూ సినిమా ప్రచార కార్యక్రమంలో ఒకింత ఆవేదన వ్యక్తం చేసింది తహీరా కశ్యప్. 'అయినా పేరు చివరన ఈ తోకలు ఎందుకని ప్రశ్నించింది. ఆయుష్మాన్, తహీరా చిన్ననాటి స్నేహితులు. చదువుకొనే రోజుల నుంచీ వారి స్నేహం... ప్రేమగా వికసించింది. కొన్నేళ్ల సాన్నిహిత్యం తరువాత 2008లో ఇరువురూ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. బాలీవుడ్‌లోని ముచ్చటైన జంటల్లో వీరిది ఒకటిగా చెప్పుకొంటారు. ఇప్పటికీ ఒకరంటే ఒకరికి తరగని ప్రేమ. నమ్మకం. వీరికి ఒక అబ్బాయి... ఒక అమ్మాయి.

'భగవంతుడి దయవల్ల మా ఇద్దరి మధ్య చాలా విషయాల్లో సారూప్యతలు ఉన్నాయి. కలిసి వాటిని ఆస్వాదిస్తాం. వయసుతోపాటు పరిణతి కూడా సహజం. దానివల్ల మన ఆసక్తులు, ఆలోచనల్లో మార్పులు సంభవించడం కూడా అంతే సహజం. ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించుకొంటూ ప్రేమగా సాగిపోతున్నాం. అదే మా బంధానికి బలమైన పునాది. ఇది వ్యక్తిగత జీవితం. కానీ వృత్తిగతంగా ఎవరి కష్టం వారిది' అంటుందామె.

అయితే తాను సినీ రంగం వైపు రావడానికి కారణం తన నిజజీవిత కథానాయకుడు ఆయుష్మాన్ కాదంటుంది తహీరా. కాలేజీ రోజుల్లో ఇద్దరూ కలిసి థియేటర్ వర్క్‌షాపుల్లో పాల్గొనేవారు. కొన్ని నాటకాలు కూడా వేశారు. ఒకరితో ఒకరు పోటీపడేవారు. ఆ నేపథ్యమే తనను సినిమా నిర్మాణం వైపు నడిపించిందంటోంది ఆమె.

మొహాలీలోని 'యాదవీంద్ర పబ్లిక్ స్కూల్‌'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన తహీరా... చండీఘడ్‌లోని 'పంజాబ్ విశ్వవిద్యాలయం' నుంచి జర్నలిజమ్ అండ్ మాస్ కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ చదివింది. అదే యూనివర్సిటీ నుంచి



మాస్‌కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ చేసింది. ముంబయి వెళ్లి 'బిగ్ 92.7 ఎఫ్‌ఎం'లో ప్రోగ్రామింగ్ హెడ్‌గా కెరీర్ ప్రారంభించింది. కొంత కాలం 'మిథిబాయి కాలేజీ'లో ప్రొఫెసర్‌గా మాస్ కమ్యూనికేషన్స్ పాఠాలు చెప్పింది. తరువాత అన్నిటినీ వదిలేసి రచన వైపు మళ్లింది. 2011లో 'ఐ ప్రామిస్' అనే పుస్తకం రాసింది. అది మొదలు 'సోల్డ్ అవుట్, క్రాకింగ్ ద కోడ్, 12 కమాండ్‌మెంట్స్ బీయింగ్ ద ఉమన్' తదితర పుస్తకాలు రాసి, రచయితగా పేరు తెచ్చుకుంది. అంతటితో ఆమె ఆగలేదు. 2017లో 'టోఫీ' అనే షార్ట్ ఫిలిమ్ తీసి దర్శకురాలయింది తహీరా. 2020లో 'జిందగీ ఇన్‌షార్ట్'తో పాటు మరో

> ఆఖరికి రివ్యూల్లో కూడా నన్ను 'దర్శకురాలు ఆయుష్మాన్ భార్య తహీరా' అంటూ రాశారు. నన్ను నన్నుగా ఎందుకు చూడరు? నేను తహీరా... తహీరా కశ్యప్. తహీరా ఖురానా లేదా మిసెస్ ఖురానా కాదు.

లఘుచిత్రం చేసింది.

ఇక తొలిసారి ఆమె రచించి, దర్శకత్వం వహించిన చలనచిత్రం 'శర్మాజీ కీ బేటీ'. ఈమధ్యనే ఓటీటీలో విడుదలైంది. మొదటి సినిమాతోనే ఆకట్టుకున్న తహీరా పనితనానికి ఎన్నో ప్రశంసలు అందుతున్నాయి.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలోనే తనను 'మిసెస్ ఖురానా'గా పేర్కొనడంపై ఆవేదన వ్యక్తం చేసింది.

"ఆఖరికి రివ్యూల్లో కూడా నన్ను 'దర్శకురాలు ఆయుష్మాన్ భార్య తహీరా' అంటూ రాశారు. నన్ను నన్నుగా ఎందుకు చూడరు? నేను తహీరా... తహీరా కశ్యప్. తహీరా ఖురానా లేదా మిసెస్ ఖురానా కాదు. ఒకప్పుడు ఇలాంటివి చూసి బాధపడేదాన్ని. కానీ ఇప్పుడు వాటన్నిటినీ దాటి, ఒక మహిళగా స్వయంశక్తితో నన్ను నేను అభివృద్ధి చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నాను. ఎవరు ఎలా సంబోధించినా పట్టించుకోదలుచుకోలేదు' అంటుంది తహీరా. కాగా, ఆమె చిత్రం పోస్టర్‌ను తన ఇన్‌స్టాలో షేర్ చేసిన ఆయుష్మాన్... తనను తాను 'తహీరా భర్త' అంటూ రాసుకున్నాడు. తద్వారా తన జీవిత భాగస్వామికి తగిన గౌరవం ఇచ్చాడు.

ఎప్పుడూ ఉల్లాసంగా, సంతోషంగా సాగిపోయే తహీరా జీవితాన్ని 2018లో బ్రెస్ట్ కేన్సర్ కుదిపేసింది. కానీ దాన్ని ధైర్యంగా ఎదుర్కొంది. ఆ మహమ్మారిని జయించింది. గత ఫిబ్రవరిలో ప్రపంచ కేన్సర్ దినం సందర్భంగా తహీరా పోరాటాన్ని అభిమానులతో పంచుకున్నాడు. 'ధీశాలి' అంటూ అభివర్ణించాడు.

'ద 12 కమాండ్‌మెంట్స్ ఆఫ్ బీయింగ్ ఏ ఉమన్' పుస్తకంలో కేన్సర్‌తో తాను ఎలా పోరాడిందీ వివరించింది తహీరా. తద్వారా కేన్సర్ బాధితుల్లో స్ఫూర్తి నింపేందుకే ఆ పుస్తకం రాసినట్టు ఓ సందర్భంలో చెప్పుకొచ్చిన తహీరా... జీవితంలో తనకంటూ ఒక ప్రత్యేకత ఉండాలని తపించేవారిలో ముందుంటుంది. •

న్యూస్ మేకర్

అగ్రరాజ్యం అమెరికా ఉపాధ్యక్ష పదవి అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన జె.డి వ్యాన్స్ అర్ధాంగి, ఉష చిలుకూరి మన తెలుగమ్మాయే! వృత్తిపరంగా లాయర్ అయిన ఉష గురించి, భర్త జె.డి వ్యాన్స్ రాజకీయ ఎదుగుదల వెనకున్న ఆవిడ ప్రమేయం గురించి తెలుసుకుందాం!



అమెరికాలో ఉషోదయం

మాజీ అమెరికా అధ్యక్షుడు, డొనాల్డ్ ట్రంప్, ఓహియో సెనేటర్, జెడి వ్యాన్స్‌ను, నవంబరులో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో ఉపాధ్యక్ష పదవికి అభ్యర్థిగా ప్రకటించడంతో, అందరి దృష్టి ఆయన సతీమణి ఉష చిలుకూరి మీదకు మళ్లింది. ఒకవేళ ఎన్నికల్లో ట్రంప్ గెలిస్తే, జెడి వ్యాన్స్ అమెరికా ఉపాధ్యక్షుడిగా ఎన్నికవుతాడు. 39 ఏళ్ల వ్యాన్స్, ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, పామర్రుకు చెందిన ఉష చిలుకూరిని, 2014లో పెళ్లి చేసుకున్నాడు. ఉష తండ్రి డాక్టర్, తల్లి గృహిణి. ట్రయల్ లాయర్, జ్యుడీషియల్ క్లర్క్ అయిన ఉష, వ్యాన్స్ రాజకీయ జీవితంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుకైన పాత్రను పోషించడం విశేషం.

లా స్కూల్‌లో లవ్

క్యాలిఫోర్నియాలోని శాండియాగోలో పెరిగిన ఉష, ఏల్ జోర్నల్ ఆఫ్ లా అండ్ టెక్నాలజీకి మేనేజింగ్ ఎడిటర్‌గా, ఏల్ లా జోర్నల్‌కు డెవలప్‌మెంట్ ఎడిటర్‌గా పని చేసింది. ఏల్ లా స్కూల్‌లో విద్యను అభ్యసించే సమయంలోనే వ్యాన్స్‌కూ, ఉషకూ పరిచయం ఏర్పడింది. తర్వాత 2014లో, కెంటకీలో వాళ్లిద్దరూ పెళ్లితో ఒక్కటయ్యారు. వీళ్లకు ముగ్గురు పిల్లలు. సెనేటర్ జెడి వ్యాన్స్ తన విజయంలో భార్య ఉష పాత్ర గురించి ఎన్నో సందర్భాల్లో కొనియాడుతూ ఉంటారు. 2016లో రాసిన తన మెమొయిర్, హిల్‌బిల్లీ ఎలిజీలో, జెడి వ్యాన్స్ తన భార్య గురించి వివరిస్తూ, ఆవిడను... "ఏల్స్ స్పిరిట్ గైడ్" అని పేర్కొనడం విశేషం. 'నేను ఎలా ప్రశ్నించాలో తెలియని ప్రశ్నలను ఆవిడ వెంటనే అర్థం చేసుకోగలుగుతుంది. అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఆవిడ నన్నెంతో ప్రోత్సహిస్తూ ఉంటుంది' అని రాసుకున్నారాయన.

ఆధ్యాత్మిక ప్రయాణంలో అండగా...

తన ఆధ్యాత్మిక, వృత్తి జీవితాల మీద ఉష ప్రభావం ఎంతో ఉందని జెడి వ్యాన్స్ కొన్ని ఇంటర్వ్యూల్లో స్పష్టం చేశాడు. ఒక సందర్భంలో వ్యాన్స్ మాట్లాడుతూ... 'నేను దేవుడిని నమ్మేవాడిని. కానీ నేనెలాంటి మతానికి చెందను. అప్పుడప్పుడూ ఇవాంజెలికల్ చర్చ్‌కు వెళ్తూ ఉండేవాడిని. కానీ 2010లో ఏల్‌లో అడుగు పెట్టినప్పుడు, నేను చర్చికి, దేవుడికీ దూరమయ్యాను. నిజానికి నన్ను నేను నాస్తికుడిగా చెప్పుకునేవాడిని. కానీ ఏల్‌లో ఉషను కలిసిన తర్వాత, తిరిగి భగవంతుని మళ్లీ విశ్వసించడం మొదలుపెట్టాను. 2014లో మా పెళ్లి హిందూ పూజారి సమక్షంలోనే జరిగింది. గత ఏడాది నుంచి నేను మళ్లీ చర్చికి వెళ్లడం మొదలుపెట్టాను. 2018లో కాథలిక్ చర్చిలో బాప్తిసం తీసుకున్నాను' అంటూ ఆధ్యాత్మిక ప్రయాణంలో భార్య తోడ్పాటు గురించి వ్యాన్స్ ఒక సందర్భంలో చెప్పుకొచ్చాడు. 'నేను క్రైస్తవుడిగానే పెరిగినా, ఎప్పుడూ బాప్తిసం తీసుకోలేదు. ఉష క్రైస్తవురాలు కాదు. అయినా భగవంతుని మీద నాకున్న విశ్వాసాన్ని ఆవిడ ప్రోత్సహించింది' అంటూ వ్యాన్స్ మరో సందర్భంలో వివరించాడు. భర్తకు తానందించిన తోడ్పాటు గురించి విష వివరిస్తూ... 'నేను మతపరమైన కుటుంబంలో పుట్టాను. మా తల్లితండ్రులు హిందువులు. నా జీవితంలో ఆధ్యాత్మిక ప్రభావాన్ని స్వయంగా చవి చూశాను. జెడి దేని కోసం వెతుకుతున్నాడో నాకు తెలుసు. కాబట్టే ఆయన విశ్వాసానికి దన్నుగా నిలిచి, ప్రోత్సహించాను' అంటూ చెప్పుకొచ్చింది ఉష. •

రాజకీయ సహచరిగా...

తన భర్త రాజకీయ జీవితంలో కీలక పాత్ర పోషించిన ఉష, భర్తతో రాజకీయ వేడుకలకు హాజరవడంతో పాటు, 2016, 2022లో జెడి వ్యాన్స్ రాజకీయ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని, ఆయనకు నిరంతర సహాయసహకారాలు అందిస్తూ ఉండేది. ఉష తల్లితండ్రులు సైతం వ్యాన్స్ రాజకీయ ప్రస్థానానికి మద్దతిస్తూ, ప్రచార వేడుకల్లో పాల్గొంటూ ఉంటారు. ఉష 2015 నుంచి 2017 వరకూ ముంగర్ టోల్స్, ఓల్సన్ ఎల్‌ఎల్‌పిల్లో న్యాయవాదిగా పని చేసింది. ఆ తర్వాత, 2018లో యుఎస్ సుప్రీం కోర్టులో లా క్లర్క్‌గా కూడా సేవలందించింది.



వివక్షను దాటి... సాధికారత వైపు

విద్యార్థినుల్లో నెలసరి సమస్యలపై అవగాహన పెంచడం నుంచి... పర్యావరణ పరిరక్షణ, ఉపాధి కల్పన వరకూ... అహంగర్ జహీదాది స్ఫూర్తిమంతమైన ప్రయాణం. కట్టుబాట్లు, వివక్షల వలయాల్ని దాటి... మహిళా సాధికారతకు సారథిగా నిలుస్తున్నారు ఈ 27 ఏళ్ల కశ్మీరీ మహిళ.



"ఒకవైపు ఉగ్రవాద భయం... మరోవైపు సామాజికమైన కట్టుబాట్లు... ఇంటా, బయటా వివక్ష. వీటన్నిటిమధ్యా నా బాల్యం ఎంతో గందరగోళంగా సాగింది. మాది కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా పట్టాన్ గ్రామం. ఆడపిల్లలను బడికి పంపడానికి కూడా చాలా కుటుంబాలు ఇష్టపడేవి కావు. ఇలాంటి పరిస్థితుల మధ్య... హైస్కూల్‌లో అడుగుపెట్టాను. అప్పుడే ప్రారంభమైన నెలసరి సమస్య నన్ను ఎంతో ఇబ్బంది పెట్టేది. నేను, నా తోటి విద్యార్థినులు పాత వస్త్రాలనే శానిటరీ నేప్‌కిన్లుగా వాడేవాళ్లం. చాలామంది నెలసరి రోజుల్లో స్కూల్‌కు వచ్చేవారు కాదు. ఇళ్లలో ఆంక్షల కారణంగా... కొందరు చదువు మానేసేవారు. నిజం చెప్పాలంటే... ఇంట్లో పెద్దవాళ్లు కూడా పీరియడ్స్ గురించి మాట్లాడడానికి ఇష్టపడేవారు కాదు. ఏమైనా అడిగితే కసురుకొనేవారు. అత్యంత సాధారణమైన రుతుక్రమం గురించి బాలికల్లో అవగాహన కలగకపోవడానికి ఇదే ప్రధాన కారణం. అందుకే... కాలేజీ రోజుల నుంచి పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని.

> మహిళలు, యువత కోసం సొంతంగా ఏదైనా చెయ్యాలనుకున్నాను. 2016లో 'స్టాండ్ ఫర్ కశ్మీరీ యూత్'(స్కై) అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించాను. కొందరు స్నేహితులతో కలిసి... పాఠశాలలకు వెళ్లి... నెలసరిపై అపోహల గురించి అమ్మాయిలకు వివరిస్తున్నాను.

రోజుకో గ్రామంలో...

చదువు పూర్తయ్యాక... మహిళల కోసం, యువత కోసం సొంతంగా ఏదైనా చెయ్యాలనుకున్నాను. 2016లో 'స్టాండ్ ఫర్ కశ్మీరీ యూత్' (స్కై) అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించాను. ఇది ప్రభుత్వేతర, రాజకీయేతర సంస్థ. కొందరు స్నేహితులతో కలిసి... పాఠశాలలకు వెళ్లి... నెలసరిపై ఉండే అపోహల గురించి అమ్మాయిలకు వివరించడం ద్వారా మా కార్యక్రమాలు మొదలయ్యాయి. క్రమంగా మాతో కలిసి పని చెయ్యడానికి చాలామంది ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఒక రోజుకో, ఒక వారానికో ఆ ఉత్సాహం వారిలో తగ్గిపోయేది. దాంతో సేవను సీరియస్‌గా తీసుకొనేవాళ్లనే ఎంపిక చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. కనీసం మూడు నెలల నుంచి ఏడాది వరకూ వాళ్లు గ్రామాల్లో పని చెయ్యడానికి వీలుగా ప్రణాళిక రూపొందించాను. మహిళల శారీరక, మానసిక ఆరోగ్యం, సాధికారత, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. ఇప్పుడు బారాముల్లా, బుడ్గాం, బండిపోరా తదితర జిల్లాల్లో 150 మందికి పైగా వాలంటీర్లు మా 'స్కై' తరఫున పని చేస్తున్నారు. వీరు ప్రతి రోజూ ఒక గ్రామాన్ని సందర్శించి... మహిళలను కలుసుకుంటారు. నెలసరి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చెబుతారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, గృహహింసను ఎదుర్కోవడంపై సూచనలు చేస్తారు.



ప్రభుత్వ సంస్థలు, ఎన్జీవోలతో కలిసి వర్క్‌షాపులు, సెమినార్లు, శిక్షణ శిబిరాలు కూడా నిర్వహిస్తున్నాం. మాతో కలిసి పనిచేసేలా ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నాం. వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. వ్యక్తిగతంగా ఎంత చైతన్యం ఉన్నా... ఆర్థికంగా స్థిరపడడం ప్రధానమనేది నా నమ్మకం. మహిళలకోసం ఎన్నో ప్రభుత్వ పథకాలు ఉన్నాయి. కానీ వాటి ప్రయోజనాలను అందుకోవడం అతి పెద్ద సవాల్. దీనికోసం ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకోవడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ప్రతి ఒక్కరికీ కనీస ఆదాయం ఉండేలా మేము చేస్తున్న ప్రయత్నాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఇక... బారాముల్లా జిల్లాలోని అన్ని అప్పర్ సెకెండరీ పాఠశాలల్లో ఉచిత శానిటరీ ప్యాడ్ వెండింగ్ మిషన్లను ఏర్పాటు చేయాలంటూ నేను వేసిన పిటిషన్‌కు సానుకూల స్పందన వచ్చింది. ఇప్పటికే దాదాపు వందకు పైగా పాఠశాలల్లో అవి ఏర్పాటయ్యాయి. మరికొన్ని చోట్ల రాబోతున్నాయి. నాకూ, మా సంస్థకూ ఎన్నో అవార్డులు, అభినందనలు దక్కాయి. కానీ చిన్నప్పుడు నేను పడినలాంటి ఇబ్బందులు... ఆ బడుల్లోని పిల్లలకు ఇక ఉండవనే ఆలోచనకన్నా ఎక్కువ సంతృప్తి కలిగించినది మరేదీ లేదు.

సౌర విద్యుత్ దిశగా...

కశ్మీర్ పర్యావరణం విలక్షణమైనది. కానీ కాలుష్యం కారణంగా వాతావరణ మార్పులు వేగంగా సంభవిస్తున్నాయి. వాటిని నిరోధించడం కోసం క్లైమెట్ ఫ్రెండ్స్ ఫెలోషిప్'ను ప్రారంభించాం. వాతావరణ మార్పులు మన జీవితాలపైనా, భవిష్యత్ తరంపైనా ఎలాంటి దుష్ప్రభావాలు కలిగిస్తాయో ప్రజలకు వివరిస్తున్నాం. గ్రామాల్లో సౌర విద్యుత్ వాడకాన్ని ప్రోత్సహించడానికి 'గ్రీన్ ఎంటర్‌ప్రెన్యూర్' అనే కార్యక్రమాన్ని మొదలుపెట్టాం. బిందీ ఇంటర్నేషనల్ సంస్థ ద్వారా సోలార్ ప్యానెల్స్ తయారీలో, వాటిని అమర్చడంలో, నిర్వహణలో స్థానిక మహిళలకు శిక్షణ ఇప్పించాం. నేను కూడా శిక్షణ పొంది, మరికొందరికి నేర్పుతున్నాను. ఇది స్థానిక మహిళల ఉపాధికి దోహదపడుతోంది. మరోవైపు సౌర విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. పర్యావరణ పరిరక్షణ దిశగా ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. అవగాహన పెంచుకోవడం, అవకాశాలు అందిపుచ్చుకోవడం... ద్వారానే సాధికారత సాధ్యమవుతుంది. సమాజం అభివృద్ధి సాధించాలంటే... యువతకు, మహిళలకు తగిన అవకాశాలు అందాలి. అందుకే నేను చేపట్టే కార్యక్రమాలన్నీ ప్రధానంగా వారి కోసమే." •

ఫ్యాషన్







ఒంటికి హత్తుకున్నట్టు కనిపించే దుస్తుల ట్రెండ్ క్రమంగా మారుతోంది. తాజాగా వదులుగా ఉండే, ఓవర్‌సైజ్ డ్రస్సుల ట్రెంట్ ఊపందుకుంటోంది. దాన్లో ఓవర్‌సైజ్ బ్లేజర్స్ లేటెస్ట్ ఫ్యాషన్. ఆలియా భట్, ప్రియాంకా చోప్రా లాంటి బాలీవుడ్ అగ్ర తారలు అనుసరిస్తున్న ఈ తాజా ట్రెండ్ మీద ఓ లుక్కేద్దాం!

ఓవర్‌సైజ్ మీద ఓ లుక్కేద్దాం!

పవర్ డ్రస్సింగ్‌లో భాగంగా....

పవర్ డ్రస్సింగ్ కాలక్రమేణా కొత్త పుంతలు తొక్కుతోంది. లాంగ్ స్కర్ట్, ట్రౌజర్స్, ఈవినింగ్ గౌన్‌లను ఓవర్‌సైజ్ బ్లేజర్స్‌తో జత చేయడం ఫ్యాషన్‌గా మారింది. అటు ఆఫీస్ వేర్‌గా, ఇటు ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా రెండు విధాలా మహిళల ఆదరణకు నోచుకుంటోంది ఓవర్‌సైజ్ బ్లేజర్స్ ట్రెండ్. సౌకర్యంగా ఉండడంతో పాటు, చూపులకు ఫ్యాషనబుల్‌గా కనిపిస్తూ ఉండడంతో వర్కింగ్ విమెన్ వీటి మీద మక్కువ చూపుతూ ఉండడం విశేషం.

యాక్సెసరీస్ ఇలా...



ఓవర్‌సైజ్ బ్లేజర్స్ తయారీలో ప్రముఖ కంపెనీలన్నీ కొత్త పోకడలను అనుసరిస్తూ ఉన్నాయి. మరీ ముఖ్యంగా ననూష్క, ఎంపోరియో అర్మానీ, కామె డెస్ గార్కన్స్, బ్యాలెన్సియాగా కంపెనీలు మహిళలు ధరించే ఓవర్‌సైజ్‌డ్ బ్లేజర్ల తయారీలో ముందంజలో ఉంది. షార్ట్స్, ట్రౌజర్స్, లాంగ్ గౌన్స్‌తో కలిపి ధరించే ఈ బ్లేజర్స్ హుందాగా, ఆధునికంగా కనిపిస్తాయి. వీటికి తోడుగా హీల్స్, బూట్స్ ధరించవచ్చు. చేతిలో హ్యాండ్ బ్యాగ్, బ్రీఫ్ కేస్ నిండుదనాన్ని అందిస్తాయి. ఈ రకం దుస్తులతో సింపుల్ జ్యూవెలరీ చక్కగా మ్యాచ్ అవుతుంది. •





హై రిస్క్ పెట్టుబడుల కోసం కొత్త అసెట్ క్లాస్

● కనీస పెట్టుబడి రూ.10 లక్షలు ● గరిష్ఠం రూ.50 లక్షలు
● ఎంఎఫ్, పీఎంఎస్ మధ్య అంతరాన్ని పూడ్చేందుకే..

ప్రవేశపెట్టే యోచనలో సెబీ



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్), పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్) మధ్య అంతరాన్ని పూడ్చేందుకు కొత్త అసెట్ క్లాస్‌ను ప్రవేశపెట్టాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మంగళవారం ప్రతిపాదించింది. అధిక రిస్క్ తీసుకోగలిగే ఇన్వెస్టర్ నుంచి కనీసం రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల స్థాయి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ అసెట్ క్లాస్‌ను ఏర్పాటు చేయాలనుకుంటోంది.అయితే, రూ.10 లక్షల కనీస పెట్టుబడి పరిమితి ద్వారా అధిక రిస్క్ తీసుకోలేని చిన్న మదుపరులను ఈ అసెట్ క్లాస్‌కు దూరంగా ఉంచనుంది. అనధికారిక, అన్ రిజిస్టర్డ్ పీఎంఎస్ ప్రొవైడర్ల సేవలందుకుంటున్న వారి పెట్టుబడులను కొత్త అసెట్ క్లాస్ వైపు మళ్లించడమే తమ ఉద్దేశమని చర్చా పత్రంలో సెబీ పేర్కొంది. ఎంఎఫ్ నిర్మాణంలోనే కొత్త అసెట్ క్లాస్‌ను ప్రవేశపెట్టనున్నట్లు, క్రమానుగత పెట్టుబడుల (సిప్) వెసులుబాటు కూడా కల్పించనున్నట్లు తెలిపింది. అంతేకాదు, నూతన అసెట్ క్లాస్ ఇన్వెస్టర్లు డెరివేటివ్‌ల్లోనూ పెట్టుబడులు పెట్టే అవకాశం కల్పించాలనుకుంటోంది.

రీట్స్, ఇన్విట్స్ నిబంధనల సవరణ

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్స్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్స్).. యూనిట్ బేస్డ్ ఎంప్లాయ్‌మెంట్ బెనిఫిట్ పథకాన్ని అమలు చేసేందుకు సెబీ విధివిధానాలను జారీ చేసింది. రీట్స్, ఇన్విట్స్ ఎంప్లాయీ బెనిఫిట్ ట్రస్ట్‌కు ఏ విధంగా యూనిట్లను కేటాయించాలి.. ట్రస్ట్‌లు ఏ విధంగా యూనిట్లను స్వీకరించాలనే విషయాలను కొత్త నియమావళి ద్వారా తెలియజేసింది.

పేటీఎంకు సెబీ హెచ్చరిక

డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌కు సెబీ హెచ్చరిక లేఖ జారీ చేసింది. ఆడిట్ కమిటీ లేదా షేర్‌హోల్డర్ల ఆమోదం లేకుండానే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్)తో 2021-22 ఆర్థిక సంవత్సరంలో నెరిపిన రిలేటెడ్ పార్టీ ట్రాన్సాక్షన్స్‌కు సంబంధించి సెబీ ఈ లేఖలో హెచ్చరించింది. దాంతో పేటీఎం షేరు బీఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ.459.75 వద్ద ముగిసింది.

గూగుల్ చేతికి విజ్?

న్యూయార్క్:సైబర్ సెక్యూరిటీ కంపెనీ విజ్‌ను కొనుగోలు చేసేందుకు గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ చర్చలు జరుపుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ డీల్ విలువ 2,300 కోట్ల డాలర్లు (రూ.1.93 లక్షల కోట్లు) ఉండవచ్చని అంచనా. ఇంటర్నెట్ దిగ్గజం ఆల్ఫాబెట్ చరిత్రలోనే ఇది అతి పెద్ద డీల్ కానుంది. ఎక్కువ మొత్తం నగదు రూపంలో చెల్లించే విధంగా ఈ డీల్ ఖరారు కావచ్చని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్‌లో ఏర్పాటై ప్రస్తుతం న్యూయార్క్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న విజ్ ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఒకటి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా సైబర్ భద్రతకు సంబంధించిన ముప్పులను గుర్తించి, క్లౌడ్ ఆధారితంగా తక్షణ పరిష్కారాలు ఈ కంపెనీ అందిస్తుంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నాయకత్వంలో టెక్నాలజీ పరిశ్రమపై నియంత్రణాపరమైన నిఘా పెరిగిన వాతావరణంలో ఆల్ఫాబెట్ కుదుర్చుకోబోతున్న ఈ డీల్ అసాధారణమైనదిగా నిలుస్తుందంటున్నారు.

తెలంగాణలో విన్ గ్రూప్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్?

హైదరాబాద్: వియత్నాంకు చెందిన విన్ గ్రూప్ తెలంగాణలో స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో లేదా నగరానికి దగ్గర్లో 1,000 ఎకరాల్లో మెగా స్మార్ట్ సిటీని అభివృద్ధి చేయాలనుకుంటోంది. అనువైన స్థలం కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. విన్‌గ్రూప్‌కు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ కంపెనీ విన్‌ఫాస్ట్ ఇప్పటికే తమిళనాడులో ఇంటిగ్రేటెడ్ ఈవీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేసింది. కాగా, తెలంగాణలో స్మార్ట్ సిటీ అభివృద్ధితోపాటు ఈవీ విడిభాగాలను సైతం తయారు చేయాలనుకుంటోంది. ఇందుకోసం విన్‌ఫాస్ట్ ఇండియా మేనేజ్‌మెంట్ గతవారం తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబును కలిసినట్లు తెలిసింది.

త్వరలో జికా, కేఎఫ్‌డీ వ్యాక్సిన్లు : ఐఐఎల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) మరో రెండు సరికొత్త వ్యాక్సిన్లను అభివృద్ధి చేస్తోంది. జికా, కేఎఫ్‌డీ వ్యాక్సిన్లను అభివృద్ధి చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఇందులో జికా వ్యాక్సిన్‌ను విష క్రిముల కాటు కారణంగా గర్భస్థ శిశువుల్లో ఏర్పడే బుద్ధి మాంద్యం నివారణకు ఉపయోగిస్తారు. ఇక అంటువ్యాధుల బారిన పడిన జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే ప్రాణాంతక వ్యాధుల కట్టడికి కేఎఫ్‌డీ (క్రైసనూర్ ఫారెస్ట్ డిసీజ్) వ్యాక్సిన్లను ఉపయోగిస్తారు. కాగా వియత్నాంలోని ఐదు రాష్ట్రాల్లో వినియోగం కోసం 10,000 డోసుల యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను అందించిన సందర్భంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో ఐఐఎల్ చైర్మన్ డాక్టర్ మీనేశ్ షా, ఎండీ డాక్టర్ ఆనంద్ కుమార్ ఈ విషయాలు వెల్లడించారు.

సీఏల కోసం ఏఐ సర్టిఫికెట్ కోర్సు

ఐసీఏఐ ప్రెసిడెంట్ రంజిత్ అగర్వాల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) కూడా కృత్రిమ మేధ (ఏఐ) బాట పట్టింది. తన సభ్యుల (సీఏ) కోసం ప్రత్యేక ఏఐ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించింది. హైదరాబాద్‌లో ఐసీఏఐ నిర్వహిస్తున్న ఏఐ ఇన్నోవేటివ్ సదస్సు (ఏఐఎస్ 2024)కు హాజరైన ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు రంజిత్ కుమార్ అగర్వాల్ విలేకరులతో ఈ విషయం చెప్పారు. అకౌంటింగ్, ఆడిటింగ్‌కు సంబంధించి ఒక జాతీయ సంస్థ ఏఐ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించడం ప్రపంచంలో ఇదే తొలిసారని తెలిపారు. ఈ కోర్సు ద్వారా ఐసీఏఐ సభ్యులకు అకౌంటింగ్, ఆడిటింగ్‌కు సంబంధించిన సమకాలీన ఏఐ టూల్స్‌పై అవగాహన ఏర్పడుతుందన్నారు.

ఏఐ ఆధారిత అకౌంటింగ్ టూల్స్ ఎన్ని అందుబాటులోకి వచ్చినా అవి సీఏలకు ప్రత్యామ్నాయం కావని అగర్వాల్ స్పష్టం చేశారు. సరైన నిర్ణయాలు తీసుకోవడం, కంపెనీల అకౌంటింగ్, ఆడిటింగ్‌లో జరిగే మోసాలను వెంటనే గుర్తించడం, నిబంధనల అమలు విషయంలో సీఏలకు సాయపడేందుకు త్వరలో ఒక ఆడిట్ టూల్‌ను తీసుకురాబోతున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖతో కలిసి పని చేస్తున్నట్టు తెలిపారు. ఐసీఏఐ సీఏ జీపీటీ టూల్ దేశంలో సీఏ కోర్సు చేసే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అగర్వాల్ చెప్పారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,020 ▲	67,850 ▲	99,500 ▼
ముంబై	73,339 ▲	67,179 ▲	92,014 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	102	విజయవాడ	110
వరంగల్	102	గుంటూరు	110
కరీంనగర్	102	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	117
కర్నూలు	102	నెల్లూరు	117
విశాఖపట్నం	102	అనంతపురం	110
గోదావరి	110		

ఎస్‌బీఐకి సాయిశ్రీ ఇంజనీర్స్ రూ.15 కోట్లు టోకరా

సంస్థ ఎండీ నుంచి రూ.3 కోట్లు జప్తు చేసిన ఈడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో వ్యవసాయేతర భూమిని సెక్యూరిటీగా చూపి నకిలీ పత్రాలతో రూ.15 కోట్లు రుణం తీసుకుని ఎస్‌బీఐ (గతంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్)ను మోసం చేసిన కేసులో నిందితుడి నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు రూ.3.11 కోట్ల స్థిరాస్తులు జప్తు చేశారు. సాయిశ్రీ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఈపీఎల్) యాజమాన్యం కుట్రపూరితంగా నకిలీ పత్రాలతో ఈ రుణం తీసుకుంది. వ్యాపార అవసరాలకు కాకుండా ఆ నిధులు దారి మళ్లించి తిరిగి చెల్లించకుండా మోసగించారని ఎస్‌బీఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ చెన్నై బ్రాంచ్ ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్ కేసు నమోదు చేసింది. సాయిశ్రీ ఇంజనీర్స్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన సీబీఐ చెన్నై అధికారులు దర్యాప్తు చేపట్టారు. నిధుల మళ్లింపుపై 2020 డిసెంబర్ 21న చార్జిషీట్ నమోదు చేశారు. మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టింది. బ్యాంకు నుంచి రుణంగా తీసుకున్న మొత్తాన్ని కంపెనీ ఎండీ సాగిరాజు సూర్యనారాయణ రాజు ఆంధ్రా బ్యాంక్ ఖాతాలోకి మళ్లించినట్టు ఈడీ అధికారులు గుర్తించారు.

బజాజ్ ఆటో లాభం రూ.1,942 కోట్లు

న్యూఢిల్లీ: బజాజ్ ఆటో.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,942 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.1,644 కోట్లు)తో పోల్చితే లాభం 18 శాతం వృద్ధి చెందింది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అమ్మకాలు గణనీయంగా పెరగటం ఎంతగానో కలిసివచ్చిందని కంపెనీ పేర్కొంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం రెవెన్యూ రూ.10,312 కోట్ల నుంచి రూ.11,932 కోట్లకు పెరిగింది.

ఫేమ్-3 సిద్ధమవుతోంది..

కేంద్ర మంత్రి కుమారస్వామి

న్యూఢిల్లీ: దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఫేమ్-3 పథకం రూపొందిస్తున్నదని, సమీప భవిష్యత్తులోనే దాన్ని అమలుపరిచే ఆస్కారం ఉన్నదని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డి కుమారస్వామి చెప్పారు. అయితే రాబోయే బడ్జెట్లో మాత్రం దీన్ని ప్రతిపాదించబోరని ఆయన స్పష్టం చేశారు. భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మూడో దశ ఫేమ్ పథకం రూపకల్పన పనులు జరుగుతున్నాయని, వివిధ మంత్రిత్వ శాఖలు తమ తమ సిఫారసులు అందించాయని మంత్రి చెప్పారు. హైబ్రిడ్ వాహనాలపై పన్ను తగ్గింపు అంశం గురించి ప్రస్తావించగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రోడ్ మ్యాప్‌పై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటారని, ఆ తర్వాత దాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ అమలుపరుస్తుందని తెలిపారు.

2 లక్షల మంది నిపుణులు అవసరం: 2030 నాటికి ఈవీల వినియోగం 30 శాతానికి పెంచాలన్న ప్రభుత్వ విజన్ సాకారం కావాలంటే 2 లక్షల మంది నిపుణులైన కార్మిక శక్తి అవసరమని సియామ్ అంటోంది. కార్మిక శక్తిని నియమించుకుని శిక్షణ ఇవ్వడంపై రూ.13,552 కోట్లు పెట్టుబడి అవసరం కావచ్చని అంచనా వేసింది.

మూడో రోజూ రికార్డుల మోత

● 81,000 దిశగా సెన్సెక్స్ ● 24,600 ఎగువకి నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. ఎఫ్ఎంసీజీ, టెలికాంతోపాటు కొన్ని ఐటీ రంగ షేర్లలో కొనుగోళ్లు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు ఇందుకు దోహదపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 233.44 పాయింట్లు ఎగబాకి 80,898.30 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 51.69 పాయింట్ల లాభంతో 80,716.55 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఆరంభ సెషన్‌లో 74.55 పాయింట్లు పెరిగి 24,661.25 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 26.30 పాయింట్ల లాభంతో 24,613 వద్ద కొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, కోటక్ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు మార్కెట్ లాభాలను పరిమితం చేశాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 18 లాభపడ్డాయి.

● ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర రూ.550 పెరిగి రూ.75,700 వద్దకు చేరుకోగా.. కిలో వెండి రూ.400 పెరుగుదలతో రూ.94,400 పలికింది.

నేడు మార్కెట్లకు సెలవు

మొహర్రం సందర్భంగా బీఎస్ఈ, ఎన్ఎస్ఈ బుధవారం సెలవు పాటించనున్నాయి. గురువారం నుంచి మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

స్పోర్ట్స్

టీ20 కెప్టెన్‌గా సూర్యకుమార్?

వన్డే సిరీస్‌కు హార్దిక్ దూరం



న్యూఢిల్లీ: భారత టీ20 జట్టు కెప్టెన్ ఎంపికపై జాతీయ సెలెక్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. టీ20 వరల్డ్‌కప్‌లో వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించిన హార్దిక్ పాండ్యానే కెప్టెన్‌గా కొనసాగిస్తారని అంతా భావించినా.. కోచ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఆలోచనలు మరోలా ఉన్నాయి. పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాల రీత్యా డాషింగ్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్‌వైపే వీరు మొగ్గు చూపుతున్నారు. ఈనెలాఖరున ఆరంభమయ్యే శ్రీలంక సిరీస్‌తో పాటు 2026 టీ20 మెగా టోర్నీ వరకు సూర్యకే పగ్గాలు అప్పగించే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఇప్పటికే హార్దిక్‌కు కూడా చెప్పినట్టు సమాచారం. గతేడాది సూర్య ఆసీస్, దక్షిణాఫ్రికాలపై ఎనిమిది మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం ఉంది. అలాగే తను డ్రెస్సింగ్‌రూమ్‌లో సహచరులతో కలివిడిగా ఉంటాడనే పేరుంది. మరోవైపు లంకతో వన్డే సిరీస్‌కు పాండ్యా వ్యక్తిగత కారణాలతో అందుబాటులో ఉండడం లేదు.

స్టార్ క్రికెటర్లు దేశవాళీల్లో ఆడాల్సిందే..

స్టార్ క్రికెటర్లు కూడా దేశవాళీ టోర్నీలకు అందుబాటులో ఉండాలని బీసీసీఐ కార్యదర్శి జైషా స్పష్టం చేశాడు. అయితే రోహిత్, విరాట్, బుమ్రా మాత్రం వారికిష్టమైతే ఆడవచ్చని తెలిపాడు. ఇతర టెస్టు స్పెషలిస్టులు మాత్రం దులీప్ ట్రోఫీలో కనీసం ఓ మ్యాచ్‌లోనైనా ఆడాల్సిందేనన్నాడు. ఈసారి దులీప్ ట్రోఫీ ఆటగాళ్లను జోనల్ సెలెక్షన్ కమిటీ కాకుండా జాతీయ సెలెక్షన్ కమిటీనే ఎంపిక చేయనుంది.

పసిడి పంచ్ పడేనా?




పారిస్ ఒలింపిక్స్‌కు మొత్తం ఆరుగురు భారత బాక్సర్లు అర్హత సాధించారు. వీరిలో నలుగురు మహిళా బాక్సర్లు కాగా.. ఇద్దరు పురుషులు. మేరీకోమ్ శకం ముగియడంతో.. తమదైన ముద్ర వేయడానికి యువ బాక్సర్లకు ఇదో సువర్ణావకాశం. ముఖ్యంగా మేరీ వల్ల ఎన్నో అవకాశాలను కోల్పోయిన తెలుగు బాక్సర్ నిఖత్ జరీన్.. అంతర్జాతీయస్థాయిలో మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. ఈ క్రమంలో ఆమెపై భారీ అంచనాలుండగా.. టోక్యో కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్ ఈసారి పతకం రంగుమార్చాలన్న పట్టుదలతో ఉంది. అమిత్ పంగల్, నిషాంత్ దేవ్ కూడా సత్తా చాటాలనుకొంటున్నారు. మొత్తమ్మీద మన 'సూపర్ సిక్స్' బంపర్ హిట్ కొట్టాలన్న సంకల్పంతో ఉన్నారు.

నిఖత్ జరీన్

మేరీ కోమ్ శకం ముగియంతో.. నిఖత్ జరీన్ భారత బాక్సింగ్‌కు ముఖచిత్రంగా మారింది. 50 కిలోల విభాగం బరిలోకి దిగుతున్న నిఖత్‌పై భారీ అంచనాలున్నాయి. గతంలో ఇదే కేటగిరీలోకి మేరీ రావడంతో జరీన్‌కు చాన్సులు దక్కలేదు. మేరీ ఈసారి దూరమవడంతో.. 28 ఏళ్ల నిఖత్‌కు తొలిసారి ఒలింపిక్స్ ఆడే చాన్స్ లభించింది. ఆసియా క్రీడల్లో కాంస్యం నెగ్గడంతో జరీన్‌కు పారిస్ బెర్త్ ఖరారైంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వరుసగా 2 స్వర్ణాలు నెగ్గి జోరు మీదున్న నిఖత్ విశ్వక్రీడల్లోనూ సత్తా చాటేందుకు సిద్ధమైంది.

ప్రీతి పవార్



హరియాణాకు చెందిన 20 ఏళ్ల ప్రీతి పవార్ సంచలనాలు సృష్టించాలన్న పట్టుదలతో ఉంది. అంతగా అనుభవం లేకున్నా.. పెద్ద ఈవెంట్లలో మెరుగైన ప్రదర్శన చేస్తోంది. ఆసియా క్రీడల క్వార్టర్స్‌లో మూడు సార్లు వరల్డ్ చాంపియన్ జైనా షెకర్‌బెకోవాను ఓడించి సెమీస్ చేరడం ద్వారా.. పారిస్ బెర్త్ పట్టేసింది. ఖేలో ఇండియా, ఆసియా యూత్ చాంపియన్‌షిప్‌లో పతకాలు కొల్లగొట్టిన ప్రీతి.. 54 కిలోల విభాగం నుంచి పారిస్‌లో పోటీపడుతోంది.

నిషాంత్ దేవ్



పురుషుల్లో పారిస్ ఒలింపిక్ బెర్త్ సాధించిన తొలి భారత బాక్సర్ నిషాంత్ . వరల్డ్ క్వాలిఫయర్స్-2లో 71 కిలోల విభాగం క్వార్టర్స్‌లో గెలిచి విశ్వక్రీడలకు ఎంపికయ్యాడు. గాయాలతో ఇబ్బందులు పడినా వెరవకుండా పోరాడి పారిస్ టికెట్ సాధించిన ఈ ఆర్మీ కుర్రాడు.. ఒలింపిక్స్‌లోనూ పతకం నెగ్గాలన్న పట్టుదలతో ఉన్నాడు.

లవ్లీనా బోర్గొహైన్



టోక్యో విశ్వక్రీడల్లో కాంస్యం దక్కించుకొన్న అసోం బాక్సర్ లవ్లీనా.. వరుసగా రెండోసారి మెగా ఈవెంట్‌కు అర్హత సాధించింది. గతంలో 69 కిలోల విభాగంలో లవ్లీనా తలపడగా.. ఈ ఒలింపిక్స్‌లో ఆ వెయిట్ కేటగిరీని రద్దు చేశారు. దీంతో ఆమె 75 కిలోల విభాగంలో ఆసియాడ్ రజతంతో విశ్వక్రీడల చాన్స్ పట్టేసింది. ఇటీవలి కాలంలో ఆసియా, వరల్డ్ చాంపియన్‌షిప్ స్వర్ణాలతో మెరిసిన లవ్లీనా.. పారిస్‌లో తన పతకరంగును మార్చాలనుకుంటోంది.

పారిస్ ఒలింపిక్స్ 9 రోజుల్లో

జాస్మిన్ లంబోరియా



హరియాణా అమ్మాయి జాస్మిన్ లంబోరియాకు అదృష్టవశాత్తూ పారిస్ చాన్స్ లభించింది. 57 కిలోల కేటగిరీలో బెర్త్ దక్కించుకొన్న పర్వీన్ హుడా డోపింగ్ నిబంధనల్ని ఉల్లంఘించడంతో ఆమెపై వేటు పడింది. ఈ పరిస్థితుల్లో పర్వీన్ స్థానంలో జాస్మిన్ 60 కిలోల కేటగిరీ నుంచి 57 కిలోల విభాగానికి మారి ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో తలపడి పారిస్ బెర్త్ పట్టేసింది. ఇక, ఈ చాన్స్‌ను వదలొద్దనుకుంటోంది.

అమిత్ పంగల్



ఆశలు వదులుకొన్న సమయంలో అమిత్‌కు అనూహ్యంగా అవకాశం దక్కింది. వాస్తవంగా భారత బాక్సింగ్ సమాఖ్య దీపక్ బోరియావైపు మొగ్గుచూపింది. అయితే, తొలి క్వాలిఫయర్స్‌లో దీపక్ విఫలమవడంతో పంగల్‌కు చాన్స్ లభించింది. రెండో క్వాలిఫయర్స్‌లో అమిత్ క్వార్టర్స్ చేరి 51 కిలోల విభాగంలో ఒలింపిక్స్‌కు ఎంపికయ్యాడు. ఇతడు పతకం నెగ్గుతాడన్న నమ్మకం క్రీడా వర్గాల్లోనూ బలంగా ఉంది. టోక్యో క్రీడల్లోనూ పాల్గొన్న ఈ హరియాణా బాక్సర్.. పారిస్ నుంచి కచ్చితంగా పతకంతోనే రావాలనుకుంటున్నాడు.


మురికి నదిలో స్విమ్మింగ్ ఎలా?



పారిస్: ఫ్రాన్స్ రాజధాని పారిస్‌ను రెండుగా చీల్చుకుంటూ వెళ్లే సెన్ నదిపై ఇప్పుడు అందరి దృష్టీ నెలకొంది. ఒలింపిక్స్‌లో భాగంగా ఇందులోనే ట్రయాథ్లాన్, మారథాన్ స్విమ్మింగ్ పోటీలు జరగాల్సి ఉంది. అయితే అదే ఇప్పుడు సమస్యగా మారింది. ఎందుకంటే.. ఓ శతాబ్దానికి పైగా సెన్ నదిలో ఈత కొట్టడంపై నిషేధం కొనసాగుతోంది. ఆ నదిలో నీటి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉండడమే దీనికి కారణం. వరద, మురికి నీరు అధికంగా చేరుతుండడంతో 1923 నుంచే ఇందులోకి ఎవరినీ అనుమతించడం లేదు. బ్యాక్టీరియాతో నిండిన ఆ జలాలు పొరపాటున నోట్లోకి వెళితే మనిషి తీవ్ర అనారోగ్యానికి గురవడం ఖాయం. ఈనేపథ్యంలో ఈత కోసం స్విమ్మర్లను అందులోకి ఎలా అనుమతిస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ సమస్య పరిష్కారం కోసం నది ప్రక్షాళనకై పారిస్ వేల కోట్లను ఖర్చు చేసినా నాణ్యత విషయంలో ఆశించిన ఫలితం కనిపించలేదు. ఇందులోకి మురికి నీటిని రాకుండా ఆపేందుకు ఆస్టర్లిట్జ్ రైల్వే స్టేషన్ పక్కన భారీ భూగర్భ నీటి నిల్వ బేసిన్‌ను సైతం నిర్మించారు. ఇది 20 ఒలింపిక్ స్విమ్మింగ్‌పూల్‌లకు సమానంగా ఉంటుంది. అందులో మురికి నీటిని శుద్ధి చేయనున్నారు. ఒకవేళ భారీ వర్షాలు కురిస్తే సెన్ ప్రవాహం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ట్రయాథ్లాన్ వేదికను మార్చే ఆలోచనలో నిర్వాహకులున్నారు.

యశ్వంత్ మరో సాహసం

మౌంట్ కాంగ్ యాట్సేను అధిరోహించిన తెలంగాణ కుర్రాడు



హైదరాబాద్: పర్వతారోహణలో ఇప్పటికే ఎన్నో రికార్డులు సాధించిన తెలంగాణకు చెందిన భూక్యా యశ్వంత్ మరో ఘనత అందుకున్నాడు. తాజాగా లద్దాఖ్ ప్రాంతంలోని 6,250 మీటర్ల ఎత్తులో ఉన్న మౌంట్ కాంగ్ యాట్సే 2 పర్వతాన్ని విజయ వంతంగా అధిరోహించాడు. ఈ సాహసయాత్రను 8 రోజుల్లో ముగించాడు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ ప్రాంతంలోని భూక్యా తండాకు చెందిన గిరిజన యువకుడైన యశ్వంత్.. ఇప్పటికే దక్షిణా ఫ్రికాలోని కిలిమంజారో, రష్యాలోని ఎల్‌బ్రస్, ఆస్ట్రేలియాలోని కొసిజ్‌స్కో, హిమాచల్‌లోని యునమ్‌లాంటి పర్వతాలతో పాటు ఎవరెస్ట్ బేస్‌క్యాంప్‌ను అధిరోహించాడు. అలాగే మౌంట్ ఎవరెస్ట్‌ను కూడా అధిరోహించడం తన లక్ష్యమని యశ్వంత్ తెలిపాడు.

కెప్టెన్ అయ్యాక కోహ్లీ మారిపోయాడు!



అమిత్ మిశ్రా

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ కెప్టెన్ అయ్యాక చాలా మారాడని, అతడికి స్నేహితులు కూడా తక్కువేనని వెటరన్ స్పిన్నర్ అమిత్ మిశ్రా వ్యాఖ్యానించాడు. కానీ తాజా కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం అలా కాదని, ఎవరితోనైనా సరదాగా ఉంటాడని కితాబిచ్చాడు. 'నాకు విరాట్ చిన్నప్పటినుంచే తెలుసు. కానీ జట్టు కెప్టెన్ అయ్యాక అతనిలో చాలా మార్పు కనిపించింది. నేనిప్పుడు తనతో గతంలో ఉన్నంత చనువుగా లేను. దాదాపుగా మాట్లాడుకోవడమే లేదు. అయితే క్రికెటర్‌గా విరాట్‌ను గౌరవిస్తాను. ఓ వ్యక్తికి పేరు, డబ్బు వచ్చాక అతడి దగ్గరికి ఇతరులు ఏదో ఆశించే వెళతారని భావిస్తారు. కానీ రోహిత్ స్వభావం విరాట్‌కు పూర్తి భిన్నం. నేను చాలా ఏళ్లుగా జట్టులో లేకపోయినా.. కెరీర్ ఆరంభంలో నాతో ఎలా ఉన్నాడో ఇప్పటికీ అలాగే ఉంటాడు. ఐపీఎల్‌లో కానీ బయట ఎక్కడ కనిపించినా సరదాగా మాట్లాడుతాడు' అని అమిత్ వివరించాడు. అలాగే గతేడాది ఐపీఎల్‌లో లఖ్‌నవూ పేసర్ నవీనుల్‌ను కోహ్లీనే మొదట దుర్భాషలాడాడని, అలాంటి వ్యక్తిని అతడు ముున్ముందు ఎలా గౌరవిస్తాడని ప్రశ్నించాడు.


హర్భజన్ క్షమాపణ



న్యూఢిల్లీ: 'తౌబా తౌబా' పాటకు దివ్యాంగులను అనుకరిస్తూ చేసిన వీడియో వివాదస్పదమవడంతో మాజీ ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ క్షమాపణ చెప్పాడు. ఇటీవల ముగిసిన వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) టోర్నీ ఫైనల్లో పాకిస్థాన్‌పై గెలిచిన ఆనందంలో భారత వెటరన్స్ జట్టు సభ్యులైన యువరాజ్ సింగ్, సురేష్ రైనా, హర్భజన్ 'తౌబా తౌబా' పాటకు దివ్యాంగుల రీతిలో స్టెప్పులేశారు. ఈ వీడియోపై సోషల్ మీడియాలో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాలని దివ్యాంగ న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు మండిపడడంతో హర్భజన్ 'ఎక్స్' వేదికగా క్షమాపణ కోరాడు. 'ఈ వీడియో ఎవరినీ కించపర్చడానికి చేయలేదు. మేమెంత అలసిపోయామో తెలియజేయడానికి పెట్టింది. ఒకవేళ ఎవరినైనా బాధిస్తే అందుకు క్షమాపణ చెబుతున్నా. నా సోషల్ మీడియా ఖాతా నుంచి ఆ వీడియోను తొలగించా. ఈ విషయాన్ని ఇంతటితో వదిలేయండి' అని హర్భజన్ అన్నాడు.



మంత్రివర్గ సమావేశంలో సీఎస్ నీరబ్, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి అచ్చెన్న



'జె'భూతం వెంటాడుతోంది!

- ఇసుక వ్యవహారాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు తలదూర్చవద్దు. చెడ్డపేరు తెచ్చుకోవద్దు. గత ప్రభుత్వం మాఫియా తరహాలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలు చేసింది. మనకు అటువంటి పనులు అక్కర్లేదు.
- భూములు, గనుల దోపిడీ ఎంత జరిగిందో సమాచారం సేకరించడానికి సమయం పడుతోంది. అధికారులు అంత వేగంగా కదలడం లేదు.

- కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు

- పారిశ్రామికవేత్తల్లో ఇంకా ఆందోళన పోలేదు
- కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్య

అమరావతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టాలని పారిశ్రామికవేత్తలు ఆసక్తితో ఉన్నా వారిని 'జె(జగన్)' భూతం వెంటాడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఆ భయం పోగొట్టడానికి చేయాల్సిందంతా చేస్తున్నామని కూడా అన్నట్లు సమాచారం. 'పరిశ్రమలు పెట్టాలని మనం కోరుతుంటే వారు సానుకూలంగానే స్పందిస్తున్నారు. కానీ భూతం మళ్లీ వస్తుందేమోనన్న భయం వారిలో కనిపిస్తోంది' అని మంగళవారమిక్కడ సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పేర్కొన్నట్లు తెలిసింది. భూతాన్ని సీసాలో బంధించి తిరిగి పైకి లేవకుండా రాష్ట్ర ప్రజలు భూమిలో పాతిపెట్టారని చెప్పాలని ఒక మంత్రి సూచించినప్పుడు మిగిలిన మంత్రులంతా నవ్వేశారు. 'మిగిలిన విషయాలు ఎలా ఉన్నా.. తాము స్వేచ్ఛగా ఉన్నామన్న అనుభూతి రాష్ట్ర ప్రజల్లో వచ్చింది. భయం పోయింది. ఈ విషయంలో మన పట్ల ఉన్న సానుకూలతను మన పనితీరుతో మరింత పెంచుకోవాలి. ప్రతి మంత్రీ పనితీరును మెరుగుపరచుకోవాలి. నేర్చుకోవడాన్ని చిన్నతనంగా భావించొద్దు. నేను కూడా తెలియని విషయాలను అడిగి తెలుసుకుంటాను. మీరు కూడా మీ శాఖలపై బాగా అవగాహన పెంచుకోండి. ప్రజలు ఎన్నో ఆశలతో మనల్ని గెలిపించారు. వాటిని మనం అందుకోవాలి. ప్రతి శాఖలో చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. అదే సమయంలో ఆర్థిక సమస్యలూ ఉన్నాయి. నిధులు అవసరం లేని సమస్యలుంటే ముందు వాటిని పరిష్కరించండి. మీ పనిలో మీ కుటుంబాల జోక్యం లేకుండా చూసుకోండి' అని సీఎం మంత్రులకు సూచించారు.

ఉచిత ఇసుక శాశ్వత విధానం

ఉచిత ఇసుక శాశ్వత విధానమని, టీడీపీ ప్రభుత్వం ఉన్నంత కాలం ఇదే విధానం అమల్లో ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు. వెల్లడించారు. అవసరమైనప్పుడు మరింత మెరుగుపరుస్తామే తప్ప విధానంలో మార్పు ఉండదన్నారు. ఇసుక తవ్విన ఖర్చులు, పంచాయతీలకు సీనరేజీ చెల్లింపు తప్పవని, ఇంటి వరకూ ఇసుక రావాలంటే రవాణా ఖర్చు ఎవరికి వారు భరించాలని తేల్చిచెప్పారు. ప్రభుత్వం ఇసుకపై పైసా కూడా ఆదాయం తీసుకోదని, గతంలో మాదిరిగా 'జె' ట్యాక్స్ ఉండదని తెలిపారు. అవసరానికి ఇసుక తప్ప.. అమ్మకానికి కాదని, ఈసారి అవకతవకలకు తావు లేకుండా అమలు చేయాలని సూచించారు. వానాకాలంలో ఇసుక కొరతను అధిగమించే మార్గాలపై మంత్రివర్గం చర్చించింది. బోటు సొసైటీల ద్వారా వచ్చే ఇసుక, నదుల్లో పూడిక తీయడం ద్వారా వచ్చే ఇసుకతో ఈ లోటు భర్తీ చేస్తామని అధికారులు వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో భూములు, గనుల దోపిడీపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. ఎంత దోపిడీ జరిగిందో సమాచారం సేకరించడానికి సమయం పడుతోందని, అధికారులు అంత వేగంగా కదలడం లేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. క్షేత్ర స్థాయి నుంచి ఈ సమాచారం సేకరించాలని నిర్ణయించామన్నారు. ఈ దోపిడీలో భాగస్వాములై జేబులు నింపుకొన్న వారిని ఏం చేయాలన్నదానిపై సమావేశంలో పలు సూచనలు వచ్చాయి. 'మనం ఏదో ఒకటి గాలివాటంగా మాట్లాడవద్దు. ప్రభుత్వంలో ఉన్నాం. ఏం చేసినా బాధ్యతగా చేయాలి. ఈ దోపిడీపై ఏం చేయాలో మీరు కూడా ఆలోచించండి. అందరం కలిసి నిర్ణయం తీసుకుందాం' అని సీఎం కోరారు. బియ్యం స్మగ్లింగ్ వ్యవహారంలో తెర వెనుక ఉన్నవారిపై కూడా కఠిన చర్యలు ఉండాలన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. 'వైసీపీ హయాంలో నాటి కాకినాడ ఎమ్మెల్యే తండ్రి పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్. తమ్ముడు రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు. ఒకే కుటుంబంలో ఇన్ని పదవులు ఇస్తారా? అందరూ కలిసిపోయి పేదల నుంచి చాలా తక్కువ రేటుకు రేషన్ బియ్యం కొని కిలో రూ.43కు విదేశాలకు ఎగుమతి చేశారని మనకు అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తాం. ఇందులో కూడా మీకేమైనా ఆలోచనలు ఉంటే ఇవ్వండి' అని మంత్రులను చంద్రబాబు కోరారు. పరిపాలనలో ప్రమాణాలు పెంచడానికి 'గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గుడ్ అడ్మినిస్ట్రేషన్' అనే సంస్థను నెలకొల్పే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు.

పింఛన్ల పంపిణీలో మనం పాల్గొనాలి..

ఆగస్టు 1న పేదలకు పింఛన్ల పంపిణీలో కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పాలు పంచుకోవాలని చంద్రబాబు సూచించారు. 'పోయిన నెల ఒకేసారి రూ.7 వేలు ఇవ్వడం ప్రభుత్వానికి చాలా మంచి పేరు తెచ్చింది. పింఛన్లకు ఏడాదికి రూ.35 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నాం. ఇంత ఖర్చు చేస్తున్నప్పుడు పంపిణీ సమయంలో మనం ప్రజల్లో ఉండాలి' అని చెప్పారు. పథకాలన్నీ ఒకేసారి అమలు చేయడం కాకుండా నెలకొకటి అమల్లోకి తెస్తామన్నారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్లు వంద వరకూ ప్రారంభించాలని అనుకుంటున్నామని, ఆ రోజుకు ఎన్ని సిద్ధమైతే అన్ని ప్రారంభిస్తామని చెప్పారు. నైపుణ్య గణన ప్రారంభిస్తున్నామని, మెగా డీఎస్సీ పనులు కూడా మొదలయ్యాయని తెలిపారు.

కొన్ని బయటకు చెప్పలేం!

చంద్రబాబు ఢిల్లీ యాత్ర విషయం కూడా కేబినెట్ భేటీలో ప్రస్తావనకు వచ్చింది. 'దేని కోసం వెళ్తున్నామో కొన్ని చెప్పేవి ఉంటాయి. మరి కొన్ని బయటకు చెప్పలేం. ప్రజాప్రయోజనాలు తప్ప ఢిల్లీలో మనకు వేరే పనులు లేవు. రాష్ట్రం కోసమే తిరుగుతున్నాం' అని ఆయన మంత్రులకు వివరించారు.

పంటల బీమాపై వైసీపీ మోసం..


పంటల బీమా పథకం ఎలా ఉండాలో ఖరారు చేసేందుకు వ్యవసాయం, ఆర్థిక, పౌర సరఫరాల శాఖల మంత్రులతో కమిటీని వేస్తూ ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సమయం తక్కువ ఉన్నందున ముందుగా ఈ ఏడాది వరకూ ఈ విధానం ఎలా ఉండాలో ఈ కమిటీ చెప్పాల్సి ఉంటుంది. ఆ తర్వాత మిగిలిన సంవత్సరాలకు నిర్ణయిస్తారు. గత టీడీపీ హయాంలో బీమా ప్రీమియంలో 40 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రం, మిగతా 20 శాతం రైతులు భరించేవారు. వైసీపీ ప్రభుత్వం మొత్తం తానే భరిస్తానని హడావుడి చేసినా రెండు మూడేళ్లుగా పైసా కూడా చెల్లించకుండా మోసం చేసింది.

మరో 4 నెలలకు ఓటాన్ అకౌంట్..!

అమరావతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత తాత్కాలిక బడ్జెట్‌ను మరో నాలుగు నెలలపాటు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల తర్వాత దీనిపై ఆర్డినెన్స్ జారీచేస్తారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై వరకు ఓటాన్ అకౌంట్ (తాత్కాలిక బడ్జెట్)ను ఆమోదించింది. దాని గడువు ఈ నెలతోనే ముగుస్తోంది. నెలాఖరులోపు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలి. కానీ ఇంత తక్కువ సమయంలో బడ్జెట్ తయారుచేయలేమని, తమకు ఇంకొంత సమయం కావాలని ఆర్థిక శాఖ అధికారులు కోరారు. దీంతో ఓటాన్ అకౌంట్‌ను పొడిగించాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఈ నెలాఖరులో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం తీసుకోవచ్చు. కానీ శాసనమండలిలో టీడీపీకి ప్రస్తుతం మెజారిటీ లేదు. అక్కడ బడ్జెట్ బిల్లును పెండింగ్‌లో ఉంచితే ఆగస్టు 1 నుంచి ప్రభుత్వం పైసా కూడా ఖర్చు చేయలేని పరిస్థితి ఎదురవుతుంది. ఆర్థిక బిల్లులను తిరస్కరించే అధికారం మండలికి లేదు. అయితే కొంతకాలం పెండింగ్‌లో ఉంచడానికి అవకాశం ఉంటుంది. ఈ నెల 26తో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసే అవకాశం ఉంది. ఆ వెంటనే అసెంబ్లీని ప్రొరోగ్ చేసి ఆర్డినెన్స్ జారీ చేయించాలని నిశ్చయించారు.

టైటిలింగ్ చట్టం రద్దు

(మొదటి పేజీ తరువాయి)



కూర్చోబెట్టేందుకు అవకాశం కల్పించే విధంగా మార్పులు చేసిందని మంత్రి చెప్పారు. ఈ చట్టం ప్రకారం సివిల్ కోర్టుల ప్రమేయాన్ని పూర్తిగా తుడిచివేసినట్లవుతుందని.. టీఆర్వో దగ్గర సమస్య ఉత్పన్నమైతే వ్యవయ ప్రయాసల కోర్చి నేరుగా హైకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి అని తెలిపారు. 'టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారులు చేసే వారసత్వ ఆస్తుల బదలాయింపులు సివిల్ కోర్టుల ద్వారా చేయవచ్చు. ఈ చట్టం అమల్లోకి వస్తే ప్రస్తుతమున్న రిజిస్ట్రేషన్ వ్యవస్థ, రెవెన్యూ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ కనుమరుగయ్యే ప్రమాదముంది. స్టేక్‌హోల్డర్స్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా హడావుడిగా ఈ చట్టం చేశారు. ఇది ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేస్తుంది. భూయజమానులు సంఘ విద్రోహ శక్తుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడేలా చేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఈ చట్టంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కేబినెట్, ప్రజా ప్రజాప్రతినిధులపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు' అని వెల్లడించారు. గత రబీ సీజన్‌లో సేకరించిన వరి ధాన్యానికి 84 రోజులు గడిచినా సొమ్ము చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం తాత్సారం చేసింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు బకాయిపడ్డ సొమ్ము రూ.1,000 కోట్లు చెల్లించినట్లు మంత్రి చెప్పారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించే పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ఆహార, పప్పు ధాన్యాలను సేకరించి జాతీయ ఆహార భద్రత చట్టానికి అనుగుణంగా తెల్ల రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలకు రాయితీ ధరలకు ఇస్తోందని.. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ధాన్య సేకరణకు రుణం తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రజలకు ఉచితంగా ఇసుక లభించేలా చూడడం, ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టడం, పర్యావరణ హితం కోరుతూ సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్‌జీటీ ఇచ్చిన మార్గదర్శకాల మేరకు కొత్త ఇసుక విధానం (2024) రూపొందించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మక గుల్బెంకియన్ అవార్డు వచ్చిందని, ఇది వ్యవసాయ రంగంలో నోబెల్ ప్రైజ్‌తో సమానమని, ఈ అవార్డు కింద రూ.9 కోట్లు వచ్చిందని చెప్పారు. ఈ ప్రకృతి సేద్యం 2018లో 5 లక్షల హెక్టార్లతో ప్రారంభమైందని.. 10 లక్షల మంది రైతులు ఇందులో భాగస్వాములయ్యారని అన్నారు. ఎలాంటి రసాయనాలు వినియోగించకుండా చేస్తున్న ప్రకృతి సేద్యాన్ని 2029 నాటికి 20 లక్షల హెక్టార్లకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రకృతి సేద్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికే మార్గదర్శిగా నిలిచి ఆదర్శప్రాయం అవుతుందని సీఎం అన్నట్లు తెలిపారు. కౌలు రైతులకు సులువుగా రుణాలు అందించే కొత్త విధానం తీసుకురావలసిన అవసరముందని కూడా ఆయన చెప్పారని.. ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు కేబినెట్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారని పార్థసారథి వెల్లడించారు.

మరిన్ని కేబినెట్ నిర్ణయాలివీ..

- గతంలో అమలు చేసిన ఇసుక, గనుల పాలసీ (2019), మరింత మెరుగైన ఇసుక విధానం (2021) రద్దు. ఉచిత ఇసుక యంత్రాంగం (2024) ఏర్పాటయ్యే వరకు ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు ఇసుక ఉచితంగా అందించే మధ్యంతర వ్యవస్థ ఏర్పాటు చేసేలా ఈ నెల 8న జారీచేసిన జీవో 43కు కేబినెట్ ఆమోదం.
- ఇప్పటి వరకు ఆయా సంస్థలతో ఉన్న ఒప్పందాలను నిలుపుదల చేయాలని.. ఇసుక నిల్వలను సంబంధిత అధికారులకు అప్పగించాలని మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్‌కు ఆదేశాలు.
- 2024-25 సంవత్సరానికి గాను ధాన్యం కొనుగోలు ప్రక్రియ కోసం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రూ.2 వేల కోట్ల రుణాన్ని వాణిజ్య బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చేందుకు ఆమోదం.
- అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మార్క్‌ఫెడ్.. ఎన్‌సీడీసీ నుంచి వర్కింగ్ కేపిటల్ సాయం కింద రూ.3,200 కోట్లు కొత్తగా రుణం తీసుకోవడానికి ప్రభుత్వ హామీ కోరుతూ వ్యవసాయ, సహకార శాఖ చేసిన ప్రతిపాదనకు అంగీకారం.
- ప్రస్తుతం అమల్లో ఉన్న ధాన్యం కొనుగోలు విధానంలోని లోపాలను సవరించి రైతులకు సులువైన విధానాలను రూపొందించాలి. ఈ నేపథ్యంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న పంటల బీమా చట్టాలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ఆర్థిక, పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖల మంత్రులతో కమిటీ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం. నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం.

విజయసాయిని అరెస్టు చేయాలి

- రూ.1.6కోట్లు ఇవ్వడంపై సీబీఐ విచారణ జరపాలి
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం



నెల్లూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): 'రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఆయన భార్య సునంద.. దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ శాంతి భర్త మదన్‌మోహన్‌కు రూ.1.6 కోట్లు ఎందుకిచ్చారు? ఈ విషయాన్ని స్వయంగా మదన్‌మోహనే చెప్పారు. ఈ డబ్బులను విల్లా కోసం ఇచ్చారా? లేదా శాంతి సీమంతానికి ఇచ్చారా? ఒక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి చేతికి ఒక ఎంపీ అంత డబ్బు ఇచ్చారంటే ఆయన నేరానికి పాల్పడినట్లు స్పష్టమవుతోంది. వెంటనే విజయసాయిరెడ్డిని అరెస్టు చేయాలి. దీనిపై సీబీఐ విచారణ జరపాలి' అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడారు. శాంతి మాజీ భర్త మదన్‌మోహన్ ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరగాలని ఆనం డిమాండ్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయసాయి డీఎన్ఏ టెస్టుకు ఎందుకు ఒప్పుకోవడం లేదని నిలదీశారు. వైజాగ్‌లో భూదందాకు ఎస్టీ మహిళను పావులా వాడుకున్నారని, ఆమెను బ్లాక్ మెయిల్ చేసి భూములు కొట్టేశారని ఆనం ధ్వజమెత్తారు. ఈ రోజు ఆ ఇద్దరు ఎస్టీ భార్యాభర్తలు ఇరుక్కున్నారని, వారిద్దరు రోడ్డు మీదకు రావడానికి కారణం విజయసాయిరెడ్డే అని ఆరోపించారు. ఆయన చేసిన పాపానికి ఒక ఎస్టీ కుటుంబం నాశనమైందని ఆనం ఆవేదన వ్యక్తం చేశారు. విజయసాయిరెడ్డి గతంలో కొలంబియాకు వెళ్లారని, ఎవరితో వెళ్లారన్న విషయాలు బయటకు వస్తే ఈ వ్యవహారంలో స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. వైజాగ్‌లో విజయసాయిరెడ్డి ఏమైనా పాపిష్టి పనులు చేసి ఉంటే మహిళలు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. 'నెల్లూరులో హత్యలు చేసి జైలుకు వెళ్లిన కుటుంబం విజయసాయిరెడ్డిది. అటువంటి మీడియా సంస్థలను, రిపోర్టర్లను బెదిరించేలా మాట్లాడారు. బెయిల్ మీద తిరుగుతున్న ఆయన ఆ బెయిల్ కండీషన్లను ఉల్లంఘించారు. ఇకపై బయట ఉంటే జనాలను కూడా భయపెడతారు. వెంటనే విజయసాయిరెడ్డి బెయిల్ రద్దు కోరుతూ కోర్టులో సీబీఐ పిటిషన్ వేయాలి' అని డిమాండ్ చేశారు.

సాయిరెడ్డీ.. కమ్మవాళ్లు వైసీపీలో ఉండకూడదా?

- పార్టీలో మేం ద్వితీయశ్రేణి పౌరులమా..!
- ప్రభుత్వ మాజీ సలహాదారు ఎస్ రాజీవ్‌కృష్ణ

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తనపై వచ్చిన ఆరోపణలపై స్పందిస్తూ కమ్మ కుల ప్రస్తావన తేవడాన్ని ఎస్. రాజీవ్‌కృష్ణ తీవ్రంగా తప్పుపట్టారు. ఆయన తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త. వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి. వైసీపీ ప్రభుత్వానికి సలహాదారుగా పనిచేశారు. విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'మీపై కొందరు వ్యక్తులు ఆరోపణలు చేశారు. వాటిని సరైన పద్ధతిలో ఖండిస్తూ మిమ్మల్ని మీరు రక్షించుకునే హక్కు మీకు ఉంది. ఆ క్రమంలో ఓ కులాన్ని కించపరుస్తూ మాట్లాడారు. మీపై ఆరోపణలు చేసిన వ్యక్తుల గురించి మాట్లాడండి.. కులం గురించి ఎందుకు? నాతో సహా చాలా మంది కమ్మ కులస్థులు వైసీపీకి, వైఎస్ జగన్‌కు సేవ చేస్తున్నాం. మీ వ్యాఖ్యలతో పార్టీలో మేం ద్వితీయ శ్రేణి పౌరులమన్న భావన కలుగుతోంది. వైసీపీలో కమ్మవాళ్లు ఎవరూ ఉండకూడదు, పార్టీని సమర్థించకూడదన్నది మీ అభిప్రాయమా? ఏ రాజకీయ పార్టీ విజయానికైనా అన్ని కులాల, మతాల, వర్గాల మద్దతు అవసరమన్నది మీకు తెలియనది కాదు. ఇలాంటి వ్యాఖ్యలతో పార్టీకి నష్టం జరుగుతుంది' అన్నారు.

ఏపీ ప్రకృతి సేద్యం ప్రపంచ దేశాలకు ఆదర్శం

- వ్యవసాయ మంత్రి అచ్చెన్న

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఏపీలో ప్రకృతి సేద్య విధానాలు ప్రపంచదేశాలకు ఆదర్శంగా నిలుస్తాయని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఏపీసీఎన్ఎఫ్‌కు గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటీ అవార్డు అందుకుని పోర్చుగల్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చిన రైతుసాధికార సంస్థ వైస్ చైర్మన్ విజయకుమార్, వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ మంగళవారం అమరావతి సచివాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాలకూ ప్రకృతి సేద్యంపై ఏపీ సూచనలు చేసే స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు.

పెద్దిరెడ్డి 'సెటిల్‌మెంట్'కు బ్రేక్

- 982 ఎకరాలపై కమిషనర్ ఆఫ్ సర్వే సెటిల్‌మెంట్స్‌కు రివిజన్ పిటిషన్ వేయండి
- చిత్తూరు కలెక్టరు ఆదేశాలు
- చంద్రబాబు రాగానే రిజిస్ట్రేషన్ల నిలిపివేత

(చిత్తూరు, ఆంధ్రజ్యోతి)

చిత్తూరు జిల్లా పుంగనూరులో ఇష్టారాజ్యం వ్యవహరించిన అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అడ్డగోలు 'సెటిల్‌మెంట్' భూ దందాలకు బ్రేక్ పడింది. రాగానిపల్లెలో రూ.100 కోట్లు విలువ చేసే 982 ఎకరాల ప్రభుత్వ అనాధీన భూముల్ని.. నాటి మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాలతో ఆయన అనుచరులకు అప్పటి అధికారులు కట్టబెట్టిన వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. రాగానిపల్లె పట్టాల విషయాన్ని కమిషనర్ ఆఫ్ సర్వే సెటిల్‌మెంట్స్‌కు రివిజన్ పిటిషన్ వేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తాజాగా పుంగనూరు తహసీల్దార్‌ను ఆదేశించారు. లీగల్‌గా పర్ఫెక్ట్‌గా ఉండాలని జీపీ సాయంతో పుంగనూరు తహసీల్దార్ పిటీషన్‌ను సిద్ధం చేస్తున్నారు. మరో రెండు మూడు రోజుల్లో కమిషనర్ ఆఫ్ సర్వే సెటిల్‌మెంట్స్‌కు పంపించనున్నారు. పట్టాలు పొందిన రైతులకు కమిషనర్ నుంచి నోటీసులు అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మొత్తం 982 ఎకరాల్ని వివాదాస్పద భూముల కింద పేర్కొని పక్కన పెట్టేయనున్నారు. ఇప్పటికే ఈ 982 ఎకరాల్ని రిజిస్ట్రేషన్లు జరగకుండా ఆపాలని చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్‌కు ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. అధికారంలో ఉన్న ఐదేళ్లూ పెద్దిరెడ్డి రాజ్యమే ఇక్కడ నడవడంతో.. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటి చిత్తూరు జిల్లా జేసీ, ప్రస్తుత తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్.. పెద్దిరెడ్డి ఆదేశాలను అమలు చేయడంలో భాగంగా ఇలా ఆయన అనుచరులకు పట్టాలు ఇచ్చారు. పట్టాలు అక్రమంగా ఇచ్చారని రెవెన్యూ అధికారులు తేల్చినట్లు సమాచారం. అక్కడ తమ భూములున్నాయని, తమకు కాకుండా వేరేవాళ్లకు పట్టాలు ఇచ్చారని రైతులు తాజాగా చిత్తూరు కలెక్టర్, జేసీలను ఆశ్రయించారు. దీనిపై చంద్రబాబు సీరియస్‌గా ఉన్నారు.

అసలేం జరిగిందంటే..

పుంగనూరు మండలం రాగానిపల్లెలో 982 ఎకరాల భూమికి 1907లో అప్పటి పుంగనూరు జమిందారు మహదేవరాయులు పేరుతో పట్టా ఇచ్చారు. 1948 ఎస్టేట్ ఎబాలిషన్ చట్టం ప్రకారం ఈ భూమిని ప్రభుత్వం పుంగనూరు జమిన్ ఎస్టేట్‌లో భాగమని ప్రకటించి స్వాధీనం చేసుకుంది. అనంతరం సెటిల్‌మెంట్ అధికారులు విచారించి ఈ భూమికి మహదేవరాయులు కుమారుడు శంకరరాయులు పేరుతో 1958 ఫిబ్రవరి 27న రఫ్ పట్టా ఇచ్చారు. తర్వాత శంకరరాయులు దీన్ని వెంకటస్వామి, రెడ్డప్పరెడ్డికి విక్రయించారు. వారికి రైత్వారీ పట్టాలు వచ్చాయి. తర్వాత ఈ భూమి పలుమార్లు చేతులు మారింది. రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయి. 1973 డిసెంబరులో సెటిల్‌మెంట్ డైరెక్టర్ ఈ భూమి అనుభవదారులకు నోటీసులిచ్చారు. జమిందారు పట్టా జారీ నిబంధనలకు విరుద్ధమని, అది సాగు భూమి కాదని, అడవిగా ఉందని పేర్కొన్నారు. సాగుభూమిగా మార్చడానికి 1908 నాటి ఎస్టేట్స్ ల్యాండ్ చట్టం ప్రకారం అప్పటి కలెక్టర్ అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. 1977 ఫిబ్రవరి 24న శంకరరాయులుకు ఇచ్చిన పట్టాను రద్దు చేశారు. అనంతరం వెంకటస్వామి, రెడ్డప్పరెడ్డి వారసులు ఈ భూమిపై హక్కుల కోసం కోర్టుల్లో పిటిషన్లు, అప్పీళ్లు వేశారు.

అప్పటి జేసీ వెంకటేశ్వర్ పాత్ర ఏంటీ?

982 ఎకరాల భూములపై 2022లో నాటి చిత్తూరు జేసీ, ప్రస్తుత తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ విచారణ చేపట్టారు. '1907లో రఫ్ పట్టాను ధ్రువీకరించారు. దీన్ని మళ్లీ విచారించి పట్టా ఇవ్వక్కర్లేదు. 1908 ఎస్టేట్స్ ల్యాండ్ చట్టానికి ముందే పుంగనూరు జమిందారు పట్టా ఇచ్చారు. ఆ అధికారం ఆయనకు ఉంది. దీనిపై అనేకలావాదేవీలు జరగడం ద్వారా పట్టా భూమిగా గుర్తించారు. ఇవి వ్యవసాయ భూములే.. అధికారులు శిస్తు వసూలు చేశారు.. విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు..' అని విచారణ నివేదికలో పేర్కొన్నారు. వాస్తవానికి రఫ్ పట్టా చెల్లదని గతంలో కోర్టులు తీర్పులు ఇచ్చాయి. అయినా అప్పటి జేసీ వెంకటేశ్వర్ రఫ్ పట్టా చెల్లుతుందని, కొత్త పట్టా అవసరం లేదని తేల్చేశారు. దీనికి అనుగుణంగా నిషేధిత జాబితా(22ఏ) నుంచి వాటిని తొలగించారు. 2022లో జరిగిన ఈ విషయం రెండేళ్ల అలస్యంగా బయటపడింది. ఈ వ్యవహారం మొత్తం అప్పటి మంత్రి పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే జరిగింది. ఇందులో సగానికిపైగా ఆయన అనుచరులు ఉన్నారు. మిగిలిన నిజమైన రైతుల నుంచి ప్రధాన అనుచరులు ఒప్పందం చేసుకున్నారు.

ఆంధ్ర ఆర్థిక పునరుజ్జీవానికి

సమగ్ర ప్రణాళిక!

అమిత్ షాతో ఢిల్లీలో చంద్రబాబు భేటీ

న్యూఢిల్లీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం రాత్రి ఢిల్లీలో సమావేశమయ్యారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించేందుకు కేంద్రం, రాష్ట్రం అనుసరించాల్సిన ప్రణాళిక సహా అనేక అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాత్రి 9.30 గంటల నుంచి 10.30 వరకు జరిగిన చర్చల్లో రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి తమ ప్రభుత్వ ప్రాథమ్యాలు, ప్రాధాన్యాలను షా దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సంబంధించి పొందుపరచాల్సిన అంశాలతో పాటు తక్షణం అవసరమైన నిధులు, మంజూరు చేయాల్సిన ప్రాజెక్టుల గురించి ప్రస్తావించినట్లు సమాచారం. రాష్ట్ర దుర్భర ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వ నిర్ణయాలతో పరిస్థితులు ఎంత దిగజారాయో వివరించారు. జగన్ పాలనలో ఆర్థిక అసమర్థత, ఆర్థిక నిర్వహణలో తీవ్ర వైఫల్యం, విచ్చలవిడి అవినీతి వల్ల రాష్ట్రానికి ఎనలేని నష్టం జరిగిందని అమిత్ షాకు చెప్పినట్లు ఆ తర్వాత చంద్రబాబు విలేకరులకు తెలిపారు. ఎన్డీయేకి ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడినపెట్టేందుకు, ఎకానమీ కోలుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర ప్రణాళికను రూపొందిస్తాయని చెప్పారు. 2019-24 మధ్య అలవిమాలిన విధంగా పెరిగిపోయిన రుణాలు, తద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అదుపు తప్పడంపై తాను నాలుగు శ్వేతపత్రాలను విడుదల చేశానని తెలిపారు. అనంతరం కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు టీడీపీ ఎంపీలతో చర్చించారు. బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు పలువురు మంత్రులతో భేటీ అయ్యే అవకాశాలున్నాయి.

'సీసీ'.. సొమ్ములు నొక్కేసి!

(మొదటి పేజీ తరువాయి)

పెట్టాలని కేంద్రం కానీ, రాష్ట్ర ప్రభుత్వం కానీ ఆదేశించలేదు. అయినప్పటికీ ఆ శాఖ ఉన్నతాధికారులు ఏదో ఒక రూపంలో జేబులు నింపుకొనే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాల సరికొత్త ఆలోచనను తెరమీదికి తెచ్చారు. ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో దొంగల బెడద ఎక్కువగా ఉందని పేర్కొంటూ.. వాటిని అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తలపోశారు. ఈ క్రమంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పెట్టారు. నేషనల్ హెల్త్ మిషన్ నిధుల నుంచి వీటిని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా నేషనల్ హెల్త్ మిషన్ అధికారులు.. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం సీసీ కెమెరాల స్పెసిఫికేషన్ సిద్ధం చేశారు. ఆ స్పెసిఫికేషన్‌తో ఉన్న కెమెరాలు దాదాపు 3 వేల వరకు అవసరం అవుతాయని, వీటితో పాటు కంప్యూటర్లు, కెమెరాల మానిటర్స్ వంటివి కావాలని నిర్ణయించారు. వీటికి సంబంధించి వెంటనే టెండర్లు పిలవాలని రాష్ట్ర వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్(ఏపీఎంఎస్ఐడీసీ)కి లేఖ రాశారు. ఎన్‌హెచ్ఎం అధికారుల విన్నపం మేరకు ఏపీఎంఎస్ఐడీ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. టెండర్ ప్రక్రియలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ముందుగానే నిర్ణయించుకున్న కంపెనీ ఎల్-1లో రాలేదు. దీంతో ఎన్‌హెచ్ఎం ఇచ్చిన స్పెసిఫికేషన్‌ను మార్చేశారు. దీంతో అధికారులు కోరుకున్న కంపెనీ ఎల్-1గా ఎంపిక అయింది. అయితే, ఈ టెండర్ విషయంలో ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు కొంత భయపడ్డారు. స్పెసిఫికేషన్ మార్చడంతో పాటు అధికారులు నిర్ణయించిన కంపెనీ టెండర్ ప్రక్రియలో సీసీ కెమెరాల ధర భారీగా నమోదు చేసింది. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినా బిడ్ ఫైనలైజ్ కమిటీలో ఉన్నవారు సదరు కంపెనీకి ఎల్-1 ఇచ్చేశారు. ఇది ఎప్పటికైనా తమ తలకు చుట్టుకుంటుందని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు టెండర్ ప్రక్రియ వరకు మాత్రమే పూర్తి చేశారు. కానీ కంపెనీకి పీవో(కొనుగోలు ఆదేశాలు) మాత్రం ఇవ్వలేదు. దీనిని ఎన్‌హెచ్ఎం ద్వారా తెచ్చుకోవాలని చెప్పేశారు. వాస్తవానికి ఆరోగ్యశాఖలో ఏ టెండర్ అయినా ఏపీఎంఎస్ఐడీసీనే పిలుస్తుంది. పీవోలు కూడా ఏపీఎంఎస్ఐడీసీనే ఇస్తుంది. ఈ టెండర్ విషయంలో మాత్రం ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు తప్పుకొన్నారు. దీంతో అధికారులు పీవో నిబంధనలను పక్కన పెట్టి ఎన్‌హెచ్ఎం నుంచి పీవోలు ఇచ్చేశారు. ఇలా దాదాపు రూ.18.75 కోట్లకు పీవోలు జారీ చేశారు.

ముందే బిల్లులు..

ప్రభుత్వం నిర్వహించిన ఏ టెండర్ ప్రక్రియలో అయినా కాంట్రాక్టర్ మొత్తం పని పూర్తి చేసిన తర్వాత బిల్లులు చెల్లిస్తారు. కానీ, సీసీ కెమెరాల టెండర్ ప్రక్రియలో మాత్రం అంతా రివర్స్‌గా జరిగిపోయింది. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు చెందిన కంపెనీ కావడంతో కెమెరాలు కొనుగోలు చేసిన వెంటనే 50 శాతం, కొన్ని కెమెరాలు బిగించిన తర్వాత 25 శాతం, ఆ తర్వాత కెమెరాల నిర్వహణ నిమిత్తం క్వార్టర్‌కు, ఏడాదికి కొంచెం కొంచెం చొప్పున బిల్లులు ఇచ్చేలా నిబంధనల రూపొందించారు. ఏ టెండర్ ప్రక్రియలో కూడా ఈ విధంగా నిబంధనలు మార్చే పరిస్థితి ఉండదు. కానీ, ఎల్-1గా ఎంపికయిన కంపెనీ నుంచి అధికారులకు భారీగా ముడుపులు అందడంతో కంపెనీ ప్రతినిధులు ఎలా చెబితే అలా నిబంధనలు మార్చేశారు.

అర్హతలేని కంపెనీ!

సీసీ కెమెరాల టెండర్ దక్కించుకున్న విశాఖపట్నానికి చెందిన కంపెనీకి పెద్దపేరు లేదు. ఆర్థికంగా కూడా కోట్ల విలువైన టెండర్లు దక్కించుకునే అర్హత కూడా లేదు. కానీ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సదరు కంపెనీని ఎంపిక చేసుకుని, దాని ద్వారా వారి జేబులు నింపుకొనేలా వ్యవహరించారు. దానికి అనుగుణంగా ప్లాన్ మొత్తం అమలు చేసిన సదరు కంపెనీకి ఎల్-1 వచ్చేలా చేశారు. పైగా ప్రభుత్వ నిధులతోనే కెమెరాలు కొనుగోలు చేసేలా ముందుగానే 50 శాతం అంటే దాదాపు రూ.8 కోట్లు వరకు బిల్లులు చెల్లించారు.

కాంట్రాక్టర్ ఇస్తాడని తెలిసినా..

ఆరోగ్యశాఖ అధికారులు అవసరం లేని మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులకు కూడా సీసీ కెమెరాలు కొనుగోలు చేశారు. గత ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టింది. ఆయా కాలేజీల్లో ఎన్ఎంసీ సూచనలకు అనుగుణంగా కాలేజీల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టరే సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కాలేజీని దాదాపు రూ.350 కోట్లు ఖర్చు చేసి నిర్మించారు. ఈ విషయం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు తెలుసు. తెలిసి కూడా సదరు కంపెనీకి మేలు చేసి దాని ద్వారా తమ జేబులు నింపుకొనే ప్రయత్నం చేశారు. అవసరం లేకపోయినా 10 కాలేజీలకు కెమెరాలు కొనుగోలు చేశారు. ఇప్పుడా కెమెరాలు ఎక్కడ పెట్టాలో తెలియక ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. కాంట్రాక్టర్ ఇచ్చిన సీసీ కెమెరాలను కొత్త మెడికల్ కాలేజీల్లో ఉన్న బీరువాల్లో భద్రంగా దాచి పెట్టారు. అవసరం లేని 10 కాలేజీలకు కూడా దాదాపు రూ.2 నుంచి రూ.3 కోట్ల విలువైన కెమెరాలు కొనుగోలు చేసి ప్రజాధనాన్ని వృథా చేశారు. ఇదే సమయంలో కమీషన్లను జేబులో వేసుకున్నారు.

పిల్లలు అత్యాచారం చేసి చంపేశారు పెద్దలు మృతదేహాన్ని మాయం చేశారు

ముచ్చుమర్రి ఘటనలో ఐదుగురు అదుపులోకి

- మైనర్లపై పోక్సో కేసు, జువెనైల్ హోంకు తరలింపు
- ఇద్దరు పెద్దల అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

నందికొట్కూరు, జూలై 16: ముచ్చుమర్రిలో పది రోజుల క్రితం కనిపించకుండా పోయిన తొమ్మిదేళ్ల బాలిక కేసులో ఎట్టకేలకు పోలీసులు పురోగతి సాధించారు. ఇందుకు సంబంధించిన వివరాలను నంద్యాల కొత్త జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నంద్యాల జిల్లా పగిద్యాల మండలం ఓ గ్రామానికి చెందిన బాలిక(9) ఈ నెల 7న పార్కులో ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. తండ్రి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ముగ్గురు మైనర్ బాలురను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వారిలో ఒకరు 8వ తరగతి(13), ఇద్దరు పదో తరగతి(15) విద్యార్థులు బాలికపై పార్కులోనే అత్యాచారం చేశారు. ఆ తర్వాత గ్రామ శివారులో కేసీ కాలువ పక్కనే ఉన్న పొదల్లోకి తీసుకెళ్లి బాలికను చంపేశారు. వారిలో ఒకరు కాళ్లను, మరొకరు చేతులను గట్టిగా పట్టుకోగా మరో బాలుడు గొంతు నులిమి కిరాతకంగా హతమార్చారు. ఆ తర్వాత ఇంట్లో పెద్దలకు విషయాన్ని చెప్పారు. రాత్రి సమయంలో బాలురులో ఒకరి తండ్రి కాటం యోహాన్, మరో బాలుడి పెదనాన్న బొల్లెద్దుల సద్గురుడు.. బాలిక మృతదేహాన్ని సంచిలో వేసుకొని ద్విచక్రవాహనంపై కృష్ణానది వద్దకు వెళ్లారు. మృతదేహానికి రాయి కట్టి తెప్పలో నదిలో మధ్యలోకి వెళ్లి విసిరేశారు. తర్వాత కేసు పెద్దలపై రాకుండా మైనర్లను ముందుకు ఉంచారు. బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన ముగ్గురు మైనర్లపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి కర్నూలు జువెనైల్ హోంకు తరలించారు. బాలురు చేసిన తప్పును సమర్థిస్తూ బాలిక మృతదేహాన్ని మాయం చేసిన కేసులో యోహాన్, సద్గురుడులను అరెస్టు చేసి, కోర్టు ఆదేశాల మేరకు నందికొట్కూరు సబ్‌జైల్‌లో రిమాండ్‌కు తరలించారు. బాలిక మృతదేహం కోసం గాలింపుచర్యలు చేపడుతున్నామని, కేసు బలోపేతం కోసం సాక్ష్యాలను సేకరిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

కిడ్నీ కాజేసిన కేసులో ఇరువురు అరెస్టు

- 30 లక్షలు ఇస్తామని లక్ష చేతిలో పెట్టిన నిందితులు
- మిగిలిన వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు

గుంటూరు, జూలై 16: ముప్పై లక్షలు ఇస్తామని ఆశ చూపి.. చివరకు లక్ష చేతిలో పెట్టి కిడ్నీ కాజేసిన కేసులో ఇరువురు నిందితులను గుంటూరు నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన సయ్యద్ యూసఫ్ సోనుబాషా.. అలియాస్ బాషా, కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం నరసప్పచెరువు గ్రామానికి చెందిన నిమ్మకాయల సుబ్రహ్మణ్యం అనే ఇద్దరిని అరెస్టు చేసినట్లు వెస్ట్ డీఎస్పీ మహేశ్ తెలిపారు. నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మీడియా ఎదుట ఆ వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం గరికపాడు గ్రామానికి చెందిన గార్లపాటి మధుబాబు భార్యాపిల్లలతో గుంటూరు చుట్టుగుంట సమీపంలో నివాసం ఉంటున్నారు. బతుకు తెరువు కోసం ఫ్యాన్సీ షాపు, కూరగాయలు షాపు వంటి వ్యాపారాలు చేసి నష్టపోయాడు. రూ.8 లక్షల వరకు అప్పు చేశాడు. ఈ పరిస్థితుల్లో ఫేస్‌బుక్‌లో ఆలిండియా కిడ్నీ డోనర్స్ గ్రూపులో కిడ్నీదాతలు కావలెను అనే ప్రకటన చూసి వారిని సంప్రదించాడు. వెంటనే కిడ్నీ రాకెట్ ముఠా రంగంలోకి దిగింది. తొలుత సోను.. ఫోన్‌చేసి మధ్యవర్తి సుబ్రహ్మణ్యంను పరిచయం చేశాడు. ఆయన మధుబాబుని విజయవాడ పిలిపించారు. రోగికి కిడ్నీ ఇస్తే రూ.30లక్షలు ఇప్పిస్తామని నమ్మించారు. నకిలీ డాక్యుమెంట్లు తయారుచేసి, గతనెల 15న కుడి కిడ్నీ తీసి కేతినేని వెంకటస్వామికి అమర్చారు. మధుబాబుకి 59,500 ఆన్‌లైన్ ద్వారా ఇచ్చి.. డిశ్చార్జి సమయంలో మరో రూ.50వేలు చేతిలో పెట్టారు. మిగిలిన డబ్బులివ్వకుండా మోసం చేశారంటూ మధుబాబు గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. మంగళవారం జిల్లా కోర్టు రోడ్డులోని సంగం డెయిరీ వద్ద ఇరువురు నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు డీఎస్పీ మహేశ్ తెలిపారు. ఈ కేసులో పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని చెప్పారు.

ఎర్రమట్టి దిబ్బలకు ఎసరు



భీమిలిలోని ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలో తవ్వకాలు

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ నేతలు కొనసాగడంపై తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. భీమిలి మండలం నేరేళ్లవలస పంచాయతీ సర్వే నంబర్ 118 (పాత సర్వే నంబరు 49/1)లోని 1,067 ఎకరాల్లో ఎర్రమట్టి దిబ్బలు ఉండేవి. అందులో తూర్పు నౌకాదళం ఏర్పాటుచేసిన ఐఎన్ఎస్ కళింగకు 588 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఆ తరువాత భీమిలి మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి 373.95 ఎకరాలు ఇచ్చారు. మిగిలిన భూమిని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా భౌగోళిక వారసత్వ సంపదగా ప్రకటించింది. దానిని పరిరక్షించాలని ఆదేశించింది.

ఆదేశాలు బేఖాతరు

భీమిలి కో-ఆపరేటివ్ సొసైటీకి కేటాయించిన భూములు ఎర్రమట్టి దిబ్బల్లోనే ఉన్నాయి. వారు అక్కడ లేఅవుట్ వేయడానికి 2016లో వుడా(ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ)కి దరఖాస్తు చేయగా, అనేక షరతులు విధించింది. ముందు భూ వినియోగ మార్పిడి ఫీజు చెల్లించాలని సూచించింది. దీనికి జిల్లా కలెక్టర్ నుంచి, ఏపీ కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్ నుంచి, కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి, నేషనల్ మాన్యుమెంట్ అథారిటీ నుంచి, రక్షణ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించింది. అంతేకాకుండా సొసైటీదిగా చెబుతున్న భూమిలో వారసత్వ సంపదగా గుర్తించిన 94.65 ఎకరాలు ఉందని, అది పోను 279.31 ఎకరాలు మాత్రమే సొసైటీదని వెల్లడించింది. లేఅవుట్ వేస్తే అందులో 75 ఎకరాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు లేఅవుట్ వేసి ఒక్కొక్కరికి 75 గజాలకు మించకుండా ప్లాట్లు కేటాయించాలని, వారంతా ఆర్థికంగా వెనుకబడిన వారే అయి ఉండాలని సూచించింది. జియో హెరిటేజ్ స్థలం పక్కనే ఉన్నందున బఫర్‌జోన్ ఏర్పాటు చేయాలని, భీమిలి బీచ్‌రోడ్డు అప్పటి మాస్టర్ ప్లాన్ ప్రకారం 150 అడుగుల వెడల్పు ఉన్నందున ఆ మేరకు భూమి విడిచి పెట్టాలని సూచించింది. భూ విని యోగ మార్పిడి కింద సొసైటీ వుడాకు సుమారు రూ. 3కోట్లు వరకు అప్పుడు చెల్లించింది. అయితే మిగిలిన నిబంధనలు ఏవీ పాటించకపోవడంతో దరఖాస్తును వెనక్కి పంపారు. ఇన్నేళ్ల తరువాత ఇప్పుడు మళ్లీ అక్కడ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ఇక్కడ లేఅవుట్ వేయడానికి ముందు వుడా నుంచి సొసైటీ నిర్వాహకులు అనుమతులు కోరారు. అక్కడే డబ్బులు కూడా కట్టారు. ఇప్పుడు పరిధి మారి జీవీఎంసీకి అధికారం కల్పించడంతో అక్కడ దరఖాస్తు చేసినట్టు తెలిసింది. అక్కడా లేఅవుట్ దరఖాస్తు సమర్పించలేదు. భూమి చదును చేయడానికి 5కోట్ల వరకు చెల్లించినట్టు సమాచారం. దీనిపై వీఎంఆర్‌డీఏ అధికారులను సంప్రతించగా, గతంలో చెల్లించిన మొత్తాన్ని వెనక్కి ఇవ్వాలని రెండురోజుల క్రితమే సొసైటీ దరఖాస్తు చేసిందని సీయూపీ తెలిపారు. జీవీఎంసీ ఎటువంటి అనుమతులు ఇచ్చిందో తెలుసుకోవడానికి చీఫ్ సిటీ ప్లానర్ సురేశ్‌కు ఫోన్ చేయగా, స్పందించలేదు.

ప్రస్తుతానికి పనులు ఆగాయి: భీమిలి తహసీల్దార్

అనుమతులు లేకుండా ఎర్రమట్టి దిబ్బల్లో పనులు జరుగుతున్నాయని భీమిలి తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లగా, మంగళవారమే వెళ్లి పరిశీలించామని, ప్రస్తుతానికి వాటిని ఆపాల్సిందిగా చెప్పామని తెలిపారు. వారికి ఎటువంటి అనుమతులు ఉన్నాయో పరిశీలించి చెబుతామన్నారు. ఇది చారిత్రక వారసత్వ సంపద కలిగిన భూములున్న ప్రాంతం కావడంతో ఢిల్లీ స్థాయిలో అనుమతులు తీసుకోవలసిన అవసరం ఉంది. అవేమీ లేకుండానే గత మూడు నెలలుగా పనులు జరుగుతుంటే అధికారులు కళ్లు మూసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఎర్రమట్టి దిబ్బలను తవ్వేసి వేలాది లారీల మట్టిని తరలించుకుపోయినా గనుల శాఖ అధికారులు కళ్లు అప్పగించి చూస్తున్నారు.

నేటి నుంచి టీడీపీ కార్యాలయానికి మంత్రులు

- చంద్రబాబు ఆదేశంతో షెడ్యూల్ ఖరారు

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఇక్కడి మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి ఇకపై ప్రతి రోజూ మంత్రులు హాజరు కానున్నారు. మంత్రులు పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉండి పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో ఏ రోజు ఏ మంత్రి హాజరు కావాలన్నదానిపై ఒక షెడ్యూల్ రూపొందించి మంగళవారం దానిని విడుదల చేశారు. దీని ప్రకారం ఈ నెల 17న బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, 18న మైనారిటీ సంక్షేమం, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్, 19న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, 22న గిరిజన సంక్షేమం, మహిళా సంక్షేమ శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి, 23' గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర, 24న రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్, 25న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్, 26న రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, 29న ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, 30 రవాణా మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి, 31న రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిపార్టీ కార్యాలయానికి హాజరవుతారు. వీరితోపాటు పార్టీ ముఖ్య నేతలు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, కావలి ప్రతిభా భారతి, పనబాక లక్ష్మి, బీదా రవిచంద్ర యాదవ్, కంభంపాటి రామ్మోహనరావు, కెఎస్ జవహర్, తోట సీతారామలక్ష్మి, వైకుంఠం ప్రభాకర్, బొల్లినేని రామారావు కూడా ఒకో తేదీలో ఒకరు మంత్రులతోపాటు పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని కేంద్ర కార్యాలయం తెలిపింది.

వచ్చేనెల నుంచి రేషన్‌లో కందిపప్పు, చక్కెర

- సేకరణకు టెండర్లు పిలిచిన పౌర సరఫరాల సంస్థ
- ఈ వారంలోనే ప్రక్రియ పూర్తికి అధికారుల కసరత్తు
- కిలో కందిపప్పు రూ.67కే ఇచ్చే ఏర్పాట్లు

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు ఉచిత బియ్యంతో పాటు వచ్చేనెల నుంచి సబ్సిడీపై చక్కెర, కందిపప్పును కూడా పంపిణీ చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటున్న తరుణంలో పేదలకు కాస్త ఉపశమనం కల్పిస్తూ.. రాయితీ ధరలపై కందిపప్పు, పంచదార సరఫరాను పునరుద్ధరించాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించింది. దీంతో ఆగస్టు నుంచి అక్టోబరు వరకు 3 నెలలకు సరిపోయేలా కందిపప్పు, పంచదార, గోధుమపిండి సరఫరా కోసం సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కాంట్రాక్టర్ల నుంచి ఇప్పటికే టెండర్లు ఆహ్వానించింది. 22,500 టన్నుల కందిపప్పు, 17,538 టన్నుల పంచదార సేకరణ కోసం టెండర్లు పిలిచారు. అయితే పంచదార సరఫరాదారులు ఎక్కువ ధరలు కోట్ చేయడంతో ఆ టెండరు ప్రక్రియను రద్దుచేసి, మళ్లీ రెండోసారి టెండర్లు ఆహ్వానించారు. ఏదేమైనా ఈ వారంలోనే ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వచ్చేనెల నుంచి కార్డుదారులకు రాయితీపై రూ.67కే కిలో కందిపప్పు లభించనుంది. అలాగే అరకిలో చొప్పున చక్కెరను కూడా పంపిణీ చేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని కార్డుదారులందరికీ నాణ్యమైన బియ్యం, ఇతర రేషన్ సరుకులు ఇంటింటికీ అందిస్తామని గొప్పలు చెప్పినప్పటికీ.. ఆచరణలో చూస్తే కార్డుదారులకు పండుగల నెలల్లో కూడా కిలో కందిపప్పు ఇవ్వలేక చేతులెత్తేసింది.

టీటీడీ జేఈఓగా వెంకయ్య చౌదరి!

- కేంద్ర విధుల నుంచి రిలీవ్ చేసిన డీవోపీటీ
- టీటీడీ జేఈఓగా పంపుతున్నట్టు ఉత్తర్వుల్లో వెల్లడి
- రాష్ట్ర సర్కారు విన్నపం మేరకు మూడేళ్లు డిప్యుటేషన్
- ఐపీఎస్ అధికారి రవికృష్ణకూ రిలీవ్ ఆర్డర్



అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(జేఈవో)గా 2005 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి సీహెచ్ వెంకయ్యచౌదరి నియమితులు కానున్నారు. ప్రస్తుతం కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వ విన్నపం మేరకు రిలీవ్ చేసేందుకు కేంద్ర పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం(డీవోపీటీ) ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రిలీవ్ ఆర్డర్‌లోనే ఆయనను టీటీడీ జేఈవోగా నియమించేందుకు సమ్మతిస్తున్నట్టు డీవోపీటీ పేర్కొంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఆయనను జేఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశాక, తిరుమలలో బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, 2014-19 మధ్యలో కూడా చౌదరి మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా డిప్యుటేషన్‌పై ఏపీలో విధులు నిర్వహించారు. తర్వాత ప్రభుత్వం మారడంతో తిరిగి ఆయన కేంద్ర సర్వీసులోకి వెళ్లిపోయారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో ఏపీకి రానున్నారు. మూడేళ్ల పాటు ఆయన టీటీడీ జేఈవోగా విధులు నిర్వర్తించనున్నారు.

ఏపీకి ఆకే రవికృష్ణ

రాష్ట్రానికి మరో ఐపీఎస్ అధికారి రానున్నారు. కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరోలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధుల నిర్వహిస్తున్న ఆకే రవికృష్ణను ఏపీకి పంపించేందుకు కేంద్రం అంగీకరించింది. ఈ మేరకు డీవోపీటీ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రవికృష్ణ కర్నూలు ఎస్పీగా పని చేశారు. అనంతరం, కేంద్ర సర్వీసెస్‌లోకి వెళ్లారు. 2006 బ్యాచ్‌కు చెందిన ఆయన మళ్లీ ఏపీకి రానున్నారు.

డేటింగ్ పేరుతో చీటింగ్

హైదరాబాద్ సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): డేటింగ్ యాప్‌లలో చాటింగ్ చేస్తూ.. యువతులను చీటింగ్ చేస్తున్న యువకుడిని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. నంద్యాల జిల్లా, సంజమల మండలానికి చెందిన చిన్నిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి(23) తనను తాను గూగుల్ లాంటి పెద్ద కంపెనీల్లో యాప్ డెవలపర్‌గా పరిచయం చేసుకుంటాడు. టిండర్, నీతో వంటి యాపుల్లో నకిలీ ఐడీలు సృష్టించి పెళ్లి సంబంధాలు చూస్తున్నట్లు నటిస్తాడు. అమాయక యువతులను ఎంచుకుని వారిని పూర్తిగా నమ్మించిన తరువాత డ్రామా స్టార్ట్ చేస్తాడు. 'నా కుటుంబానికి ఆపద వచ్చింది... సమయానికి నా బ్యాంకు ఖాతా హ్యాక్ అయింది' అంటూ చెప్పిన కారణం చెప్పకుండా యువతులను డబ్బులు అడుగుతాడు. ఇలా పలువురిని మోసం చేశాడు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నివసించే ఓ యువతి అతని మాటలకు మోసపోయింది. సందీప్, సన్ని పేర్లతో ఈ మోసగాడు చెప్పిన కట్టు కథలు ఆమె నమ్మింది. అతను అత్యవసరమన్న ప్రతిసారీ డబ్బులు పంపించింది. అలా మొత్తం రూ.6.42 లక్షలు సమర్పించుకుంది. లక్షల్లో సొమ్ములు నొక్కేసిన తరువాత అతన్నుంచి మాటల్లేవు. మాట్లాడుకోవడాలూ లేవు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని గుర్తించిన పోలీసులు అరెస్టు చేశారు. ఓ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కాలేజీల ఖాతాలకే ఫీజులు

- తల్లిదండ్రులకు ముడిపెట్టకూడదని నిర్ణయం
- పాత విధానంపై అధ్యయనానికి లోకేశ్ ఆదేశం



ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఉన్నత విద్యా శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేశ్

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద విద్యార్థులకు చెల్లించే ఫీజులను నేరుగా కాలేజీల ఖాతాలకు జమ చేసే విధానం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. పాత విధానంపై విధివిధానాలు రూపొందించాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. గతంలో కాలేజీలకు నేరుగా ఫీజులు ఇచ్చే విధానం ఉండగా, వైసీపీ ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో జమ చేసే విధానం ప్రవేశపెట్టింది. కానీ సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేసి ఇబ్బంది పెడుతున్నాయి. దీంతో పాత విధానంలో నేరుగా కాలేజీల ఖాతాల్లోకి ఫీజులు వేయాలని, ఇందులో విద్యార్థులు, తల్లిదండ్రులకు సంబధం ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఫీజులతో పాటు ఉన్నత విద్యకు సంబంధించిన పలు అంశాలపై మంత్రి లోకేశ్ మంగళవారం సచివాలయంలో సమీక్షించారు. గత ప్రభుత్వం విద్యా దీవెన, వసతి దీవెన పథకాల్లో రూ.3,480 కోట్లు బకాయి పెట్టడంతో విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీల్లో ఉండిపోయాయని తెలిపారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానాలతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆరోపించారు. కాలేజీల్లో డ్రగ్స్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారుల నియామకం అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. 3,220 అధ్యాపక పోస్టుల భర్తీపై సమావేశంలో చర్చించారు. న్యాయపరమైన వివాదాలు పరిష్కరించి వీలైనంత త్వరగా పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు ప్రారంభించాలని మంత్రి పేర్కొన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా ప్రతిభ ఆధారంగా, పారదర్శకంగా నియామక ప్రక్రియ జరగాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లు తగ్గిపోవడంపై లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై దృష్టి పెట్టి అడ్మిషన్లు పెరిగేలా చూడాలని కోరారు. ఉన్నత విద్యాసంస్థలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, కోర్టు కేసులు, అడ్మిషన్ల వివరాలను డ్యాష్ బోర్డులో పెట్టాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ, ఫీజులు, ప్రైవేటు వర్సిటీల పనితీరు, పొట్టి శ్రీరాములు, అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలను రాష్ట్రంలో ఏర్పాటుచేసే అంశాలపైనా సమావేశంలో చర్చించారు.

జీవో 117ను రద్దు చేయాలి: ఆపస్

పాఠశాల విద్యను నిర్వీర్యం చేసిన జీవో 117ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీ, జి.వెంకట సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాల విద్యలో పలు సమస్యలపై ఆ శాఖ సర్వీసెస్ జేడీ రామలింగంను మంగళవారం కమిషనరేట్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో కలపడంతో పాటు పాఠశాలల్లో రెండు మాధ్యమాలు కొనసాగించాలని కోరారు.

నామినేటెడ్ పదవులపై కసరత్తు!

- త్వరలో పాతిక వరకూ కార్పొరేషన్ పదవుల భర్తీ
- విడతల వారీగా అందరికీ ఏదో ఒక అవకాశం
- టీడీపీ ఆశావహుల్లో పెరిగిన ఉత్సాహం
- జనసేన, బీజేపీ నేతలకూ చాన్స్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీలో నామినేటెడ్ పోస్టుల భర్తీ కోలాహలం అలుముకొంది. ఈ నెలలో కొన్నైనా నామినేటెడ్ పదవులను భర్తీ చేసేందుకు అధినాయకత్వం కసరత్తు చేపట్టింది. అసెంబ్లీ సమావేశాలకు ముందుగానీ, తర్వాతగానీ నామినేటెడ్ పదవుల భర్తీ చేపట్టే ఆలోచన ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటింది. ఇప్పటివరకూ అధికారుల నియామకాల కసరత్తులో ప్రభుత్వం నిమగ్నమైంది. అవి కొంతవరకూ పూర్తి కావడంతో ఇప్పుడు నామినేటెడ్ పదవులపై దృష్టి పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్పొరేషన్లు, ఇతర పదవుల సమాచారాన్ని పార్టీ అధినాయకత్వం ఇటీవల సేకరించింది. దీని ప్రకారం ముఖ్యమైన కార్పొరేషన్లు వందకుపైగా తేలాయి. కుల వృత్తులకు సంబంధించిన ఫెడరేషన్లు మరో అరవై వరకూ ఉన్నాయి. ఇవిగాక కింది స్థాయిలో నీటి సంఘాలు, ఆహార సలహా సంఘాలు తదితరాలు మొదలుకొని పైస్థాయిలో ఉన్న పదవులను పరిగణనలోకి తీసుకొంటే డైరెక్టర్లతో కలిపి వేల సంఖ్యలో ఉన్నాయని తేలింది. తిరుమల తిరుపతి దేవస్థానం మొదలుకొని కింది స్థాయిలో చిన్న దేవాలయాల వరకూ పాలక మండళ్ల నియామకానికి కూడా అవకాశం ఉంది. వీటిలో కూడా పెద్ద సంఖ్యలో పార్టీ నేతలను సర్దుబాటు చేసే అవకాశం ఉంది. మిత్రపక్షాలుగా ఉన్న జనసేన, బీజేపీ కేడర్‌కు కూడా కొన్ని ఇవ్వాల్సి ఉంటుందని టీడీపీ వర్గాలు తెలిపాయి. ఆ పార్టీలకు ఏఏ పదవులివ్వాలి? టీడీపీ నేతలతో వేటిని భర్తీ చేయాలన్నదానిపై కూడా అంతర్గతంగా కసరత్తు నడుస్తోంది. అయితే, అన్నింటినీ ఒకేసారి కాకుండా విడతలవారీగా భర్తీ చేసే యోచనలో పార్టీ నాయకత్వం ఉంది. ముందు రాష్ట్ర స్థాయిలో ముఖ్యమైన పాతిక వరకూ పదవులను భర్తీ చేయాలని నిశ్చయించారు. కొన్ని కార్పొరేషన్ల అధ్యక్ష పదవులు, కొన్ని సలహాదారు పదవులు, కొన్ని ముఖ్య సంస్థల్లో డైరెక్టర్ల పదవులు ఇందులో ఉండే అవకాశం ఉంది. మొదటి విడతలో భర్తీ చేయాల్సిన పదవులు, వాటిలో చోటు కల్పించాల్సిన నేతల ఎంపికపై ప్రస్తుతం టీడీపీ నాయకత్వం దృష్టి పెట్టింది. ఇప్పటికే పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉన్న కొంత సమాచారాన్ని సేకరించారు. దీనితోపాటు మరి కొంత సమాచారాన్ని ఎన్నికల సమయంలో పనిచేసిన వారి నుంచి తీసుకొంటున్నారు. వీటిలో సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమీకరణాలను కూడా పరిగణనలోకి తీసుకొంటారని సమాచారం. ఎన్నికల సమయంలో కీలకంగా పనిచేసిన వారు, క్షేత్ర స్థాయిలో కష్టపడినవారు, పార్టీ అధ్యక్షుని తరఫున బ్యాక్ ఆఫీసులో వివిధ బాధ్యతల్లో పనిచేసిన వారి జాబితాలను ముందు పెట్టుకొని, వారిలో ముందుగా ఎవరికి అవకాశం ఇవ్వాలన్నదానిపై కసరత్తు చేస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీ త్వరలో జరగనుందని తెలిసి టీడీపీలోని ఆశావహుల్లో ఉత్సాహం పెరిగింది. పార్టీ అధిష్ఠానాన్ని, మంత్రులను, పార్టీ ముఖ్యులను కలిసి తమ పేరును పరిశీలించాలని కోరే వారి సంఖ్య విస్తృతంగా పెరిగింది. గత కొన్ని రోజులుగా పార్టీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తదితరులకు వస్తున్న వినతిపత్రాల్లో పదవులకు సంబంధించినవే గణనీయ సంఖ్యలో ఉంటున్నాయి. విడతలవారీగా అందరికీ ఏదో ఒక అవకాశం ఉంటుందని పార్టీ ముఖ్యులు చెబుతున్నారు.

కవితకు అస్వస్థత

- ఆసుపత్రిలో చికిత్సఅనంతరం మళ్లీ జైలుకు



న్యూఢిల్లీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అస్వస్థతకు గురయ్యారు. కొంతకాలంగా గైనిక్ సమస్యతో బాధపడుతున్న ఆమెకు రెండురోజులుగా జ్వరం కూడా వస్తోంది. ఈ క్రమంలోనే.. మంగళవారం ఆమె అస్వస్థతకు గురికావడంతో జైలులోని వైద్యుల సూచన మేరకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ హాస్పిటల్‌కు తరలించారు. సుమారు రెండు గంటలపాటు వైద్యులు పలు వైద్యపరీక్షలు నిర్వహించి.. ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని ప్రకటించారు. వైద్యుల సూచనల మేరకు కవితను అధికారులు తిరిగి తిహాడ్ జైలుకు తరలించారు.

అవినీతిపై ఫిర్యాదులకు 9440440057

- కాల్ చేసి చెప్పండి: ఏసీబీ డీజీ అతుల్‌సింగ్

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): అవినీతిపై ఫిర్యాదులు చేసేందుకు ఉద్దేశించిన 14400 టోల్‌ఫ్రీ నంబరు ప్రస్తుతం పనిచేయట్లేదు. అవినీతిపరులపై 9440440057 నంబరుకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని ఏసీబీ డీజీ అతుల్‌సింగ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

24న విభజన సమస్యలపై తెలుగు రాష్ట్రాల సమావేశం

న్యూఢిల్లీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల విభజన సమస్యలపై కేంద్రం దృష్టి సారించింది. ఈనెల 24న ఢిల్లీలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో కీలక సమావేశం జరగనుంది. ఆ సమావేశానికి రావాలని ఏపీ, తెలంగాణ సీఎస్‌లకు కేంద్ర హోంశాఖ లేఖలు రాసింది. షెడ్యూల్ 13లోని అంశాలపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

రూ.2 వేల కోట్ల అప్పు

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): రిజర్వ్ బ్యాంకు నుంచి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రూ.2,000 కోట్ల అప్పు తెచ్చింది. ఇందులో రూ.1000 కోట్ల అప్పును 16 ఏళ్ల కాలపరిమితితో, మరో రూ.1000 కోట్ల అప్పును 19 ఏళ్ల కాలపరిమితితో తీసుకున్నారు. ఈ అప్పుపై 7.33 శాతం వడ్డీ అమలవుతుంది. రాష్ట్రంలో అత్యవసర బిల్లుల చెల్లింపుల కోసం ఈ డబ్బును వినియోగించనున్నట్టు తెలిసింది.

తీరనున్న తాగునీటి కష్టాలు

- నేటి నుంచి ఏపీకి 4.5 టీఎంసీల నీరు

తెలుగు రాష్ట్రాల తాగునీటి అవసరాల కోసం బుధవారం నుంచి నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా కృష్ణా జలాలు విడుదల చేయాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు నిర్ణయించింది. ఏపీకి 4.5టీఎంసీలు, తెలంగాణకు 5.414 టీఎంసీలు విడుదల చేయాలని పేర్కొంది. శ్రీశైలం జలాశయం పవర్ జనరేషన్ ప్లాంట్ల ద్వారా నీటిని విడుదల చేయడం ద్వారా రెండు రాష్ట్రాల విద్యుత్తు అవసరాలు కూడా తీరుతాయని అభిప్రాయపడింది. రోజుకు 5500 క్యూసెక్కుల జలాలు కిందకు విడుదల చేయాలని కేఆర్ఎంబీ పేర్కొంది.

ల్యాండ్ టైట్లింగ్ తరహాలో జీపీఎస్‌ను రద్దు చేయండి!

- సెప్టెంబరు 1న చలో విజయవాడ: ఏపీసీపీఎస్ఈఏ
- జీపీఎస్ నిలిపివేతపై సీపీఎస్ ఉద్యోగుల హర్షం

విజయవాడ, అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసినట్టుగా జీపీఎస్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తుందని భావిస్తున్నామని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం(ఏపీజేఈఏ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్ అన్నారు. మంగళవారం విజయవాడలో ఆయన మాట్లాడుతూ... సీపీఎస్‌ను రద్దు చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించే వరకూ ఉద్యమ కార్యాచరణను వీడేది లేదన్నారు. ఏపీసీపీఎస్ఈఏ (ఏపీజేఈఏ అనుబంధం) ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ... ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా వైసీపీ ప్రభుత్వం తమని తీవ్రవాదులుగా చూసిందని, అక్రమ కేసులు పెట్టిందన్నారు. ఆ అక్రమ కేసులను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. సెప్టెంబరు 1న చలో విజయవాడకు పిలుపునిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీసీపీఎస్ఈఏ (ఏపీజేఈఏ అనుబంధం) రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శాంతి బాయి తదితరులు పాల్గొన్నారు. కాగా, గత ప్రభుత్వం తెచ్చిన గ్యారెంటీ పెన్షన్ స్కీం(జీపీఎస్) జీవో, గెజిట్‌ను నిలుపుదల చేస్తూ సీఎం చంద్రబాబు ఆదేశాలివ్వడంపై సీపీఎస్ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. మంగళవారం రాష్ట్ర సచివాలయ సీపీఎస్ ఉద్యోగ సంఘ నేతలు కోట్ల రాజేశ్, నాపా ప్రసాద్, మరియదాసు తదితరులు అమరావతి సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. జీపీఎస్‌పై గెజిట్ ఉత్తర్వులను నిలుపుదల చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని ఏపీఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ శివారెడ్డి, పురుషోత్తం నాయుడు అన్నారు. కాగా, పెన్షనర్ల కోసం ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని అసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ కోరింది. మంగళవారం అసోసియేషన్ అధ్యక్షుడు నళినీ మోహన్‌కుమార్ తదితరులు అమరావతి సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రతినెలా 1న పెన్షన్ ఇవ్వాలని, పెన్షనర్ల బిల్లులు డైరెక్టరేట్‌లో సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు.

ఉద్యోగుల బకాయిలపైనా శ్వేతపత్రం విడుదల చేయాలి

- రానున్నవి మంచి రోజులే అని నమ్ముతున్నాం: ఏపీఎన్‌జీజీఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎన్‌జీజీఓ నేతలు

విజయవాడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల బకాయిలపై కూడా రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఏపీఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ శివారెడ్డి, పురుషోత్తంనాయుడు అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు దురదృష్టకర రోజులు పోయాయని, రానున్నవి మంచి రోజులే అని పేర్కొన్నారు. జీపీఎస్‌పై గెజిట్ ఉత్తర్వులను నిలుపుదల చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. మంగళవారం ఏపీఎన్‌జీజీఓ భవన్‌లో విలేకరుల సమావేశంలో శివారెడ్డి మాట్లాడారు. 'రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన తొలి నెలలోనే ఒకటో తేదీన జీతాలు జమ చేయడం పట్ల ఉద్యోగులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజులలో పాత బకాయిల విషయంలో కూడా సానుకూలంగా వ్యవహరిస్తుందని నమ్ముతున్నాం. ఉద్యోగులపై నమోదైన అక్రమ కేసులన్నింటినీ ఎత్తివేసేలా సీఎం చర్యలు తీసుకోవాలి' అని కోరారు. ఏపీఎన్జీఓ సంఘం పశ్చిమ కృష్ణా అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన సొమ్ముల దుర్వినియోగంపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. సమావేశంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

బెర్మ్‌పార్క్‌లో కల్యాణమస్తు!

- ఏసీ కల్యాణమండపానికయ్యే ఖర్చులోనే బెర్మ్‌పార్క్‌లో అన్నీ!
- కల్యాణమండపం, రూములు, భోజనాలు, పురోహితులు ఇతర ఏర్పాట్లు
- బడ్జెట్‌లోనే మరపురాని పెళ్లిళ్ల నిర్వహణకు అవకాశం
- వెడ్డింగ్ ప్యాకేజీకి ఏపీటీడీసీ రూపకల్పన.. త్వరలో టారిఫ్ విడుదల

కల్యాణమండపాలకు దీటుగా పెళ్లిళ్లకు బెర్మ్‌పార్క్ సిద్ధం



కల్యాణ వేదిక, సీటింగ్

ఆంధ్రజ్యోతి, విజయవాడ: పరవళ్లు తొక్కుతున్న కృష్ణానది చెంతనే.. ఓపెన్ లాన్‌పై అంగరంగవైభవంగా పెళ్లిళ్లు నిర్వహించుకునేందుకు నగరంలోని హరిత బెర్మ్‌పార్క్ సంసిద్ధమౌతోంది. కల్యాణమండపాలకు పెట్టే ఖర్చులోనే మొత్తం పెళ్లి తంతు మొత్తం జరిపించుకునేందుకు వీలుగా 'కల్యాణమస్తు' వెడ్డింగ్ ప్యాకేజీకి ఏపీటీడీసీ సిద్ధం చేస్తోంది. కల్యాణమండపాల్లో పొందలేని అనుభూతులను, అంతకంటే సూపర్‌గ్రాండ్‌గా భారీ సెట్టింగ్‌లతో ధగధగలాడే వెలుగు జిలుగుల వాతావరణంలో పెళ్లిళ్లు చేసుకునేలా త్వరలో వెడ్డింగ్ ప్యాకేజీని ఏపీటీడీసీ విడుదల చేయనుంది. ప్రస్తుతం ఈ ప్యాకేజీపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. కల్యాణమండపాలను తలదన్నేలా వైభవంగా, నయనమనోహరంగా తక్కువ ఖర్చుతో నిర్వహించుకునేలా డిజైన్ చేస్తున్న ఈ వెడ్డింగ్ ప్యాకేజీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హరిత బెర్మ్‌పార్క్ ఓ వెలుగు వెలిగింది. ఇక్కడ పెళ్లిళ్లు కూడా ఎంతో గ్రాండ్‌గా జరిగేవి. కాకపోతే అప్పట్లో వెడ్డింగ్ ప్యాకేజీలనేవి లేవు. ప్రభుత్వం మారటంతో తిరిగి పర్యాటకరంగానికి బూస్ట్ ఇచ్చేందుకు ఏపీటీడీసీ అధికారులు వినూత్న ఆలోచన చేస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని హరిత బెర్మ్‌పార్క్‌లో 'కల్యాణమస్తు' వెడ్డింగ్ ప్యాకేజీకి శ్రీకారం చుట్టారు. ఈ ప్యాకేజీ ముఖ్య ఉద్దేశం ఏమిటంటే పెళ్లికి సంబంధించిన అన్ని కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చు. పెళ్లిళ్లు చేసుకోవటానికి బయట కల్యాణమండపాలను అద్దెకు తీసుకుంటారు. అక్కడ పెళ్లిళ్లు మాత్రమే చేసుకోవటానికి వీలౌతుంది. మిగిలినవి సొంత ఖర్చులతో చేసుకోవాలి. భోజనాలు, పురోహితులు, కల్యాణవేదిక అలంకరణ ఇలా అనేక వాటికి వేర్వేరుగా ఖర్చు చేయాలి. సగటున కల్యాణమండపానికి కనిష్ఠంగా రూ. లక్ష నుంచి గరిష్ఠంగా రూ.3లక్షల వరకు ఖర్చు అవుతోంది. ఇవి కాకుండా సెక్యూరిటీ, మెయింటెనేన్స్ ఖర్చునూ భరించాలి. మొత్తంగా కల్యాణ మండపాల్లో పెళ్లిళ్లు చేయాలంటే అన్నీ కలుపుకుంటే చాలా ఖర్చవుతుంది. ఏపీటీడీసీ ప్రవేశపెట్టే వెడ్డింగ్ ప్యాకేజీ మాత్రం కేవలం కల్యాణమండపం ఖర్చుతోనే భోజనాలు, పురోహితులు, ఏసీ విశ్రాంత గదులు, సెట్టింగ్స్, లైటింగ్, ఫర్నిచర్ అందించనుంది. దాదాపుగా ఇవన్నీ బయట వేర్వేరుగా చేసుకోవాలంటే కనిష్ఠంగా రూ.5 నుంచి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు అవుతుంది. ఇంకా రేంజ్‌ను బట్టి అర కోటి, కోటి ఖర్చు చేసేవారుంటారు. వీరి సంగతి పక్కన పెడితే మిగిలిన అన్ని వర్గాలకు అందుబాటు ధరల్లో గ్రాండ్‌గా పెళ్లిళ్లు చేసుకునేలా బెర్మ్‌పార్క్‌ను సిద్ధం చేయాలన్నది ఏపీటీడీసీ అధికారుల ఆలోచన. ఏపీటీడీసీలో పెళ్లిళ్లు చేసుకునేవారికి ప్రత్యేక అలంకరణ చేసిన ఎడ్లబండ్లు, రంగురంగుల వస్త్రాలు, గొడుగులతో అలంకరణ చేసిన టెంట్లలో బఫే భోజనాలు, పెళ్లికొడుకు, పెళ్లికూతురికి స్నానాలు చేయించటానికి వీలుగా ప్రత్యేక టెంట్లు, అన్నింటికీ మించి భారీ కల్యాణ వేదిక సెట్టింగ్, ధగధగలాడే విద్యుద్దీపాలంకరణలు ఇలా ఎన్నెన్నో అట్రాక్షన్‌తో తీర్చిదిద్దుతారు. కృష్ణానది వెంబడే ఓపెన్ లాన్‌పై ఈ ఏర్పాటంతా ఉంటుంది. పెళ్లికి వచ్చే ముఖ్య బంధువులకు కాటేజీలను కేటాయిస్తారు. వచ్చిన అతిథులంతా బెర్మ్‌పార్క్, నదీ తీరం వెంబడి కలియతిరగవచ్చు. అలాగే బోటింగ్ చేయవచ్చు. ఇక్కడి అందాలను స్వేచ్ఛగా ఆస్వాదించవచ్చు. పెళ్లికి వచ్చిన వారికి వెల్‌కమ్ డ్రింక్‌తో స్వాగతం పలికి.. స్నాక్స్, టిఫిన్స్, భోజనాలు ఇలా అన్నీ వరుసక్రమంలో అందిస్తారు. మరోలోకంలో పెళ్లి జరుగుతుందా అన్నట్టుగా బెర్మ్‌పార్క్ వాతావరణం కనిపిస్తుంది. కల్యాణమండపాల్లో ఇంతకంటే ఎక్కువ ఖర్చు పెట్టినా రానటువంటి అనుభూతులను ఇక్కడ సొంతం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తారు. రాత్రిపూట బెర్మ్‌పార్క్‌ను చూస్తే అద్భుతంగా ఉంటుంది. దీనికి పెళ్లి అలంకరణ కూడా తోడైతే అద్భుతంగా ఉంటుంది. మాటలకందని అద్భుతం కళ్లముందు సాక్షాత్కారమౌతుంది.


టిఫిన్, భోజన స్టాల్ వద్ద..


వరుడికి స్వాగతం పలికేటప్పుడు చేసిన ఏర్పాట్లు


ఢిల్లీలో సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

ఢిల్లీలో చంద్రబాబుకు ఎంపీ కేశినేని శివనాథ్ స్వాగతం

వన్‌టౌన్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసేందుకు మంగళవారం ఢిల్లీ వెళ్లిన సీఎం చంద్రబాబు నాయుడుకు ఢిల్లీ విమానాశ్రయం లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సాదర స్వాగతం పలికారు. ఈ నెల 23 నుంచి పార్లమెంట్ సమావేశాలు జరగనున్న దృష్ట్యా ఏపీకి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అమిత్‌షాను చంద్రబాబు కోరనున్నట్టు చిన్ని వెల్లడించారు. రాష్ట్రానికి నిధులు, ఇచ్చిన హామీల విషయమై సీఎం దృష్టి పెట్టనున్నారని తెలిపారు.


మెదక్ ఎంపీ రఘునందనరావుకు ఆశీర్వాదం అందజేస్తున్న వేద పండితులు

దుర్గమ్మ సన్నిధిలో మెదక్ ఎంపీ రఘునందనరావు

వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందనరావు మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం అధికారులు ఆయనకు శేషవస్త్రం, ప్రసాదం, దుర్గమ్మ చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.


రాజశేఖర్‌బాబుకు మొక్కను అందచేసి శుభాకాంక్షలు చెబుతున్న వెంకన్న

సీపీకి బుద్దా వెంకన్న శుభాకాంక్షలు

వన్‌టౌన్: జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబుకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన బుద్దా వెంకన్న పోలీసు కమిషనర్‌కు మొక్క అందజేసి అభినందనలు తెలిపారు.


సత్తా చాటిన టీటీ ప్లేయర్స్‌తో కోచ్‌లు

రాష్ట్ర టీటీ విజేతలు కాజోల్, మనస్వి

విజయవాడ స్పోర్ట్స్: ఏపీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన రాష్ట్ర ఓపెన్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో ఐజీఎంసీలో జిల్లా టీటీ అసోసియేషన్ హాల్లో కోచ్‌లు బి.శ్రీనివాస్, షారుఖ్ అక్రమ్ వద్ద శిక్షణ పొందిన ఆర్ కాజోల్ సునార్ ఉమెన్ రాష్ట్ర విన్నర్‌గాను, ఎస్.మనస్వి అండర్-11 బాలికల ఈవెంట్‌లో విన్నర్‌గా, జి మిషిక క్వార్టర్స్ ఫైనల్స్‌కు చేరుకుని పతకాలను వశం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ టీటీ సెక్రటరీ పి విశ్వనాథ్, ప్రెసిడెంట్ కేవీ ప్రకాష్, జిల్లా కార్యదర్శి కె. బలరామ్ క్రీడాకారులను, కోచ్‌లను అభినందించారు.

నేటి నుంచి బీ2బీ సమావేశాలు

భవానీపురం: షార్జా, యూఏఈ ప్రభుత్వ సహకారంతో యూఏఈ ద్వారా ప్రపంచవ్యాప్తంగా మీ వ్యాపారాన్ని విస్తరించడం అనే అంశంపై ప్రత్యేకమైన బీ2బీ సమావేశాలను ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని నోవాటెల్ హోటల్లో జరుగుతాయని అసోసియేటెట్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఆఫ్ ఇండియా (అసోచామ్) ఒక ప్రకటనలో తెలిపింది. అసోచామ్ ఏపీ, తెలంగాణ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్మన్ రవికుమార్ రెడ్డి కటారు మాట్లాడుతూ యూరప్, ఆఫ్రికా, మధ్య ఆసియాలో విస్తరించాలన్న లక్ష్యం కలిగిన భారత వ్యాపారులకు యూఏఈ ఒక ప్రాధాన్య ఎంపికగా ఉద్భవించిందన్నారు.

నేడు జిల్లా అండర్-7 చెస్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: జూనియర్ చెస్ అకాడమీ, ది విజయవాడ చెస్ అసోసియేషన్‌ల ఆధ్వర్యం లో ఈనెల 17న గుణదలలోని అరుణ ఎలక్ట్రికల్స్ ఫస్ట్‌ఫ్లోర్‌లో జిల్లా అండర్-7 బాలబాలికలకు వేర్వేరుగా చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్బర్ బాషా, మందుల రాజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని, వివరాలకు 9246181858 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో నీలిబడ్డీల దందా

- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు



మధురానగర్: స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులో కాల్వ ఒడ్డున నీలి బడ్డీల దందా నిరాటంకంగా కొనసాగుతోంది. సైజు, స్థలాన్ని బట్టి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఉంది. ఇటీవల ఒక బడ్డీ రూ.70వేలకు అమ్మకం జరిగింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 1, 29వ డివిజన్ల వైసీపీ నేతల కనుసన్నల్లో బీఆర్‌టీఎస్ రోడ్డు వంతెన నుంచి పడవల రేవు సబ్‌స్టేషన్ వరకు కాల్వ ఒడ్డున ఆక్రమణలకు తెరతీశారు. వాటాల్లో తేడా రావడంతో ఆయా నేతల మధ్య పంచాయితీలు కూడా నడిచాయి. చివరకు అప్పటి ఎమ్మెల్యే వద్ద సెటిల్‌మెంట్లు నడిచాయని తెలిసింది. ఇందుకు కారణం అక్కడ స్థలం ఆక్రమించి తమ మనుషులతో నీలిరంగులో బడ్డీలను ఏర్పాటు చేయించారు. డిమాండ్‌ను బట్టి స్థలంతో సహా అమ్మడం లేదా అద్దెకివ్వడం చేస్తారు. ఈ వ్యవహారంలో తేడాలు రావడంతో నేతల మధ్య గొడవలు జరిగాయి. మున్సిపల్, ఇరిగేషన్ అధికారుల నుంచి ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తారు. ఇలా బడ్డీలు, స్థలం పొందినవారు రోడ్డు మార్జిన్లను కూడా ఆక్రమించారు. టాటా ఏస్ వాహనాలను రోడ్డుపై పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. ఉదయం వేళ కుండలు, సోడాలు, డ్రింక్స్ అమ్మేవారు, సాయంత్రం వేళ కూరగాయల వ్యాపారాలు, న్యూడిల్స్ వ్యాపారాలు చేసేవారు రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. ఏమైనా ఇబ్బందులొస్తే వ్యవహారం చక్కపెట్టడానికి వ్యాపారుల పేరుతో ఒక సంఘం కూడా పెట్టారు. అధికారంలో ఎవరుంటే వారి బ్యానర్లు కట్టే బ్యాచ్ ఒకటి ఈ గ్రూపుల్లో ఉన్నారు. ప్రస్తుతం ఈ లైన్‌లోని బడ్డీలు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. అవి చెదలు పట్టి పట్టుకుంటే ఊడిపోయేలా ఉన్నాయి. గత ఏడాది ఈ తరహా ఆరోపణలు వచ్చినపుడు టౌన్ ప్లానింగ్ అధికారులు వచ్చి ఖాళీ బడ్డీలను తొలగించారు. మళ్లీ పరిస్థితి యథావిధిగా మారిపోయింది.

దుర్గగుడి సమగ్రాభివృద్ధికి చర్యలు

- దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి
- ఈవో చాంబర్‌లో ఆలయాభివృద్ధి పనులపై సమీక్ష



ఎమ్మెల్యే సుజనాచౌదరికి అమ్మవారి చిత్రపటం ఇస్తున్న ఈవో, అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

వన్‌టౌన్, జూలై 16: దుర్గగుడి సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందచేస్తామని స్థానిక ఎమ్మెల్యే సుజనాచౌదరి అన్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి దుర్గగుడికి ఆయన మంగళవారం విచ్చేసి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఈవో రామారావు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికింది. అమ్మవారి దర్శనానంతరం సుజనాచౌదరికి శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష..

దుర్గమ్మను దర్శించుకున్న సుజనాచౌదరి మహామండపంలోని నాలుగో అంతస్తులోని ఈవో చాంబర్‌కు వెళ్లారు. అక్కడ ఈవో, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనకు దుశ్శాలువ కప్పి సత్కరించారు అనంతరం ఈవో రామారావు ఆలయాభివృద్ధి పనుల నివేదికను ఎమ్మెల్యేకు అందజేసి ఆయా వివరాలను వివరించారు. చిత్రాలు, వీడియోల ద్వారా ఇప్పటి వరకు జరిగిన పనులు, ఇకముందు చేపట్టాల్సిన పనులను వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలించిన ఆయన టీడీపీ హయాంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్ అమలు విషయమై ఆరా తీశారు. ఆలయ నిధులను వృథా చేయకుండా సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. పార్కింగ్ సమస్య ఎందుకు వస్తోందని, ఎంతమంది సిబ్బంది ఉన్నారు? ఏయే విధులు నిర్వహిస్తున్నారన్న అంశాలపై ఆరా తీశారు. భక్తులకు తాత్కాలిక ఇబ్బందులున్నాయని వెంటనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం సుజనాచౌదరి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిపై మొదటిసారి ఈవోతో, అధికారులతో సమీక్షించామని, ఇది ప్రాథమిక చర్చని, మరోసారి సమావేశమై ఆర్థిక పరిస్థితి, నిధుల సమీకరణ వంటి అంశాలను పరిశీలిస్తామన్నారు. వేలాదిగా వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఆలయ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని, దేవదాయ శాఖ మంత్రి, సీఎంతో సమావేశమై చర్చిస్తామన్నారు. ఆయనతోపాటు పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

బస్టాండ్ వద్ద దళారుల దందా..!

- ప్రయాణికుల నుంచే కమీషన్ వసూలు చేస్తున్న దళారులు
- పొరపాటున టాక్సీ బ్రేక్ డౌన్ అయితే కమీషన్ డబ్బుకు చిల్లు

కృష్ణలంక, జూలై 16: పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద దళారుల దందాతో ప్రయాణికులు, టాక్సీవాలాలు బెంబేలెత్తుతున్నారు. వీరి దందాకు ఆర్టీసీ అధికారులు కానీ, పోలీసులు కానీ బ్రేకులు వేసే పరిస్థితి లేదు. పండుగ దినాలు, సెలవుదినాల్లో వీరి ఆగడాలు మితిమీరుతున్నాయి. విషయం ఏమిటంటే హైదరాబాద్ నుంచి లేదా వేరే ప్రాంతాల నుంచి నగరం మీదుగా ఏలూరు, విశాఖ, మచిలీపట్నం వంటి ప్రాంతాలకు డ్రాపింగ్‌కు వచ్చిన టాక్సీలు రిటన్‌లో సర్వీస్ చేసుకుంటూ హైదరాబాద్ వెళతారు. ఆ క్రమంలో బస్టాండ్ ఏరియాల్లో తమ కార్లను ఆపుకొని పాసింజర్ల కోసం చూస్తుంటారు. దీన్ని అవకాశంగా తీసుకొని కొంతమంది వ్యక్తులు కృష్ణలంక వైపు బస్టాండ్ ప్రధానద్వారం దగ్గర పాగా వేశారు. పై నుంచి కార్లు వచ్చినప్పుడు అందులోకి ప్యాసింజర్లను ఎక్కిస్తారు. అర్జెంట్‌గా కానీ రిజర్వేషన్ లేకపోవడం, వెళ్లాలనుకొన్న టైంకి బస్‌లు లేకపోవడం వంటి కారణాలతో బస్టాండ్ బయట ఉన్న కార్ల వద్దకు వస్తుంటారు. దీన్ని అవకాశంగా తీసుకొన్న దళారులు పాసెంజర్లను కార్లలోకి ఎక్కిస్తారు. అందుకు గాను ప్యాసింజర్ నుంచి కమీషన్ వసూలు చేస్తున్నారు. గతంలో కార్ డ్రైవర్ నుంచి వసూలు చేసేవారు. వీరికివ్వాల్సిన మామూలు ఎక్కువవడంతో డ్రైవర్లు రూటు మార్చి తాము వసూలు చేసేదానిలోనే కొంతమొత్తాన్ని దళారులకు, ప్యాసింజర్లతోనే ఇప్పిస్తున్నారు. ప్రయాణం సజావుగా జరిగితే ఎవరూ పట్టించుకోవడం లేదు. కానీ తామెక్కిన కారు బ్రేడ్‌డౌన్ అయినప్పుడు సమస్య తలెత్తుతోంది. రెండు రోజుల క్రితం ఓ వృద్ధ జంట హైదరాబాద్ వెళ్లేందుకు కారు ఎక్కారు. యథాప్రకారం దళారికి ప్యాసెంజర్లతో డ్రైవర్ కమీషన్ ఇప్పించారు. తీరా కారు కంచికచర్ల ప్రాంతం సమీపంలో బ్రేక్‌డౌన్ అయింది. దీంతో ప్రయాణికులు తమ డబ్బులు వాపసు అడిగారు. డ్రైవర్ కమీషన్ కొంత తీసేసి కొంత మినహాయించి డబ్బులు ఇవ్వబోయాడు. కమీషన్‌తో తమకు సంబంధం లేదని వృద్ధులకు తెగేసి చెప్పాడు డ్రైవర్. దీంతో వృద్ధ జంట చేసేది లేక వెళ్లిపోవాల్సి వచ్చింది.

ఇలాంటి ఘటనలు ఇటీవల తరచుగా జరుగుతున్నాయి. పాసింజర్లు నిండకపోతే నందిగామ, కోదాడ, సూర్యాపేట వంటి చోట్ల గంటల తరబడి టాక్సీలు ఆపేస్తున్నారు. ఈ విషయంపై ఒకరిద్దరు డ్రైవర్లను కదిలిస్తే ఖాళీగా వెళ్లలేక పాసింజర్ల కోసం బస్టాండ్ల వద్దకు వస్తామని దళారులు అడిగినంత ఇవ్వకపోతే ప్యాసింజర్లను ఎక్కనివ్వరని వాపోయారు. ఆర్టీసీ అధికారులు, పోలీసులు స్పందించి దళారులపై చర్యలు తీసుకోవాలని టాక్సీ డ్రైవర్లు, బాధితులు కోరుతున్నారు.


సీసీఎల్ఏగా బాధ్యతలు స్వీకరించిన జయలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగ సంఘాల నేతలు


రెవెన్యూశాఖకు మంచిపేరు తెస్తాం

సీసీఎల్ఏ జయలక్ష్మికి పలు సంఘాల నేతల శుభాకాంక్షలు

వన్‌టౌన్, జూలై 16: రాష్ట్రంలో రెవెన్యూశాఖకు మంచిపేరు తెచ్చేందుకు తమ వంతు సహకరిస్తామని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నేతలు తెలిపారు. సీసీఎల్ఏగా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన జి జయలక్ష్మికి వారు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు పెద్దపీట వేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు చేరవేయడంలో రెవెన్యూ ఉద్యోగులందరూ శ్రమించి పనిచేస్తారన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏపీ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్, ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల అసోసియేషన్, ఏపీ విలేజీ రెవెన్యూ సహాయకుల సంఘం ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో చెత్త కంపు..!

- మహామండపం షెడ్డు కింద నిలిపి ఉంచిన చెత్త తరలింపు వాహనం
- తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భక్తులు




వన్‌టౌన్, జూలై 16: దుర్గగుడిలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఆటంకం కలిగిస్తూ ఒక చెత్త తరలింపు వాహనాన్ని మహామండపం షెడ్డు కింద ఉంచుతున్నారు. ఆలయంలోని చెత్త, వ్యర్థ పదార్థాలను తీసుకువచ్చి వాహనంలో వేస్తుంటారు. అయితే చెత్త నుంచి దుర్గంధం రావడంతో పాటు చెత్త నుంచి కారిన నీరు భక్తులు నడిచే మార్గంలో నిలిచిపతోంది. దీంతో పవిత్రంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఇబ్బందిగా మారింది. మురికి నీటిలోనే అడుగులు వేసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడి నుంచి వాహనాన్ని తీసివేయాలని ఈవో రామారావు, అధికారులు చెప్పినా వాహనాన్ని అక్కడే నిలిపి ఉంచుతున్న వైనం గర్హనీయం. పైగా వాహనం ఎక్కువ స్థలాన్ని ఆక్రమించడంతో భక్తులు సేద తీరే అవకాశం లేని పరిస్థితి. గతంలో ఇక్కడే ద్విచక్ర వాహనాలను పెద్దఎత్తున పార్కింగ్ చేసి ఉండటంతో ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు వచ్చాయి. దీంతో వాటిని తీసేసినా ఇప్పుడు చెత్త తరలింపు వాహనాన్ని ఇక్కడ పెడుతుండడంతో పెనంమీద నుంచి పొయ్యిలో పడ్డట్టయింది భక్తుల పరిస్థితి.

నేటితో ముగియనున్న నిత్యావసరాల పంపిణీ

వన్‌టౌన్, జూలై 16: రైస్ కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ బుధవారంతో ముగుస్తుందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పీ సంపత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండీయూ ఆపరేటర్లు బుధవారం మధ్యాహ్నం వరకు ఇళ్లవద్దనే పంపిణీ చేసి గ్రామ,వార్డు సచివాలయాల వద్ద వాహనాన్ని ఉంచి మిగిలిన కార్డుదారులకు పంపిణీ చేయాలన్నారు.

రైతుబజార్లలో, ఉషోదయ, మెట్రో, రిలయన్స్ మార్ట్ వంటి పెద్ద పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా నాణ్యమైన బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. కందిపప్పు కిలో రూ.161కు, కర్నూలు సోనా మసూరి బియ్యం (బాయిల్డ్) కిలో రూ.49కు, రా రైస్ కిలో రూ.48కే విక్రయిస్తున్నట్టు తెలిపారు.


ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసిన ఫెడరేషన్ నేతలు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

- ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్‌ను కలిసిన ఏపీడబ్ల్యుజేఎఫ్ నేతలు

విజయవాడ లీగల్, జూలై 16: రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హిమాన్షు శుక్లాను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నేతలు మంగళవారం ఐఅండ్‌పీఆర్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యల్ని డైరెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. నిబంధనలను సడలించి అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులివ్వాలని, హెల్త్‌కార్డుల్ని ఇన్‌టైంలో రెన్యువల్ చేయాలని, చిన్న పత్రికల విషయంలో జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని, జర్నలిస్టులకు పెన్షన్ విధానాన్ని అమలులోకి తేవాలని, అక్రిడిటేషన్ కమిటీలో ఫెడరేషన్‌కు అవకాశం కల్పించాలని, ఇప్పటికే దరఖాస్తు చేసుకొన్న అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించాలని, అర్హులై ఉండి దరఖాస్తు చేసుకోని జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపు విషయంలో పునరాలోచించాలని, జర్నలిస్టులకు ఏటా ఇచ్చే అవార్డుల్ని ప్రకటించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, అధ్యక్షుడు ఎస్.వెంకట్రావు కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ శుక్లా కొత్తగా బాధ్యతలు తీసుకొన్నందున కొంత సమయం కావాలని, తప్పనిసరిగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు వి.శ్రీనివాస్, కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, ఉదయ ఫణికుమార్, అబ్దుల్ హలీమ్, సురేష్‌బాబు, పటౌడి, కొండబాబు, ఆనంద్, బాషా తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హీరో వినోద్ కిషన్ తదితరులు

నగరంలో 'పేకమేడలు' చిత్ర యూనిట్ సందడి

లబ్బీపేట, జూలై 16: నగరంలో 'పేకమేడలు' చిత్ర యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా బందర్‌రోడ్డులోని మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో హీరో వినోద్ కిషన్ మాట్లాడుతూ నా పేరు శివ చిత్రంలో తాను నటించి న నెగిటివ్ రోల్‌కు ప్రేక్షకులు నుంచి విశేష స్పందన లభించిందన్నారు. అలాగే పలు తెలుగు, తమిళ చిత్రాల్లో నెగిటివ్ రోల్స్ చేసి ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యానన్నారు. తెలుగులో మొదటిసారిగా పేకమేడలు చి త్రంలో హీరోగా నటిసున్నానని, ఈ చిత్రంలో నా క్యారెక్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. దర్శకుడు నీలగిరి మమ్మీల ఈ చిత్రానికి తాను హీరోగా అయితేనే బాగుంటుందని నమ్మి అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. కుటుంబసమేతంగా ఈ చిత్రాన్ని చూడవచ్చని, ఫ్యామిలీ ఓరియంటెడ్ చిత్రమని ఎలాంటి అసభ్యకర సన్నివేశాలుండవని, భార్యభర్తల మధ్య జరిగే సన్నివేశాలు దర్శకుడు చాలా చక్కగా తీశారన్నారు. ఈ చిత్రం ఈనెల 19న విడుదలవుతుందని, ప్రేక్షకులు చూసి వి జయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో హీరోయిన్ అనూష కృష్ణ, నిర్మాత రాకేష్ వర్రే పాల్గొన్నారు.

హైదరాబాద్- కర్నూల్ ఆర్టీసీ బస్సులో రూ. 36 లక్షల చోరీ

జడ్చర్ల పోలీసులకు బాధితుడి ఫిర్యాదు.. కేసు నమోదు

జడ్చర్ల, జూలై 16: హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్లే ఆర్టీసీ బస్సులో రూ. 36 లక్షలు చోరీకి గురయ్యాయి. హైదరాబాద్‌లోని విద్యుత్‌శాఖలో విధులు నిర్వహిస్తున్న దామోదర్.. కర్నూల్‌లో ఉన్న తన సోదరికి డబ్బు అవసరమవడంతో మంగళవారం రూ. 38 లక్షలు తీసుకుని బస్సులో బయలుదేరారు. రూ. 36 లక్షలు ఓ బ్యాగులో పెట్టి దాన్ని తాను కూర్చున్న సీటు క్యారియర్‌పై ఉంచారు. మరో రూ. 2 లక్షలను తన వద్దే మరో బ్యాగులో ఉంచుకున్నారు. టిఫిన్ చేయడానికి జడ్చర్లలో బస్సును నిలపడంతో క్యారియర్‌పై ఉంచిన బ్యాగును వెంట తీసుకెళ్లేందుకు దాన్ని తీసుకున్నారు. అయితే బరువులో తేడా రావడంతో తెరిచి చూడగా అందులో ఉంచిన రూ. 36 లక్షలు చోరీకి గురయ్యాయని గుర్తించి వెంటనే జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బస్సులో ఓ ప్రయాణికుడు మార్గమధ్యలో తరచూ క్యారియర్‌పై ఉన్న బ్యాగులు సర్దుతూ కనిపించాడని, బ్యాగులో ఉన్న డబ్బులను అతనే చోరీ చేసి ఉండవచ్చని తోటి ప్రయాణికులు అనుమానం వ్యక్తం చేశారు. ఆ ప్రయాణికుడు జడ్చర్ల కొత్త బస్టాండులో దిగాడని వారు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలు విడుదల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు విడుదల చేసింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో వీరికి రెండు నెలలుగా జీతాలు నిలిచిపోయిన అంశంపై 'ఆంధ్రజ్యోతి' మంగళవారం కథనం ప్రచురించింది. దీనిపై వెంటనే స్పందించిన సమగ్రశిక్ష అధికారులు జీతాల విడుదలకు ఉత్తర్వులు జారీ చేశారు. కేజీబీవీ టీచర్లు, సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు సమగ్రశిక్ష పరిధిలోని ఉద్యోగులకు మే, జూన్ నెలల జీతాలకు రూ.122.23 కోట్లు విడుదల చేసినట్లు ఎస్పీడీ బి. శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగుల జీతాలకు రూ.105.2 కోట్లు, కేజీబీవీల్లో విద్యార్థినుల భోజన నిర్వహణ ఖర్చులకు రూ.17.02 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు.

ప్రభుత్వాలు మారుతున్నా దక్కని 'క్షమాభిక్ష'!

మూడు దశాబ్దాలుగా జైల్లోనే గణేశ్

వయోభారం, అనారోగ్యంతో ఇబ్బందులు

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఖైదీలకు క్షమాభిక్ష అంశాన్ని ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోవడం లేదు. అర్హులైన ఖైదీల ఎంపికపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా.. రాష్ట్ర ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయి. ఫలితంగా క్షమాభిక్షకు అర్హులైన వారు కూడా విడుదలకు నోచుకోక జైళ్లలోనే మగ్గిపోతున్నారు. ప్రకాశం జిల్లా మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న పీబీవీ గణేశ్ ఉదంతమే దీనికి నిదర్శనం. గణేశ్ విద్యార్థి దశలో 1985లో మావోయిస్టు పార్టీలో చేరారు. మాగుంట హత్య కేసులో 1995 డిసెంబరులో పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారు. ఆగస్టు 4, 2000లో కోర్టు శిక్ష ఖరారు చేసింది. గణేశ్ దాదాపు 26 ఏళ్లుగా జైల్లోనే ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల సుమారు 200 మందికిపైగా ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించింది. ఆ జాబితాలో గణేశ్ పేరు ఉన్నట్లు చెప్పిన జైలు అధికారులు.. ఖైదీల విడుదలకు కొద్ది సమయం ముందు పేరు లేదన్నారు. గతంలో పలుమార్లు కూడా గణేశ్‌కు ఇలాగే నిరాశ మిగిలింది. మాజీ ప్రధాని రాజీవ్ హంతకులు నళినితోపాటు మరో ముగ్గురికి 2014లో జయలలిత ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించింది. దాన్ని సవాలు చేస్తూ కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఏదైనా కేసులో సీబీఐ దర్యాప్తు జరుగుతున్న నిందితులపై మోపిన అభియోగాల మేరకు క్షమాభిక్షకు అనర్హులని, అయితే రాష్ట్ర ప్రభుత్వం విచక్షణ మేరకు నిర్ణయం తీసుకొని విడుదల చేయవచ్చని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. గణేశ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చు. అయినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఆయన జైల్లోనే ఉండాల్సి వస్తోంది. అప్పుడప్పుడు పెరోల్‌పై బయటకొస్తున్నా షరతులతో కాలం వెళ్లదీస్తున్నారు. వయోభారం, అనారోగ్యంతో బాధపడుతున్న గణేశ్.. తన క్షమాభిక్షపై ఇప్పటికైనా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ఈ అంశంపై కవులు, కళాకారులు కూడా పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

21న అఖిలపక్ష సమావేశం

న్యూఢిల్లీ, జూలై 16: ఈనెల 22 నుంచి పార్లమెంట్ వర్షకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 21వ తేదీన అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆదివారం ఉదయం 11 గంటలకు ఆ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. జూలై 21వ తేదీని తమ పార్టీ అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటున్నందున అఖిలపక్ష సమావేశానికి తమ ప్రతినిధులెవరూ హాజరుకాబోరని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తెలిపింది. కాగా, ఈనెల 22న ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలు వచ్చేనెల 12న ముగుస్తాయి. ఈ క్రమంలో ఈనెల 23న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

అభిషేక్ బోయినపల్లి పిటిషన్ విచారణ నుంచి వైదొలగిన జస్టిస్ సంజయ్ కుమార్

న్యూఢిల్లీ, జూలై 16: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ అభిషేక్ బోయినపల్లి దాఖలు చేసిన పిటిషన్ విచారణ నుంచి జస్టిస్ సంజయ్‌కుమార్ వైదొలిగారు. మంగళవారం ఈ పిటిషన్ విచారణకు రాగా.. జస్టిస్ సంజయ్‌కుమార్ వాదనలు వినడానికి నిరాకరించినందున, పిటిషన్‌ను మరో ధర్మాసనానికి బదిలీ చేయాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. సంజయ్‌కుమార్ సభ్యుడిగా లేని ధర్మాసనం విచారణ జాబితాలో (ఆగస్టు 5న విచారించేలా) ఈ పిటిషన్‌ను చేర్చాలని సూచించారు. అభిషేక్ భార్య ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నందున ఆయనకు జారీ చేసిన మధ్యంతర బెయిలును తదుపరి ఆదేశాలిచ్చేవరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. అభిషేక్ 18 నెలలుగా జైల్లో ఉన్నారని గుర్తుచేసిన సుప్రీం ధర్మాసనం మార్చి 20న ఆయనకు ఐదు వారాలు మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. అప్పటి నుంచి ఆ బెయిలును పొడిగిస్తూ వస్తోంది.

కొత్తగా 346 స్వదేశీ సైనిక పరికరాలు!

న్యూఢిల్లీ, జూలై 16: ఆత్మనిర్భర్ భారత్ పథకంలో భాగంగా స్వదేశీ రక్షణ సంస్థలను ప్రోత్సహించడం కోసం భారత ప్రభుత్వం కొత్తగా 346 సైనిక పరికరాలను 'స్వదేశీ జాబితా'లో చేర్చింది. ఈ జాబితాలో ఉన్న పరికరాలను సైన్యం ఇక నుంచి స్వదేశీ సంస్థల నుంచే కొనుగోలు చేయాలని పేర్కొంది. వీటి దిగుమతులపై నిషేధం విధించింది. రక్షణ శాఖ గడిచిన మూడేళ్లలో ఇప్పటివరకు 12,300 రక్షణ పరికరాలను 'స్వదేశీ జాబితా'లో చేర్చింది. కాగా, రాబోయే ఐదేళ్లలో దేశీయంగా.. ఏడాదికి రూ.1.75లక్షల కోట్ల రక్షణ పరికరాలను ఉత్పత్తి చేయాలని, రూ.50 కోట్ల విలువైన పరికరాలను ఎగుమతి చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకొంది. ప్రస్తుతం భారత్ ఏటా రూ.21వేల కోట్ల విలువైన రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తోంది.

మహారాష్ట్రలో 11 ఏళ్ల బాలికపై అత్యాచారం

ఆరుగురి అరెస్టు.. అందులో నలుగురు మైనర్లు

ముంబై, జూలై 16: మహారాష్ట్రలో ఓ 11 ఏళ్ల బాలికపై నమోదైన అత్యాచారం కేసులో పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకోగా అందులో నలుగురు మైనర్లు ఉండడం సంచలనంగా మారింది. మహారాష్ట్రలోని థానే జిల్లా అంబర్‌నాథ్ పట్టణానికి చెందిన ఓ 11 ఏళ్ల బాలికకు తన స్నేహితురాలు మాయమాటలు చెప్పి దుండగులు ఉన్న ప్రదేశం వద్దకు తీసుకెళ్లింది. అక్కడ మొత్తం ఐదుగురు బాలురు ఉండగా ఒకడు బాలికను ఆటోలోకి బలవంతంగా తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అనంతరం ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ అతడు బాలికను బెదిరించాడు. అక్కడి నుంచి బాలిక ఎలాగోలా తప్పించుకుని విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలియజేసింది. వారు పోలీసులను ఆశ్రయించగా.. వారు బాలిక స్నేహితురాలితో సహా మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. అందులో నలుగురు మైనర్లే ఉన్నట్లు తెలిపారు. పోక్సో కేసు నమోదు చేశామని, ఇద్దరు మేజర్లను రిమాండ్‌కు నలుగురు మైనర్లను రిఫార్మ్ హోమ్‌కు తరలించామని పోలీసులు పేర్కొన్నారు

భారతీయ భాషల్లో 22 వేల పుస్తకాలు

న్యూఢిల్లీ, జూలై 16: రానున్న ఐదేళ్ల కాలంలో అన్ని భారతీయ భాషల్లో 22 వేల పుస్తకాలను ప్రచురించాలని కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకుంది. దీని కోసం ఆగ్మెంటింగ్ స్టడీ మెటీరియల్స్ ఇన్ ఇండియన్ లాంగ్వేజెస్ థ్రూ ట్రాన్స్‌లేషన్ అండ్ అకడమిక్ రైటింగ్ (అస్మిత) పేరుతో రూపొందించిన ప్రాజెక్టును మంగళవారం ఉన్నత విద్యాశాఖ సెక్రటరీ సంజయ్ మూర్తి ప్రారంభించారు. భారత విద్యావ్యవస్థలో భారతీయ భాషల వృద్ధికి యూజీసీ, భారతీయ భాషా సమితి ఆధ్వర్యంలో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన సంయుక్త కమిటీ ద్వారా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని యూజీసీ అధినేత జగదీశ్ కుమార్ చెప్పారు. అలాగే అన్ని భారతీయ భాషల్లో పదాల అర్థాలు తెలుసుకునేందుకు 'బహుభాషా శబ్దకోశ్' అనే నూతన ఆన్‌లైన్ నిఘంటువును కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ మంగళవారం ప్రారంభించింది.

అమరావతికి మూడు రాచబాటలు!

సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు మరో 2 రోడ్ల అభివృద్ధి



జాతీయ రహదారికి అనుసంధానమయ్యే రోడ్ల శాటిలైట్ చిత్రం



జాతీయ రహదారికి అనుసంధానం కానున్న ఈ-11 రోడ్డు

ఎన్‌హెచ్-16తో అనుసంధానం చేసేలా సీఆర్డీయే ప్రణాళిక

ఈ 11, ఈ 13 రోడ్లను ఎన్‌హెచ్-16కు కలపాలని నిర్ణయం

ఓఆర్ఆర్, ఐఆర్ఆర్ సాకారం దిశగా అడుగులు

అమరావతికి విస్తృత రోడ్డు నెట్‌వర్క్ కల్పించడమే లక్ష్యం

విజయవాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి రాచబాటలు పడనున్నాయి. ఏపీ రాజధానిలోకి ప్రవేశించడానికి గ్రాండ్ ఎంట్రన్స్‌గా ఉన్న సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమాంతరంగా మరో రెండు రోడ్లను కూడా ఇదే స్థాయిలో అభివృద్ధి చేసి 16వ నంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)కి అనుసంధానం చేయాలని సీఆర్‌డీఏ అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రణాళికలు శరవేగంగా సిద్ధం చేస్తున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమాంతరంగా ఉండే ఈ-11, ఈ-13 రోడ్లను కూడా జాతీయ రహదారికి అనుసంధానం చేయనున్నారు. ఈ రెండు రోడ్లను అమరావతిలో వెంకటపాలెం వరకు నిర్మించారు. వీటిని విస్తరించి జాతీయ రహదారికి కలుపుతారు. సీడ్ యాక్సెస్ రోడ్డు కూడా వెంకటపాలెం దగ్గర వరకు వచ్చి ఆగింది. ఇక్కడి నుంచి మణిపాల్ హాస్పిటల్ పక్క నుంచి కనకదుర్గ వారధి దిగువన ఎన్‌హెచ్-16కు కలపాల్సి ఉంది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. అమరావతి రాజధానిపై దృష్టి సారించింది. ఉండవల్లి మండలంలోని పెనుమాక దగ్గర నుంచి జాతీయ రహదారి వరకు 3 కిలోమీటర్ల మేర 30 ఎకరాల వరకు భూముల అవసరం ఏర్పడింది. సమీకరణ కింద రైతులు ఇస్తే తీసుకోవటానికి సీఆర్‌డీఏ సిద్ధంగా ఉంది. ఒకవేళ పూలింగ్ కింద సాధ్యం కాకపోతే భూ సేకరణ చేసైనా ముందుకు వెళ్లాలని భావిస్తోంది. త్వరలో సీడ్ యాక్సెస్ రోడ్డు బ్యాలెన్స్ పనులకు అడుగులు పడతాయనుకున్న దశలో సీఆర్‌డీఏ దానితోపాటు ఈ-11, ఈ-13 రోడ్లను కూడా ఎన్‌హెచ్-16 అనుసంధానించాలని నిర్ణయించడం విశేషం.

కేంద్రం సహకరిస్తే...

ఈ-11, ఈ-13 రోడ్లను తెరపైకి తీసుకురావడానికి మరో కారణం కూడా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును కేంద్రానికి ప్రతిపాదించింది. దీనికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపుగా రూ.25 వేల కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపింది. ఈ నెల 23న ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఇదే సందర్భంలో సీఆర్‌డీఏ అధికారులు అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)తో పాటు ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్)లను కూడా ముందుకు తీసుకువెళ్లాలని భావిస్తున్నారు. ఎన్‌హెచ్-16కు మూడు రాచబాటలను అనుసంధానం చేయడం వల్ల అమరావతి నుంచి దేశంలో ఎక్కడికైనా కనెక్ట్ అయ్యే అవకాశాలు ఉంటాయి. ఈ రోడ్లకు సీఆర్‌డీఏ మీద పెద్దగా ఆర్థిక భారం కూడా పడదు. దాదాపుగా వెంకటపాలెం వరకు అయితే సమస్య లేదు. ఎయిమ్స్‌లో కొండ ప్రాంతం వెంబడి రోడ్లను ఎలా అభివృద్ధి చేశారో అదే తరహాలో ఈ-11, ఈ-13 రోడ్లను కూడా వెంకటపాలెం నుంచి అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్లాలని భావిస్తున్నారు. ఈ రెండు రోడ్లకు భూ సేకరణ అవసరం దాదాపుగా ఉండదని తెలుస్తోంది. ఎన్‌హెచ్-16 దగ్గర అనుసంధానం చేసే చోట తప్పనిసరి అయితే భూసేకరణకు వెళ్లాలని భావిస్తున్నారు. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారికి మూడు రాచబాటలను అనుసంధానం చేయటం ద్వారా ఒక విస్తృతమై రోడ్డు నెట్‌వర్క్ ఏర్పడుతుందని సీఆర్‌డీఏ భావిస్తోంది. అమరావతి రాజధాని ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ఇవి ఎంతగానో దోహదపడనుంది.

జాతీయ రహదారులతో అనుసంధానం

ఇప్పటికే అమరావతి ఓఆర్ఆర్‌కు అనేక జాతీయ రహదారులు అనుసంధానమవుతున్నాయి. ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65, ఎన్‌హెచ్-30, ఎన్‌హెచ్-216, ఎన్‌హెచ్-216 హెచ్ ఇలా ఎన్నో రోడ్లు ఇందులో ఉన్నాయి. అన్నింటికంటే ప్రధానమైన నాగ్‌పూర్-విజయవాడ ఎకనమిక్ కారిడార్, బెంగళూరు-విజయవాడ ఎకనమిక్ కారిడార్‌లు అనుసంధానమవుతాయి. నాగ్‌పూర్-విజయవాడ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా ఖమ్మం జిల్లా దేవరపల్లి వరకు పనులు జరుగుతున్నాయి. ఖమ్మం-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తయితే నాగ్‌పూర్-విజయవాడ ఎకనామిక్ కారిడార్‌కు పూర్తి రూపం వస్తుంది. బెంగళూరు-విజయవాడ కారిడార్ పనులూ జరుగుతున్నాయి. ఈ రెండు కారిడార్లు అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానం కావడంతో పాటు.. ఎన్‌హెచ్-16కు అమరావతి మూడు రాచబాటలను అనుసంధానిస్తే అమరావతికి విస్తృత స్థాయి రోడ్డు నెట్‌వర్క్ ఏర్పడుతుంది.

'విజన్-2047'లోకి ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం!

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మంజూరు చేసిన రీజనల్ రింగ్‌రోడ్డు దక్షిణ భాగం పనుల్లో కదలిక వచ్చింది. ఆ పనులను, విభజన చట్టంలో పేర్కొన్న హైదరాబాద్-అమరావతి మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను, మరికొన్ని జాతీయ రహదారులను.. కేంద్ర ప్రభుత్వం తన 'విజన్ 2047' ప్రాజెక్టులో భాగం చేసినట్టు సమాచారం. కేంద్ర క్యాబినెట్ ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలపగానే ఈ రహదారుల పనులు వేగవంతం కానున్నాయి. రీజినల్ రింగ్ రోడ్డును మంజూరు చేసినప్పుడే.. దాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా నిర్మిస్తామని కేంద్రం తెలిపింది. అయితే, అప్పట్లో ఈ ప్రాజెక్టును భారత్‌మాల-1లో చేర్చింది. ఉత్తర భాగం నిర్మాణానికి అవసరమైన అనుమతులను ముందుగా ఇచ్చింది. దక్షిణ భాగం విషయంలో మాత్రం కొంత ఆలస్యం జరిగింది. దీంతో దాన్ని భారత్‌మాల-2లో చేర్చింది. ఆ తరువాత కూడా సమయానికి పనులు మొదలు కాకపోవడంతో దక్షిణ భాగాన్ని కేంద్రం తాజాగా విజన్-2047లోకి చేర్చినట్టు తెలిసింది.

మంచి కోసం స్టింగ్ ఆపరేషన్లు ఓకే!

ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకం: కేరళ హైకోర్టు

తిరువనంతపురం, జూలై 16: ప్రజలకు వాస్తవాలను తెలియజేసే సదుద్దేశంతో మీడియా జరిపే స్టింగ్ ఆపరేషన్లకు.. చట్టపరమైన విచారణ నుంచి రక్షణ కల్పించవచ్చని కేరళ హైకోర్టు అభిప్రాయపడింది. అలాగని, అన్ని స్టింగ్ ఆపరేషన్లను ఒకే గాటన కట్టలేమని, దేనికదే విడిగా పరిశీలించాలని స్పష్టం చేసింది. ఒక వ్యక్తిలక్ష్యంగా, ఆ వ్యక్తి ప్రతిష్ఠను దెబ్బతీయాలనో, మరేదైనా దురుద్దేశంతోనో జరిపే స్టింగ్ ఆపరేషన్లకు చట్టపరంగా ఎటువంటి రక్షణ ఉండదని పేర్కొంది. కేరళలో సంచలనం సృష్టించిన సోలార్ విద్యుత్తు కుంభకోణంలో జైలు పాలైన జొప్పన్ అనే నిందితుడిపై.. 2013 జూలైలో జైలులోనే 'రిపోర్టర్' అనే టీవీ ఛానల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. జైలు నిబంధనలను ఉల్లంఘించి.. తమ వెంట రహస్యంగా సెల్‌ఫోన్ తీసుకెళ్లి జొప్పన్ చెప్పిన వివరాలు రికార్డు చేశారు. అనంతరం వాటిని బహిరంగపరచటంతో అవి ప్రకంపనలు సృష్టించాయి. ఈ నేపథ్యంలో, టీవీ ఛానల్ వ్యక్తులపై జైలు నిబంధనలను ఉల్లంఘించినట్లుగా కేసు నమోదైంది. దీనిపై విచారణ సందర్భంగా కేరళ హైకోర్టు.. ప్రజాస్వామ్య సౌధానికి నాలుగో స్తంభమైన మీడియా ప్రాధాన్యాన్ని వివరించింది. అవినీతి, అధికార దుర్వినియోగం, తప్పులకు పాల్పడేవారిని నిలదీయటం, భిన్నాభిప్రాయాలకు వేదికగా నిలవటం, ప్రభుత్వ విధానాలు, చర్యలు ప్రజలకు జవాబుదారీగా ఉండటం మీడియా బాధ్యతని గుర్తు చేసింది. ప్రజోపయోగ పనుల కోసం గుర్తింపు పొందిన మీడియాగానీ, దర్యాప్తు సంస్థలుగానీ స్టింగ్ ఆపరేషన్లు నిర్వహించవచ్చని పేర్కొంటూ.. 2014లో, 2009లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఉటంకించింది. రిపోర్టర్ టీవీ ఛానల్ వ్యక్తులు కూడా.. ఒక కుంభకోణంలో కీలకమైన సమాచారాన్ని సేకరించి ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు కాబట్టి.. వారిని తప్పుబట్టలేమని పేర్కొంది. వారిపై అభియోగాలను కొట్టివేస్తూ తీర్పు చెప్పింది.

మిహిర్ షాకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

ముంబై హిట్ అండ్ రన్ కేసు

ముంబై, జూలై 16 : ముంబైలో ఇటీవల సంచలనం సృష్టించిన వర్లీ హిట్ అండ్ రన్ కేసులో ప్రధాన నిందితుడు మిహిర్ షా(24)కు స్థానిక న్యాయస్థానం మంగళవారం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. మిహిర్ షా.. శివసేన(ఏక్‌నాథ్ షిండే వర్గం) పార్టీ నేత రాజేశ్ షా కుమారుడు. ఈ నెల 7న జరిగిన ఘటనలో మద్యం మత్తులో బీఎండబ్ల్యూ కారు నడిపిన మిహిర్ షా ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ఆ ద్విచక్రవాహనంపై ఉన్న దంపతుల్లో కావేరి నక్వా మరణించగా ఆమె భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. కావేరి మృతదేహాన్ని మిహిర్ షా తన కారుతో సుమారు 1.5 కిమీ ఈడ్చుకెళ్లాడు. అనంతరం పరారైన మిహిర్ షాను పోలీసులు జూలై9న అరెస్టు చేశారు. పోలీసు కస్టడీ ముగియడంతో మిహిర్‌షాను మంగళవారం న్యాయస్థానంలో హాజరుపర్చగా జూలై 30 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఇదే కేసులో జూలై 7న అరెస్టయిన మిహిర్ షా తండ్రి రాజేశ్ షా బెయిల్ మీద విడుదలయ్యారు. అలాగే, ప్రమాద సమయంలో మిహిర్ షాతోపాటు కారులో ఉన్న అతని డ్రైవర్ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు.

ఏ పోలింగ్ బూత్.. ఏ ఈవీఎంనైనా ఎంచుకోండి!

పరిశీలన కోసం ఓడిన అభ్యర్థులకు ఈసీ అవకాశం

న్యూఢిల్లీ, జూలై 16: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్)ల ట్యాంపరింగ్‌కు సంబంధించి తనిఖీకి ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులకు ఎన్నికల కమిషన్(ఈసీ) వివిధ ఆప్షన్లు ఇచ్చింది. మాక్ పోలింగ్, వీవీప్యాట్ స్లిప్పుల లెక్కింపు తదితరాల కోసం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఏ పోలింగ్ బూత్ నుంచైనా ఈవీఎంలను ఎంపిక చేసుకొనే అవకాశం కల్పించింది. ఎన్నికల ఫలితాల్లో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థుల కోసం వివిధ ర్యాండమ్ తనిఖీలను సూచిస్తూ మంగళవారం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను ఈసీ విడుదల చేసింది. ఈవీఎంలను నియంత్రించేందుకు వాటిలో రహస్యంగా ఏమైనా ఫర్మ్‌వేర్ ఉందా? పక్షపాతం జరిగిందా? అనే సందేహాల నివృత్తికి ఈ తనిఖీలు దోహదపడతాయని పేర్కొంది. ఈవీఎంలు ట్యాంపరింగ్‌కు గురయ్యాయా? వాటిలో ఉన్న మైక్రో కంట్రోలర్ చిప్‌లు మార్పుచేర్పులకు గురయ్యాయా? తదితరాల పరిశీలన కోరుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం బీజేపీ, కాంగ్రెస్ సహా ఎనిమిది మంది లోక్‌సభ అభ్యర్థులు, ముగ్గురు అసెంబ్లీ అభ్యర్థుల నుంచి ఈసీకి దరఖాస్తులు వచ్చాయి. ఈవీఎంలను తారుమారు చేశారనే అనుమానాలకు ఆధారాలు లేవంటూ సుప్రీంకోర్టు ఏప్రిల్ 26న తిరిగి బ్యాలెట్ పేపర్ విధానాన్ని తీసుకురావాలనే డిమాండ్‌ను తిరస్కరించింది. అదే సమయంలో అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 5 శాతం ఈవీఎంలలో ఉన్న మైక్రో కంట్రోలర్ చిప్‌ల తనిఖీకి దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులకు సుప్రీంకోర్టు కల్పించింది. దీనికోసం ఈసీకి లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేయడంతోపాటు, అందుకు అయ్యే వ్యయాన్ని ఈసీకి ఫీజుగా చెల్లించాలని సుప్రీం స్పష్టం చేసింది. దీంతో అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో గరిష్ఠంగా 5 శాతం ఈవీఎంలను తనిఖీ చేసేందుకు అర్హత గల అభ్యర్థులు పోలింగ్ స్టేషన్లను, ఈవీఎం సీరియల్ నంబర్లను ఎంపిక చేసుకోవచ్చని ఈసీ పేర్కొంది. థర్డ్ పార్టీ లేదా అధికారుల జోక్యానికి తావులేకుండా అలాగే, ప్రత్యేకించి ఏదేని ఈవీఎంను మినహాయించకుండా నియోజకవర్గ వ్యాప్తంగా దరఖాస్తుదారు ఎంచుకున్న ఈవీఎంలను తనిఖీకి ఉంచుతామని ఈసీ స్పష్టం చేసింది. పోలింగ్ బూత్‌లోని ఈవీఎంలన్నింటినీ కలిపేసి, అందులో నుంచి ఎంపిక చేసుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తామని తెలిపింది. పోలింగ్ బూత్‌లో ఏదేని బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌ను తనిఖీకి ఎంచుకున్న దరఖాస్తుదారు.. అదే బూత్‌లోని మరో యూనిట్‌ను తనిఖీకి ఎంచుకునేందుకు అనుమతించబోమని, దాంతోపాటు నియోజకవర్గ పరిధిలోని ఇతర పోలింగ్ బూత్‌లలోని యూనిట్లనూ తనిఖీకి దరఖాస్తుదారు ఎంచుకోవచ్చని పేర్కొంది. అభ్యర్థికి తనిఖీ నిమిత్తం గరిష్ఠంగా 1,400 ఓట్ల వరకు మాక్ పోలింగ్‌కు అనుమతిస్తారు. వీవీప్యాట్ స్లిప్పుల లెక్కింపు ఈసీ నిర్దేశించిన ప్రకారమే జరుగుతుంది.

నీట్ లీక్ కేసులో మరో ఇద్దరి అరెస్ట్

పేపర్ దొంగిలించి సర్క్యులేట్ చేసిన ఆరోపణలపై వారిని అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు

ఎన్‌టీఏ సంస్కరణల కమిటీకి 37 వేల సిఫారసులు

మార్కుల నార్మలైజేషన్ ఎత్తివేత సహా పలు సూచనలు

న్యూఢిల్లీ, జూలై 16: నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ మరో ఇద్దరు కీలక నిందితులను అరెస్ట్ చేసింది. ఝార్ఖండ్‌లోని హజారీబాఘ్‌లో జాతీయ టెస్టింగ్ ఏజెన్సీకి చెందిన ట్రంకుపెట్టె నుంచి ప్రశ్నపత్రాన్ని దొంగిలించిన ఆరోపణలపై వారిని అదుపులోకి తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. దీంతో ఈ కేసులో ఇప్పటిదాకా అరెస్టయినవారి సంఖ్య 14కు చేరింది. సీబీఐ అరెస్టు చేసినవారిలో ఒకరు పంకజ్‌కుమార్ అలియాస్ ఆదిత్య. ఈయన జంషెడ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన 2017 బ్యాచ్ సివిల్ ఇంజనీర్. ఎన్‌టీఏ ట్రంకుపెట్టెలోంచి పేపర్‌ను దొంగిలించింది ఇతడేనని.. ఇతణ్ని పట్నాలో అదుపులోకి తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. ఈ పనిలో అతడికి సహకరించడమే కాక, దొంగిలించిన ప్రశ్నపత్రాన్ని తమ గ్యాంగులోని ఇతర సభ్యులకు చేరవేసినందుకు రాజుసింగ్ అనే మరో వ్యక్తిని హజారీబాఘ్‌లో అరెస్ట్ చేసినట్టు వివరించారు. కాగా.. పరీక్షలను సక్రమంగా నిర్వహించడానికి, అక్రమాలు చోటు చేసుకోకుండా నిలువరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సిఫారసులు చేయడానికి ఇస్రో మాజీ చీఫ్ రాధాకృష్ణన్ నేతృత్వంలో ఏడుగురు సభ్యుల ఉన్నతస్థాయి సంస్కరణల కమిటీని జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈమేరకు ఆ కమిటీ ప్రజల నుంచి సిఫారసులను ఆహ్వానించగా.. దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కోచింగ్ సంస్థలు, కెరీర్ కౌన్సెలర్ల నుంచి 37 వేలకు పైగా సలహాలు సూచనలు ఆ కమిటీకి అందాయి. మార్కుల సాధారణీకరణ (నార్మలైజేషన్) ఎత్తివేత, పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాల తనిఖీలు, పరీక్షల షెడ్యూలు మారితే ఆ విషయాన్ని సమర్థంగా అభ్యర్థులకు తెలియజేసే ఏర్పాటు.. ఇలా పలు సూచనలు కమిటీకి అందినవాటిలో ఉన్నాయి. ఎక్కువ సూచనలు విద్యార్థుల నుంచే వచ్చినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం.



ఘటనా స్థలంలో ఇరుక్కున్న ట్యాంకర్, లారీ

మట్టి చరియలు విరిగిపడి ఐదుగురు దుర్మరణం

శిథిలాల కింద మరో నలుగురు..?

ఉత్తర కన్నడ జిల్లాలో ఘోరం

బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని సముద్రతీర జిల్లాలు, పశ్చిమ కనుమల ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అతలాకుతలం అవుతోంది. ఉత్తర కన్నడ జిల్లా అంకోలా తాలూకా శిరూరు వద్ద జాతీయ రహదారి 66పై మట్టిచరియలు భారీగా విరిగిపడటంతో ఐదురుగు మృతిచెందారు. మరో నలుగురు మట్టిలో కూరుకుపోయినట్టు భావిస్తున్నారు. గంగావళి నది సమీపాన ఉండే రహదారి పక్కన టీస్టాల్ ఉంది. ఇదే ప్రాంతంలో జాతీయ రహదారి విస్తరణ పనులు సాగుతున్నాయి. భారీ వర్షాలకు మట్టి చరియలు ఒక్కసారిగా విరిగి పడటంతో టీస్టాల్ వద్ద పలువురు మట్టిలో కూరుకుపోయారు. లక్ష్మణనాయక్ (47), అతని భార్య శాంతినాయక్ (36), వారి పిల్లలు రోషన్ (11), అవంతిక (6)తో పాటు జగన్నాథ్ (55) అనే వ్యక్తి మృతదేహాలను బయటకు తీశారు. మట్టి చరియలు పడటంతో టీస్టాల్ వద్ద ఆగిన ఓ గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడింది. మరో లారీ మట్టిలో ఇరుక్కుపోయింది. ఈ రెండు వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు మట్టిలో ఇరుక్కుపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. ఉత్తర కన్నడ జిల్లాలో మరో మూడు చోట్ల కూడా మట్టిచరియలు విరిగిపడ్డాయి. జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. జిల్లా అధికారి లక్ష్మీప్రియ, ఎస్పీ పీఎం నారాయణ్, జిల్లా పంచాయతీ సీఈఓ ఈశ్వర్‌కాందూ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించినా, వాహనాలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. ఉత్తరకన్నడ ఎంపీ విశ్వేశ్వరహెగ్డే కాగేరి ఘటనా స్థలానికి చేరుకుని స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మంద్రాళి చెండియా, అర్గా తదితర ప్రాంతాల్లో మట్టి చరియలు పడిన ప్రదేశాలను ఆయన పరిశీలించారు.

రేపు రత్నభాండాగారాన్ని మళ్లీ తెరుస్తాం

తాత్కాలిక స్టోర్‌రూమ్‌కు ఆభరణాలు: జస్టిస్ రథ్

పూరీ, జూలై 16: పూరీ క్షేత్రంలోని రత్నభాండాగారం లోపలి గదిని శ్రీ జగన్నాథ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ) గురువారం (18న) తిరిగి తెరవనుంది. ఖజానాలోని ఆభరణాలను ఆలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్టోర్ రూమ్‌కు తరలించనున్నారు. ఎస్‌జేటీఏ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పాఢీ, ఒడిశా ప్రభుత్వం నియమించిన కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్, పూరీ కలెక్టర్ సిద్ధార్థ్ శంకర్ స్వైన్, ఇతర అధికారులు మంగళవారం సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. '18న ఉదయం 9.51 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల మధ్య రహస్య గది తాళాలు తెరిచి లోపలికు ప్రవేశిస్తాం. అందులోని విలువైన వస్తువులను తాత్కాలిక స్టోర్ రూమ్‌కు తరలిస్తాం. అదే సమయంలో ఏఎస్ఐ సభ్యులు గది పటుత్వాన్ని, అవసరమైన మరమ్మతులపై అంచనా వేస్తారు. ఈ కార్యక్రమం మొత్తాన్ని వీడియో తీస్తాం' అని జస్టిస్ రథ్ మీడియాకు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్టోర్ రూమ్‌లో సీసీ కెమెరాలు, ఫైర్ సేఫ్టీ చర్యలతో పాటు ఇతర అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించారు. 18న రత్నభాండాగారాన్ని తిరిగి తెరవనున్న సందర్భంగా ఆలయంలోకి ప్రవేశించడంపై విధించిన ఆంక్షలను పాటించాలని భక్తులకు ఎస్‌జేటీఏ విజ్ఞప్తి చేసింది. కాగా, ఆభణాల లెక్కింపు, శిథిలావస్థకు చేరిన గది మరమ్మతుల నిమిత్తం 46 సంవత్సరాల అనంతరం ఒడిశా ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈ నెల 14న రహస్య గదిని తెరిచిన విషయం తెలిసిందే.

బిహార్ మాజీ మంత్రి సాహ్నీ తండ్రి దారుణ హత్య

దర్భంగా/పట్నా, జూలై 16: బిహార్ మాజీ మంత్రి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) అధ్యక్షుడు ముకేష్ సాహ్నీ తండ్రి జతిన్ సాహ్నీ (70) దారుణ హత్యకు గురయ్యారు. దర్భంగా జిల్లా జిరత్ గ్రామంలోని సొంతింట్లో ఆయన మృతదేహం రక్తపుమడుగులో పడి ఉండగా గుర్తించారు. ఛాతీ, కడుపులో కత్తిపోట్లు ఉన్నాయి. ఇంటి సమీపంలోని సీసీటీవీ కెమెరాల ఆధారంగా పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత హత్య జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఘటనా స్థలంలో మూడు గ్లాసులను, ఇంట్లో ఉండాల్సిన అల్మారా బయటపడేసి ఉండడాన్ని, ఇంటి సమీపంలో నిలిపి ఉన్న మూడు మోటారు సైకిళ్లను పోలీసులు గుర్తించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఏడీజీ జితేంద్ర సింగ్ గంగ్వార్ తెలిపారు. తండ్రి హత్య గురించి తెలియగానే ముంబైలో ఉన్న ముకేష్ సాహ్నీ స్వగ్రామానికి బయలుదేరారు. వీఐపీ.. ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీ. ముకేష్ సాహ్నీ గతంలో నితీశ్ కుమార్ మంత్రివర్గంలో పనిచేశారు. నిషాద్ సామాజిక వర్గానికి చెందిన ఆయన... బీజేపీ చొరవతోనే శాసనమండలికి ఎన్నికై మంత్రి కాగలిగారు. ఆయనకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, పలువురు కేంద్ర మంత్రులు ముకేష్ సాహ్నీని పరామర్శించారు. హంతకులకు కఠిన శిక్ష పడేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాహుల్ కోరారు. కాగా, ఎన్‌డీయే, ఇండియా కూటమి నేతలు పరస్పరం విమర్శలు చేసుకున్నారు. బిహార్‌లో ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విమర్శించారు. ఆర్జేడీ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి నివాసాన్ని నేరస్థుల స్థావరంగా మార్చారని కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీ మండిపడ్డారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 17 జూలై 2024
diksuchi@andhrajyothy.com

నోటిఫికేషన్స్

అగ్రి సెట్ 2024

గుంటూరు-లాంలోని ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్‌ఏయూ)- 'అగ్రిసెట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని వ్యవసాయ విభాగాల్లో పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులకు ఉద్దేశించారు. ఈ ఎగ్జామ్‌లో సాధించిన స్కోర్ ద్వారా నాలుగేళ్ల వ్యవధి గల 'బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్' ప్రోగ్రామ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ అగ్రికల్చరల్ కళాశాలల్లో నిర్దేశిత సీట్లు భర్తీ చేయనున్నారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

విభాగాలు: అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ ఫార్మింగ్

సీట్ల వివరాలు

- పాలిటెక్నిక్ వ్యవసాయ డిప్లొమా అభ్యర్థుల కోసం ప్రభుత్వ వ్యవసాయ కళాశాలల్లో 196 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 72 సీట్లు చొప్పున మొత్తం 268 సీట్లు నిర్దేశించారు.
- ప్రభుత్వ వ్యవసాయ కళాశాలల్లో అగ్రికల్చర్ అభ్యర్థులకు 161 సీట్లు, సీడ్ టెక్నాలజీ అభ్యర్థులకు 27 సీట్లు, ఆర్గానిక్ ఫార్మింగ్ అభ్యర్థులకు 8 సీట్లు ఉన్నాయి.
- అనుబంధ వ్యవసాయ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద అగ్రికల్చర్ అభ్యర్థులకు 59 సీట్లు, సీడ్ టెక్నాలజీ అభ్యర్థులకు 10 సీట్లు, ఆర్గానిక్ ఫార్మింగ్ అభ్యర్థులకు 3 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఏఎన్‌జీఆర్‌ఏయూ/పీజేటీఎస్‌ఏయూ నుంచి రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 22 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.

అగ్రిసెట్ వివరాలు: అభ్యర్థులు తమ డిప్లొమా స్ట్రీమ్‌లోనే అగ్రిసెట్ ఎగ్జామ్ రాయాలి. ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) ప్రోగ్రామ్‌లకు ఏఎన్‌జీఆర్‌ఏయూ నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్న పత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఈ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 25 శాతం(30)మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **ఆన్‌లైన్ దరఖాస్తు ఎడిట్ విండో ఓపెన్:** ఆగస్టు 7 నుంచి 8 వరకు
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఆగస్టు 16 నుంచి 23 తేదీల వరకు
- **అగ్రిసెట్ మాక్ టెస్ట్ తేదీలు:** ఆగస్టు 20 నుంచి 25 వరకు
- **ఏఎన్‌జీఆర్‌ఏయూ అగ్రిసెట్ 2024 తేదీ:** ఆగస్టు 27
- **చిరునామా:** కన్వీనర్-అగ్రిసెట్ 2024, అసోసియేట్ డీన్, ఎస్వీ అగ్రికల్చరల్ కాలేజ్, తిరుపతి-517502
- **వెబ్‌సైట్:** angrau.ac.in



ఎన్‌జీ రంగా వర్సిటీ

బీఎస్సీ ఆనర్స్, బీటెక్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్‌ఏయూ)- వ్యవసాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. బైపీసీ స్ట్రీమ్, ఎంపీసీ స్ట్రీమ్ కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా సీట్లు అలాట్ చేస్తారు. గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఈ సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి. ప్రతి కాలేజీలో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- వెబ్‌సైట్: angrau.ac.in

బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌ను అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలు

- అగ్రికల్చరల్ కాలేజ్, బాపట్ల
- అగ్రికల్చరల్ కాలేజ్, నైరా-శ్రీకాకుళం జిల్లా
- అగ్రికల్చరల్ కాలేజ్, రాజమహేంద్రవరం
- ఎస్వీ అగ్రికల్చరల్ కాలేజ్, తిరుపతి
- అగ్రికల్చరల్ కాలేజ్, మహానంది-నంద్యాల జిల్లా
- మేకపాటి గౌతమ్ రెడ్డి అగ్రికల్చరల్ కాలేజ్, ఉదయగిరి-ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా
- అగ్రికల్చరల్ కాలేజ్, పులివెందుల

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌ను అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలు

- ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బాపట్ల
- కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, పులివెందుల

బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌ను అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలు

- డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బాపట్ల
- కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, మడకశిర

అనుబంధ కళాశాలలు

- శ్రీ కింజరపు ఎర్రం నాయుడు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్, ఎచ్చెర్ల-శ్రీకాకుళం
- కదిరి బాబూరావు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్, సీఎస్ పురం, ప్రకాశం జిల్లా
- ఎన్.ఎస్ అగ్రికల్చరల్ కాలేజ్, మార్కాపూర్-ప్రకాశం జిల్లా
- ఎస్‌బీవీఆర్ అగ్రికల్చరల్ కాలేజ్, బద్వేల్, వైఎస్సార్ జిల్లా
- శ్రీ కృష్ణదేవరాయ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్, అనంతపురం
- జే.సీ. దివాకర్ రెడ్డి అగ్రికల్చరల్ కాలేజ్, తాడిపత్రి-అనంతపురం

బైపీసీ స్ట్రీమ్

- బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌నకు సంబంధించి ప్రభుత్వ కాలేజీల్లో 980 సీట్లు(20 శాతం ఐకార్ సీట్లు సహా); అనుబంధ కళాశాలల్లో 252 సీట్లు ఉన్నాయి. ప్రైవేట్ యూనివర్సిటీలైన శ్రీ సత్య సాయి జిల్లాలోని భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ(బీఈఎస్‌టీఐయూ)లో 175; తిరుపతిలోని మోహన్ బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో 63 సీట్లు ఉన్నాయి.
- బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌నకు సంబంధించి ప్రభుత్వ కాలేజీల్లో 73 సీట్లు ఉన్నాయి.
- ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్/నేచురల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 2

ఎంపీసీ స్ట్రీమ్

- బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌నకు సంబంధించి డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-బాపట్లలో 27 సీట్లు; కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-మడకశిరలో 20 సీట్లు ఉన్నాయి.
- బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌నకు సంబంధించి ఫార్మర్స్ కోటా కింద డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-బాపట్లలో 21 సీట్లు; కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-పులివెందులలో 11 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 29

చిరునామా: రిజిస్ట్రార్, ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034

SCHOLARSHIP ALERT

HDFC Bank Parivartan's ECSS Programme 2024-25

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the postgraduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000

Last Date to Apply: 04-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/HDFC54

Panasonic Ratti Chhatr Scholarship



Description: Panasonic Life Solutions India (PLSIND) invites applications from students enrolling in B.E./B.Tech. courses at the Indian Institutes of Technology (IITs).

Eligibility: Open for students across India who have cleared the entrance for admission into B.E./B.Tech. courses at any of the IITs (Indian Institute of Technology) in 2024-25. Applicants must have cleared their Class 12 examination or be awaiting final results. Applicants must have scored more than 75% marks in Class 12. The annual family income of the applicant must not be more than INR 8,00,000 from all sources. Only candidates from 2024-25 batch are eligible to apply.

Prizes & Rewards: Scholarship amount: INR 70,250 per year for four years

Last Date to Apply: 15-08-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/RCSP56

Kotak Kanya Scholarship

Description: Under the CSR Project on Education & Livelihood of Kotak Mahindra Group Companies, Kotak Education Foundation invites applications for the Kotak Kanya Scholarship 2024-25 from meritorious girl students from low-income families to empower them to pursue higher studies in professional education after Class 12.

Eligibility: Open for meritorious girl students across India.

- Applicants must have scored 75% or more marks or equivalent CGPA in Class 12 board examinations.
- Applicant's annual family income must be less than INR 6,00,000.
- Meritorious girl students who have secured admission to the first year of graduation programs in the academic year 2024-25 in institutes of repute like NIRF/NAAC accredited for professional graduation degrees like Engineering, MBBS, BDS, Integrated LLB (5 Years), B.Sc. Nursing, B. Pharmacy, Integrated BS-MS/BS-Research in ISER, IISC (Bangalore), or other professional courses (Design, Architecture, etc.).

Prizes & Rewards: INR 1.5 lakh* per year

****Disclaimer:*** The renewal of the scholarship every year will be at the sole discretion of the Kotak Education Foundation

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/KKGS3


buddy4study.com

కొత్త పుస్తకం

పోటీ పరీక్షల దిక్సూచి

భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ

మరి కొద్ది నెలల్లో తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలు నిర్వహించబోతున్నారు. అటు ఏపీలోనూ ఇటీవల కొలువు తీరిన కొత్త ప్రభుత్వం భారీ స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి సమాయత్తం అవుతోంది. పోటీ పరీక్షలు ఏవైనా...ఇండియన్ పాలిటీ ప్రాధాన్యం ఎనలేనిది. పైగా అన్ని సబ్జెక్టుల్లో కన్నా ఎక్కువ మార్కులు తెచ్చిపెట్టే సబ్జెక్టు కూడా ఇదే. ఈ నేపథ్యంలో పోటీ పరీక్షల శిక్షణలో చాలా అనుభవం ఉన్న డాక్టర్ సుంకర రమాదేవీ రచించిన 'భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ' 15వ ఎడిషన్ మార్కెట్‌లోకి విడుదల అయ్యింది. దాదాపు 333 పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను అధ్యయనం చేసి ఈ పుస్తకానికి రూపకల్పన చేశారు. శాసన వ్యవస్థల కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థ, రాజ్యాంగ, రాజ్యాంగేతర సంస్థల్లో వచ్చిన అన్ని పరిణామాలను, చట్టాలను, కోర్టుల తీర్పులను ఈ పుస్తకంలో పొందుపరిచారు. రాజ్యాంగ నిర్మాణ వివరాలతోపాటు ఉద్యమ చరిత్ర, రాజ్యాంగ చరిత్రలో ముఖ్య ఘట్టాలు, రాజ్యాంగం ఏర్పడటానికి దారితీసిన చారిత్రక పోరాటాలు - పరిణామాలు, బ్రిటిష్ పాలకులు అనుసరించిన వ్యూహాలు తదితర వివరాలన్నీ ఈ పుస్తకంలో ఉన్నాయి. భారత రాజకీయ వ్యవస్థకు సంబంధించిన ప్రతి అంశాన్నీ సంపూర్ణంగా, వాద ప్రతివాదాల సమాచారంతో ఎంతో ప్రామాణికంగా రూపొందించారు. అదేవిధంగా ఇండియా వర్సెస్ భారత్, ఉమ్మడి పౌరస్మృతి- ఒకే దేశం ఒకే చట్టం, పౌరసత్వ సవరణ చట్టం- విమర్శ, ఆర్టికల్ 370 రద్దు- సుప్రీంకోర్టు తీర్పు, కొత్త పార్లమెంట్ భవనం- సెంగోల్ స్థాపన, జమిలీ ఎన్నికలు - రామ్‌నాథ్ కోవింద్ కమిటీ, కొత్త నేర న్యాయ చట్టాలు, సాధారణ ఎన్నికల ఫలితాలు- 2024పై విశ్లేషణ, ఎలక్టోరల్ బాండ్స్ వంటి సమకాలీన అంశాలను వివరంగా చర్చించారు. సమగ్రమైన రాజ్యాంగ విశ్లేషణను, భారత రాజకీయాలకు సంబంధించిన సమాచారాన్ని, చారిత్రక పరిణామాలను వివిధ పట్టికల రూపంలో చక్కగా అందించారు. ఈ పుస్తకం కేవలం ఏపీపీఎస్సీ, టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకే కాదు విద్యార్థులకు, అధ్యాపకులకు, న్యాయవాదులకు, స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే వారికి కరదీపిక వలె ఉపయోగపడుతుంది.




పుస్తకం పేరు: భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ (15వ ఎడిషన్)
పేజీలు: 1202(రెండు వాల్యూమ్స్ కలిపి)
వెల: రూ.899/-
ప్రతులకు: శ్రీ తేజ పబ్లికేషన్స్, గాంధీనగర్, హైదరాబాద్-500080
ఫోన్ నెం: 8686430054, 8686430055

లిటిల్స్



పచ్చటి గుర్రం

చతురతకు, చమత్కారానికి మారుపేరైన బీర్బల్ అక్బరు కొలువులో కొత్తగా చేరిన కొన్నిరోజులకు ఇద్దరూ వేటకు వెళ్లారు. అక్కడి ప్రకృతిని చూసి, మైమరచిపోయిన బీర్బల్ 'ఇంత పచ్చని చెట్ల నడుమ, పచ్చటి కొండలలో ఒక ఆకు పచ్చని గుర్రం మీద వెళితే ఎంత మజాగా ఉంటుందో కదా' అన్నాడు ఏదో ఆలోచిస్తూ. ఆ మాటలు విన్న అక్బరు 'ఏదీ పచ్చటి గుర్రం అన్నావే వారం రోజుల్లోగా నువ్వునాకు, ఆ పచ్చటి గుర్రాన్ని తెచ్చి ఇవ్వాలి' అని ఆజ్ఞాపించి ఇదెలా సాధిస్తాడో చూద్దాం అని లోలోపల నవ్వుకుంటాడు. వారం రోజులు గడిచాక బీర్బల్ హడావుడిగా కొలువుకు వచ్చి 'జహాపనా.. ఒక చోట మీరడిగిన పచ్చటి గుర్రం. దొరి




కింది కానీఆ గుర్రం యజమాని మీరు స్వయంగా వస్తేనే, గుర్రం అమ్ముతా అంటున్నాడు' అని చెప్పాడు. అంత అరుదైన గుర్రం కోసం నేను రావడమే సముచితం, తప్పక వస్తాను అన్నాడు అక్బరు. (కానీ అతను మీకు ఆ గుర్రాన్ని వారంలో ఎనిమిదవ రోజు మాత్రమే అమ్ముతాడట' అన్నాడు బీర్బల్. అక్బరు ఇవాళ శుక్రవారం రేపు శనివారం ఎనిమిదవ రోజు ఏదంటే అని లెక్క వేస్తూ ఒక్కసారిగా నాలిక కరుచుకుని, "వారంలో ఎనిమిది రోజులు ఎలా ఉంటాయి నీ చమత్కారం కాకపోతే?' అన్నాడు. దానికి బీర్బల్ మరి ఆకు ప చ్చటి గుర్రం మాత్రం ఎలా ఉంటుంది జహాపనా? నేనేదో సరదాగా అంటే మీరు దాన్ని నిజంగా తీసుకు రమ్మంటే నేనేంచేయగలను? అన్నాడు బీర్బల్.

10 తేడాలు గుర్తించండి!





రంగులు వేయండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 360

	2	3	7	1	8	4		
1						8		
	8	4	3	6		9	2	
			1			5	4	
			2		6			
	5	2			4			
	3	9		4	1	6	5	
		7						4
		8	5	2	7	1	3	

సుడోకు - 359 సమాధానం

2	8	5	6	7	4	9	1	3
1	4	3	8	5	9	7	2	6
9	7	6	1	2	3	4	8	5
8	3	9	5	6	7	1	4	2
7	6	4	3	1	2	5	9	8
5	1	2	4	9	8	3	6	7
3	5	8	9	4	6	2	7	1
4	2	1	7	8	5	6	3	9
6	9	7	2	3	1	8	5	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.